

# తెలుగు సినిమా

# స్వర్ణయుగం

డా॥ఎం.వి.రమణారెడ్డి

# తెలుగు సినిమా - స్వర్ణయుగం

సమీక్ష:

**ఎం.వి.రమణారెడ్డి**

డా॥ ఎం.వి.రమణారెడ్డి
రాయపరం, ఖాదరాబాద్ (పి.ఒ.)
ప్రొద్దుటూరు - **516 362**
ఫోన్: **08564-251133**

**తెలుగు సినిమా స్వర్ణయుగం**

తొలి ప్రచురణ: జూలై 2004
రెండవ ముద్రణ: జూన్ 2007

హక్కులు: రచయితవి
ముఖచిత్రం: బాపు
వెల: రు.100/--

Opinions are invited to mallelaramanareddy@rediffmail.com/ hotmail.com/ yahoo.com

ప్రతులకు:
1. విశాలాంధ్ర అన్ని బ్రాంచిలు
2. డా. ఎం.వి.రమణా రెడ్డి,
రాయవరం,ఖాదరబాద్ పోస్ట్,
ప్రొద్దుటూరు - 516 362 (కడప జిల్లా)
ఫోన్: 08564- 251133

ఈ రచన చాలా వరకు సీరియల్‌గా ప్రచురించిన ఆంధ్రభూమి దినపత్రిక ఎడిటర్ గారికి, యాజమాన్యానికి ధన్యవాదాలతో

ముద్రణ: అనుపమ ప్రింటర్స్,
గ్రీన్ వ్యూ, 126, శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్: 23391364

published by: Dr. M.V. Ramana Reddy, Rayavaram, Khadarabad P.O. Proddatur - 516 362, Phone: 08564-251133

వి.ఏ.కె.రంగారావుగారు సంగీత ప్రియులందరికి ఎలా తెలుసో నాకూ అలా తెలుసు. కానీ, నేనింతవరకు ఆయన్ను కలవలేదు, చూడలేదు. నేను గుంటూరు మెడికల్ కాలేజిలో విద్యార్థిగా వున్నప్పుడు, వారపత్రికలో సీరియల్‌గా నడిచిన ఆయన 'సరాగ మాల' కోసం 'ఆంధ్రపత్రిక'ను విధిగా కొనేవాణ్ణి. గొప్పవారిమీద గౌరవభావం ఏర్పడటానికి భౌతికమైన పరిచయం తప్పనిసరిగాదు. గౌతమ బుద్ధుని ఆరాధించే వాళ్ళంతా ఆయన్ను కంటితో చూసిన వారేనా? మహాత్మాగాంధీని అనుసరించేవాళ్ళంతా ఆయన్ను భౌతికంగా ఎరిగిన వారేనా? అవసరం లేదు. గొప్పవారు తమ విజ్ఞానం ద్వారా, ఆదర్శం ద్వారా పరిచయమౌతారు, ఆరాధ్యులౌతారు.

ఆధునికయుగంలో కళాపోషణకు సినిమారంగం బలమైన సాధనంగా పరిణమించింది. కానీ, ఈ పరిశ్రమ ప్రారంభమైన తొలిదశల్లో కనిపించిన విలువలు కొంతకాలం తరువాత క్షీణించడం మొదలైంది. వ్యాపారానికి ప్రాముఖ్యత పెరిగి, జనాకర్షణ నెపంతో, చౌకబారు సంగీతమూ, జీవంలేని సాహిత్యమూ అందులో ప్రవేశించాయి. ఆ దశలో, తెలుగు సినిమా సంగీత సాహిత్యాలను పూర్వ వైభవానికి పునరుద్ధరించటానికి పూనుకున్న వైతాళికుల్లో వి.ఏ.కె. రంగారావుగారు ప్రముఖులు. ఆ కళాతపస్వి కృషికి చిరుకానుకగా ఈ రచన -

## అంకితం

# 'సరాగమాల' రంగారావుగారికి.

# మనవి

అలనాటి తెలుగు సినిమాల్లో ఉత్తమమైనవి ఈ ఎనిమిదేనా? కాదు; చాలా వున్నాయి. పది సంవత్సరాల పొడవున మంచి చిత్రాలుగా తేలేవి ఈ ఎనిమిదే ఐతే, ఆ కాలాన్ని 'స్వర్ణయుగం' అని పిలిచే అవసరమే రాదు. నా స్కీంలోనే మరో మూడు సినిమాలు ఉండేవి. సంభాషణలు కూర్చడంలో సముద్రాల జూనియర్‌గారి నేర్పునూ, అంజలీదేవి, వహీదా రహెమాన్‌గార్ల ప్రతిభనూ, టి.వి.రాజుగారి సంగీత ప్రాభవాన్నీ వివరించే 'జయసింహ' వాటిల్లో వొకటి. ఎల్.వి.ప్రసాద్, చక్రపాణిగార్ల అపూర్వసృష్టి 'మిస్సమ్మ' రెండవది. ఆదుర్తి సుబ్బారావుగారి దర్శకనైపుణ్యం, నటనా భాగీరథి కన్నాంబగారి ప్రావీణ్యం గుర్తుకు తెచ్చే 'తోడుకోడళ్ళు' మూడవది. కానీ, పుస్తకం పెద్దదైతే పాఠకులు జంకుతారనే సందేహంతో మానేశాను. వాల్యూమినస్‌గా కనిపించే పుస్తకాలను పాఠకులు ముట్టుకునే రోజులు కావివి.

గడ్డిఅన్నారం నుండి బి.శ్రీనివాసరావుగారనే పాఠకులు, మల్లీశ్వరి-జయభేరి చిత్రాల అంతరం ఎనిమిది సంవత్సరాలేనని తెలియజేశారు. వారికి నా ధన్యవాదాలతో, నా పొరపాటును ఈ ప్రచురణలో సవరించాను. 'ఆంధ్రభూమి'లో ఈ పుస్తకాన్ని సమీక్షించిన ఎస్.వి.రామారావుగారి ద్వారా, దేవదాసు చిత్రంలో బండిమనిషి పాత్రను పోషించిన నటుడు సీతారాంగారనీ, చంద్రముఖిగా నటించిన లలితకు వాయిస్ ఇచ్చింది పి.జి.కమలాదేవిగారనీ తెలుసుకున్నాను. వారికి నా కృతజ్ఞతలు.

సమగ్రమైన చరిత్రగా ఉండాలనే ఉద్దేశంతో చేసిన రచన కాదిది. అంతటి సర్వజ్ఞత నాకు లేదు. సినిమా పట్ల చాలామందిలో కనిపించే తేలికభావాన్ని పోగొట్టటానికి, ఒక ప్రేక్షకునిగా నేను చేసిన చిన్న ప్రయత్నం మాత్రమే ఈ పుస్తకం. నా పరిమితులను దృష్టిలో ఉంచుకోవలసినదిగా పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

- రచయిత

శ్రీరామ

10.06.03

శ్రీ డా. రమణారెడ్డిగార్కి

ఆలస్యానికి మన్నించగోరుతూ నమస్కరించి వ్రాసేది -

తెలుగుసినిమా-స్వర్ణయుగం పుస్తకం చదివాను. కాదు, అదే చదివించింది - శ్రద్ధతో, గౌరవంతో, సంతోషంతో.

మీ వర్ణనలూ వ్యాఖ్యలూ చదువుతూంటే ఆయా దృశ్యాలు మనసులో రూపుకట్టాయి; కొన్నిచోట్ల నేపథ్య సంగీతంతో సహా - వీనులవిందు చేశాయి. నాకు తెలియని సంగతులు ఎన్నో తెలుసుకున్నాను. తెలుసును అనుకున్నవి తప్పులు అని కూడా తెలుసుకున్నాను. ఇది సినిమాగదా అని తేలిక భావంతో సరదాగా రాసినది కాదు ప్రేమతో గౌరవంతో ఎందరో మహా కళాకారుల గొప్పతనాన్నీ మంచినీ సత్కరించాలన్న సహృదయంతో, మంచిని పంచాలన్న మంచి మనసుతో మీరు వ్రాశారు. Doctoral thesis కి దీటైన పరిశోధన చేసి పరిశీలన జోడించి వ్రాశారు. ఈ సమీక్షని సమీక్షించే అర్హత నాకన్నా చాలాచాలా ఎక్కువ గలవారు - 1. వి.యే.కే. రంగారావుగారు, 2. రావి కొండలరావుగారు. నన్ను మన్నించమని కోరుతూ పుస్తకాన్ని తిరిగి పంపిస్తున్నాను. పబ్లిష్ అయినాక కొని చదువుకుని ఆనందిస్తాను.

అభివందనాలతో

**ముళ్లపూడి వెంకటరమణ**

## సంగతుల పరంపర:


| | |
|---|---|
| స్వర్ణయుగం | 7 |
| మల్లీశ్వరి | 11 |
| జయభేరి | 41 |
| దొంగరాముడు | 65 |
| దేవదాసు | 84 |
| బంగారుపాప | 102 |
| పాతాళభైరవి | 123 |
| మాయాబజార్ | 143 |
| విప్రనారాయణ | 175 |
| ముగింపు | 193 |

# స్వర్ణయుగం

ఒకప్పుడు సినిమాలు చూడటం సరదా. పెద్దల దృష్టిలో సినిమాలు చూసేవాళ్ళంతా పోకిరి వెధవలు. ఆ తరువాత అది నాగరికతగా ఎదిగింది. క్రమేణా, సంసార స్త్రీలు సైతం చిరుతిండ్లు మూటగట్టుకుని, మరచెంబుతో మంచినీళ్ళు తీసుకుని, పరచి కూర్చోడానికి గడ్డిచాపలు చంకనబెట్టుకుని, సినిమాలకు ప్రయాణంకావడం మొదలైంది. ఈ అలవాటు ముదిరి, నేటి నాగరిక ప్రపంచంలో సినిమా చూడటం జీవితంలో భాగంగా చేరిపోయింది. ఇది యాదృచ్ఛికంగా జరిగిన పరిణామంకాదు. ఈ ప్రక్రియను ప్రజలకు చేరువగా తీసుకెళ్ళటానికీ, ప్రజాబాహుళ్యాన్ని ఆకట్టుకోడానికీ, ప్రజాజీవితాన్ని ప్రభావితం చేయగల అద్వితీయమైన మీడియాగా దీన్ని తీర్చిదిద్దటానికీ ఎందరో మహానుభావులు చేసిన నిరంతర కృషి దీని వెనుక దాగివుంది. తెలుగు సినిమారంగానికి పటిష్టమైన పునాదులు వేసిన ఆ కళాతపస్వుల కృషినీ, నైపుణ్యాన్నీ, కళపట్ల వారికుండిన అంకితభావాన్నీ నెమరువేసు కోవడంకన్న ఆ మహానుభావుల రుణం తీర్చుకునే మార్గం మరొకటేముంది మనకు?

1931లో తొలి తెలుగు టాకీని నిర్మించిన తెలుగు చలనచిత్ర పితామహుడు హెచ్.ఎం.రెడ్డి కాలంనుండి నేటివరకు తెలుగు సినిమాలో చోటుచేసుకున్న సాంకేతిక అభివృద్ధి అంతాయింతా గాదు. అప్పట్లో రంగుల చిత్రాలు లేవు. కలర్ ఫిలిం కాదుగదా, ఆ రోజుల్లో సిల్వర్‌నైట్రేట్ ఫిలింగూడా అపురూపమే. తరువాత తరువాత సిల్వర్ నైట్రేట్ ఫిలింను నెగెటివ్‌గా వాడి, బ్రోమైడ్ ఫిలిం మీద కాపీలు తీసేవారు. బ్రోమైడ్ ఫిలింలో అంచులు నిశితంగా వుండవుగాబట్టి బొమ్మ అలికినట్టు కనిపించేది. లోతు(depth) వుండేది కాదు. శబ్దగ్రహణ పరికరాలుగూడా పరిణతి చెందినవి కాదు. ప్రతి పలుకు విడివిడిగా విరిస్తే తప్ప రికార్డింగ్‌లో ముద్దయిపోతుంది. అందుకే ఇరవయ్యోశతాబ్దం మధ్యకాలంవరకు నిర్మించిన తెలుగుచిత్రాల్లో సంభాషణ నిదానంగా, మాటలు ఈడ్చినట్టుగా వుంటుంది.

సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా, చిత్రం రూపకల్పనలో ఇప్పటి వారు బహు కొద్దిమంది మాత్రమే అప్పటివారికి సాటిరాగలరని చెప్పక తప్పదు. ప్రేక్షకులను ఆకర్షించడానికి హాస్యం, శృంగారం మొదలైన మసాలాలను కలిపి పాకం చేయడం 1960కి ముందు రోజుల్లో అంతగా కనబడదు. హాస్యమైనా శృంగారమైనా కథలో భాగంగా ఇమిడివుండాలి. కాబట్టి, ఆ కోవకు చెందిన కథను ఎన్నుకోవడంపైన అప్పటి దర్శకుల దృష్టి కేంద్రీకరించబడేది. దర్శకుడు, రచయిత కలిసి నెలల పర్యంతం జరిపే చర్చల ఫలితంగా స్క్రీన్‌ప్లే తయారయ్యేది. తరువాత వీళ్ళిద్దరూ తక్కిన సాంకేతిక సిబ్బందితో సంప్రదించిన మీదట చిత్రానికి బ్లూప్రింట్ తయారయ్యేది. ఆ చర్చలూ సంప్రదింపులూ ఇప్పటంత తేలిగ్గా వుండేవిగావు. ఆ బృందంలోని సమన్వయం, సామూహిక కార్యాచరణలతోబాటు, సమర్థత, అంకితభావాలు చిత్రంలో స్పష్టంగా కనిపించేవి.

ఆనాటి సినిమాల్లో దాగున్న కళాత్మక విలువలను పరిశోధించడం వొక యజ్ఞం లాటిది. ప్రతి చిత్రాన్ని లోతులకు దిగి పరిశీలించి రాయటానికి వొక రచయితా చాలడు, వొక పుస్తకమూ చాలదు. అందువల్ల, మరపురాని చిత్రాలుగా జనం జ్ఞాపకాల్లో మిగిలిన కొన్ని మచ్చుతునకలను మాత్రమే మనం మననం చేసుకోగలం. అవి పౌరాణికాలు గావచ్చు, సాంఘికాలు గావచ్చు, చారిత్రికాలు గావచ్చు, లేదా జానపదాలు గావచ్చు; కథాంశం ఏదైనా కళాప్రాభవానికి కొదువలేని చిత్రాలు కొల్లలుగా వున్నాయి. రకానికి రెండుమూడు చిత్రాలు తీసుకున్నా సమాచారం కుప్పలుగా ప్రోగౌతుంది.

ఉత్తరభారతంలోలాగే తెలుగుసినిమా పౌరాణికంతో ప్రారంభమైంది. అది సహజమే. ఎందుకంటే, సినిమాకు ముందు వినోదానికి ఏకైక సాధనంగా వుండిన రంగస్థలం పురాణకథలకు మాత్రమే పరిమితమై వుండేది. 'చింతామణి' నాటకం ప్రవేశించేవరకు సాంఘిక నాటకాలు లేవు. ఒక దశలో చారిత్రిక నాటకాలు ప్రవేశించినా, ఆదరణ కరువై క్రమంగా తెరమరుగయ్యాయి. 'బాలనాగమ్మ' వంటి వొకటి రెండు జానపదాలూ, 'సతీసక్కుబాయి' వంటి కొన్ని సాంఘికపురాణాలూ మినహా యిస్తే, మిగిలినవన్నీ పౌరాణికాలే. 'పల్నాటి యుద్ధం.' 'బొబ్బిలి యుద్ధం' వంటి చారిత్రికాలు రంగస్థలం మీది కంటే

బుర్రకథల రూపంలోనే ఆదరణ పొందాయి. సాంఘికాలనూ, కాశీమజిలీ కథలవంటి రచనలనుండి ఏరుకున్న జానపదాలనూ, విజయనగర రాజుల కథల వంటి చారిత్రికాలనూ విరివిగా ప్రవేశపెట్టి ప్రజలను మెప్పించిన గొప్పతనం సినిమారంగానికే దక్కుతుంది.

నాల్గవదశాబ్ద కాలంలో తెలుగు చిత్రపరిశ్రమ పరిస్థితి మెరుగుపడింది. ప్రయోగాత్మక దశనుండి వాణిజ్యంగా ఎదిగింది. టూరింగ్ టాకీసులకు తోడుగా పట్టణాల్లో పక్కా సినిమాథియేటర్లు ఏర్పాటౌతున్నాయి. యూరప్‌దేశాలనుండి అధునాతన సాంకేతిక పరికరాలు కొనుగోలుచేసే సదుపాయం, సాహసం మన సినిమారంగానికి ఏర్పడింది. ఆధునిక సౌకర్యాలతో కొత్తకొత్త సినిమా స్టూడియోలు చెన్నపట్నంలో నెలకొనడం మొదలైంది. దక్షిణాది చిత్రనిర్మాణానికి మద్రాసు కేంద్రంగా రూపొందింది. అప్పట్లో ఆసియాఖండంలోనే అతిపెద్దవిగా పేరు తెచ్చుకున్న వాహినీ విజయా స్టూడియో మద్రాసులో వెలిసింది.

వాహినీ సంస్థకు మూలపురుషుడు తాడిపత్రి వాస్తవ్యులైన మూలా నారాయణస్వామిగారు. చదువుకునే రోజులనుండీ ఆయన కళాభిమాని. అదే అభిరుచి కలిగిన తన స్నేహితులతో కలిసి ఆయన చిత్రయాత్ర ప్రారంభించారు. బి.ఎన్.రెడ్డి, కె.వి.రెడ్డి, చిత్తూరు నాగయ్య, లింగమూర్తి మొదలైన మిత్రులు అతని పరివారం. అనుభవజ్ఞుడైన హెచ్.ఎం.రెడ్డి భాగస్వామ్యంతో వారి తొలిచిత్రం 'గృహలక్ష్మి' విడుదలైంది. చిత్రం విజయవంతమైందే గాని, దర్శకునితో సర్దుకోలేనన్ని అభిప్రాయబేధాలు ఏర్పడి, కుంపటి వేరుపడింది. హెచ్.ఎం.రెడ్డిని వదిలేసి ఆ కుర్రకారు స్వయంగా చిత్రనిర్మాణానికి పూనుకుంది. స్నేహితులంతా భాగస్వాములై, 'వాహినీ' సంస్థను నెలకొల్పారు. తమలో వొకడై, సమర్థునిగా నమ్మిన బి.ఎన్.రెడ్డిని దర్శకునిగా నియమించుకున్నారు. నిరుద్యోగ సమస్య ఇతివృత్తంగా గల తమ తొలిచిత్రం 'వందేమాతరం' ను నిర్మించి విడుదల చేశారు. ప్రయత్నం ఫలించింది. తొలిచిత్రంతోనే యోధులుగా గుర్తింపు లభించింది. విధవావివాహాలను సమర్థిస్తూ తీసిన వారి మలిచిత్రం 'సుమంగళి', వేశ్యా వ్యామోహాన్ని గర్హిస్తూ నిర్మించిన తరువాతి చిత్రం 'స్వర్గసీమ' జనాన్ని ఊపేశాయి. అంతేగాదు, వీరు ప్రవేశపెట్టిన

పంథా తెలుగు చిత్రసీమను కొత్త మలుపు తిప్పటానికి శ్రీకారంచుట్టింది. కళాసృష్టిలో వొకరినొకరు మించిపోవాలనే పోటీ తత్వాన్ని ఆవిష్కరించింది. దీనిమూలంగా 1950-65ల మధ్యకాలం అనేక కళాఖండాలతో తెలుగు సినీపరిశ్రమచరిత్రలో స్వర్ణయుగంగా రూపొందింది. ఇంతటి పరిణామానికి ప్రేరకులైన వాహినీవారి నుండి దృశ్యకావ్యంగా ప్రఖ్యాతి గాంచిన చిత్రం 'మల్లీశ్వరి'తో మన సమీక్ష ప్రారంభిద్దాం.

# వాహినీ వారి మల్లీశ్వరి

మల్లీశ్వరి వొక అపురూపమైన ప్రేమగాథగా ప్రశస్తి పొందిన చిత్రం. ఐతే, ప్రేమి కుల సంభాషణలో ఏ వొక్కచోట 'ప్రేమ' అనే పదం దొర్లకపోవడం రచనలోని ప్రత్యేకత. వారి మధ్య నుండే అనుబంధం, ఆత్మీయతలు పాత్రల ప్రవర్తన ద్వారా వెల్లడౌతాయే తప్ప, మాటలద్వారా కాదు. మనసులో భావాన్ని మాటలతో చెప్పటం తేలిక. తెరమీదికి ఎక్కించడం కష్టం. ఎందుకంటే, కెమెరాకు కొన్ని పరిమితులు (limitations) వున్నాయి. ఉదాహరణకు జయ దేవుని అష్టపదుల్లో 'సావిరహే తవ దీన' అనే గీతం చూడండి - రాధ విరహంతో కుంగిపోతూంది. మంచి గంధపు వాసనతో వీచే మలయమారుతాన్ని కూడా విషప్రాయంగా భావించేంత విరహం ఆమెను వేధిస్తూంది. చల్లని స్పర్శతో తాకే వెన్నెల ఆమె శరీరాన్ని వేడెక్కిస్తూంది. ఈ బాధకు ఉపశమనం కలగాలంటే 'నీవే గతి మాధవా' అంటూ పరితపిస్తుంది. ఒక విరహిణి పరితాపం ఎంతో మనోహరంగా ఇక్కడ చెప్పబడింది. కానీ, ఇది ఉన్నది ఉన్నట్టుగా నటనలోకి తర్జుమా కావడం అసాధ్యమైన విషయం. ఏ చెలికత్తెకో తన బాధను ఆమె వివరిస్తున్నట్టు చూపెట్టొచ్చు, కానీ అంత సహజంగా కనిపించదు. ఒకవేళ చెప్పించినా మాటలు మాటల రూపంలోనే ఉంటాయి తప్ప దృశ్యంగా మారవు. రాధ పరితాపంలోని తీవ్రత ప్రేక్షకులు ఆస్వాదించాలంటే అంతకు ముందే అనేక సన్నివేశాల ద్వారా దానికి పునాదులు తయారు చేయాలి. మాధవుడు లేకుండా రాధ ఒంటరిగా వుండ వలసిన ఘట్టానికి చేరుకోగానే, మాధవుని ఎడబాటును ఆమె సహించలేదనే భావం ప్రేక్షకుల్లో అనాలోచితంగా కలిగేలా చేయాలి. ఇది అనన్య సామాన్యమైన రచనా ప్రక్రియ. అది మల్లీశ్వరి రచనలో తారాస్థాయికి చేరుకుంది.

కథకు మల్లీశ్వరి నాయకి. ఆమె మేనత్త కొడుకు నాగరాజు. చిన్నతనం నుండి ఆ యిద్దరూ అన్యోన్యంగా పెరుగుతారు. కలవారింటి ఏకైక సంతానం మల్లీశ్వరి. తండ్రి లేని నిరుపేద నాగరాజు. చిన్నప్పటి నుండి శిల్పాలు చెక్కడంపైన అతనికి ఆసక్తి. సంపాదన మీద ధ్యాసే లేదు. విధవరాలైన

తల్లి కూలి పనిచేసి కుటుంబాన్ని నెట్టుకొస్తూంది. ఆ కూలిపని చేసేది కూడా తన అన్న నారప్ప దగ్గరే. నాగరాజు మీద మేనమామ నారప్పకు అమితమైన వాత్సల్యం. తన కూతురు మల్లీశ్వరికి అతన్ని భర్తగా నారప్ప ఎప్పుడో నిర్ణయించుకున్నాడు. అతని భార్య నాగమ్మకు నాగరాజంటే గిట్టదు. మేనరికం తప్పించి ఎక్కడైనా కలిగిన కుటుంబాల్లో పిల్లనివ్వాలని ఆమె తాపత్రయం.

ఇంతవరకు కథ మామూలే. ఇటువంటి కథలతో ఎన్నో సినిమాలు తెరమీదికెక్కాయి. పెద్దలను కాదని ప్రేమికులు దొంగచాటుగా కలుసుకోవడం, ఈ భాగోతం ఎలాగో పెద్దలకు తెలియడం, గిట్టనివారు ప్రేమికులను దౌర్జన్యంగా విడదీయడం, పర్యవసానంగా ఎడబాటు, కష్టాలు వగైరావగైరా, చివరన ప్రేమ వర్ధిల్లి సుఖాంతం గావడం; లేదా ప్రేమ త్యాగాన్ని ఆశించి ప్రేమికులు చనిపోవడం - ఇవి సాదాసీదా కథలు.

సగటు ప్రేమ కథల స్థాయినుండి మల్లీశ్వరిని విడదీసే భిన్నత్వం ఆ తరువాతి కథలో కనిపిస్తుంది. ఈ కథకు విలన్ పాత్ర లేదు. ప్రేమికులను దౌర్జన్యంగా విడదీసే వాళ్ళుండరు. జీవితంలో యాదృచ్ఛికంగా తటస్థించే పరిస్థితులే, మరోలా చెప్పాలంటే 'విధి', ఈ కథలో విలన్ పాత్రను పోషిస్తుంది.

పాత్రల స్వభావ పోషణకు (character establishmentకు) అప్పటి దర్శకులు చాలా పెద్ద ప్రాముఖ్యత నిచ్చేవారు. ఇప్పుడు కూడా ఈ విషయం పట్ల కొంత శ్రద్ధ కనిపిస్తుంది గానీ, అది కొనామొదలు నిలువదు. సాధారణ పాత్రలను క్యారెక్టరైజ్ చేయడం చేతగాక, పర్వర్టెడ్ మనస్తత్వాలనో, వెకిలి చేష్టలతో ఎకసెక్కెంగా వుండే పాత్రలనో రంగంలో దింపుతున్నారు. మల్లీశ్వరి చిత్రంలో స్వభావపోషణ ఎలా జరిగిందో కొద్దిగా పరిశీలిస్తే ఈ తేడా మనకు తెలిసిపోతుంది.

ఒకరోజు మల్లీశ్వరీ నాగరాజులు కలిసి ఎద్దుల బండ్లో తిరునాలకు వెళతారు. తిరిగి వచ్చే సమయంలో గాలివాన ముసురుకుంటుంది. వర్షం ఆగిందాకా ఒక సత్రంలో తలదాచుకుంటారు. యవ్వనంలో వున్న జంట మరెవ్వరూలేని సత్రంలో చిక్కుబడే అవకాశం మరొక దర్శకునికి దొరికితే వెకిలి శృంగారం కట్టలు తెంచుకుంటుంది. ఇందులో అటువంటి చేష్టలు

రవ్వంతైనా కనిపించవు. ఎందుకంటే, 'ప్రేమ' అనేది కేవలం శారీరికమైన అవసరం పర్యవసానంగా కలిగిన తేలికపాటి సంబంధం కాదనీ, మల్లీశ్వరీ నాగరాజుల ప్రేమ పవిత్రమైందని నిర్ధారించడం ఈ దర్శకుని ధ్యేయం.

ఇంటి దగ్గర అమ్మాయి తల్లి ఆందోళన పడుతుంది. గాలివానలో పిల్ల చిక్కుకు పోవడ మొక్కటేగాదు, ఆ వాతావరణంలో నాగరాజు వెంట వుండటం కూడా ఆమెకు ఆందోళనకలిగించే విషయమే.

నాగమ్మ: దానికి బుద్ధి లేకపోతే మనకైనా వుండాలి. ఈడొచ్చిన పిల్లను గంగిరెద్దు తిరిగినట్టు తిరగనిస్తే మనం కళ్ళు మూసుకున్నా లోకం వూరుకుంటుందా?

నారప్ప: లోకానికంటే ముందు నువ్వే మల్లమ్మని అల్లరి పెడుతున్నావ్. ఏదో వేడుకలు చూడాలని తిరునాలకు వెళ్ళింది. మన రాజా తోడున్నాడుగా.

నాగమ్మ: (ఈసడించుకుంటూ) ఆ.. ఉన్నాడు. . నాగరాజు తోడున్నాడు. ఊరంతా కోడై కూస్తున్నా మీకు వినిపించదు. నలుగురూ నవ్వుంటా రుగానీ, మీకేం. హవ్వ! పరాయి మగాడితో విరగబడి తీర్థాలకు, తిరునాళ్ళకు కూతురు తిరుగుతూ వుంటే ఎట్లా చూస్తూ ఊరుకుంటాం?

నారప్ప: ఎవరే పరాయివాడు? నోటికొచ్చినట్టల్లా వాగుతున్నావ్. నాగరాజు పరాయివాడా? నీకు బుద్ధివుంటే అట్లా మాట్లాడ తావా?

నాగమ్మ: (చప్పున సర్దుకుంటూ) నా మీద కారాలూ మిరియాలూ నూరు తారే గాని గాలివానకు పిల్ల ఏమైందోనని కాసింతైనా మీకు మనసులో వుందీ. ఆ మేనల్లుడిని వెనకేసుకుని నా మీద గుడ్లురుముతారెందుకు?

నారప్ప: మరేం భయంలేదు. గాలి వాన వెలిసిందాకా ఎక్కడైనా ఆగి, మరీ వస్తార్లే.

నాగమ్మ గడుసుదే గానీ, మొగుడి మీద పెత్తనం సాగించేంత సత్తా కలిగింది గాదు. మొగుడు నారప్ప ప్రలోభం ఎరుగని మనిషి. అలాటి

మనుషులను లొంగదీ యడం సులభం గాదు. కానీ, వున్న ఒక్క కూతురును నాగరాజు పాలు చేయటం నాగమ్మకు సుతరామూ ఇష్టం లేదు. సమయం దొరికినప్పుడల్లా ప్రతిఘటిస్తూనే వుండేది.

నాగమ్మ: ఆ.. మన ప్రయత్నం లేకుండా ఊడిపడతాడు ఆకాశం నుండి! తిరిగి తిప్పలుపడందే వరుడెక్కడ దొరుకుతాడు?

నారప్ప: తిప్పలుపడే ఖర్మ మనకేం వచ్చిందే? మనకా చింతలేకుండా దేవుడే కుదిర్చాడు. నాగరాజు కంటే మంచి సంబంధం ఎక్కడుంటుంది?

నాగమ్మ: ఈ పాట చిన్నప్పటి నుంచి పాడుతోందేగా. అంత మేనల్లుడనే అభిమానం పొడుచుకొస్తే మేడలిచ్చుకోండి, మాడలిచ్చుకోండి. ఏంచూసి వాడికి పిల్లనిస్తారు? ఇల్లల్లా దులిపితే ఇంత మట్టైనా రాలదు. రాల్లుకొట్టి తెచ్చే గింజలతో పెళ్ళానికింత కూడైనా పెట్టగలడా?

నారప్ప: రాల్లుకొట్టి కూలీ గింజలే తెస్తాడో, రాజ్యాలే ఏలుతాడో ఎవరు చూశారు? పోనీ, ఇంతకంటే కొమ్ములు తిరిగిన సంబంధం తీసుకురా చూద్దాం. మనమేం సామంతులమా, చక్రవర్తులమా? గోడమీద కూచుని మేడమీద కలలుకంటే ఏం లాభం?

నాగమ్మ: మీరెన్నైనా చెప్పండి. నేను ఉరిపోసుకుని చావనైనా చస్తాను గానీ ఈపెళ్ళికి వొప్పుకోను. ఆ పుట్టు దరిద్రపు కొంపకు మన పిల్లనిస్తామనడానికి మీకు నోరెలా వస్తోందో! ఈ దిక్కుమాలిన సంబంధంకంటే నా తల్లిని ఏ పాడుబావిలోనైనా పారేసి మీరూ మీచెల్లెలు సుఖంగా వుండండి.

ఈ రెండు సన్నివేశాలను కథ నడిపేందుకే గాక, పాత్రల స్వభావాన్ని నిరూపించడానికి ఎంతో సమర్ధవంతంగా దర్శకుడు వినియోగించుకున్నాడు. అంతేగాదు, పల్లెప్రజల సంభాషణకు ఇక్కడ ఉపయోగించిన భాషలో తత్సమాలులేని తెలుగుదనముంది; సామెతలు జోడించి విషయాన్ని పూసగించే తెలుగు నుడికారముంది. పేదరికాన్ని వర్ణించడానికి 'ఇల్లంతా దులిపితే ఇంత మట్టైనా రాలదు' అనే నిష్ఠూరంలో సాటిలేని అలంకారముంది.

నాగమ్మ నిష్ఠూరాలు తల్లిద్వారా నాగరాజుకు తెలుస్తుంది. నాగరాజు తల్లి సాత్వికురాలు. చాడీలు చెప్పే గుణం ఆమెకు లేదు. కొడుకును ఏదో విధంగా నాలుగు రాళ్ళు సంపాదించేలా చేయాలనేది ఆమె తపన.

నాగ: భాగ్యవంతులు కావచ్చు. కానీ ఇంత అహంకారం దేనికి? మనమేం వాళ్ళమీద ఆధారపడి వున్నామా? అంతమాత్రాన మనల్ని చిన్న తనంగా మాట్లాడడందేనికి?

గోవిందమ్మ: అదేమిట్రా రాజా అట్లా అంటావు! ఆవిడ తప్పేముందిరా? ఐశ్వర్యం వుంటే అట్లా వుంటుంది లోకంలో. మీ నాన్నే వుంటె ఇట్లా అనేవారా? ఆయనతోనే పోయింది మన అదృష్టమంతా. పోనీ నిన్ను చూస్తే, పనీపాటా లేకుండా పొద్దస్తమానం ఆ గుళ్ళో రాళ్ళూ రప్పలూ చెక్కుతూ కూర్చుంటావు. ఎట్లారా నాయనా రాజా, ముందుగతి ఆలోచించకపోతే ఎట్లారా? నలుగురితో పాటు నువ్వూ నాలుగురాళ్ళు సంపాదిస్తే మీ నాగమ్మత్త ఇంత చిన్నతనంగా మాట్లాడుతుందా? పుట్టు దరిద్రులకు మనం పిల్లను ఎలా ఇచ్చేది అంటుంది. మన సంబంధం దిక్కుమాలిన సంబంధం అట. నేను ఎట్లా ఏడుస్తున్నానో ఆ భగవంతుడికే తెలియాలి. ఒకర్నని ఏం లాభం నాయనా, ఇదంతా నా ఖర్మ రాజా.

నాగ: చాలమ్మా చాలు. ఈ మాటలు వినలేను. నాగమ్మత్త కళ్ళు భ్రమిసే టంత ధనం తెస్తాను. ఈ ఊర్లో ఎవ్వరికీ లేనంత ఐశ్వర్యం తెచ్చి నీ పాదాల దగ్గర పెడతాను. మల్లిని నీ కోడలుగా చేసుకోమని నాగమ్మ నీ కాళ్ళావేళ్ళా పడి బతిమాలేలా చేస్తాను. సరేనామ్మా. నీ మీద ప్రమాణం చేసి చెబుతున్నాను.

నాగరాజు రెచ్చిపోయాడు. నాగమ్మ తన ప్రతిభను గుర్తించలేదనే ఆవేదనతో కూడిన ఆవేశం అది. తన నైపుణ్యానికి గుర్తింపు కలిగిన ప్రదేశాలకు వెళ్ళి, నాగమ్మ కళ్ళు తిరిగేంత సంపదతో తిరిగిరావాలని ప్రయాణమౌతాడు. కొండలూ అడవులూ దాటవలసిన ప్రయాణాలకు కత్తి, ఈటె వంటి ఆయుధాలు వెంటతీసుకెళ్ళడం ఆ కాలపు ఆచారం. చేతిలో బల్లెంతో బయలుదేరుతున్న నాగరాజును కోవెల దగ్గర మల్లీశ్వరి నిలేస్తుంది. అప్పుడప్పుడనుకుని నిర్ణ

యించుకున్న ప్రయాణం; ఆవేశంతో నిర్ణయించుకున్న ప్రయాణం; ఆమె తల్లిమీద పంతంతో చేసే ప్రయాణం - అందువల్ల మల్లితో ముందే చెప్పే అవకాశంలేదు. ఇదివరకు వారి జీవితంలో వొకరికి తెలియకుండా మరొకరు ఏపనీ చెయ్యలేదు. ఇప్పుడది జరిగింది.

మల్లి: ఏయ్ బావా, ఎక్కడి కలా పరుగెడుతున్నావ్?

నాగ: (పలకడు)

మల్లి: ఏం జరిగింది బావా? ఎక్కడికీ ప్రయాణం?

నాగ: ఎక్కడైనా బ్రతుకు తెరువు చూడందే నాబోటి నిరుపేదలకు ఎలాగడుస్తుంది? నీవంటే భాగ్యశాలివి. శ్రీమంతుల బిడ్డవు.

మల్లి: ఈ మాటలకంటే నీ చేతిలో బల్లెంతో పొడిచినా ఇంత బాధ వుండదు. నేనేం చేశాను బావా?

నాగ: మరేం అనుకోకు మల్లీ. నా మనసులోని బాధ కొద్దీ నిన్ను నొప్పించాను. మా అమ్మకు జబ్బుగావుంది. నేను వచ్చేవరకు నువ్వు కాస్తా చూస్తుంటావా?

మల్లి: ఎందుకిట్లా మాట్లాడుతున్నావు బావా? అత్తకు జబ్బుగావుంటే ఉపచర్య చెయ్యమని నువ్వు నాకు చెప్పాలా? నేను నీకేమీకానా? నన్నెందుకిట్లా పరాయిదాన్ని చేస్తున్నావు?

నాగ: నేనిప్పుడేం మాట్లాడినా విపరీతంగా వుంటుంది. ఒక్కమాట మల్లీ! నువ్వు లేనిది ఏదీ నాది కాదు. నీకంటే నాకు ఎవ్వరూ లేరు. ఇంతకంటే నేనేమీ చెప్పలేను.

మల్లి: పోనీ, ఈ ప్రయాణం ఎందాకా బావా? మళ్ళీ ఎప్పుడు తిరిగొస్తావు?

నాగ: కొన్ని మాసాల్లో, బహుశా వొక ఏడాది కావచ్చు.

మల్లి: ఒక ఏడాదే! అన్నాళ్ళు నిన్ను చూడకుండా ఎట్లావుండగలను బావా?

నాగ: నేను మాత్రం వుండగలనా మల్లీ. మనిద్దరికోసం, మన మంచికోసం మనకీ ఎడబాటు తప్పదు.

మల్లి: నాకు చెప్పరాదా బావా. నాకు తెలియగూడని రహస్యాలు నీకున్నాయా?

నాగ: వద్దు మల్లీ వద్దు. తొందరగానే తిరిగొస్తాను. అప్పుడన్నీ వివరంగా చెప్తాను.

ఆరోగ్యం బాగలేని తల్లిని కాస్త కనిపెట్టి వుండమనడం మామూలు అప్పగింత. కానీ, ఆ మాటే మల్లీశ్వరి గుండెల్లో గాయం చేసిందంటే ఆమె స్వభావం ఎంత సున్నితమైంది! ఆమె తన సొంతమనిషి ఐనప్పుడు అది ప్రత్యేకంగా అప్పగించవలసిన పనిగాదు. బావ తనను దూరం జరుపుతు న్నాడు. ఆ దూరం వెంట్రుకవాసే గావచ్చు, కానీ, దూరం దూరమే. ఆ చిన్నమాటే మల్లీశ్వరిని కలవరపెట్టింది. ఆత్మీయతను అంత నిశితంగా పరిశీలించి, ఇంత సున్నితంగా తీర్చిదిద్దగలిగిన రచయితకు వేవేల జోహార్లు. ఇక్కడ గమనించవలసిన మరికొన్ని అంశాలున్నాయి. ప్రేమికులకు త్వరలో కలుగబోయే ఎడబాటు ప్రేక్షకుల్లో అనుభూతిని కలిగించే పునాదులను ఈ మాటతో కట్టుదిట్టం చేస్తున్నాడు రచయిత. భాషలో గూడా కొద్దిపాటి తేడా తీసుకొచ్చాడు. నారప్పా నాగమ్మలు మాట్లాడే భాషకూ దీనికీ తేడావుంది.

ఇటువంటి కారణాలనేకం ఉండబట్టే 'మల్లీశ్వరి' చిత్రం దృశ్యకావ్యంగా మేధావుల మెప్పుదల పొందింది. ఇది ముగ్గురు కళామూర్తుల అద్వితీయ ప్రతిభను మేళవించుకున్న త్రివేణీసంగమం. మాటలూ పాటలూ మొత్తంగా దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి కలంనుండి వెలువడగా, సంగీతానికి సాలూరు రాజేశ్వరరావుగారు సారథ్యం వహించారు. దర్శకశిల్పి బి.ఎన్.రెడ్డిగారు ఈచిత్రానికి నాయకత్వం నిర్వహించారు.

కథను ఎన్నుకోవడంలో బి.ఎన్.రెడ్డి దిట్ట. ఆయన మంచి చదువరి. ఇంగ్లీషు సాహిత్యంతో మంచి పరిచయం వుంది. తెలుగులో వెలువడిన ప్రతి పుస్తకం ఆయన చేతుల్లో నలుగుతుంది. మల్లీశ్వరి కథ సాధారణంగా చలనచిత్రాలు విభజింపబడే తరగతుల్లో చేరదు. కథలో చెప్పబడింది సామా న్యుల జీవితమేగానీ ఇది సాంఘికం కాదు. విజయనగర రాజుల కాలంలో జరిగినట్టు చెప్పబడిందేగానీ చారిత్రికం కాదు. తయారుచేసింది దేవుల పల్లివారేగానీ అంతా ఆయనదేగాదు. బుచ్చిబాబుగారి వొకానొక రేడియో నాటకం బి.ఎన్.రెడ్డికి ఈ ప్రేరణ కలిగించింది. విజయనగర రాజుల పరి పాలనమీద ఆయనకు ఎనలేని గౌరవం. ప్రేమ అనేది పవిత్రమైన అనుబంధమని ఆయన నమ్మకం. ఆ రాజుల గౌరవానికి భంగం కలుగరాదు. ప్రేమ పవిత్రతకు మాలిన్యం అంటరాదు. అందువల్ల, బుచ్చిబాబుగారి క్యాన్వాస్‌మీద కొత్త

బొమ్మ గీయించాలని ఆయన సంకల్పించారు. కవీ, మిత్రుడు కృష్ణశాస్త్రిని పిలుచుకున్నాడు. ఇద్దరూ కలిసి కొత్తరూపం తయారుజేశారు. అదే 'మల్లీశ్వరి' చిత్రకథ.

ఆషామాషీగా బ్రతికే కుటుంబాలకు సామాజిక విలువలను జోడించడం కుదరని పని. మర్యాదస్తుల కుటుంబాలను ఇందుకుగాను ఎన్నుకోవాలి. జీవితానికి ప్రధానమైంది కూడు, నాగరికతకు ప్రధానమైంది బట్ట. కాబట్టి, సమాజంలో రైతుపని నేత పని ప్రధానమైన వృత్తులుగా నిలిచాయి. రైతులది మోటుపని. దానికి అలవాటు పడిన మనుషులుగూడా మోటుగా వుంటారు. నేతపని సున్నితమైంది. యంత్రాలు రాక పూర్వం నేతకుటుంబాలు చాలా సంపన్నంగా వుండేవి. సంపదతోపాటు నాగరికతగూడా ఉన్నతంగా వుండేది. 'మేము పద్మసాలీలం' అని గర్వంగా చెప్పుకునే స్థాయిలో నేత కుటుంబాలు బ్రతికేవి. ఈ చారిత్రిక అంశాన్ని దృష్టిలో వుంచుకుని, పద్మసాలి కుటుంబాన్ని ఆసరాగా తీసుకుని కథ మలచడం ఇందులోని మరో విశేషం.

గాలివాననుండి తలదాచుకోటానికి మల్లీశ్వరీ నాగరాజులు సత్రంలో చేరారు. కాస్సేపటికి ఇద్దరు పెద్దమనుషులు అందులో ప్రవేశిస్తారు. వారెవరో నాగరాజుకు తెలీదు. వారిలో వొకాయన ఆశువుగా చెప్పిన పద్యాన్నిబట్టి వారిని కవులుగా గుర్తిస్తాడు.

'ఏ ఊరు స్వామీ మనది?'

'మాది విజయనగరం నాయనా. దార్లో వర్షం తరుముకొస్తే ఇలా వచ్చాం.' అంటాడు పద్యం చెప్పిన పెద్దమనిషి.

'కూచోండి స్వామీ.' నాగరాజు నిలబడేవుండి అంటాడు. నాగరాజు చూపే వినయాన్నిబట్టి విజయనగరప్రభువుల కాలంలో కవులకు ప్రజల్లో ఎంత గౌరవం వుండేదో తెలిసివస్తుంది.

'మీదేవూరు?'

'ఇక్కడికి దగ్గరేనండీ. వీరాపురం. తిరునాలకు పోయి తిరిగొస్తూ, చినుకు లొస్తే ఇక్కడ ఆగిపోయాం. ఈ పిల్ల మా నారప్పమామ కూతురు - మల్లీశ్వరి. నా పేరు నాగరాజులెండి.'

'ఏమిటీ, మల్లీశ్వరి - నాగరాజు! ఎంత చక్కని పేర్లు!'

'ఇంత చక్కని నృత్యం ఎక్కడ నేర్చావమ్మా?' అడుగుతాడు రెండవ పెద్దమనిషి.

'అబ్బే, నాకేం రాదండీ. నేనెక్కడా నేర్చుకోలేదు. మా బావ ఆడమంటే వేళాకోలానికి ఆడాను.'

'అమ్మాయీ, ఈ విద్యలు ఈశ్వర ప్రసాదం. ఇదిగో మా ఆనందానికి ఈ చిన్న పారితోషికం.' మెడలో హారం తీసి ఇవ్వబోతాడు.

'వద్దండీ. ముక్కూమొహం ఎరుగని పరాయివాళ్ళిచ్చే బహుమానాలు తీసుకునేవాళ్ళం కాము.' ముఖంమీద కొట్టినట్టు చెప్తుంది మల్లీశ్వరి.

ఈ మాటలో మల్లీశ్వరి స్వభావాన్నేకాదు, ఆనాటి మధ్యతరగతి కుటుంబీకుల ఆత్మాభిమానాన్నిగూడా రచయిత ఇనుమడించాడు. అది సాదాసీదా హారం కాదు. ఆ తరువాత మల్లీశ్వరి తల్లి దాన్ని ఊరందరికీ ప్రదర్శిస్తుంది. హారాన్ని చేతుల్లో పట్టుకుని బసక్క:

> 'మా నాగమ్మతల్లి మెడలో ఈ హారం వేస్తేనా, మహారాణి కళ ఉట్టిపడుతుంది.'
>
> 'ఎవరా పోయేది, పాపమ్మేనా, ఓ మాటు ఇటు రావమ్మా,' అంటూ నాగమ్మ,
>
> 'మా యింటి వేపే రావడం మానేశావే. ఈ హారం చూడు ఎంత బావుందో.'
>
> 'చూడండమ్మా చూడండి.' అంటూ బసక్క హారాన్ని అందరకి చూపిస్తుంది.
>
> 'మన ఊరంతా అమ్మినా ఇట్లాంటి హారం వొక్కటైనా కొనలేం. మన రాయలవారి రాణివాసంలోనే ఇట్లాంటివి వుంటాయట తెలుసా?' అంది నాగమ్మ.

మన రాయలవారు అనడంలో రాయల పరిపాలన ప్రజలకు ఎంత చేరువగావుందో చెప్పబడుతూంది.

'మీకేం పనీపాటా లేవూ, మా ఇంటిచుట్టూ మూగారు. ఏమిటీ గుంపంతా?' నారప్ప వచ్చి కసురుకుంటాడు. 'ఈ హారాన్ని మెడలో తగిలించుకుని ఊరేగరాదూ. తప్పెట కొట్టి ఊరంతా చాటరాదూ. ఎవరో దారినబోయే పరాయివాళ్ళు అమ్మాయికిచ్చిన బహుమానాన్ని మహాగొప్పగా చెప్పుకుంటున్నావు, సిగ్గులేదూ?' అని భార్యను కోప్పడతాడు.

ఇక్కడ మర్యాదస్తుల ప్రవర్తన మరొక్కసారి నిరూపించబడింది. అంతేగాదు, మల్లీశ్వరి, ఆమెతండ్రి నారప్పల ఆదర్శంలో సామ్యం చూపబడింది.

సత్రంలో, పెద్దమనుషులు నాగరాజుతో కబుర్లకు దిగుతారు.

**పండి: మీరే వర్ణస్తులు నాయనా?**

**నాగ: పద్మసాలీలం. మీరు వినేవుంటారు మామామ నారప్పగారి పేరు. ఆయన చేతికింద నూరు మగ్గాలున్నాయి. మా ఊరికంతా పెద్ద మా మామేలెండి.**

రచయిత గొప్పతనం చాటే మాట ఇది. నాగరాజు పేదవాడు. గొప్పవారి ఎదుట గర్వంగా చెప్పుకునే హోదా అతనికి లేదు. నాగరాజుది నిరాడంబరమైన వ్యక్తిత్వం. లేని గొప్పలు ఆపాదించుకుని హెచ్చులు చెప్పుకోవాలనే ఉబలాటం అతనికి లేదు. తన మేనమామకు హోదా వుంది. నూరు మగ్గాల యజమాని. తనను ఆప్యాయంగా పెంచింది మేనమామే గాబట్టి, నాగరాజుకు అతడంటే అభిమానం, భక్తి. ఇన్ని విషయాలను ఒక్క మాటలో గుదిగుచ్చి చెప్పడం దేవులపల్లివారికే సాధ్యం.

**నాగ: చూశారా స్వామీ. కాస్తా చనువిస్తే చాలు, ఈ పిల్లకు పట్టపగ్గాలుండవు. మరి, ఈమె ఆటాపాటా గూడా మీరు మెచ్చుకున్నారు. ఆ . . . . పోనీండి. మీరో ఉపకారం చేస్తారా?**

**పండి: ఓ. చెప్పు నాయనా. విజయనగరంలో మీకేది కావాలన్నా మేము ఏర్పాటు చేయగలం.**

**నాగ: మరేం లేదులెండి. ఇందాకా ఏదో సెలవిచ్చారే, మహారాణీవారి ఇష్టసఖీ మర్యాదలని, అవేవో కాస్త జరిగేటట్టు చూడండి. మన రాయలవారితో మల్లీశ్వరి అని ఒక పిల్లి .. ఆ .. పిల్ల, వుందని మనవి చేయించి, పల్లకీ పంపేటట్టుమాత్రం చూడండేం.**

నిజంగా అది అతని కోరిక కాదు. వేళాకోలానికి అడుగుతాడు. ఆ యిద్దరు వెళ్ళిపోయిన తరువాత మల్లీశ్వరి అంటుంది - 'పో బావా, నీతో మాట్లాడను. ఎందుకుచెప్పు వాళ్ళతో పల్లకి పంపమని చెప్పడం.' ఆడంబరంగా దుస్తులు, దండలు వేసుకునేవారు విజయనగరంలో కొల్లలుగా ఉంటారు. వారికీ ప్రభువులకూ సామ్యమే లేదని నాగరాజు అంచనా. 'ఓస్ పిచ్చిపిల్లా. వీల్లేనా పల్లకిలూ పట్టపుటేనుగులూ పంపేది. వీళ్ళకసలు రాయలవారి దర్శనమే కాదు.'

అదే అతని పొరపాటు. ఆ కొద్దిసేపు వారితో కాలక్షేపం చేసింది స్వయానా విజయనగర ప్రభువు కృష్ణదేవరాయలు, ఆయన ఆస్థానకవి అల్లసాని పెద్దనామాత్యులే నని ఆతనికి తెలీదు. మారు వేషాల్లో దేశాటనం చేస్తూ వారు అక్కడి కొచ్చారు. ఆ సందర్భంలోనే మల్లీశ్వరి నాట్యాన్ని చూసి ముగ్ధుడైన పెద్దన ఈ పద్యాన్ని ఆశువుగా చెబుతాడు.

**భళిరా ఎన్నడు జారె నీ భువికి, రంభా రాగిణీ రత్నమే**
**ఖలయో, నిర్జర వల్లభ ప్రియ వధూ కంఠ స్రవద్దామమో,**
**మలయాశాగత మారుతోల్లలిత పంపా వీచికా డోలికా**
**చల దుత్ఫుల్ల జలేజ మాలికయో, చంచచ్చంచలా తన్వియో!**

అల్లసానివారు చెప్పిన పద్యం కాబట్టి అల్లసానివారి శైలిలోనే ఉండాలనేది దర్శకుని పట్టుదల. దానికోసం దేవులపల్లివారు 108 పద్యాలు తయారు చేశారు. కావలసింది మాత్రం వొక్క పద్యమే. ఇంత ప్రయత్నం ఎవరినో సంతృప్తి పరచడానికి కాదు. ప్రేక్షకులకు వడ్డించేముందు తమను తాము సంతృప్తి పరచుకోడానికి. ఆ దర్శకుడూ రచయితల పట్టుదలకూ, అంకిత భావానికి ఇదొక తార్కాణం.

ఆ సత్రంలో మల్లీశ్వరి నాట్యంకోసం దేవులపల్లివారు రాసిన జావళిలో తెలుగుపదాల ప్రాభవం గమనించితీరాలి.

**పిలిచిన బిగువటరా, ఔరౌర, చెలువలు తామే వలచి వచ్చిన..**
**ఈ నయగారము, ఈ వయ్యారము, ఈ నవయవ్వనమారగ నినునే..**
**గాలుల తేలెను గాటపు మమతలు, నీలపు మబ్బుల నీడలు కదిలెను**
**అందెల రవళుల సందడి మరిమరి, అందగాడ, ఇటు తొందర సేయగ.**

ఒక నాయిక ప్రియుణ్ణి 'కళ్ళారా' చూస్తుంది. ఒక నాయిక ప్రియుని మధురాలాపాలు 'చెవులారా' వింటుంది. కృష్ణశాస్త్రిగారి నాయిక 'నవ యవ్వనమారా' బావను పిలిచింది. ఎంత గొప్ప ప్రయోగం!

పాత్రల్లో, ప్రదేశాల్లో, మాటల్లో, నడవడికలో సహజత్వం ఉట్టిపడేలా ప్రదర్శించే ప్రతిభ బి.ఎన్.రెడ్డిది. అందుకు మచ్చుతునకగా వొక చిన్న సన్నివేశాన్ని పరిశీలించండి. అవి నేత పనివారి కుటుంబాలు. వసారాల్లోనూ, అరుగులమీదనూ కూర్చొని ఆడవాళ్ళు నేతకు అనుబంధమైన పనులు

చేసుకోవడం అలవాటు. ఆడవాళ్ళకు రచ్చబండగూడా అదే. సంగతులూ, సమాచారాలూ, పుకార్లూ, వాస్తవాలూ సర్వస్వం అక్కడ చర్చకొస్తాయి. మనుషులను ఎగదోసి సమాచారం రాబట్టే నేర్పరులు గూడా వారిలో వుంటారు.

బసక్క: ఏం గోవిందమ్మా. కొడుక్కి పెళ్ళెప్పుడు చేస్తావు?

గోవిం : నాదేముంది బసక్కా. అదంతా మా అన్నయ్య చేతిలో వుంది. దేవుని దయ సరిగ్గా వుంటే, వచ్చే మాఘమాసంలో చేస్తానన్నాడు మా అన్నయ్య.

బసక్క: నీకేమమ్మా. బంగారంలాంటి మేనకోడల్ని భగవంతుడిచ్చాడాయె. ఆపెళ్ళి కాస్తా అయిపోతే, కొడుకూ కోడల్ని చూసుకుంటూ సుఖంగా వుండొచ్చు.

గోవిం: అదంతా ఆ పరమాత్ముని దయ. (అంటూ వెళ్ళిపోతుంది.)

రామక్క: నాకు నమ్మకం లేదే ఆ నాగమ్మ ఈ పెళ్ళికి వొప్పుకుంటుందని.

బసక్క: ఆ, దాని బడాయికేంలే, ఐనా వొకరి సంగతి నాకెందుకులే, ఎవ రెట్లా పోతే నాకేం. (అని అంతటితో ఆగదు బసక్క) అది సరే గాని, మేనరికం ఎట్లా తప్పించుకుటుంది. గోవిందమ్మ కొడుక్కి ఏం తక్కువైందీ అంట?

రామక్క: సరేలే, నీ కింతే తెలిసింది. ఆ నాగమ్మ చూపంతా ఇజయనగరం మీదుంది. వాళ్ళన్న హనుమంతప్ప అక్కడ వొక పెద్ద సంబంధం చూస్తున్నాడంట.

బసక్క: ఐతే రామక్కా, తెలియకడుగుతాను, దాని మాట నీ మాటేనా జరిగేది? కన్నకొడుక్కంటే ఎక్కువగా నారప్ప నాగరాజుని పెంచి పెద్దచేశాడే, ఈ రోజు తన కూతుర్ని పరాయిచోట ఇస్తాడా?

మరొక స్త్రీ: రాతవుంటే ఎవరూ తప్పించలేరు. నాగమ్మకేం కొమ్ము లొచ్చాయా?

బసక్క: ఐనా వొకరి సంగతి నాకెందుకులే. ఎవరెట్లాపోతే నాకేం. జరిగేది ఎట్లాగూ జరుగుతుంది. నువ్వూరుకోవే, నాగమ్మ నోరు మంచిది కాదు.

ఆ కూర్పు, నేర్పు, నటనల్లోని సహజత్వాన్ని ఆస్వాదించాలంటే

తెరమీద చూడవలసిందే తప్ప చెప్పటానికి అలవిగాదు.

మేనత్త బ్రతిమాలి పిల్లనిచ్చే అంతస్తుకు చేరుకునే ప్రయత్నంలో నాగరాజు ఊరు విడిచాడు. ఆ పల్లెలో ఎవ్వరికీ లేనంత సంపదతో తిరిగొచ్చాడు. కానీ, విధి వక్రించింది. ఎవరికోసం తను ఇన్ని తిప్పలు పడ్డాడో ఆమె అక్కడ లేదు. అతడు తిరిగివచ్చేలోపు ఆమె అంతస్థు మరింత పెరిగింది. ఏస్థాయికి తను చేరుకోగలనని నాగరాజు ఊహించనైనాలేడో అంత ఎత్తుకు మల్లీశ్వరి ఎదిగిపోయింది. ఆమె రాణి వాసం చేరిపోయింది.

సత్రంలోని సన్నివేశంతో మల్లీశ్వరీనాగరాజులు ఎంత కలవొద్దికగా వుంటారో అర్థమయ్యేలాచేస్తాడు దర్శకుడు. అందువల్ల మల్లీశ్వరి ధ్యాస నాగరాజును వదిలిపెట్టదు. మతిచలించి ఊరు విడిచి వెళిపోతాడు. సంపాదనకోసం తను ఊరు విడిచి వెళ్ళినప్పుడు తప్ప చిన్నప్పటినుండి ఆ జంట ఏపూటా విడిపోలేదు. అప్పటి ఎడబాటులోని గుండెకోతను పాటరూపంలో కృష్ణశాస్త్రి వర్ణించిన తీరు అద్వితీయం. మేఘసందేశంలోలా ఇక్కడగూడా ప్రేమికుల మధ్య మేఘమాల సందేశకర్త.

మల్లి: ఆకాశవీధిలో హాయిగా ఎగిరేవు, దేశదేశాలన్ని తిరిగి చూసేవు
ఏడ తానున్నాడొ బావ, జాడ తెలిసిన పోయిరావా
అందాల ఓ మేఘమాలా, చందాల ఓ మేఘమాలా

నాగ: గగన సీమల తేలు ఓ మేఘమాలా,
మావూరు గుడిపైన మసలి వస్తున్నావా
మల్లి మాటేదైన నాతో మనసు చల్లగ చెప్పిపోవా,
నీలాల ఓ మేఘమాలా, రాగాల ఓ మేఘమాలా

మల్లి: మమత లెరిగిన మేఘమాలా, నా మనసు బావకు చెప్పిరావా
ఎన్నాళ్ళు నా కళ్ళు దిగులుతో రేబవలు
ఎదురుతెన్నులు చూసెనే, బావకై చెదరి కాయలు కాచెనే

నాగ: మనసు తెలిసిన మేఘమాలా, మరువలేనని చెప్పలేవా,
మల్లితో మరువలేనని చెప్పలేవా
కళ్ళు తెరచినగాని, కళ్ళు మూసినగాని
మల్లిరూపే నిలిచెనే, నాచెంత మల్లి మాటే పిలిచెనే

**మల్లి: జాలిగుండెల మేఘమాలా, బావ లేనిది బ్రతుకజాల,**
**కురియు నా కన్నీరు గుండెలో దాచుకుని**
**వానజల్లుగ కురిసిపోవా, కన్నీరు ఆనవాలుగ బావ మ్రోల.**

'మమత లెరిగిన మేఘమాలా', 'మనసు తెలిసిన మేఘమాలా', 'జాలిగుండెల మేఘమాలా' - ఎంత సందర్భోచిత సంబోధనలు కృష్ణశాస్త్రి గారివి! స్వరకల్పనా? - గుండెలు పిండేదిగా వుంది. ఈ పాటలో ప్రత్యేకంగా గమనించవలసింది తబలా, ఢోలక్‌ల దరువు. అవి అంత శ్రావ్యంగా వుండటానికి కొంత చరిత్ర వుంది. తబలా, ఢోలక్‌లను శృతిచేయడానికి తాళ్ళను బిగిస్తూ సుత్తెతో సవరిస్తారు. ఆ శృతి అంత ఖచ్చితమైంది కాదని సాలూరివారి అభిప్రాయం. ఈ సాధనాల తయారీకి బరోడా పట్టణం ప్రసిద్ధి. శ్రుతి ఖచ్చితంగా నిలిపి, వొక్కో శ్రుతికి వేరువేరుగా వీటిని తయారు జేస్తారు. అవి వాడాలని సాలూరి కోరిక. తీయదలచింది కళాఖండంగదా - తప్పలేదు మరి!

మల్లీశ్వరి కోసం రాయలవారు పల్లకి పంపుతారు. రాణివాసానికి అనుమతిస్తూ రాయలువారు జారీచేసిన ఆజ్ఞాపత్రం దేవులపల్లివారి మరో అద్భుత సృష్టి. ఆనాటి సంస్థానాల లేఖలు ఏ శైలిలో వుంటాయో సరిగ్గా అదే శైలిలో ఈ పత్రాన్ని ఆయన తయారుజేశారు.

**'శుభమస్తు. శ్రీమన్మహారాజాధిరాజ, రాజపరమేశ్వర, మూరురాయర గండ, శ్రీ వీర ప్రతాప, శ్రీ కృష్ణదేవరాయలవారు విజయనగర సింహాసనస్థులైవుండి, తమ దేవేరి శ్రీ మహారాజ్ఞి శ్రీ తిరుమలదేవమ్మగారు కోరివుండడం వల్లనూ శ్రీ విజయాభ్యుదయ శాలివాహనశక వర్షంబులు రెండు వందల ముప్పై ఎనిమిది అగు నేటి ధాతు సంవత్సర కార్తీక శుద్ధ ఏకాదశీ భానువారాన, వీరాపురగ్రామ వాస్తవ్యుడు తాటిపర్తి నారప్ప కుమార్తె మల్లీశ్వరీదేవిని శ్రీ మహారాజ్ఞి తిరుమల దేవమ్మగారి ఇష్టసఖిగా నియమించుటకున్నూ, మల్లీశ్వరీదేవికి యథోచిత రాణివాస గౌరవములున్నూ లాంఛనములున్నూ జరిపించుటకు అనుగ్రహించి దయచేయించుటకు ఉత్తరువు.'**

ఈ ఉత్తరువుకు దిగ్భ్రాంతుడైన నారప్ప మాట్లాడే మాటల్లో అతని స్వభావం మరొకసారి బయటపడుతుంది. 'ఇదెక్కడి విచిత్రం. మా మల్లమ్మేమిటి, మహారాణీ వారి పల్లకీ ఏమిటి? దీంట్లో ఏదో పొరపాటు ఉండివుంటుంది.

మహాప్రభువులవారి రాణివాసం ఎక్కడ, ఈ సాలె నారప్ప కూతురెక్కడ?'- అంటాడు. 'మహారాయల వారి నిర్ణయంలో ఎప్పటికీ పొరపాటుండదు. మల్లీశ్వరీదేవి ప్రయాణానికి అన్నీ సిద్ధం చేయించండి.' అంటాడు భటుడు.

రాయలవారి నిర్ణయంమీద సేవకులకు ఎంత ధీమా వుందో తెలుపు తున్నాడు రచయిత. రాయలవారు రాణివాసానికి అర్హురాలుగా నిర్ణయించిన మల్లమ్మ, అప్పుడే మల్లీశ్వరీదేవిగా మారిపోయింది. సత్రంలో యథాలాపంగా చెప్పుకున్న కబుర్ల మధ్య నాగరాజు అందించిన వివరాలన్నీ ప్రభువుకు గుర్తున్నాయంటే అతని పరిపాలన ఎంత సమర్థవంతంగా వుండేదో పరోక్షంగా చెబుతున్నాడు.

ఇంతవరకు త్రివేణీ సంగమంలో ఒక ప్రవాహాన్ని గురించే ఎక్కువగా ముచ్చటించుకున్నాం. తక్కిన రెండింటి మాటేమిటి? ఔను, ఇంకా రెండు మిగిలున్నాయి. వాటిలో వొక దాన్ని స్పష్టంగా విడదీయడం కష్టం. సినిమాలోని ప్రతి అంగుళంలో అది లీనమైంది. అదే బి.ఎన్.రెడ్డిగారి దర్శకత్వం. ఎవరో రాసిన కథను తెరమీది కెక్కించటానికి ఆయన దర్శకత్వం వహించింది గాదు 'మల్లీశ్వరి.' మాటలు, పాటలు, నటన, కళ, సంగీతం, ఛాయాగ్రహణం, ఎడిటింగులతో సహా అంతా తానై బి.ఎన్.రెడ్డి నడిపించినవే. మల్లీశ్వరికి అందించిన అద్భుతమైన రచనకు అబ్బుర పడిన పచ్చయ్యప్పాస్ కాలేజీ అధ్యాపక బృందం దేవులపల్లి వారికి సన్మానం ఏర్పాటు చేసింది. అప్పట్లో తెలుగు పాఠాలకూ, పండితులకూ మద్రాసు పచ్చయ్యప్పాస్ కాలేజి ప్రసిద్ధి. బాలవ్యాకరణకర్త చిన్నయసూరి పనిచేసింది అదే కళాశాలలో. ఆ సన్మానానికి ధన్యవాదాలు తెలుపుతూ దేవులపల్లివారు - 'వాస్తవంగా దీనికి అర్హుడైన వ్యక్తి నేను గాదు. 'మల్లీశ్వరి' సృష్టిలో మేమంతా నిమిత్తమాత్రులం. బి.ఎన్.రెడ్డి గారు దీనికి సర్వస్వం' అన్నారు.

ముప్ఫయ్యేళ్లకు పైన తెలుగు చిత్రరంగంలోని సంగీతానికి సార్వ భౌముడుగా వెలిగిన వ్యక్తి సాలూరి రాజేశ్వరరావు. సినిమాలో ఏ విలువలూ లేకున్నా కేవలం ఆయన సంగీతంతోనే విజయవంతమైన చిత్రాలెన్నో వున్నాయి. ఎన్నో సంభారాలు ఆశించి సినిమాకు వెళ్ళే ప్రేక్షకుడు, చివరకు ఒకేవొక్క బహుమానంతో తృప్తిపడుతున్నాడంటే, సాలూరివారి సంగీతంలోని విశిష్టత

అది. సంతోషంగా వుండే సందర్భం వెనుక రాబోయే విషాదాన్ని ఆయన హెచ్చరిక చేయగలడు. అందరూ విషాదానికి ఉపయోగించే రాగంతో పండుగలు చేయించగలడు, భక్తిని పరవశింపచేయగలడు. ఆయన సంగీతం వొక విశిష్టమైన విన్యాసం. ఆ విన్యాసానికి ఇందులోని వీడ్కోలుపాట మచ్చు తునక.

మల్లీశ్వరి రాణివాసం వెళ్ళక తప్పదు. రాణివాసంవల్ల అంతస్థు పెరుగుతుంది. కానీ, బావకు దూరమౌతుంది. మల్లీశ్వరికి కావలిసింది బావే గాని, అంతస్థు కాదు. ఆమె తల్లికి పట్టరాని ఆనందం; మల్లీశ్వరికి అలవిగాని ఆవేదన. వీడ్కోలు సమయంలో ఆశీర్వాదం తీసుకోవడానికి ఆమె ముగ్గురిని మాత్రమే ఎన్నుకుంటుంది - తన తండ్రి, గురుతుల్యుడు పూజారి, మేనత్త. ఒక్కొక్కరి ఆశీర్వాదంకోసం వెళ్ళినప్పుడు ఒక్కొక్క ప్రత్యేకతతో నేపథ్యంలో వినిపించే కృష్ణశాస్త్రిగారి గీతం, సాలూరి వారి సంగీతం అపురూపమైనవి. రాణివాసము రమ్మనిపిలిచే సందర్భం: ముత్యాలపల్లకి ముంగిట నిలిచిన సందర్భం: కానీ -

**మా ఇంటిదీపమా, మా కంటి వెలుగా,**
**హాయి నీ కౌనమ్మ అపరంజికొమ్మా**
**కడుపు చల్లగ నిన్ను కనిపెంచినామే**
**శుభములవునే తల్లి సుగుణాలవల్లి**
**అని తండ్రి దగ్గర,**

**కులదేవతలు నిన్ను కూర్మి చూచేరే**
**నీ తోడు నీడలై నిలిచి కాచేరే**
**కన్నీరు వలదమ్మ కలత వలదమ్మా**
**నీ కోర్కెలీడేర్చి నిన్ను బ్రోచేరే**
**అని పూజారి దగ్గర.**

మేనత్త విధవరాలు. ప్రయాణానికి ఎదురుపడి రాకూడదు. దూరంగా, విచారంగా, జనంలో నిలబడివుంటుంది. ఆమెకోసమే అన్నట్టు మల్లీశ్వరి గుంపును కలయజూస్తుంది. కనిపించగానే దగ్గరికి వురుకుతుంది.

**పాత చుట్టాలమే బంగారు తల్లీ**
**మనసార పెంచిన మమకారమమ్మా**
**మనసులో మమ్మెపుడు మరిచిపోకమ్మా**
**సెలవమ్మా ఎపుడైనా తలుచుకోవమ్మా**

ప్రేక్షకుల వొల్లు జలదరిస్తుంది, కన్ను చెమ్మగిల్లుతుంది.

దర్శకుడు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి ఇక్కడో చిన్న విషయం ప్రస్తావించాలి. మల్లీశ్వరిని రాణివాసానికి సాగనంపే శుభకార్యంలో పేరంటాళ్ళంతా పెద్దవయసులో వున్నవారే కనబడతారు. వయసులో వున్న అమ్మాయిలను పెట్టొచ్చుగదా అని బి.ఎన్.రెడ్డిగారిని అడిగితే, 'ఆ పని చేసుంటే హీరోయిన్ గ్లామర్ ఎత్తిపోయేది. భానుమతి పెద్ద అందగత్తె గాదు.' అన్నారు. నిజమే. భానుమతి పెద్ద అందగత్తె కాదు. అద్భుతమైన గాత్రం కోసం ఆమెను ఎన్నుకున్నారు. పైగా, కథలో వున్నది తొలిచూపులో ప్రేమ (love at first sight)గాదు; మేనకోడలిపై మమకారం. మల్లీశ్వరి పాత్రను పోషించిన భానుమతికి మరో లోపం గూడా వుంది. ఆమె నాట్యం చెయ్యలేదు. చేతులు మెడ కదిలితే కాళ్ళాడవు, కాళ్ళూ నడుమూ కదిలితే చేతులాడవు. అందువల్ల, ఈమెతో నాట్యం చేయించే సందర్భాల్లోగూడా బహుజాగ్రత్తగా కెమెరాతో సర్దుబాటు చేయాలి.

మల్లీశ్వరి రాణివాసం చేరింది. రాణివాస భోగాలమీద ఆమెకు రవ్వంతైనా ఆసక్తిలేదు. మనసునిండా బావకోసం పెట్టుకున్న దిగులే. ఈ అవస్థను కృష్ణశాస్త్రిగారు సాటిలేని ఉపమానాలతో వర్ణిస్తారు. 'పగలులేని రేయి వోలె, పలుకు లేని రాయి వోలె, బరువు బ్రతుకు'గా మిగిలిందని అంటారు. పగలే లేకుండా ఎప్పుడూ రాత్రే వుంటే ఎంత దుర్భరంగా వుంటుంది! బావ ధ్యాసే తప్ప మరెందుకూ చలించని మల్లీశ్వరి బ్రతుకు రాయిగాక మరేమౌతుంది.

వెన్నెలకొలువులో మల్లీశ్వరి పాట వినాలని రాణీ తిరుమలదేవికి ఆసక్తి కలుగుతుంది. ఆ వెన్నెలకొలువు, అందులోని రంగస్థలం విజయనగర నిర్మాణ ఫక్కీలో రూపొందించడం మనకు కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అంతేగాదు, అంతఃపురం నుండి మహారాణి బయలుదేరి కొలువుకు చేరుకునే విధానం

విజయనగర రాజుల వైభవాన్నీ, శిల్పకళాసంపదనూ చాటి చెప్పే రీతిలో సాగుతుంది. రాణి వెన్నెలకొలువుకు చేరుకునే నడవలన్నీ శిల్పకళావిలాసంతో విరాజిల్లేవే. ఆ నడవల పొడవునా తివాచీలు పరుస్తుంటారు; పువ్వులు చల్లుతుంటారు; గాలిలో సుగంధం తేలటానికి ధూపాలు తెచ్చిపెడుతుంటారు. వీణమీద జయజయ ధ్వానాలు గానం చేస్తూ గాయకీమణులు నడుస్తుంటారు. హోదా చిహ్నాలైన ఛత్రచామరాలతో చెలికత్తెలు వెంటరాగా, రాణీ తిరుమల దేవమ్మ కొలువుకు బయలుదేరుతుంది. ఆమెను కీర్తిస్తూ గానం చేయడానికి దేవులపల్లివారు హుందాతనం ఉట్టిపడే పాట రాయగా, దానికి రెండింతలు దర్జాగావుండే బాణీనీ, సంగీతాన్నీ సమర్పించారు సాలూరివారు.

**జయా జయా జయ శుభాశయా, జయ విజయశ్రీ నగర రమాప్రియ**
**జయా జయా జయ శుభాశయా**
**జయ శ్రీకృష్ణధరావర హృదయా, జయా జయా జయ శ్రితాశయా**
**జయశ్రీ పంపావల్లభ దుర్లభ దయోదయా జయ జయా జయా**
**జయ జయ జయ జయ జయ,**
**జయ కర్ణాట మహాంధ్ర జనాశ్రయ కృపామయా**
**జయశ్రీ తిరుమలదేవీ జయ జయ కళాలయా**

వెన్నెలకొలువులో మల్లీశ్వరి పాడుతుంది. ఏం పాడుతుంది పాపం? గూడు కట్టుకున్న దిగులుతప్ప ఆమె గుండెల్లో ఇంకేముంది పాడటానికి? ఆమె దాన్నే పాడుతుంది. బావకూ తనకు కలిగిన ఎడబాటునే పాడుతుంది. అది విన్న మహారాణి మనసులో మల్లీశ్వరి పట్ల జాలి, సానుభూతి కలుగుతుంది.

దర్శకుని మెళుకువల్లో గమనించవలసిన అంశం మరొకటి ఈ సన్నివేశంలో వుంది. రాయలవారు నాటకాన్ని చూసే సందర్భం ఈచిత్రంలో మరొకచోట కలుగుతుంది. అక్కడ రాయలు బయలుదేరే విధానం చిత్రించ కుండా వదిలేస్తాడు దర్శకుడు. వెన్నెలకొలువుకు రాణిగారు బయలుదేరే సందడికే పరిమితమౌతాడు. కారణ మేమిటని బి.ఎన్.రెడ్డిని అడిగితే, 'రాణిగారి వైభవం చూసి, రాజుగారిది మరెంత గొప్పగా వుంటుందోనని ప్రేక్షకులు ఊహించుకోడానికి వదిలేయాలి. ఎంతో గొప్పగా ఊహించుకునే రాయలవారి వైభవాన్ని తృప్తికరంగా చిత్రీకరించడం కష్టం' - అన్నాడు.

అన్ని జాగ్రత్తలు తీసుకుని చిత్రీకరించిన ఆర్భాటంలో ఎట్టకేలకు చిన్న లోపం చోటు చేసుకుంది. తిరుమలదేవి పాత్రను పోషించిన కుమారి, వొకచోట, వ్రేలాడే పైటను చేతిమీదికి మార్చుకుంటుంది. అది సాధారణ మహిళల అలవాటు. రాణులు పైటకొంగును బారుగా జారవిడిచి నడుస్తారే తప్ప, ముంజేతి మీదికి తీసుకోరు. రాచకుటుంబంలో పుట్టిన స్త్రీ గాక తక్కువ స్థాయినుండి వచ్చి గద్దెనెక్కిన స్త్రీగా వొకపాత్రను తెలపడానికి దర్శకులు ఇలాటి అలవాట్లను వాడుకుంటారు. తిరుమలదేవి అలాటిది కాదు. పొరబాటు జరిగిందని దర్శకుడు ఒప్పుకున్నాడు. ఆ షూటింగ్ జరిగే సమయంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్‌గారు చనిపోయిన వర్తమానం బి.ఎన్‌కు చేరింది. పటేల్‌గారంటే బి.ఎన్‌కు విపరీతమైన అభిమానం. వాళ్ళిద్దరు మంచి స్నేహితులుగూడా. అందువల్ల, ఉన్నపళంగా ఆయన షూటింగ్ వదిలేసి వెళ్ళిపోతే, సహాయదర్శకుడు మిగిలిన భాగాన్ని కొనసాగించాడు. సెట్టింగును తొలగించిన తరువాతగానీ ఆరోజు సన్నివేశాన్ని పరిశీలించే వ్యవధి దర్శకునికి దొరకలేదట. మరోసారి సెట్టును నిర్మించడం ఖరీదైన పని. సంస్థ డైరెక్టర్లు అతికష్టంమీద బి.ఎన్‌కు నచ్చజెప్పి, రీషూటింగ్ ఆపించారట. ఖరీదైన నిర్మాణం. భాగస్వాముల అభిప్రాయాన్ని కొంతమేరకు ఆమోదించక తప్పదు.

ఆ రోజు ప్రదర్శనలో మల్లీశ్వరి పాటతోపాటు మరికొన్ని కార్యక్రమాలు న్నాయి. వాటిలో గోపికల బృందగానం వొకటి. ఈ బృందగానానికి కృష్ణ శాస్త్రిగారు రసవత్తరమైన గీతాన్ని అందించారు. యుక్తవయసు కలిగించే ఉలికిపాటును గోపికలకు ఆపాదించి మనోహరంగా పలికించారు.

ఎవరే పిలిచే రల్లన మెల్లన పిల్లనగ్రోవిని ప్రియా ప్రియా?
పొదలో కదిలే వెదురు గోలలే గాలి ఈలలే ప్రియాప్రియా.
ఎవరే పరిచే రిసుక బయలులో మల్లెల శయ్యలు ప్రియా ప్రియా?
కరిగే వెన్నెల పాల తరగలో మరిగే నురుగులె ప్రియాప్రియా
ఎవరే చెవిలో కొసరికొసరి ఇటు గుసగుస మందురె ప్రియా ప్రియా?
చెదిరే నిదురా యమున హృదయమున బెదిరే ఊర్పులె ప్రియాప్రియా.

ప్రతి సినిమాలో ఎక్కడోవొకచోట భక్తిపాటను జొనపడం అప్పట్లో ఆనవాయితి. భక్తిపాటలను సులభంగా అందుకుని ఆడవాళ్ళు పదేపదే

పాడుకుంటారు. స్త్రీజనాన్ని సినిమాకు ఆకర్షించేందుకు అప్పట్లో బాగా అనుసరించిన చిట్కా ఇది. ఈ కోవలో వచ్చిన తులసికోట పాటలు కొంతకాలం పాటు చిత్రరంగాన్ని ఏలుకున్నాయి. తెలుగునాట ఏఇంట చూసినా ఆ పాటలే. తులసికోట ఇంట్లో లేకుంటే సంస్కారానికి లోటని, గుడిసెల్లోసైతం తిప్పలుబడి తులసికోటకు చోటు కల్పించేవారు. మల్లీశ్వరిలో ఆ పంథాను వదిలేశారు. సినిమా మొత్తాన్ని వొకేవొక అంశం - ప్రణయం, ఆవహించింది. ప్రతి మాటా, ప్రతి పాటా దానిచుట్టే తిరుగుతుంది; తనతో పాటు విజయనగర వైభవాన్ని వెంటేసుకుని తిరుగుతుంది. దైవభక్తంతా టైటిల్స్‌లోనే ముగించాడు దర్శకుడు. ఆ కార్యక్రమాన్ని తేలిగ్గా ముగించినట్టు కనిపించినా, సంగీతపరంగా ఆపాట ప్రేక్షకులకు అరుదైన బహుమానం. 'శ్రీగణనాథ' పల్లవితో మొదలయ్యే పిళ్ళారి గీతమది. సంగీతపాఠాలు మొదలెట్టే చిన్నపిల్లల నోటినుండి ఈపాటను ఎన్నో సార్లు వినివుంటాం. కానీ, ఇందులో అంత మాధుర్యం వుందని రాజేశ్వరరావు చెప్పిందాకా తెలిసిరాలేదు. ఒక పరి ఆలాపన మగగొంతులతోనూ, మరొకసారి ఆడ గొంతులతోనూ అద్భుతంగా మేళవించి, అరుదైన రీతిలో ఆయన ఈ బృందగానాన్ని రూపొందించారు.

అంతఃపురంలో మల్లీశ్వరి ఎలావుందో చూసిపోదామని ఆమె తల్లి, మేనమామ వస్తారు. ఆమె తల్లీ  మేనమామలు మాత్రమే వస్తారు. వచ్చి, అందుకు రాణిగారి అనుమతి పొందుతారు.

'వీరాపురం తాటిపర్తి నాగమ్మగారు శ్రీ మల్లీశ్వరీదేవి దర్శనం కోరడమైనందున శ్రీశ్రీమహారాణీవారు అనుగ్రహించి సెలవు దయచేయించారు. శ్రీ మల్లీశ్వరీదేవి గారు నాగమ్మగారికి చంద్రశాలలో దర్శనమివ్వగలరు.'

చెలికత్తె: మల్లీశ్వరీదేవిగారు ఇప్పుడే దయచేస్తారు. (చెప్పి వెళుతుంది).

నాగ: (గుసగుసగా) అన్నయ్యా. ఇదంతా కల కాదుగదా. ఈ దివ్యలోకంలో మన మల్లి వుందన్న మాట!

హను: పెట్టి పుట్టింది నాగమ్మా నీ కూతురు. లేకపోతే, మన పిల్లకు రాణివాసం ..

(గంట ఖంగుమన్న శబ్దానికి ఆగిపోతాడు. మల్లీశ్వరి వస్తుంది.)

మల్లి: అమ్మా, నాన్న ఏడీ. ఆయన రాలేదా?

నాగ: మీ నాన్న సంగతి తెలియనిదేముంది. అంతా ఎడ్డెమంటే ఆయన

తెడ్డేమంటాడు. హు.. కూతురు వైభోగం చూసే అదృష్టం వుండొద్దూ. పంజరంలో చిలుకని చూసినట్టు తన కూతుర్ని చూడలేరట. ఆ పాడుకొంపలో పుట్టిన మనిషికి అభిమానాలు కూడానా. నేనూ, మీ మావయ్య లేకపోతే నిన్ను రాణివాసానికి పంపేవారేకాదు.

మల్లి: పాపం. నేనంటే నాన్నకెంత ఇష్టమో నువ్వెప్పుడూ తెలుసు కోలేవమ్మా. పంజరంలో చిలుక - ఎంత సరిగ్గా చెప్పాడు నాన్న! రాణివాసంలో ఈ రంగులబొమ్మను చూడాలని మీకుండే ఉబలాటం మానాన్నకు ఎప్పుడూ ఉండదు.

నాగ: ఇంతదూరం నిన్ను చూడాలని అపేక్షతో వచ్చిన మాకంటే మీ నాన్న నీకు గొప్పయ్యాడా? ఎంత మారిపోయావే. కన్నతల్లితో ఇట్లాగేనా మాట్లాడేది?

మల్లి: అమ్మా. కన్నకూతురు మీద నిజంగా నీకంత అపేక్ష వుంటే నన్ని క్కడినుంచి తీసుకుపో. నువ్వూ మామయ్య పట్టుబట్టి మహారాణి వారికి మనవిచేస్తే వారు తప్పకుండా అనుగ్రహిస్తారు. ఎలాగైనా నన్నీ రాణివాసం పంజరంనుంచి తీసుకుపోమ్మా.

నాగ: ఏం విడ్డూరమే. అదృష్టం అందలం ఎక్కిస్తే బుద్ధి బురదలోకి లాగు తుందట. నీకు మతి లేకపోతే నాకైనా వుండొద్దూ. వింటున్నావా అన్నయ్యా. మహారాణివారి దయ సంపాదించి ఏ రాచకొడుకునో పెళ్ళాడతావనుకుంటే మల్లీ ఆ దాలిగుంటకే దారితీస్తానంటావేమే. మీనాన్న పిచ్చిలో సగం నీకూ వుందేమిటే.

పిల్లలు అమెరికాలో ఉన్నారని సంతోషించే మనస్తత్వంతో సరితూగేది నాగమ్మ. సంతానం కళ్ళ ఎదుట మెదలాలనే తాపత్రయాన్ని అలాంటి వాళ్ళు త్యాగం చేస్తారు.

మల్లి: ఔను. పిచ్చికాకపోతే ఈ సంగతి మీకెందుకు చెప్తాను. మంచిది.

(వెళ్ళిపోడానికి మల్లీశ్వరి లేస్తుంది. ఆమెలో రగుతున్న కోపం అప్పటికే పొగలు లేస్తూంది.)

'శ్రీశ్రీశ్రీమహారాణి తిరుమలదేవమ్మగారి ఇష్టసఖులు శ్రీ మల్లీశ్వరీదేవిగారిని చూశారు. నవరత్నాలు పొదిగిన నగలు, సింగారించుకున్న ఈ చీని

**చీనాంబరాలు బాగా చూడండి. కన్నుల వైభవంగా చూడండి' - అంటుంది.**
**నాగ: ఎంత తలబిరుసు? నిన్ను కనిపెంచిన తల్లితో ఇట్లాగేనా మాట్లాడేది? సిగ్గూ బిడియం లేవూ? వింటున్నావా అన్నయ్యా మల్లమ్మ మాటలు.**
**మల్లి: మల్లమ్మ కాదు, మల్లీశ్వరీదేవి .. మహారాణీవారి ఇష్టసఖి.**

ఉద్రేకంలోకి ఎంత సాఫీగా, ఎంత సహేతుకంగా నడిపించాడో రచయిత! చిత్రానికి సంభాషణ రాయడం దేవులపల్లివారికి ఇది మొదటి అనుభవం. అనుభవంలేని లోటు ఏవొక్క పదంలోనూ కనిపించదు. సినిమాలకు మాటలు రాయడంలో ఆత్రేయ గారిది అందెవేసిన చెయ్యి. వీరిద్దరి పద్ధతుల్లో వుండే వ్యత్యాసాన్ని ఈ సన్నివేశం వివరిస్తుంది. ఉద్రేకంలోకి తీసుకు పోవడానికి ఆత్రేయకు ఆట్టే సమయం అక్కర లేదు. ఆయన నేరుగా అందులో దూకిస్తాడు. కృష్ణశాస్త్రి అంచెలంచలుగా అక్కడికి జరుపుతాడు.

శిల్పకళావైభవానికి ప్రతీకగా వొక నర్తనశాలను నిర్మించాలని రాయల వారు సంకల్పించారు. అందుకు అనువైన శిలలు వెదికి తీసుకురావటానికి శిల్పాచార్యుడు బయలుదేరుతాడు. గుహల్లో మల్లీశ్వరి బొమ్మలు చెక్కుకుంటూ మతిచెలించిన నాగరాజు అతనికి తారసపడతాడు. అతన్ని మామూలు మనిషిగా చేసి ఆచార్యుడు తన వెంట పిలుచుకొస్తాడు. నర్తనశాల నిర్మాణంలో నాగ రాజును నియమిస్తాడు. నిర్మాణంలో వున్న నర్తనశాలను చూడటానికి రాణివాస స్త్రీలు వస్తారు. ఆ శిల్పాలు మల్లీశ్వరిని పోలివుండటం వారు గమనిస్తారు. అవి తన బావ చెక్కినవేనని మల్లీశ్వరి గుర్తిస్తుంది. తన బావ అక్కడే ఎక్కడో వుంటాడని వెదకడం మొదలెడుతుంది. తలవంచుకుని పని చేసు కుంటున్న నాగరాజును గుర్తిస్తుంది. నోరెత్తి పలకరించలేదు. కట్టలు తెంచుకుని వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ బెక్కుతుంది. కన్నీటిచుక్క జారి నాగరాజు వీపు మీద పడుతుంది. ఆ స్పర్శకు నాగరాజు తలెత్తి చూస్తాడు. తలెత్తి చూడడమే! ఇంకేమైనా వుందా! అంతఃపుర స్త్రీలను కన్నెత్తి చూస్తే అనుభ వించవలసిన శిక్ష శిరచ్ఛేదనమే. అనుభవం కలిగిన చెలికత్తె జలజ పరుగున వెళ్ళి అడ్డునిలుస్తుంది. మల్లీశ్వరిని బలవంతంగా వెనక్కు లాక్కొస్తుంది.

**జలజ: అంతఃపురానికి వెళ్ళే వేళయింది. దయచేయండి. (దూరంగా తీసుకువచ్చి) భయపడకండమ్మా. అపాయం అతనికే గాని మనకుగాదు.**

**మల్లి : అవును. అతనికోసమే భయపడుతున్నాను.**

**జలజ: మరేం మాట్లాడకండి. తొందరగా అంతఃపురం చేరుకోవాలి. పదండి.**

ఇక్కడగూడా పవిత్రప్రేమలోని త్యాగాన్ని వెల్లడిస్తున్నాడు రచయిత. తనకేమైనా ఔతుందనే ధ్యాస ఆమెకు లేనేలేదు.

ఎలాగైనా బావను కలవాలంటుంది మల్లీశ్వరి. ఏర్పాటుచేస్తానని భరోసా ఇస్తుంది జలజ. రాణివాస స్త్రీలు పరపురుషునితో కలవడం, మాట్లాడడం చాలా ప్రమాదకరమైన పనులు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లలో కలయికను ఏర్పాటు చేయటం తేలికగాదు. జలజ చురుకైంది, తెలివైంది. పైపెచ్చు మల్లీశ్వరి మీద ఆమెకు అపరిమితమైన వాత్సల్యం. తెగించి ఆ పనికి పూనుకుంది.

అదే తీగ పువ్వులు కావాలనే నెపంతో నర్తనశాల ఆవరణలో ప్రవేశిస్తుంది జలజ. నాగరాజు దాపులకు చేరుకుంటుంది. కాలుజారి పడినట్టు నటిస్తూ కోసిన పూలను వొలక బోస్తుంది. నాగరాజు సాయం రాబోతే నివారిస్తూ -

**జలజ: జాగ్రత్త. అక్కడే ఆగండి. (కాసేపాగి) నా వైపు చూడకండి. మీ పని మీరు చూసుకోండి.**

పువ్వులేరుకుంటున్న జలజను చూసి, కాపలా అధికారి-

**'పాపం పడ్డట్టున్నావు. దెబ్బతగిలిందా?'**

**'మరేం లేదులెండి. రాళ్ళమీద కాలు జారింది. పాపం, మీకు శ్రమ కలిగించాను. ఈ పువ్వులు ఏరుకుని తొందరగా పోతాను.'**

**'తొందరగా కాకపోతే నెమ్మదిగా పోవచ్చు. పనివాళ్ళకు మాత్రం ఇబ్బంది కలుగగూడదు. రాణివాసపు కట్టుదిట్టాలు నీకు తెలియనివి కావు.'**

'ఎంతమాట సెలవిచ్చారు.'

మీసాలు దువ్వుకుంటూ అధికారి దూరంగా వెళ్ళగానే-

'వచ్చే శుక్రవారం రాత్రి, పంపానదీ దేవాలయం దగ్గర, తుంగభద్ర ఒడ్డున, మా మల్లీశ్వరీదేవి మీకోసం ఎదురుచూస్తూ వుంటారు. ఇటు చూడకండి. ఈ రహస్యం ఎవరికీ తెలియగూడదు.'

చల్లగా వర్తమానం చేరవేసింది. ఆ వర్తమానంలో ఎన్ని జాగ్రత్తలు పొందుపరిచారో!

'బొమ్మలు చెక్కిచెక్కి ఇక్కడివాళ్ళ మనసులు రాళ్ళయిపోయాయని అంటున్నాను. జారిపడితే జాలిపడేవారు వొక్కరూ లేరు.' అంటుంది జలజ కాపలా అధికారితో. 'జాలికేం, కావలసినంత వుంది. అంతఃపురస్త్రీలకు జాలిచూపడం, కోరి ఉరి తెచ్చుకున్నట్టే.' అంటాడు అధికారి.

మల్లీశ్వరి రహస్యంగా నాగరాజును కలుసుకునే సన్నివేశం, ఆ సన్నివేశానికి సరితూగే పాట తెలుగు ప్రేక్షకుల మనసుల్లో మాసిపోనివి. ఆ గానం చెవికి సోకితే వొల్లుపులకరిస్తుంది.

**మనసున మల్లెల మాలలూగెనే**
**కన్నుల వెన్నెల డోలలూగెనే**
**ఎంత హాయి ఈ రేయి నిండెనో**
**ఎన్నినాళ్ళకీ బ్రతుకు పండెనో**
**కొమ్మల గువ్వలు గుసగుసమనినా**
**రెమ్మల గాలులు ఉసురుసురనినా**
**అలలు కొలనులో గలగలమనినా**
**దవ్వుల వేణువు సవ్వడి వినినా**
**నీవు వచ్చేవని నీ పిలుపే విని**
**కన్నుల నీరిడి కలయజూచితిని**
**ఘడియయేని ఇక విడిచిపోకుమా**
**ఎగసిన హృదయము పగులనీకుమా**

ఇంక నన్ను విడిచిపోవద్దు; ఇక ఒక్క ఘడియ నిన్ను చూడకున్నా నాగుండె పగిలిపోతుంది. ఎందుకు పగిలిపోతుంది? ఇన్నిరోజులు పగలంది ఇప్పుడే ఎందుకు పగులుతుంది? ఇన్నినాళ్ళకు ఆమె బ్రతుకు పండింది గాబట్టి పగిలిపోతుంది. విరహంలోని ఆవేదనను గుండెల్లో దూరే విధంగా రాసిన పాట, ఆ సంగీతం .. ఓ .. తెలుగు జనాన్ని పిచ్చివారుగా చేసింది ఆరోజుల్లో. బ్రతుకు పండడమనే మాట ఇక్కడ ఇంత భావగర్భితంగా వాడటం తెలుగు సాహిత్యానికొక అలంకారం.

ఈ సన్నివేశంలో దర్శకుడు తీసుకున్న మరో మెలకువ గమనించ వలసివుంది. బావ కనిపించగానే మల్లీశ్వరి వొల్లుమరచి ముందుకు దూకి

కౌగిట్లో వాలుతుంది. చిత్రం మొత్తానికి ఆ ప్రేమికుల శరీరాలు రాసుకునే దృశ్యం ఇదొక్కటే. నాయికానాయకులు కౌగిలించుకుంటే నేల టికెట్ల నుండి ఒక్కసారిగా ఈలలు మోగటం సహజం. అందులోనూ ఎంతోకాలం ఎడబాటులో వున్న ప్రేమికుల కలయిక. ఐతే, ఆ ఈలల గోల ప్రేమలోని పవిత్రతను చిన్నబుచ్చుతుంది. వెంటనే ఆ దృశ్యాన్ని తెంచేసి, జలజను చూపిస్తాడు దర్శకుడు. జలజ సిగ్గుపడుతూ మొఖం పక్కకు తిప్పుకుంటుంది. ఈలల రొద మొదలయ్యే వేళకు తెరమీద నాయికా నాయకులు గాక, సిగ్గుతో మొఖం చాటు జేసుకునే జలజ నిలుస్తుంది.

ఈ పాటకు స్వరకల్పన చేయడంలోనే కాదు, పాడించడంలోనూ రాజేశ్వరరావుగారి సమర్థత వెల్లడౌతుంది. భానుమతి గొంతు గంభీరమైంది. కంచులా మ్రోగు తుంది; గుర్రంలా త్రుళ్ళిపడుతుంది; కుసుమంలా మెత్తబడదు. మిగతా పాటలకు అలానే మ్రోగాలి; కానీ, ఈ పాట వేరు. ఇక్కడ వెన్నెలంత హాయిగా వుండాలి; పువ్వంత మృదువుగా తాకాలి. ఏడుస్తూ పాడితే వెటకారం ధ్వనించే గొంతును ఎలా చేస్తే సరిపోతుంది? ఎలా చేశాడో ఏమో, పాట మాత్రం చివరకు హాయిగా, ఆనందంగా, మెత్తగా, తరతరాలు మరువరానిదిగా తయారైంది.

మల్లీశ్వరి, నాగరాజులు రాణివాసం విడిపించుకుని పారిపోవటానికి నిర్ణయించుకోడంలో కాలం గడిచిపోతూవుంటుంది. భాషను ప్రయోగించడంలో రచయిత నేర్పరితనం తెలిపే మాటొకటి ఈ సందర్భంలో కనిపిస్తుంది.

'దేవి! రెండో నగారా కూడా విన్నారు.' అంటుంది జలజ. మరో మంచి రచయితైతే, 'దేవి, రెండో నగారా గూడా మ్రోగింది' అంటాడు. బజారు రచయితైతే ఆ కాలంలో సమయాన్ని నగారాతో తెలియజేస్తారని గూడా తెలుసుకోలేడు. ఆ మాటలో రాణివాసపు భాషనూ, గౌరవాన్నీ ఇనుమ డింపజేశారు దేవులపల్లివారు.

ప్రేమికులు పారిపోవడానికి పథకం వేసుకుంటారు. అప్పుడే పారి పోవచ్చు; కానీ, జలజకు ప్రమాదం కాబట్టి మల్లి వొప్పుకోదు. మరో రోజుకు వాయిదా వేసుకుంటారు. ఆ గడువు రోజు వచ్చింది. 'ఎందుకే నీకింత తొందర!' అని రామచిలుకతో మల్లీశ్వరి వయ్యారాలు పోతుంది. తొందర

పడుతున్నది రామచిలుక గాదు, తనూ. అచ్చతెలుగు నుడికారంతో రాయబడిన ఆ పాట సొగసు వర్ణనాతీతం. 'పసరు రెక్కలు పరిచి' పారిపోవటానికి ఇంకెంతో సేపు పట్టదు. చీకటి పడడమే ఆలస్యం. ఆత్రుతతో ఎదురుజూసే వాళ్ళకు సమయం వేగంగా నడవదు. 'ఈ పగటికి రాత్రంటూ లేదా' అని జలజను అడుగుతుంది మల్లీశ్వరి. సమయం దొర్లడం లేదన్న ఆవేదనకు రచయిత ఎంత కళాత్మకరూపం ఇచ్చాడు! బావ కనిపించక పూర్వం తన జీవితం పగలు లేని రాత్రికి మల్లే ఉందని కుమిలిపోయిన మల్లీశ్వరికి, బావ తోడుకాగానే పగలు చేదైంది.

చీకటి రాలేదు గాని దానికంటే ముందు పిడుగులాటి వర్తమానం వచ్చింది. ఆ రాత్రి 'ఉషాపరిణయం' నాటకాన్ని చూడాలని రాయలవారికి కోరిక కలిగింది. నాటకంలో ఉష పాత్రను మల్లీశ్వరి పోషించాలని ఉత్తరువు చేయబడింది. పారిపోవడానికి వేసుకున్న పథకం నీరుగారిపోయింది.

**'ఈ రాత్రి నందనవన లతామంటపంలో ఉషా పరిణయ నాటకం వీక్షించుటకు శ్రీశ్రీమహారాణి తిరుమలదేవమ్మగారు, శ్రీశ్రీశ్రీ మహారాయలవారి సమేతంగా విజయం చేయుచున్నారు. అందు ఉషాదేవిగా నటించుటకు మహారాణీవారు మల్లీశ్వరీదేవికి దయచేయించిన ఆజ్ఞాపన పత్రం.'**

ఆ పత్రంలోని సమాచారం చదివింది జలజ.

యక్షగానం రూపంలో 'ఉషాపరిణయం' మొదలౌతుంది. ఈ యక్ష గానానికి పాడిన అవతారిక సాంప్రదాయ సంగీతానికి కలికితురాయి. రాసింది దేవులపల్లివారేనా, లేక ఎక్కడైనా పట్టుకున్నారా? ఏమో! నాకు తెలిసి వేరెక్కడా కనిపించదు.

కృష్ణదేవరాయలు నల్లనివాడు. అందువల్ల 'సరసిజ నయను వలె' అంటూ మహావిష్ణువుతో పోల్చాడు. లక్ష్మివంటి దేవేరితో వేంచేశాడు గాబట్టి 'శ్రీసతితో' అవతరించిన మహావిష్ణువులా వున్నాడు.

**శ్రీసతితో సరసిజనయను వలె**

**చెలువున దేవేరితో కొలువున**

**చెలువున దేవేరితో వెలయగ ..**

**రాజాధి రాజ వీర ప్రతాప శ్రీ కృష్ణరాయ భూపా**

సకలాంధ్ర నిఖిల కర్ణాట విపుల సామ్రాజ్య రత్నదీపా
సామంతమకుట మాణిక్య కిరణ సందీప్త భవ్యచరణా
సాహిత్య నృత్య సంగీత శిల్ప సల్లాప సరస భవనా!

కళలకు నెలవగు మా దేవి సెలవైన పూని తలపైన
కరుణింపగ, తిలకింపగ, కడుయింపుగ, నటియింపగ
కవి పండిత శ్రితకల్పభూజ నవభోజా
సరస మధుర ఉషాపరిణయమును
దేవర సన్నిధి కారణ్యాశేవధి
చెలువున దేవేరితో కొలువున  చెలువున దేవేరితో......

రాజు అక్కడున్నాడు. ఆరాజు కళలకు భోజునివంటివాడు. ఆయన సంతృప్తి పడితే ప్రదర్శన సార్థకమౌతుంది. ఐనా, ప్రదర్శనకు అనుమతించ వలసింది రాణి. ఆమె కళలకు ఆశ్రయమైన మా దేవి. ఆమె ఆనతి 'తలపైన పూని' ఈ ప్రదర్శన ఇస్తున్నాము - అంటున్నాడు సూత్రదారుడు. నిజమే గదా! అది రాజుగారి సంతోషం కోసం అంతఃపుర స్త్రీజనంతో రాణిగారు ఏర్పాటుచేసిన వినోదం. ఈ సంగతి మల్లీశ్వరికి పంపిన ఉత్తరువులోనే వెల్లడైంది. ఈ యక్షగాన సన్నివేశంలో త్రివేణి సంగమంలోని ప్రతి ఉరవడి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రాగమాలికగా సాగే ఈ యక్షగానానికి రాజే శ్వరరావుగారి స్వరకల్పన అమోఘం. అందులోనూ

'నా ప్రాణేశ్వర నవమదనా, స్మర సుందరాననా,
ఎన్నినాళ్ళు నిన్ను కోరి వేచితి మనసులో వలపులు దాచుకుని . .'

అని పాడుతూ ఉష పాత్రలో మల్లీశ్వరి చేసే నాట్యానికి మాల్కోస్ రాగంలో సమకూర్చిన బాణీ ఎంతసేపు విన్నా తనివి తీరనిది. ఎంతో సమంజసమైన భంగిమలతో,  భానుమతితో నాట్యం చేయిస్తాడు బి.ఎన్.రెడ్డి. పరధ్యానం తప్ప ఆమె ముఖంలో భావముండదు; యాంత్రికంగా కదలడమే తప్ప ఆ భంగిమల్లో జీవముండదు. ఔను, మల్లీశ్వరి మనసు ఇక్కడ లేదు. తొందరపడి తనబావ కోటలో దూరి, ఏ ప్రమాదం తెచ్చుకుంటాడోననే ధ్యాసలో వుందామె.

ఆమె అనుమానించినట్టే అతడు కోటలోకి దూకి పట్టుబడతాడు. పట్టుబడే ముందు, కత్తులూ కటార్లతో ముట్టడిస్తున్న సైనికులను తప్పించుకునే ప్రయత్నంలో నాటకశాలలో దూరి పారిపోతాడు. మల్లీశ్వరి బావను చూస్తుంది. రాయలవారు అక్కడున్నారని గూడా లెక్కజెయ్యకుండా, నాగరాజు పారిపోయిన వైపు పరిగెత్తుతుంది. ఆమె చేరేలోపే సైనికులు నాగరాజును చుట్టుముట్టుతారు. నాగరాజు కత్తి దూస్తాడు. 'మూర్ఖుడా కత్తిదింపు' అనగానే కత్తిదింపేస్తాడు. నాగరాజుగా నటించిన ఎన్.టి.రామారావు, కత్తి చేతిలో వుండి, తిప్పకుండా వదిలేసిన సంఘటన బహుశా ఇదొక్కటేనేమో! ఇక్కడ యుద్ధాన్ని ప్రవేశపెడితే అసమంజసంగా వుండేది. నాగరాజును శిల్పిగానే తప్ప యోధునిగా ఇదివరకెక్కడా నిరూపించలేదు.

మల్లీశ్వరి 'బావా' అంటూ అక్కడికి పరిగెత్తుకొస్తుంది. మల్లిని ఆపదనుండి తప్పించటానికి నాగరాజు అంటాడు -

'ఎవరు నువ్వు? నీకేం మతిలేదూ? ఇక్కడికెందుకొచ్చావ్?' బొంకటానికి బొత్తిగా చేతగాని మాటలవి. మల్లీశ్వరి వాటిని పట్టించుకోదు. జలజ ఎంత నిబ్బరించినా నిలువదు.

'తమరు అంతఃపురంలోకి దయచేయాలి. ఈ ఘాతకుడిని దండనాయకునికి అప్పగించాలి.' అంటాడు సైనిక ప్రముఖుడు.

'ఈ పాతకినిగూడా తీసుకెళ్ళండి. నా రాజును ఒక్క క్షణమైనా విడిచి వెళ్ళను.' అంటుంది మల్లీశ్వరి.

తెల్లవారి ఆ యిద్దరిని విచారణ నిమిత్తం ప్రభువుల ముందు నిలబెడతారు.

ప్రభువు: నిర్భాగ్యుడా, ప్రాణాలమీద ఆశవుండే ప్రవేశించావా అంతఃపురంలోనికి?

నాగరాజు: ప్రాణానికి ప్రాణమైన నామల్లి ఏనాడైతే రాణివాసపు పల్లకీలో వెళ్ళి పోయిందో ఆనాడే ఈ బ్రతుకు మీద ఆశపోయింది. నా మల్లికి దూరమై చచ్చి బ్రతికే కంటే, నా మల్లిని ఒక్కసారి చూచి బ్రతుకు చాలించడం తప్ప నాకు వేరే గతి ఏముంది ప్రభూ. ఏలినవారు కరుణా సముద్రులు. ముందు నా ప్రాణాలు తీయించి, తర్వాత నా మల్లికి రాణివాసపు పల్లకి పంపివుంటే,

ఈనాడు తమకీ శ్రమలేకపోయేది.

ప్రభువు: మూర్ఖుడా, మామీదే అపవాదా? మా సాంప్రదాయాన్నే నిందిస్తు న్నావు. మా మన్ననకు పాత్రులైన వారికి గానీ ఇక్కడి రాణివాసపు గౌరవం లభించదు. మల్లీశ్వరి ఆత్మీయులెవరో మీరే అర్థించనిదే మేము పల్లకి పంపివుండము.

నాగరాజు: మహాప్రభువులు మన్నించాలి. ఏలిన వారి పాదధూళికైనా తగని వారము. మేమంతటి రాణివాసాన్ని కలలోనైనా ఊహించ గలమా ప్రభూ. మేమెంత, మా యోగ్యతెంత. మా మల్లికి రాణివాసపు పల్లకి పంపించమని ప్రార్థించామంటారు.

ప్రభువు : అయితే మా అంతట మేమే పల్లకి పంపామంటున్నావా? బాగా ఆలోచించి మాట్లాడు.

నాగరాజు: ఎంత ఆలోచించినా మా వైపు ఎవ్వరికీ రాణివాసపు పల్లకి పంపించమని అర్థించే సాహసం లేదు ప్రభూ.

ప్రభువు : ఏమో, ఒకవేళ నీవే మాతో మనవి చేసుకున్నావేమో!

నాగరాజు: నేనా ప్రభూ! కోరి కోరి నేనే నా మల్లిని దూరం చేసుకుంటానా? నాకు మతిపోతూంది.

అప్పుడు అల్లసాని వారిని పిలిపిస్తాడు ప్రభువు. ఆయన్ను చూసి మల్లీశ్వరీ నాగరాజులకు గతం గుర్తుకు వస్తుంది. శిక్షకు అర్హత నాదంటే నాదని మల్లీశ్వరీ నాగరాజులు వాదిస్తారు. రాయలు ఇద్దరినీ క్షమించి వదిలేస్తాడు. సినిమా 'యాంటీ క్లైమాక్స్' కాకూడదని మరికొంత పొడిగించి ముగిస్తాడు దర్శకుడు. ఎంత తాపత్రయపడినా సుఖాంత కథలకు పట్టే యాంటీ క్లైమాక్స్ గ్రహణాన్ని అధిగమించడంలో దర్శకునికి సంపూర్ణ ఫలితం దొరకదు.

'మల్లీశ్వరి' చిత్రంలో లోపాలు లేకపోలేదు. కానీ, అవి చంద్రునిలో మచ్చలాటివి. వెన్నెలను ఆస్వాదించటానికి ఆ మచ్చ అడ్డురాదు. అదిగూడా లేకపోతే ఎంత బావుండునో అనిపించొచ్చు. కానీ, ఆ మచ్చను తొలగించడం మానవులతో అయ్యేపనిగాదు.

తెలుగుసినిమా ఔన్నత్యం ఈ వొక్కచిత్రంతో ఆగిపోలేదు. మల్లీశ్వరి కథలో లాగే విజయనగర సంస్థానానికి ముడిబెట్టి నడిపిన సినిమాలు ఇంకా

వున్నాయి. వాటిలో సంగీతం, సాహిత్యం, సంభాషణ, నటన మొదలైన అంశాల్లో 'మల్లీశ్వరి'కి ఎంతమాత్రం తీసిపోని చిత్రం 'జయభేరి.'

# జయభేరి

'జయభేరి' కథగూడా విజయనగరరాజుల పరిపాలనా కాలంలో జరిగినట్టుగా చెప్పబడిందే. ఐతే, ఈ రెండు చిత్రాల నిర్మాణం మధ్యన ఎనిమిది సంవత్సరాల వ్యవధి వుంది. ఈ వ్యవధివల్ల కలిగిన మేలూ వుంది, కీడూ వుంది. ఈమధ్యకాలంలో సౌండ్‌రికార్డింగ్ పోల్చుకోలేనంత మెరుగు పడగా, కథలో చౌకబారు మసాలాల ఘాటు పెరిగింది. కథలో గూడా 'మల్లీశ్వరి'కీ దీనికీ చాలా వ్యత్యాసముంది. మల్లీశ్వరికథలో ప్రణయం తప్ప మరొకటి లేదు (pure romance). సామాజిక ప్రయోజనానికి ఉద్దేశించిన కథ 'జయభేరి.' కులాంతర వివాహం, మతం పేరుతో ఒకానొకప్పుడు ఆచరించిన దుర్మార్గాలను ఇది ప్రతిబింబిస్తుంది. ఆత్రేయగారు కథ, మాటలు వ్రాయగా, పాటలను మల్లాది రామకృష్ణ శాస్త్రి, శ్రీశ్రీ తదితరులు రచించారు. తెలుగు చిత్రసీమకు మరో మణిదీపమైన పెండ్యాల నాగేశ్వరరావుగారు సంగీతాన్ని సమకూర్చారు. అభ్యుదయగీతాలకు బాణీ సమకూర్చడంలో పెండ్యాలగారికి ప్రత్యేకత వుంది. 'పాడవోయి భారతీయుడా', 'ఉందిలే మంచికాలం' వంటి దేశభక్తిగీతాలెన్నో ఆయన చేతిలో తయారయ్యాయి. అనుభవజ్ఞుడైన పి.పుల్లయ్యగారు దర్శకత్వం నిర్వహించారు.

సంభాషణ, సాహిత్యం, పెండ్యాలవారి సంగీతం, నటీనటుల ప్రావీణ్యత ఈ చిత్రానికి పట్టుగొమ్మలు. 'మల్లీశ్వరి' సాహిత్యాన్ని చెట్టున మాగిన పండులా దేవులపల్లి వారు అందిస్తే, 'జయభేరి'లో మల్లాదివారు జుంటితేనె అందించారు. ఆయన రాసిన గీతాలన్నిటిలో ప్రజల నాలుకపై అవిరళంగా మెదలిన పాట 'రాగమయీ రావే.' గీత రచనలో ఏ కవికీ తీసిపోని మల్లాది రామకృష్ణశాస్త్రి ప్రతిభను వెల్లడించే అనేక గీతాల్లో ఇదీ వొకటి.

**రాగమయీ రావే, అనురాగమయీ రావే**
**నీలాల గగనాల నిండిన వెన్నెల నీ చిరునవ్వున కలకలలాడగ**
**చివురులు మేసిన చిన్నారి కోయిల మరిమరి మురిసే మాధురి నీవే**
**తనువై మనసై నెలరాయనితో కలువలు కులికే సరసాలు నీవే**

**సరసాలు నీవే, సరాగాలు నీవే**
**సంధ్యలలో హాయిగ సాగే చల్లని గాలిలో**
**మరుమల్లెల విరజాజుల పరిమళమే నీవు**
**జిలుగే సింగారమైన చుక్కకన్నెలు అంబరాన**
**సంబరపడు చక్కిలిగింతల పరవశమే నేను**
**నవ పరిమళమే నీవు**
**నీడ జూసి నీవనుకొని పులకరింతునే**
**అలవిగాని మమతలతో పలవరింతునే**
**నీ కోసమె ఆవేదన, నీ రూపమె ఆలాపన**
**కన్నెలందరు కలలుగనే అందాలన్ని నీవే**
**నిన్నందుకొని మైమరచే ఆనందమంతా నేనే**

భావకవిత్వంలో అంబరాన్ని చుంబించే రచన ఇది. ఆకాశంలో నక్షత్రాలున్నాయి; అవి జిలుగే సింగారంగా కలిగిన కన్నెలు; అవి చక్కిలి గింతలతో సంబరపడుతూంటే, ఆ సంబరంలోని పరవశాన్ని నేను - అహో సాహిత్యమా! సూపర్లేటివ్ డిగ్రీలో నీకు ఎంతగొప్ప అలంకారం సమకూర్చాడు మల్లాది మహానుభావుడు!

దేవులపల్లి, మల్లాదిగార్లిద్దరూ భావకవిత్వంలో శిఖరాలు తాకినవారే. ఆ ఇద్దరి కవిత్వంలో చిన్నతేడా కనబడుతుంది. దేవులపల్లివారి కవితా లాలిత్యంలో స్త్రీస్వభావం కనిపిస్తుంది. మల్లాదివారి కవితామనోజ్ఞతలో మగటిమి కనిపిస్తుంది. ఎందుకు నాకలా అగుపిస్తుందో విశ్లేషించుకోడానికి ఎంత ప్రయత్నించినా అంతు చిక్కడంలేదు.

ఇదే చిత్రంలో సూపర్లేటివ్‌ను అద్వితీయంగా ప్రయోగించిన మల్లాదివారి మరో గీత ముంది. తెలుగుజాతి నరాలను జుమ్మని మీటే సంగీత సాహిత్యాల సమ్మేళనమది. 'సంగీత సాహిత్యమే, నవ శృంగార లాలిత్యమే' అనే పల్లవితో మొదలై -

**కాకతీసామ్రాజ్యలక్ష్మి రుద్రమదేవి అరి భయంకర ఖడ్గ ధారనే నేను,**
**అలనాటి పలనాటి మన బాలచంద్రుల శౌర్యప్రతాపాల సారమే నేను,**
**నను మించి నన్నోంచగల ధీరులెవరు?**

**పరమ మాహేశ్వరుడు పాల్కురికిసోమన్న**
**పలుకులల్లిన వీరగాథనే నేను,**
**మురిపించు శృంగారి మువ్వపురి క్షేత్రయ్య**
**పదకవితలో మధుర భావమే నేను,**
**కవికోకిలల మంజు గానమే నేను,**
**కవిసింహముల చండ గర్జనే నేను.**
**నవ్యభావాల్ జీవనదులుగా ఉప్పొంగ**
**మణులు పండే తెలుగు మాగాణమే మేము,**
**జానుతెనుగే మేము, జాతి ఘనతే మేము -**

తెలుగుబిడ్డ వారసత్వానికి సగర్వమైన స్వరూపాన్ని రూపొందించాడు మల్లాది.

చిత్రంలో నాయికానాయకులకు సంబంధించిన పాటలన్నీ దాదాపు మల్లాదివారివే కాగా, వొక ప్రత్యేకమైన పాటకోసం శ్రీశ్రీని ఆశ్రయించ వలసి వచ్చింది. మల్లాది వారు అది వ్రాయలేరనికాదు; ఒక్కొక్క వస్తువుకు వొక్కొక్కరి ప్రత్యేకత వుంటుంది. ఆత్రేయ, మల్లాది, శ్రీశ్రీ - అన్నీ దిగ్గజాలే. పని తీరులో దేని ప్రత్యేకత దానిది. ముగ్గురు దిగ్గజాల శక్తినీ వినియోగించు కోవాలని దర్శకుని అభిలాష. శ్రీశ్రీగారు వ్రాసిన పాట చూస్తే, ఆ పని ఆయనకే ఎందుకు అప్పగించారో తెలుస్తుంది -

**సాకి: అధికులని అధములని నరుని దృష్టిలోనే బేధాలు,**
**శివుని దృష్టిలో అంతా సమానులే**
**పల్లవి: నందుని చరితము వినుమా, పరమానందము గనుమా**
**చర: ఆదనూరులో మాలవాడలో పేదవాడుగా జనియించి,**
**చిదంబరేశుని పదాంబుజములే మదిలో నిలిపి కొలిచేను**
**తన యజమానుని ఆనతి వేడెను శివుని చూడగా మనసుపడి,**
**పొలాల సేద్యం ముగించి రమ్మని గడువే విధించె యజమాని,**
**సాకి: యజమాని ఆనతిచ్చిన గడువులో ఏరీతి పొలము పండించుటో**
**ఎరుగక అలమటించు తన భక్తుని కార్యము ఆ శివుడే నెరవేర్చె**
**చర: పరుగున పోయెను చిదంబరానికి భక్తుడు నందుడు ఆత్రమున,**

**చిదంబరంలో శివుని దర్శనం చేయగరాదనె పూజారి,**
**ఆశాభంగము పొందిన నందుడు ఆ గుడి ముందే మూర్ఛిల్లె,**
**అంతట శివుడే అతనిని బ్రోచి పరంజ్యోతిగా వెలయించె.**

ఎక్కడేగాని వృధాగా వాడిన పదం కనిపించదు గీతంలో. చిన్నపిల్లలు సైతం తడుముకోకుండా అర్థం చేసుకునేంత సులభశైలిలో నందుని చరిత్రంతా పాటలో ఇమిడించడమే గాక, అధికులూ అధములూ అనే తేడాలు సృష్టించింది మనిషేగానీ దేవుడు కాదనే వాదనను గొంతెత్తి వినిపించాడు కవి. ఘంటసాలవారి కంఠం, పెండ్యాలవారి సంగీతం ఈ పాటను చెవుల్లో మారుమ్రోగేలా చేస్తాయి.

అలాగే, ఇందులోని 'భీష్మప్రతిజ్ఞ'అనే నాటకానికి కూర్చిన గీతంలో -

**ఒక్కింత వినవయ్య ఓ దాసరాజా**
**నీ సుతను నా సతిగ నే జేసికొందు**
**అని శంతనమహారాజు అడగగా -**
**ఆలించు నా మనవి హస్తిపురిరాజా**
**బాసచేసి పిదప చేసుకో పెళ్ళి**
**నా బిడ్డ కనబోవు నలుసుకే పట్టం**
**కట్టుతానని చెప్పు కరుణించి నువ్వు**

అని షరతు విధిస్తాడు దాసరాజు. నిరాడంబరంగా సాగే స్రవంతిలో తేటతెనుగు మాటల తియ్యదనాన్ని రుచిచూపిస్తాడు కవి. నా బిడ్డ కనబోవు 'నలుసు' అనే ప్రయోగానికి ఇక్కడ ఎంతో ప్రయోజనం వుంది. చిన్నపిల్లలను గురించి జాలిగా ప్రస్తావించే సమయాల్లో 'నలుసు' అనే పదం వాడుకలో వుంది. ఆ పలుకులో వుండే న్యూనత ఈ సందర్భంలో అవసరం. దాసరాజు బెస్తవాడు. తన కూతురు సంతానానికి రాజ్యాధికారం అడుగుతున్నాడు. శంతనునికి ఇదివరకే కుమారుడుండడమే కాక, తక్కువ కులస్తురాలి బిడ్డలకు ఆ పుట్టుకే అధికారానికి అవరోధం అవుతుంది. ప్రతిజ్ఞ చేయించుకుంటే తప్ప, రాచకుటుంబాల్లో ఆ సంతానం నలుసుగానే మిగిలిపోతుంది. నాకూతురు సంతానం నలుసులేనని తెలిసే అడుగుతున్నాను అనే దాసరాజు భావం ఇందులో నిక్షిప్తంగా వుంది.

కథలోకి ప్రవేశించేముందు, మనసును గుర్రంలా పరిగెత్తించే

ఆత్రేయగారి సంభాషణల సరళికి రెండు మచ్చుతునకలు పరిశీలిద్దాం -

అఖండ గౌరవంతో రాయలవారు కథానాయకున్ని సన్మానించడం మతగురువుకూ, రాజనర్తకికీ మింగుడు పడదు. ప్రతీకారానికి రాజనర్తకిని ఎగదోస్తాడు గురువు. హీరోను భ్రష్టు పట్టించడానికి పూనుకుంటుంది నర్తకి. తన ఇంట్లో హీరోకు ఆతిథ్యం ఏర్పాటుచేస్తుంది. ఆకర్షణీయమైన అలంకారంతో అతనికోసం ఎదురుచూస్తూ వుంటుంది. అతడు ప్రవేశించగానే వొక చెలికత్తె పరుగున వచ్చి,

'అమ్మా, వారు వస్తున్నారు.' అని ప్రకటిస్తుంది.

'వీరూ సిద్ధంగానే వున్నారు.'

అంటుంది నర్తకి, వారి మధ్యన జరుగబోయేది అదేదో యుద్ధంలాగా. సాధారణ విషయాన్ని అసాధారణమైన రీతిలో వ్యక్తీకరించడం ఆత్రేయలోని ప్రత్యేకత.

కథానాయకుడు ప్రభువుల సన్మానం పొందే సందర్భంలోగూడా ఇటువంటి ఛలోక్తి కనిపిస్తుంది. ముందు అతని అర్హత నిరూపించబడాలని రాజనర్తకి పట్టుబడుతుంది. హీరో అందుకు పూనుకుంటాడు. ఆలాపనతో సవాలుకు జవాబివ్వడం ప్రారంభిస్తాడు. ఆలాపన విని నర్తకి అడుగుతుంది.

**'ఇది ఏ రాగం?'**

**'విజయానంద చంద్రిక.'**

**'ఇదెక్కడి రాగం? మేమెప్పుడూ వినలేదే.'**

**'ఇప్పుడు వినిపిస్తాగా.'**

అంటాడు ధీమాగా. 'నీకు తెలిసిందే సర్వస్వం కాదు బాసిలే, నువ్వు నేర్చుకోవలసింది ఇంకావుంది' అనే ఎత్తిపొడుపు, హెచ్చరికలు అంతర్వాణిగా ఆమాటలో ధ్వనిస్తాయి.

కథ, మాటలు గొప్పగా వుంటే చాలదు. మాటలను భావం చెడకుండా ఉచ్చరించే దక్షత (modulation) పాత్రధారుల కుంటేనే చిత్రం రక్తి కడుతుంది. జయభేరి చిత్రానికి ఆ హంగు సమకూర్చడానికి భారీ తారాగణాన్ని జతచేశాడు దర్శకుడు. నటీ నటులంతా అనుభవంతో పండిన ఘనాపాటీలే. ఎస్.వి.రంగారావు, గుమ్మడి వెంకటేశ్వర్రావు, నాగయ్య, శాంతకుమారి, రేలంగి వెంకట్రా

మయ్య, రమణారెడ్డి, చదలవాడ కుటుంబరావు, సూర్యకాంతం, ముక్కామల, అక్కినేని నాగేశ్వర్రావు, అంజలీదేవి, రాజసులోచన తదితరులతో తారాగణం నిండిపోయింది. భారీ తారాగణంతో చిత్రాలు నిర్మించడం విజయావారికే సాధ్యమని అంటూండే సమయంలో, ఆ విషయంలో 'జయభేరి' వారి కెంతమాత్రం తీసిపోనిదిగా నిలిచింది.

కథానాయకుడైన కాశీనాథశాస్త్రి పాత్రను అక్కినేనిగారు పోషించారు. విద్యానగరంలో విద్యాపీఠంగా వెలసిన గురుకులంలో అతడు చదువు కుంటున్నాడు. ఆ విద్యాపీఠానికి అధిపతి, గురువు అయిన విశ్వంభరశాస్త్రి పాత్రను చిత్తూరు నాగయ్యగారు నటించారు. నటించారనే మాటేగాని, ఎక్కడా మనకు నాగయ్య కనిపించడు; విద్యార్థుల ఎదుగుదల తప్ప ఇతర వ్యాపకమే లేని గురుపూజ్యుడు విశ్వంభరశాస్త్రిగానే కనిపిస్తాడు. స్థాయికి తగిన ఠీవి తప్ప, ఆయన నడవడికలో గర్వం కనిపించదు.

**గురు: కాశీ.**

**కాశీ: ఆచార్యా.**

**గురు: నేడు పంచమీ శుక్రవారం కదూ?**

**కాశీ: చిత్తం.**

**గురు: సరే. కల్యాణి రాగాన్ని సాకల్యంగా సాధన చెయ్యండి.**

పంచమీ శుక్రవారమని గురువు శిష్యులనడిగి తెలుసుకునే అవసరం లేదు; రాగాలకూ తిథులకూ అవినాభావ సంబంధం వుందనే వారి నమ్మకాన్ని ఇందుమూలంగా ప్రవేశపెట్టాడు దర్శకుడు.

శిష్యులు పాట అందుకుంటారు. కల్యాణి రాగంలో ఇంపుగా ఆలాపిస్తారు. అందరికంటే కాశీ కంఠస్వరం కొరతలేకుండా రాగంలో ఒదుగుతుంది. నేపథ్యంలో పాడింది ఘంటసాలవారు గదామరి! పాడే సమయంలో అక్కినేని మెడమీది రక్తనాళాలు ఉబ్బి కనిపించడం గమనిస్తే, సన్నివేశంలో నటులు ఎంత లోతుగా నిమగ్నమయ్యేవారో మనకు తెలిసొస్తుంది. తన తరువాత విద్యాపీఠానికి వారసుడయ్యే యోగ్యత కాశీకి సమకూరిందని ఆచార్యుడు మెచ్చుకుంటాడు.

**కాశీ: ఆచార్యా, ఒక్క మనవి. ఈనాడు ఏదో వొక అపూర్వమైన కొత్తరాగాన్ని ప్రారంభిస్తామన్నారూ.**

గురు: ఊ .. అప్పుడే సర్వజ్ఞత నాపాదించుకుంటున్నావా? ఆ రాగ మొక్క టేనా నీకు రానిది? సంగీతం సొంతం సాధించాననే అహంకారమా అది? అహంకారం అవిధేయతా హేతువు.

కాశీ: ఆచార్యా, అహంకారం కాదు, అర్థిస్తున్నాను.

గురు: అవసరం లేదు. అదనూ పదునూ అధ్యాపకునికి తెలుసు. అడగటమే అవిధేయత.

అదనూ పదునూ తెలీని అధ్యాపకుణ్ణి విశ్వంభరశాస్త్రి ఊహించనూ లేడు, అంగీకరించనూలేడు. విద్యార్థి తన అధీనంలోకి వచ్చిన తరువాత తల్లి, తండ్రి, గురువు, దైవం అన్నీ తానై పెంచగలవాడే అధ్యాపకుడనేది ఆయన ఆదర్శం. ఒకరితో బాధ్యతను గుర్తు చేయించుకునే అవసరం గురువైనవాడికి కలుగరాదని అనుకునే వ్యక్తి. అందువల్ల, ఆమాట గురువుకు నొప్పి కలిగించింది, కోపం తెప్పించింది.

విశ్వంభరశాస్త్రి నియమం, నిబద్ధతలు ఎలాటివో ఆ తరువాతి సన్నివేశం వివరిస్తుంది. లౌకిక వ్యవహారాల మీద ఆయనకు ఆసక్తిలేదు. విద్యాపీఠం, శిష్యులు, కళలు, దేశం వంటి విషయాలు తప్ప, తక్కిన ప్రపంచం గురించి ఆయన పట్టించుకోడు. ఈ స్వభావం శంభుశాస్త్రితో జరిగే చర్చవల్ల తెలుస్తుంది.

శంభు: నమస్కారం ఆచార్యా.

గురు: నమస్కారం. దయచేయండి. కూర్చోండి శంభుశాస్త్రులూ. ఏమిటి విశేషాలు?

శంభు: విశేషాలకేమున్నది ఆచార్యా. విద్యానగరానికే ఏదో విపత్తు వచ్చినట్టుంది.

గురు: విద్యానగరానికి విపత్తా?

శంభు: కాకుంటే, ఈ గడ్డమీద ఆ గడసాని ఆటలేమిటి? ప్రతిరాత్రి ఆ బచ్చనవారి ప్రదర్శనలేమిటి?

మరొక శాస్త్రి: అంతేనా, ఈ రాత్రికి ఏదో సవాలు చేస్తారట, సవాలు.

శంభు: విన్నారా? ఇక్కడ విద్యాపీఠం వెలిసిందనీ, విశ్వంభరశాస్త్రులవారు వున్నారనీ వారికి లక్ష్యమే లేకపోయింది.

గురు: శాస్త్రులూ, అదా మీ ఆందోళన?

శంభు: ఆందోళన కాదు ఆచార్యా, అవమానం.

గురు: అవును. ఆ పామరులను గురించి ప్రస్తావిచడమే అవమానం, అపచారం. వారికీ కళకూ ఎక్కడ పొత్తయ్యా? వారిదీ వొక కళేనా?

శంభు: మనం కాదన్నా, జనం వేలంవెర్రిగా వాళ్ళ వెంబడి పడుతున్నారు. ఆ జయజయధ్వానాలూ, ఆ కరతాళధ్వనులూ నేనింతవరకు కనీవినీ ఎరుగను.

గురు: శాస్త్రులూ, ప్రజలు ఈరోజున హర్షిస్తారు, రేపు దూషిస్తారు. ఆలోచించడంకంటే అనుసరించడమే వాళ్ళకు అలవాటు. విద్వత్తుకు గీటురాయి అజ్ఞానుల గోలకాదు.

శంభు: (సర్దుకుంటూ) చిత్తం చిత్తం.

మరొక శాస్త్రి: అంతేమరి. ఈ జనమంతా ఆ ఆటాపాటా చూడటానికే వెళుతున్నారా? మంచి ప్రాయంలో నవనవలాడే పిల్లను తీసుకొచ్చారు, ఈ దండంతా దాన్ని చూడటానికి ఎగబడుతున్నారు.

గురు: శివశివ. పోనీలేవయ్యా మనకెందుకొచ్చింది. కోటి విద్యలు కూటికొరకే. నాకు మాధ్యాహ్నికానికి వేళౌతూంది.

శంభు: అయితే సెలవు.

శంభుశాస్త్రి ఎంత ఎగదోసినా గురువు చలించడు. కానీ, ఆ మాటల ప్రభావం శిష్యుల మీద పడుతుంది. ఈ సన్నివేశం ద్వారా పాత్రల ప్రకృతిని (temperament ను) ప్రేక్షకులకు పరిచయంజేయడం దర్శకుని గమ్యం. ప్రాయంలోవున్న ఆడపిల్ల గురించి అసభ్యంగా దొర్లిన మాటలను వినడానికైనా ఇష్టపడడు గురువు. సాంతం విని, సభ్యతకోసం ఖండించే పెద్దమనుషుల కోవకు చెందినవాడు కాడాయన. వినడానికే ఇష్టపడని విశ్వంభరశాస్త్రి స్వభావం తెలపడానికి మాటలమీద మాటలను ఓవర్ లాప్ (over lap) చేయిస్తాడు దర్శకుడు. శిష్యులంతా యువకులు. వారిలో ఉద్రేకం పాలు ఎక్కువుంటుంది గాబట్టి, శంభుశాస్త్రి మాటలు వాళ్ళను లొంగదీసుకుంటాయి. సవాలును ఎదుర్కొనే ఉద్దేశంతో ప్రదర్శనకు హాజరౌతారు. పోటీలో కథానాయకుడు కాశీ నెగ్గుతాడు.

చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకున్న కాశీని తల్లిలేని లోటు కనబడకుండా పెంచింది అతని వదినె అన్నపూర్ణమ్మ. సంతానంలేని అన్నావదినెలకు అతడు ఆశాజ్యోతి. వదినె ఎంత నెమ్మదస్తురాలో, అన్న విశ్వనాథశాస్త్రి అంత కోపిష్టి. అన్నావదినెల పాత్రల్లో గుమ్మడి, శాంతకుమారి జీవించారంటే అతిశయోక్తి కాదు. బచ్చనవాల్ల సవాలును ఎదుర్కొని విజయగర్వంతో కాశీ ఇంటికి తిరిగొచ్చిన సన్నివేశంలో -

అన్న: ఏమండీ. కాశీ ఏదో సంబరంగా చెప్పుకోనొస్తే ..

విశ్వ: ఆ, ఏంచేయమంటావ్? ఎగిరి గంతేయమంటావా?

అన్న: వద్దులెండి. పేరు నిలబెట్టాడని ఊరంతా ఉప్పొంగిపోతూంటే, మన మిట్లా మండిపోతున్నాం. హు, మిమ్మల్నని ఏంలాభం? ఆప్యాయత, ఆదరణ ఏనాడైనా ఎరిగుంటేనా? అదొక జాతకం.

విశ్వ: పిచ్చిదానా. అభివృద్ధిలోకి రావలసిన పిల్లల్ని మనమే ఆకాశాని కెత్తగూడదే. ప్రేమ మాటల్లో కాదు, మనసులో వుంటే చాలు.

అన్న: సరేలెండి (అంతలో కాశీ వస్తాడు)

విశ్వ: ఏమిట్రా అంతపెద్ద సంబరం?

కాశీ: ఏంలేదు.

విశ్వ: చెప్పవోయ్, అంతలోనే చెట్టెక్కి కూర్చున్నావ్.

కాశీ: అహ, ఎవరో బచ్చన భాగవతులు, సవాల్ చేశారు.

విశ్వ: నువ్వు గెలిచావ్. ఒహో, అంతేగా. భేష్. గొప్పపనే చేశావులే.

అన్న: అబ్బ. వెటకారంగానైనా వొప్పుకున్నారు. సంతోషం.

విశ్వ: ఒరే కాశీ, మీ వదినె కాపురానికొచ్చి ఇరవై సంవత్సరాలైందిరా. ఇప్పటికి నా మాటలో నిజమేదో, నిష్ఠూరమేదో దానికి తెలీదు. వెర్రిమొఖమా, వెర్రిమొఖమా.

ఒకే మాటను మీదమీద వొకటికంటే ఎక్కువసార్లు పలుకవలసి వచ్చినప్పుడు, అది నటుల్లోని మాడ్యులేషన్ శక్తిని సవాలు చేస్తుంది. గుమ్మడి మంచి నటుడు గాబట్టి చక్కగా ఉచ్చరించ గలిగాడు. ఇలాటి అవసరం ఇదే చిత్రంలో మరొకచోట శాంతకుమారికి కలుగుతుంది. అత్యుత్తమంగా మాడ్యులేట్ చేసి ఆమె అతిగొప్ప నటిగా ఆమె నిరూపించుకుంటుంది.

తన శిష్యుడు పామరులతో పోటీ పడటం తలవంపులుగా భావిస్తాడు గురువు. కాశీ చేసిన పనికి ఆయన ఆగ్రహంతో మండిపోతున్న సమయంలో, బచ్చనవారిని గురువుగారి దర్శనం చేయించటానికి వెంటతీసుకుని విద్యాపీఠాని కొస్తాడు కాశీ. గురువుల కోపాన్ని ఇది రెట్టింపు చేస్తుంది. గురుశిష్యుల అభిప్రాయాల్లోని వ్యత్యాసాన్ని తెలపడానికి ఈ సన్నివేశాన్ని సృష్టించాడు రచయిత.

గురు: కాశీ . . సచేలస్నానం చేసిరా. ప్రాయశ్చిత్తం చేసుకో. కదలవేం?

కాశీ: చిత్తం. ప్రాయశ్చిత్తానికి సిద్ధమే. కానీ, చేసిన పాపం సెలవిస్తే . .

గురు: ఆ ... అవిధేయత!

కాశీ: మన్నించండి గురుదేవా. చేసిన అపరాధం తెలియకపోతే అనుభవించే శిక్షకు అర్థం వుండదేమో.

గురు: చెప్పించుకుంటేగానీ చేసిన తప్పు తెలియని చిరుతప్రాయమా? ఇంతకన్నా ఏం అపరాధం చెయ్యాలి? విద్వత్తును మురికి వీధుల్లోకి లాగావ్. సంగీత సరస్వతిని చాకిరేవుల్లోకి దింపావ్. విద్యాపీఠాన్నే అప విత్రం చేశావ్.

కాశీ: పవిత్ర గంగాభవాని పాపులు మునిగినంతమాత్రాన అపవిత్రమై పోతుందా ఆచార్యా.

గురు: ఊ . . కడివెడు పాలను పాడుజేయటానికి వొక్క ఉప్పురాయి చాలు.

కాశీ: మన్నించండి. తమ ఆశీర్వాదబలంవల్ల విద్యానగర ప్రతిష్ట నిలబడిం దని అందరూ ఆనందిస్తున్నారు.

గురు: ఛీ . . అప్రదిష్ట. బచ్చనవారితో బలాబలాలు తూచుకోడానికి కాదు నీకు విద్య నేర్పింది. ఈ విద్య పరిషత్తుల్లో, విశ్వకళాపీఠాల్లో పండి తుల ప్రశంసలూ, మన్నీడుల మన్ననలూ అందుకోవలసింది. పామ రుల ఈలలకూ గోలలకూ గురికావలసింది కాదు.

కాశీ: కానీ ఆచార్యా, కళ భగవత్స్వరూపమని తమరే సెలవిచ్చారు. భగవం తుని దృష్టిలో పెద్దాచిన్నా లేదు. పండితుని మాత్రమే రంజింప చేసే కళ సంపూర్ణం కాదేమో. సామాన్య ప్రజామోదం పొందని

విద్య సంకుచితమై సమసి పోతుందని నా మనవి.

గురు: కాశీ . . నీ అహంకారం హద్దుమీరిపోయింది. ఇన్నేళ్ళ అధ్యయనం అపాత్రదానమైంది. భ్రష్టుడవైపోయావ్. నీ అహంకార జాడ్యం ఆశ్రమాన్నంతా ఆవరించక ముందే బయటికి వెళ్ళు. ఊ.

అన్న విశ్వనాథశాస్త్రి స్వభావం అనుగ్రహాన్ని ప్రదర్శించదుగానీ, ఆగ్రహాన్ని తారాస్థాయిలో వెల్లగక్కగలదు. వదినె అన్నపూర్ణమ్మది మమతాను రాగాలు మూసబోసిన మూర్తి. ఈ స్వభావనిర్ధారణకు ప్రవేశపెట్టిన సన్నివేశాన్ని దర్శకుడు సమర్థవంతంగా వినియోగించుకున్నాడు -

విశ్వ: ఎంత అవమానం, ఎంత అప్రదిష్ట. ఆ బచ్చనవాళ్ళ కొంపకు వీడు పోవడం, వాళ్ళచేత నానా మాటలూ అనిపించుకోవడం, ఖర్మేఖర్మ.

అన్న: ఏమిటండీ మరీనూ. ఎవరు చెప్పారిదంతా?

విశ్వ: ఎవరో చెప్పడమెందుకే, ఊరంతా అట్టుడుకినట్టు ఉడికిపోతూంటేను. అందరూ అడిగేవాళ్ళే, అందరూ నవ్వేవాళ్ళే. చెప్పలేక సిగ్గుతో తలొంచుకొని వచ్చాను.

అన్న: ఊళ్ళోవాళ్ళు చెప్పడానికేమొచ్చిందిలెండి. గోరంతలు కొండం తలు చేస్తారు.

విశ్వ: అయితే అపద్ధమే నంటావా? వీడు ఆ బచ్చనగుంపును వెంటబెట్టుకుని విద్యాపీఠానికి వెళ్ళడం, అక్కడ గురువుగారినే తిరస్కరించడం, అంతా అపద్ధమేనంటావ్.

అన్న: దాందేముందండీ, వాళ్ళు గురువుగారి దర్శనం చేసుకోవాలని కోరుంటారు. పసితనం, తెలీక తీసుకెళ్ళుంటాడు.

విశ్వ: చాల్లే సమర్థిస్తున్నావ్. నీ అలుసు చూసుకొనిగాదూ వాడు నెత్తికెక్కు తున్నాడు.

అన్న: (కాశీ రావడం గమనించి) ఏమండీ, కాస్త నెమ్మదిగా మాట్లాడండి.

ఇంట్లో జరిగిన రాద్ధాంతం కాశీని మరింత కలవర పరుస్తుంది. భోజనం సహించక పరగడుపుతో పడుకుంటాడు. పొద్దుపోయి ఇంటికొచ్చిన అన్న-

విశ్వ: ఏడీ మీ మరిదిగారు?

అన్న: పెరట్లో పడుకున్నాడు.

విశ్వ: ఏం, భోంచేశారా?

అన్న: ఆకలి కాలేదట.

విశ్వ: ఎందుకౌతుంది, ఊళ్ళోవాళ్ళు అన్న మాటలకే కడుపు నిండి పోతూంటే.

అన్న: అంతదాకా ఎందుకు, మీరనే మాటలు చాలవూ.

విశ్వ: అహా, అందుకని నన్ను సాధిస్తాడా ఏం? చేసిన సిగ్గుమాలినపని చాలక బెదిరింపులు కూడానా? ఉండనీ, ఎన్నిపొద్దులుంటాడో ఉపవాసం. తెలిసొస్తుంది.

ఆ తరువాత, బచ్చన నారయ్య ప్రోద్బలానికి తలొగ్గి, వారితో కలిసి వొక ప్రదర్శన ఇవ్వడానికి కాశీ మాటిస్తాడు. అది మతపరివారంలో కలకలం రేపుతుంది. మతపెద్దలు రెచ్చిపోతారు. ఆ పని జరిగితే వెలివేయక తప్పదని విశ్వనాథశాస్త్రిని హెచ్చరిస్తారు. కాశీని వెళ్లనివ్వనని మగనికి హామీ ఇస్తుంది అన్నపూర్ణమ్మ. మమతానురాగాలకూ, మగనికిచ్చిన హామీకీ మధ్య ఏర్పడిన సంఘర్షణనకు ఆత్రేయ కూర్చిన మాటలూ శాంతకుమారిగారి ఉచ్చారణా మనసులు మూగబోయేలా చేస్తుంది. వదినలోని తల్లిని ప్రదర్శించడంలో ఆమె నటన నభూతో నభవిష్యతి అనిపించుకుంది.

కాశీ: నన్ను క్షమించొదినా, క్షమించు. నేను ఈ బాధ పడలేను. నన్ను వాళ్ళు నమ్ముకున్నారొదినా.

అన్న: మేము నిన్ను నమ్ముకున్నవాళ్ళం కాదా కాశీ?

కాశీ: వదినా, నేను వాళ్ళకు మాటిచ్చాను.

అన్న: నేనూ మీ అన్నగారికి మాటిచ్చానయ్యా.

కాశీ: వదినా. ఈ వొక్కసారికీ నన్ను క్షమించు. మళ్లీ ఆ ఛాయలకు పోనొదినా. నన్ను వెళ్ళనీ. వెళ్ళనీ వొదినా. నాకు సెలవియ్యొదినా, సెలవియ్.

అన్న: కాశీ, వెళ్ళక తప్పదా?

కాశీ: (పలకడు).

అన్న: సరె. వెళ్లిరా నాయనా, వెళ్ళు. వాళ్ళని కాపాడు.

కాశీ: వదినా. ఈ ద్రోహిని మన్నించానని చెప్పొదినా, మన్నించు.

అన్న: మన్నించడమొక్కటే నాయనా మాకు మిగిలింది.

కాశీ: వదినా.

అన్న: వెళ్ళిరా, వెళ్ళిరాయ్యా, వెళ్ళు.

'మేము నిన్ను నమ్ముకున్నవాళ్ళం కాదా' అనే మాట గుండె లోతులను కెలుకుతుంది. అన్నావదినెలకు తను ఏకైక ఆధారమన్న విషయాన్ని కాశీ విస్మరిస్తున్నాడు; తన చర్యతో ఆ కుటుంబానికి రాబోయే విపత్తును నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఎందుకోసం? - ఎవరో పరాయివాళ్ళ కిచ్చిన మాటకోసం, ఎవరో పరాయివాళ్ళు తనమీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలుపుకోవడం కోసం - ఆత్మీయతను పరిగణనలో లేకుండా తొలగదోస్తున్నాడు. ఆ బాధను దిగమ్రింగుకుంటూ 'వెళ్ళిరా నాయనా, వాళ్ళను కాపాడు' అంటుంది వదిన. ఆ దశలో కాశీ కాపాడగలిగింది ఏదో వొక్కరినే. బచ్చనవాల్లు ఎదుర్కోబోయే సమస్యకంటే అన్నావదినెలకు కలుగబోయే ఆపద చాలా పెద్దదని కాశీకి తెలుసు. ఆ విషయాన్ని స్ఫురింపజేసే వదిన అంగలార్పు అతని తలకెక్కదు. మొగ్గు అవతలివేపే వుండడం ఆమె మానసిక క్షోభను మరింత పెంచుతుంది. అందుకే 'మన్నించడంతప్ప మాకు మిగిలిందేముంది' అంటుంది.

బచ్చనవారితో కలిసి కాశీ యిచ్చిన ప్రదర్శన విజయవంతంగా ముగుస్తుంది గానీ, అది అన్నావదినెలను మతపీఠంముందు ముద్దాయిలుగా నిలబెడుతుంది.

మతగురువు: విశ్వనాథం, ఏమీ నీ సమాధానం?

విశ్వ: చిత్తగించాలి. నా తమ్ముడికీ నాకు ఏవిధమైన సంబంధమూ లేదు. అంతా తీరిపోయింది. ఆ బాంధవ్యాన్ని తెంచుకున్నాను.

శంభు: అలా తెంచుకుంటే తెగేది కాదు, రక్తసంబంధం.

విశ్వ: ఇంతకంటే నేను చేయగలిగిందేముంది?

మ.గు: సదస్యుల అభిప్రాయం?

సద: మతాధికారుల అభిమతమే మా సమ్మతం.

మ.గు: ప్రాయశ్చిత్తం అనుభవించాలి.

సద: అనుభవించాలి . . అనుభవించాలి, తప్పదు.

విశ్వ: ప్రాయశ్చిత్తం! ఆచార్యా, కనికరించండి. కనికరించండి.

మ.గు: కనికరమా! నీవు చేసిన అపచారానికి ఈ శిక్ష చాలదు.

(కాశీ ప్రవేశిస్తాడు)

కాశీ: ఏమిటా అపచారం?

శంభు: ఆగు అక్కడ.

కాశీ: ఎందుకని?

శంభు: అసలు నువ్వీ పవిత్ర సభాప్రాంగణంలో అడుగుపెట్టడం అపచారం. అగ్నిహోత్రంలాంటి కులంలో నిష్ఠాగరిష్ఠుడైన అంతటి సోమయాజి కడుపున పుట్టి, ఆ బచ్చనవాళ్ళతో చేతులు కలపడం మహాపచారం. అన్నిటినీ మించి, ఆ కులంలేని కులట, ఆ నీచురాలితో లేచిపోవడం క్షమించరాని అపచారం.

సద: ఔను ఔను.

కాశీ: శాస్త్రిగారూ, అన్యాయంగా వొక ఆడదాన్ని అవమానించడం, ఇది సభామర్యాద కాదు.

శంభు: చాలించు. ఆ మానహీననూ, ఈ మతభ్రష్టుణ్ణీ మర్యాద చేయడానికి కాదు మేమిక్కడుండటం. సిగ్గులేకుండా వెలయాలును వెనకేసు కొస్తున్నావ్.

కాశీ: శాస్త్రిగారూ, తెలిసీ తెలీకుండా ఎందుకలా తూలనాడుతారు? మీ ఇంట్లో ఆడవాళ్ళు లేరూ?

గుంపులోనుండి: ఏమిరా కూస్తున్నావ్. మా ఆడవాళ్ళను దాంతో పోలుస్తావా? దానికీ నీకూ ఏమిట్రా బాదరాయణ సంబంధం? కట్టుకున్న పెళ్ళామా?

మరొకరు: ఆ .. ఇంతవరకు కాదు.

కాశీ: చాలించండి. ఒక అబలను, అమాయకురాలిని మీ అపవాదునుండి తప్పించడానికి నేను వివాహం చేసుకోక తప్పదు.

మ.గు: విన్నావా విశ్వనాథం. ఇంతకన్నా క్షుద్రం ఇంకేంకావాలి. ఇంకా మిమ్మల్ని దయతలుస్తుందా ధర్మపీఠం?

గుంపు: వీల్లేదు. శిక్షించాలి ... ఆ వంశాన్ని సమూలంగా నాశనం చేయాలి.

కాశీ: చేయండి. మీరు ఏంచేసినా సరే, ఏ శిక్ష విధించినా సరే, అపరాధిని

నేను, నన్ను శిక్షించండి. అనుభవిస్తాను. కానీ, వారు, శ్రీ విశ్వనాథ శాస్త్రులవారు .. మన్నించండి, సోదరబంధం తెంచుకున్నారు గనుక పేరుతో ముచ్చటించలసి వచ్చింది, వారు ఏ పాపం ఎరుగరు. మీకోసం, మీ బ్రాహ్మణ్యం కోసం, మీలో వొక్కడుగా జీవించి తరించడం కోసం, ఒక్కరక్తం పంచుకున్న తమ్ముణ్నేవదులుకున్నారే, పెంచిన ప్రేమను తుంచుకున్నారే, మనస్సునూ మమతనూ చంపుకున్నారే, ఇంకేం కావాలి. అదిగో పొంగిపొరలిపోతున్న దుఃఖాన్ని మ్రింగుకొని క్రుంగి పోతున్న మహాసాధ్వి అన్నపూర్ణమ్మ. అమ్మా అని పిలవటానికి నాకు మిగిలిన తల్లిగాని తల్లి. ఆమెను గూడా దూరం చేసుకున్నానే, ఇంకేం కావాలి. అన్యాయంగా వారి నెందుకు శిక్షిస్తారు. స్వామీ, మీ పాదాలంటి ప్రతిమాలుతున్నాను, వారిని దయతలచండి.

మ.గు.: ఛీ. దయాదాక్షిణ్యం. శంభూ, ఈ క్షుద్రుణ్ణి బయటికి పంపించు.

శంభు: నడవండి.

కాశీ: ఇదేనా మీ ధర్మం? నిరపరాధుల్ని శిక్షించడమేనా మీ మతం? ఇది మతం కాదు, మీ అధికార మదం.

శంభు: ముయ్ నోరు.

కాశీ: నా నోరు మూసినా, మీ కళ్ళూ చెవులూ తెరిస్తే చాలు, నిజం తెలుస్తుంది. ఎవడు బ్రాహ్మణుడు, సర్వేజనా సుఖినో భవంతు అని త్రికాలాలలో త్రికరణ శుద్ధిగా జపించి, తపించి, విశ్వశ్రేయస్సు కోరేవాడే బ్రాహ్మణుడు. ఏకో బ్రహ్మమని ఎరిగినవాడే బ్రాహ్మడు. ఈ కులమత బేధాలకు అతీతుడైనవాడే బ్రాహ్మడు. చెప్పండి, ఏది మతం? మానవుని మంచివైపు నడిపించేది మతం. మనిషితో పాటు మనస్సును పెంచేది మతం. మానవుని దేవుణ్ణి -

మ.గు: చాలించు. మతాన్ని గురించి మాట్లాడే అర్హత లేదు నీకు. ముందు నడువ్ బయటికి.

కాశీ: వెల్తున్నాను. కానీ, చివరి మాటలు చెబుతున్నాను. మీ హృదయాలను పరిశీలించుకోండి. మతం పేరుతో జరుగుతున్న అమానుషం ఇంకెంతో

**కాలం సాగదు. మీ మనసులు మార్చుకున్నారా సరే, లేదా మీతోపాటు మీ మతమూ నశించిపోతుంది.**

**మ.గు: నశించిందిరా, నీతోనే నశించింది. పో బయటికి.**

అపరాధి వొకరు, శిక్ష అనుభవించేది పదుగురు. ఇది ధర్మమేనా? మతం తన ఉనికిని కాపాడుకోటానికి ఏర్పరుచుకున్న రక్షణ ఇది. ఆ తప్పేజరిగితే ఆ కుటుంబమంతా బాధ్యులౌతారని ముందే హెచ్చరించబడింది. విచారణకంటే ముందే తీర్పు నిర్ణయింపబడింది. ఇక్కడ సాగింది ధర్మాధర్మాల విచారణ కాదు, కులపెద్దల విచక్షణ. విశ్వశ్రేయస్సు కోరే బ్రాహ్మణుల సమావేశం కాదది, వీలు కలిగినప్పుడల్లా తమ అధికారంతో నిర్దాక్షిణ్యంగా అక్కసు తీర్చుకునే కిరాతకమూక - అని చెప్పడానికి ఉద్దేశించిన ఘట్టమిది. ఈ విషయం చెప్పడానికే అల్లిన కథ కాబట్టి, దానికి తగ్గట్టు సంవాదంతో ఉద్రేకపూరితమైన వాతావరణం కల్పించబడింది.

కానీ, దేన్నైతే కీలక సన్నివేశంగా రూపొందించాలనుకున్నారో, అందులోనే బలహీనత చోటుచేసుకుంది. పెళ్ళిచేసుకునే నిర్ణయాన్ని ఆవేశంతోనూ, పౌరుషంతోనూ తీసుకున్నట్టు చూపబడింది. నాయకుడు నాయకిని పెళ్ళాడటానికి పౌరుషమే కారణం కానక్కర లేదు. అటువంటి నిర్ణయంతో ఏర్పడిన దాంపత్యంలో ఆత్మీయతగానీ, సమన్వయంగానీ కనిపించదు. కానీ, తరువాత వచ్చే సన్నివేశాల్లో వారి మధ్య అలాటి కొరతలేవీ కనిపించవు. శంభుశాస్త్రి నోట 'ఆ నీచురాలితో లేచిపోవడం' అనే ఎత్తిపొడుపు సహజంగా కాక, తొందరగా కథను దూకించడం కోసం అతికించిన మాటగా కనిపిస్తుంది. లేచిపోవడమనే పదం ఆ ఊర్లో లేకుండా పోయినప్పుడు వాడేది. కానీ, హీరో హీరోయిన్లు ఎక్కడికీ పోలేదు, ఊర్లోనే వున్నారు. ఒక స్త్రీతో కలిసి ప్రదర్శన ఇవ్వడమూ లేచిపోవడమూ వొకటికాదు. మతాన్ని గురించీ, బ్రాహ్మణత్వాన్ని గురించీ తీవ్రాతితీవ్రంగా జరిగే చర్చ ఈ అతుకు సంభాషణ వల్ల తేలికపడి యాంటీక్లైమాక్స్‌లో దిగింది. అంతేగాదు, కాశీది అభ్యుదయ భావాలు కలిగిన పాత్రగా ఇంతసేపూ మలుచుకుంటూవచ్చి, అతడు కులం తక్కువ పిల్లను చేసుకోడానికి కారణం ప్రేమగాక, పౌరుషమని అనిపించేలా చేయడంతో దారుణమైన లొసుగు ఏర్పడింది.

పోనీ, దానికైనా రచయిత కట్టుబడి వున్నాడా అంటే, అదీగాదు. మరొకవైపు ప్రేమనూ ప్రవేశపెడతాడు. అంతకుముందు వొక సన్నివేశంలో, పాటకు బాణీ కట్టే ప్రయత్నంలో, కాశీ అందుకుతగిన మానసికావస్థను (moodను) పొందలేడు. కాలి మువ్వలతో సవ్వడి చేస్తుంది మంజు. అది కాశీని ఉత్తేజపరుస్తుంది. ఆ తరువాత, మరో సన్నివేశంలో, 'ఎంత ప్రయత్నించినా గొంతుపెగలలే'దని నర్తకితో అంటే, 'దేవిగారు ఎదురుగా వుండగనే' అంటూ నర్తకి ఎద్దేవా చేస్తుంది కాశీని. దీన్నిబట్టిగూడా మంజు అతని భావావేశానికి ప్రేరణ అని తెలుస్తూంది. అంత ధృఢంగా మనసులో నెలకొన్న వనితను ప్రేమతో గాకుండా పౌరుషంతో చేసుకున్నాడనే డొంకతిరుగుడుతో పనిలేదు. కులం తక్కువ పిల్లను పెళ్ళాడడం నేరమైనట్టు, కథానాయకుడికి అనవసరంగా కవచం తొడగటం మూలంగా గమ్యానికి చిల్లి పడింది.

ఈ బలహీనత నాయికానాయకుల మధ్య ప్రణయాన్ని క్రమేణా పెంచడానికి విఫలం కావడం మూలంగా ఏర్పడింది. ప్రణయాన్ని మలచడంలో భావకవులకున్న నైపుణ్యం భౌతికవాద రచయితలకుండదు. భౌతికవాదులు ప్రణయాన్ని గురించి ఏమీ ఎరుగని సన్యాసులని గాదు దీనర్థం. వారికది జీవితంలో వొక చిన్నభాగంకాగా, భావుకుల జీవితానికి అదే సర్వస్వం.

కాలవ్యవధిలో కలిగిన మార్పుల ప్రభావం గూడా ఇందులో కొంతుంది. మల్లీశ్వరిలో హాస్యం కోసమని పనిగట్టుకుని నడిపిన వొక్క సందర్భంగానీ, సంభాషణగానీ తారసపడదు. ఆ తరువాతి కాలంలో, ఆకర్షణ కోసం అదేపనిగా హాస్యాన్ని జొప్పించే ప్రక్రియ మొదలై, జయభేరి నాటికి ముదిరింది. అందువల్ల, అసంబద్ధమైన సన్నివేశాలు కొన్ని హాస్యం కోసం అతకవలసి వచ్చింది. బహుశా ఇవి ప్రణయానికి అవసరమైన జాగాను తినేశాయేమో!

మంజును పెళ్ళిచేసుకోటానికి నిశ్చయించుకున్నానని బచ్చనవాల్లింట్లో కాశీ ప్రకటించినప్పుడు, అంతా అతనిష్టమే కాదంటూ, 'మాకు గూడా కులమూ గోత్రం, మంచీ మర్యాదా వున్నా'యంటాడు నారయ్య. పూర్వం, మనుధర్మశాస్త్రం సామాజిక నీతిగా చలామణి జరిగిన రోజుల్లో, ఏ కులస్థురాలినైనా పెళ్ళి చేసుకునే హక్కు విప్రులకుండేది. వర్ణాశ్రమధర్మాల ప్రకారం, తొలుత బ్రాహ్మణస్త్రీని పెళ్ళాడి, ఆ తరువాత ఎంతైనా బరితెగించొచ్చు. బ్రాహ్మ

ణుడు తమ ఆడపిల్లను వివాహం చేసుకోవడం చిన్నకులాలవారు వరంగా భావించేవారు. క్రమేణా పరిస్థితి మారింది. 'ఎవరి కులం వారికి గొప్ప' అనుకునే ఆత్మాభిమానం కిందికులాల్లో మొలకెత్తింది. విజయనగర రాజుల కాలంలో ఆ పరిణామం ఏ దశలో వుండేదో సినిమాలో ఎక్కడా ప్రస్తావించలేదు. చారిత్రిక నేపథ్యం ఎన్నుకున్నప్పుడు, ఇటువంటి మాటలు ప్రవేశపెట్టడానికి అవసరమైన జాగ్రత్తలు ఇక్కడ లోపించినట్టు అగుపిస్తుంది.

సంభాషణను నిశితంగా గమనిస్తే, కాశీకంటే అతని వదినే ఆదర్శంలో మిన్నగా కనిపిస్తుంది. కాశీ కులాంతర వివాహం చేసుకున్న తరువాత అన్న పూర్ణమ్మ అతన్ని చూడాలని వస్తుంది. ఆమె గుండెకోతను తెలుసుకున్న మంజు -

**మంజు: మమ్మల్ని మన్నించండమ్మా.**

**అన్న: మన్నించడానికి మీరు చేసిన మహాపరాధం ఏమీ లేదమ్మా. మనస్ఫూర్తిగా చేసిన మంచిని మానవులు అంగీకరించక పోయినా దేవతలు దీవిస్తారు.**

**మంజు: అమ్మా, మీ గుండెకోత ఇంతవరకు వారి కళ్ళలో కనిపించింది. ఆ పాపమంతా నాది.**

**అన్న: కాదు, కాలానిదమ్మా. అదంతా మరిచిపో. ఇక కాశీ నీవాడు. తన ఆశలూ, ఆశయాలూ అన్నీ నీలో నింపుకున్నాడు. పెంచినా తుంచినా పేరు నీదేనమ్మా. పాతను కాదనడం ప్రతిభ కాదు, కొత్తను ఔనని పించడం గొప్ప. చేసినదానికి సిగ్గుపడకండి. చిత్తశుద్ధిని నిరూపించుకోండి. లక్ష్యసిద్ధిని పొందండి. అంతేనమ్మా నేను కోరుకునేది.**

కాశీ, మంజు ఊరూరు తిరిగి రంగస్థల ప్రదర్శనలిస్తూ జీవనం చేస్తుంటారు. వారు గడించిన పేరు విని, వొకరోజు రాయలవారు మారువేషంలో వచ్చి వారి ప్రదర్శన తిలకిస్తాడు. అందులోని సంగీత, సాహిత్యాలకు ముగ్ధుడై, కాశీని తన ఆస్థానానికి ఆహ్వానిస్తాడు. కాశీని విద్వాంసునిగా గుర్తించి సన్మానం ఏర్పాటుచేస్తాడు. ఇది వరకే ఆస్థానంలో పాతుకుపోయిన కొంతమందికి అది కన్నెర్ర కలిగిస్తుంది. ఇక్కడ మొదలయ్యే సన్నివేశాల్లో చవిచూడాలి ఆత్రేయగారి కలానికున్న పిసలైన పదును.

నర్తకి: జయం మహారాజులవారికి.

ప్రభువు: అమృతా, నిన్న రాత్రి -

న: (నవ్వుతూ) విన్నాను.

ప్ర: ఆ నవ్వులో అంతరార్థం?

న: ఏముంది ప్రభూ, ఇన్నాళ్ళకు విజయనగరాధీశులకు సత్కరించడానికి వీధిభాగవతులు దొరికారుకదాని.

ప్ర: అమృతా, మకుటాన్ని అలంకరించే మాణిక్యంగూడా మట్టిలో పుట్టినదే.

న: కానీ, మట్టిలో వున్నవన్నీ మాణిక్యాలు కావుగా.

ప్ర: మా విచక్షణా శక్తినే శంకిస్తున్నావు.

న: మన్నించాలి. మహారాజుల సన్మానానికి వొక ప్రత్యేకత వుందనీ, అది అమూల్యమనీ భావిస్తున్నాను.

ప్ర: వారి కళ అంతకన్నా అమూల్యమైనదని మేం భావిస్తున్నాం.

న: కాదనలేను. ఆ మాత్రం అర్హత కలవారు మీ సమక్షంలో సంవత్సరాల తరబడి వున్నారు. మీరు వారిని గుర్తించలేకపోగా, ఈ సన్మానంతో అవమానిస్తున్నారని -

ప్ర: అభియోగమా? అమృతా, నీ అభిప్రాయం మేము అర్థం చేసుకున్నాము. నిన్ను మేము గుర్తించడం లేదని -

న: అనుకోవడం అవివేకమా ప్రభూ?

ప్ర: కాదామరి.

న: ఐతే క్షమించండి. అందనిదానికి ఆశించాను.

ప్ర: కాదు. పొందినదాన్ని అందలేదనుకుంటున్నావ్.

న: ఎందుకులెండి సమర్థన. మనసు తెలుసుకోలేకపోయినా, మాటల కర్థం తెలియనంత తెలివి తక్కువదాన్ని కాదు. యోచించక యాచించినందుకు సిగ్గుపడుతున్నాను. కానీ, ఈ సన్మానం సర్వజన సమ్మతం కాదని చెప్పక తప్పదు. సెలవు.

అభ్యంతరాలు అంతటితో ఆగిపోవు; సన్మానసభలో గూడా ఎదురౌతాయి. ఏ వ్యక్తిని కులభ్రష్టునిగా తాను వెలివేశాడో అదే వ్యక్తి ఇంతటి గౌరవం పొందడం మతగురువుకు కంటగింపు కలిగిస్తుంది. ఒక సామాన్యుడిగా

వుండినప్పుడే తనను ఏమాత్రం సరకుచేయని మానవుడు, ఇప్పుడు ఆస్థానపండితుని హోదాకు ఎదిగి, రాజసభలో తన సరసన కూర్చోబోతున్నాడు. రాయలవారుగా ఎస్.వి.రంగారావు, నర్తకిగా రాజసులోచన, మతగురువుగా ముక్కామలతో పాటు చిత్తూరు నాగయ్య, అక్కినేని నాగేశ్వరరావు, మంజుగా అంజలీదేవిగార్ల మధ్యన వొక్కుమ్మడిగా భేటీ జరిగే సన్నివేశమిది.

ప్ర: సదస్యులారా, మాదొక మనవి. పండితులతో, కళాకారులతో జేగీయమానమైన మన సభకు నేడు మేమొక నవీన రత్నాన్ని పరిచయం చేయాలని కుతూహల పడుతున్నాం. పాండిత్యాన్ని పామరజన రంజకం చేసి, ప్రజలను తన సంగీత నృత్యాలతో పరవశింప జేసిన ప్రతిభాశాలి అతడు. పెద్దలెవ్వరు ఆ చిన్నవాని ప్రదర్శన తిలకించి వుండరనే నా నమ్మిక. కాశీనాథశాస్త్రీ -

కా: మహారాజా.

ప్ర: ఈతడే ఆ కళాతపస్వి. కాశీనాథా, నీవు వుండవలసిన స్థానం అది కాదయ్యా. ఇటురా. మా పండితుల సరసన ఆసీనుడివికా.

మ.గు: (వస్తున్న కాశీని ఉద్దేశించి) ఆగు. మహాప్రభూ, ఇతడు తమరు గౌరవింప తగినవాడు కాడు.

ప్ర: కారణం?

మ.గు: కులభ్రష్టుడు. బ్రాహ్మణ్యానికి దూరమైనాడు. యజ్ఞోపవీతాన్ని విసర్జించాడు. కులంనుంచి వెలివేయబడ్డాడు.

ప్ర: ఆచార్యా, మేము సత్కరించునది ఆతని విద్యనూ, కళాప్రతిభను.

న: మహారాజా. ఏమిటా విద్య? ఏమిటా కళాప్రతిభ? వీధిభాగవతాలాడ్డమేనా?

ప్ర: కాదు. ప్రజాబాహుల్యాన్ని పరవశింప చేయడం.

న: బిచ్చగాని పాటలుగూడా మెచ్చుకుంటారు ప్రజలు.

ప్ర: నర్తకీ, మెచ్చుకున్నది మేము.

న: మహారాజుల మనసుకు నచ్చితే మడులూ, మాన్యాలూ ఇవ్వవచ్చు.

ప్ర: మా అధికారానికే హద్దులు తీరుస్తున్నావా?

మ.గు: లేదు మహారాజా, అతని అర్హత ఏమిటో నిరూపించుకోమని కోరుతున్నాం.

కా: మహారాజా, సెలవివ్వండి. ఏ పరీక్షకైనా సిద్ధంగానే వున్నాను.

ప్ర: ఎవరా పరీక్షించేది? ఏమిటా పరీక్ష?

న: పామరలోకాన్ని రంజింప చేసిన ఈ ప్రతిభాశాలి మన పండితులచేత ఔననిపించుకుంటే చాలు.

చక్రవాక, కానడ రాగాలు మేళవించిన అద్భుత సంగీత సాహిత్యాలతో 'రసికరాజ తగువారము కామా' అనే పాటను సభాసదులు వొళ్ళు మరిచి పోయేలా గానం చేస్తాడు కాశీ.

ప్ర: సెభాస్, సంగీతసార్వభౌమా సెభాస్. జయించినావు. పాత్రనెరిగి గౌరవించే విచక్షణ మాకున్నదని పండితులకు నిరూపించినావు. అందుకు మా ధన్యవాదాలు.

ఈ సభాఘట్టం, ముగిసినంత వరకు ప్రేక్షకులకు ఊపిరి సలుపనివ్వదు. ఇక్కడొక చిన్న పొరపాటు దొర్లినట్టు కనిపిస్తుంది. రాగాన్ని గురించి వివరిం చేప్పుడు కాశీ 'కన్నడరాగం' అంటాడు. 'కానడరాగం' అనటానికి మారుగా 'కన్నడరాగం'* అని పొరబాటుగా పలికాడా లేక కన్నడరాగం పేరుతో గూడా ఏదైనా రాగం వుందా? సంగీతశాస్త్రంలో నాకంత ప్రవేశం లేదు.

కాశీ విజయం అసూయాపరులను పగసాధింపుకు ఉసిగొల్పుతుంది.

మ.గు: తన్ను తాను అవమానించుకోవడం, ఇదే తొలిసారి.

న: ధర్మాధికారులు, తమకులేని అవమానమా నాకు?

మ.గు: తలవొంపులకు తరతమ తారతమ్యాలు లేవు. కానీ, నిలబెట్టినా పడగొట్టినా ఆడదానికే తగును. తెలుసా.

శం: ఆ, అది. నిట్టూర్పులో ఆ వేడీ వాడీ వుంటే చాలు. పగబట్టిన త్రాచు పాము రోషం బుసగొట్టడంలోనే తెలుస్తుంది.

న: కానీ, మాటువేసి కాటువేయడం మనుషుల వివేకం.

మ.గు: భళి, బాగా అన్నావ్.

శం: ఎప్పుడు మరి ప్రారంభం?

న: అదనుకోసం ఎదురుచూస్తున్నాను.

మ.గు: అక్కరలేదు నర్తకీ. కొండ చివరి కెక్కినవాడు తలదిరిగి కిందపడటం

---

*'కన్నడరాగం' ఉందని తరువాత వి.ఏ.కె.రంగారావుగారి ద్వారా తెలిసింది.

సులభం. నర్తకీ, వలపన్ను. ఆవల కావలసిన పని మేము చూస్తాం.

న: చిత్తం. తమ ఆశీర్వాదం.

శం: పండో కాయో తెలియజెయ్యాలి.

మ.గు: కాయైనా నీ కడకంటి చూపులకు పండితీరాలి. పద నర్తకీ, విజయీభవ.

బిగువు కోసం కొన్ని మాటలు అదేపనిగా కాయించుకున్నట్టు కనిపించినా, మొత్తానికి రసవత్తరంగా నడిచింది ఘట్టం. కుట్రదారుల పాచిక పారుతుంది. హీరో లొంగిపోతాడు. అతన్ని తాగుడుకు అలవాటు చేస్తుంది నర్తకి. మొదట్లో ఎంత తాగినా మంజును మరిచిపోడు. మంజు కాచుకుని వుంటుంది, తొందరగా ఇంటికి వెళ్ళాలంటాడు.

'అప్పుడేనా, వేసిన పువ్వులు వాడలేదు; పూసిన గంధం మాయలేదు; చిలికిన పన్నీరు ఆరలేదు; పిలిచిన నా కోరికా తీరలేదు' అంటూ నర్తకి అతన్ని పట్టిపెట్టుకుంటుంది.

క్రమంగా తాగుడు ఎక్కువై గాత్రం దెబ్బతింటుంది. ఈ సంగతి రాజుగారి చెవిలో వేస్తాడు మతాధికారి. అతన్ని పిలిపించి ఇప్పుడు పరీక్ష చెయ్యమంటాడు. సభకు రమ్మని కాశీకి కబురంపిస్తాడు రాజు. తాగిన మత్తులో సభకు రాలేక, కాశీ తిరస్కరిస్తాడు. తన ఉత్తరువును ధిక్కరించినందుకు రాజు కోపగించి, అతన్ని బంధీగా తీసుకురమ్మని ఆజ్ఞాపిస్తాడు. మతగురువు, రాజనర్తకి పన్నిన కుట్రకు కాశీ బలయ్యాడని విచారణలో మంజు వెల్లడిస్తుంది. రాజుకు నిజం తెలుస్తుంది. కాశీని క్షమిస్తాడు, కానీ, ఆస్థానంనుండి తొలగిస్తాడు.

తాగుడు కోసం కాశీ ఇంట్లోని వస్తువులన్నీ అమ్మడం ప్రారంభిస్తాడు. చివరకి, సంగీత సార్వభౌముడిగా సత్కరించినప్పుడు బహుకరించిన కిరీటాన్ని సైతం అమ్మేస్తాడు. ఇవన్నీ చెప్పి విశ్వంభరశాస్త్రిని ఎత్తిపొడవటానికి శంభుశాస్త్రి విద్యాపీఠానికి వస్తాడు.

శం: మీ శిష్యరత్నం ఊరు చేరుకున్నాడు విన్నారా? విశ్వాసఘాతకుడు. పాలుపోసిన వ్రేలు కొరికాడు. మహారాజుగారికే ద్రోహం తలపెట్టాడు. సరసుడూ, సహృదయుడూ కనుక మహారాజు మన్నించాడు. కానీ, పాపం కట్టికుడపకుండా వదుల్తుందా. పదభ్రష్టుడై, నీచాతినీచుడై -

గు: శాస్త్రిగారూ

శం: వెళ్ళి చూడండి మీ ముద్దులబిడ్డ ఎలా మురికిగుంటల్లో పొర్లాడుతున్నాడో.

గు: శాస్త్రిగారూ, మురికిగుంటలో పొర్లాడినా ముల్లోక నాయకుడైనా బిడ్డ బిడ్డే. వాడు పతితుడు కావచ్చు, భ్రష్టుడు కావచ్చు, కానీ విద్యా విహీనుడు మాత్రం కాదు. అతడు కళాతపస్వి. నేను ప్రేమిస్తున్నది వానిలోని కళాజ్వాలను, కళంకాన్ని కాదు. అది నా కళ్ళకు కనిపించదు.

శం: ఐతే ఆ తాగుబోతును ఆశ్రమంలో వుంచుకోలేకపోయారూ. విద్యా పీఠాన్ని వొక వెలయాలు విడిది చేయలేక పోయూరా.

గు: శాస్త్రీ. ముల్లును తీసిపారేసి పువ్వును మెచ్చుకోవడం సరసుల లక్షణం.

శం: ఊహూ (అంటూ విసురుగా వెళ్ళిపోతాడు)

విశ్వంభరశాస్త్రి సరస్వతీదేవి విగ్రహం ముందుకు వెళ్ళి -

'తల్లీ. బిడ్డలు దొడ్డవాళ్ళైతే చూచి ఓర్వలేని తల్లివా నువ్వు? కాకుంటే కాశీని ఎందుకిలా పడద్రోశావ్? వాడి పతనంలోగాని నీ ప్రతిభ ప్రజ్వరిల్లదా తల్లీ? కళాకారులకిది కఠోర శాపమా? వద్దు తల్లీ, వాన్ని కాపాడు.'

అని ప్రాధేయపడటం గుండెలను పిండేస్తుంది. చిత్తూరు నాగయ్యగారి మాడ్యులేషన్ శక్తిని వెల్లడించే సన్నివేశమిది. బిడ్డ పతనమయ్యాడనే ఆవేదనను అణువణువులో ప్రదర్శిస్తాడాయన. అంతేగాదు, శంభుశాస్త్రులవంటి అవకాశవాదులు ఎలా వినయాన్ని ప్రదర్శిస్తారో, ఎలాంటప్పుడు విరుచుక పడతారో గూడా ఇక్కడ తెలుస్తుంది. మరో విషయం అక్కడి సరస్వతీ విగ్రహం గురించి - నమ్మకం లేనివారిని సైతం నమస్కరించేలా చేసే ఠీవి, ఆకర్షణ కలిగిన విగ్రహమది. ఇంత హుందాగా వుండే స్వరూపం అరుదుగా కనిపిస్తుంది.

పరిస్థితి చెయ్యి దాటిందని తెలిసి, ఆదుకోటానికి అన్నపూర్ణమ్మ సిద్ధమౌతుంది. కానీ విశ్వనాథశాస్త్రి అనుమతించడు. అమె ఎదిరించి గడప దాటుతుంది. తిరిగొచ్చిన అన్నపూర్ణమ్మను గుమ్మంలోనే అడ్డుకుంటాడు భర్త. ఇంట్లో అడుగు పెట్టొద్దంటాడు. విధిలేక ఆమె, చనిపోడానికి నదిలో దూకుతుంది. కాశీ ఆమెను రక్షించి బ్రతికిస్తాడు. సుఖాంతాలకు పట్టే యాంటీ క్లైమాక్స్ గ్రహణం ఈ సినిమాకూ తప్పలేదు. సౌందర రాజన్ పాడిన ఉద్రేకపూరిత గీతంతో దీని ప్రభావాన్ని అదుపులో పెట్టే ప్రయత్నమైతే

జరిగిందిగానీ, ఆ అరవగొంతు అక్కినేనిగారికి సరిపడక ప్రయత్నం విఫల మైంది.

సీను(scene) మొదలయ్యేప్పుడు ఆ సీనుకోసమే అన్నట్టు పాత్రలు ప్రవేశించడంతో ఈ చిత్రంలో నాటక ఫక్కీ కనబడుతుంది. కొందరు దర్శకులు ఈ పద్ధతిని వొప్పుకోరు. వీలైనంత వరకు, సీను పాత్రల నిత్యకృత్యాలతో మొదలవ్వాలంటారు. ప్రఖ్యాత దర్శకుడు కె.వి.రెడ్డి ఈ విధానాన్ని విరివిగా ప్రయోగిస్తాడు. కథ, మాటలు వ్రాయటంలో పేరుగాంచిన మరో రచయిత డి.వి.నరసరాజు, కె.వి.రెడ్డిగార్ల సమ్మేళనంలో రూపొందిన 'దొంగరాముడు' చిత్రాన్ని పరిశీలిస్తే, అనేక ఇతర విషయాలతో పాటు ఇదిగూడా తెలిసొస్తుంది. మరో విషయం - 'జయభేరి' కథ జరిగిన పరిపాలనాకాలం విజయనగర రాజులదేనని ఎక్కడా చెప్పబడలేదు. కానీ, కళపట్ల ఆ రాజు చూపించిన ఆదరణ, 'విద్యానగర' మనే పేరుగల పట్టణం, బహుశా నాకా అభిప్రాయాన్ని కలిగించి ఉండొచ్చు. పొరపాటైతే క్షమించండి.

# దొంగరాముడు

చిత్రాతిచిత్రమైన గమనంతో సాగే కథ 'దొంగరాముడు.' దీన్ని తీర్చిదిద్దటానికి డి.వి.నరసరాజుగారు అనుసరించిన శిల్పం అద్వితీయమైంది. చిత్రసీమలోనే కాక, దీనికి దీటైన శిల్పం తెలుగు సాహిత్యంలోనే అరుదు. ఏ కథకైనా సాధారణంగా వొక మొదలు, వొక క్లైమాక్స్, వొక ముగింపు వుంటాయి. విశిష్టమైన నవలల్లో రెండుమూడు పర్యాయాలు కథ క్లైమాక్స్‌కు చేరుకోవచ్చు. కానీ, దొంగరాముడు కథ ఎన్నిసార్లు క్లైమాక్స్‌కు తీసుకెళ్తుందో చెప్పలేం. ఏం జరుగుతుందోనని గుండెలు పట్టుకుని ఎదురుచూసేంత ఉత్కంఠ పదినిమిషాలు, వెనువెంటనే గుండెను తేలికజేసేంత సంబరం, ఇలా కథంతా అలల ప్రకంపనంలా సాగుతుంది. మరో దర్శకుని చేతిలో పడకుండా, కె.వి.రెడ్డి చేతిలో పడటం ఈ కథ నోచుకున్న అదృష్టం.

కథానాయకుడి గుణాలన్నీ మంచివే; ఐతే దొంగతనమొక్కటి అలవాటుంది. అందుకని 'దొంగరాముడు' అని పేరు పెట్టారు. ఇదెక్కడి పేరని మొదట్లో అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. అదివరకు 'అగ్గిరాముడు' అనే పేరుతో వొక సినిమా వచ్చింది. ఆ పేరులో పెద్ద చోద్యం కనిపించలేదు. పరస్పర విరుద్ధమైన గుణాలకు ప్రాతినిధ్యం వహించే నామవాచకాలను కలపడంతో ఈపేరు కొంత కలకలం రేపింది. విడుదలైన మరుక్షణమే అఖండ విజయంతోపాటు, తరువాత తయారైన ఎన్నో సినిమాల పేర్లకు 'రాముడు' అనే తోక తగిలించుకునే సంప్రదాయం నెలకొల్పింది ఈచిత్రం.

1955లో అన్నపూర్ణా బ్యానర్ క్రింద నిర్మించిన తొలిచిత్రమిది. దుక్కిపాటి మధుసూధనరావు, అక్కినేని నాగేశ్వరరావు కలిసి ఏర్పాటు చేసుకున్న చిత్రనిర్మాణసంస్థ అన్నపూర్ణా పిక్చర్స్. బాక్సాఫీసుకు కె.వి.రెడ్డి ప్రఖ్యాత దర్శకుడే కావచ్చు, కానీ, కొత్తగా నిర్మాణంలో దిగిన సంస్థ కొత్త తరహా పేరును ఆమోదించడం సాహసమేనని చెప్పొచ్చు. పేరు వినగానే ముఖం నలుచుకున్న చిత్రాన్ని ప్రేక్షకుల ప్రసంశలు పొందేలా చేసిన ఘనత

కథారచయిత నరసరాజుగారికే దక్కుతుంది. సినిమా చూసిన తరువాత, పేరు ఎంత చక్కగా అమరింది అంటూ మెచ్చుకోని ప్రేక్షకుడు లేడు.

కథకు తగ్గట్టు మంచి తారాగణం కుదిరింది. కథానాయకుడుగా అక్కినేని నాగేశ్వరరావు, నాయికగా సావిత్రి, మరో ముఖ్యపాత్రలో జమున, విలన్‌గా ఆర్.నాగేశ్వరరావులు నటించారు. చిన్నచిన్న పాత్రలనుగూడా జగ్గయ్య, రేలంగి, సూర్యకాంతం, హేమలత, వంగర, అల్లు రామలింగయ్య, రామన్న పంతులు వంటి పేరు గాంచిన నటవర్గం పోషించింది. దుష్టపాత్రలో కాకుండా సామాన్యంగా నటించే అరుదైన అవకాశం సూర్యకాంతంగారికి ఈచిత్రంలో దొరికింది. సంగీత దర్శకత్వం పెండ్యాల నాగేశ్వరరావుగారు నిర్వహించారు. జనాన్ని ఉర్రూతలూగించిన 'చిగు రాకులలో చిలకమ్మ' పాట ఇందులోదే.

తెలుగు సమాజంలో మూడు విభిన్న అంతస్తుల్లో జీవించే కుటుంబాలు ఈ సినిమాలో కనిపిస్తాయి. సావిత్రి నటించిన సీత పాత్రది పేదకుటుంబం. పేదరికం అంచుకు చేరిన మధ్యతరగతి కుటుంబం రామునిది. రావుబహదూర్ వీరభద్రయ్యది సంపన్న కుటుంబం. వడ్డీవ్యాపారంతో డబ్బు తిరగేయడం తప్ప చదువూ సంస్కారాలకు ప్రాముఖ్యతలేని కుటుంబం. జగ్గయ్యది సంపాదనతో పాటు చదువు సంస్కారం గల ఉన్నతకుటుంబం. వారివారి ఇళ్ళ తీరులో, నడవడికలో, నాగరికతలో అంతస్తును అనుసరించి చోటు చేసుకునే తేడాల్లో ఆవగింజంతైనా పొరపాటు జరక్కుండా తుదకంటా పట్టుకురావడంలో దర్శకుని ప్రతిభ కనిపిస్తుంది.

రాముని ఎలిమెంటరీస్కూలు చదువుతో కథ మొదలౌతుంది. రాముని చెల్లెలు లక్ష్మిగూడా అతన్తోపాటు చదువుకుంటుంటూంది. చెల్లెలంటే రామునికి వల్లమాలిన అనురాగం. లక్ష్మికిగూడా అన్నంటే ప్రాణం. కానీ, వారిద్దరి స్వభావాలు ఎక్కడా కలవనంత భిన్నమైనవి. రాముడు చురుకైన వాడేగానీ, దుడుకు స్వభావంగల వ్యక్తి. జాలి, దయ వంటి మానవతా గుణాలు ఎన్నున్నా, అవసరమనుకుంటే దేనికైనా వెనుదీయడు. దొంగతనం చేస్తాడు, కప్పిపుచ్చ డానికి అపద్దాలాడుతాడు. చెల్లెలు నెమ్మది మనిషి. పరువుగా బ్రతకాలనే ఆకాంక్ష ఆ లేతవయసులోనే కనిపిస్తుంది. వారి బాల్యాన్ని చిత్రించటానికి తీసిన సన్నివేశాల్లో ఆ రెండు ప్రధానపాత్రల స్వభావాలను వెల్లడించటానికి

రచయిత, దర్శకుడు ప్రతి మాటనూ, ప్రతి చేతనూ వినియోగించుకున్న తీరు అబ్బురపాటు కలిగిస్తుంది.

బడికి సక్రమంగా రాడనీ, తోటల్లో దూరి దొంగతనం చేస్తాడనీ, తోటి విద్యార్థులమీద రౌడీతనం చెలాయిస్తాడనీ రామునికి బండకొయ్య తగిలిస్తాడు బడిపంతులు. కొయ్యను మోసుకుంటూ ఇంటికి తిరిగొస్తూంటే మిగతా పిల్లలంతా నవ్వుకోవడం లక్ష్మికి నామోషీగా వుంటుంది.

**రా: అదేం లక్ష్మీ, బండకొయ్య నాకేస్తే నీకెందుకు దిగులు?**

**ల: ఏమో అన్నయ్యా. నీకదేస్తే నాకు బాగుండదు. పిల్లలంతా నిన్నుచూసి నవ్వుతున్నారు.**

**రా: నవ్వుతున్నారూ? ఎవడా నవ్వేది? తంతాను. ఎవఁడ్రా నవ్వేది? రేయ్ ఇలా రారా, నువ్వేరా (కొయ్య వాని భుజానికెత్తి) అయిందా పెళ్ళి. కాకపోతే నవ్వుతావ్. నవ్వండ్రా, ఇప్పుడు నవ్వండి. ఊఁ నవ్వండి.**

**ల: ఐనా ఎందుకన్నయ్యా ఎప్పుడూ అల్లరిచేస్తావ్. రోజూ బళ్ళోకొచ్చి చక్కగా చదువుకుంటే మాస్టారు బండకొయ్య ఎందుకేస్తాడు చెప్పు.**

**రా: హు, వెధవ బండకొయ్య. దీందేముంది. ఇంటికెళ్ళగానే చూస్కో, దీన్ని మంత్రం వేసి మాయం చేసేస్తాను. . ఆ. పద.**

చిన్నతనంలో రాముడుగా నటించిన చిరంజీవి వర్మ పాత్రపోషణ అద్భుతంగా వుంది. ఆ పాత్రకు తగిన కరుకు, చలాకితనం, కట్టుకథలతో ఎదుటివాళ్ళను వశపరుచుకునే చాతుర్యం మొదలైన ప్రతి అంశాన్నీ నొక్కి బోకుండా ప్రదర్శించాడు. ఇంటికెళ్ళగానే తేలు కుట్టినట్టు నటిస్తాడు రాముడు. మంత్రం వెయ్యటానికి మాస్టారు వస్తాడు. చదువు చెప్పటమొక్కటేగాదు, ఆనాటి బడిపంతుళ్ళకు మంత్రం వెయ్యడం, వైద్యం చెయ్యడం, పెళ్ళి పెత్తనాలు మాట్లాడడం వంటి సకల వ్యాపకాలూ వుండేవి. సకల విద్యలతో మెప్పించగలవాడే సిసలైన బడిపంతులని ఆనాటి పల్లెవాసుల నమ్మకం. అచ్చమైన పల్లెటూరి పంతుల్లా ఆపాత్రలో వంగర ఇమిడిపోయాడు. మాటకు ముందు 'నా బొంద' అనటం పంతులు ఊతపదం. ఆ ఊతపదాన్ని రకరాలుగా పలకడంలోనే వంగరగారి నేర్పు వెల్లడౌతుంది.

దీపావళికని తెచ్చి ఆరబెట్టిన టపాసులకు పొరపాటున నిప్పంటుకుని

వొక్క సారిగా ప్రేలిపోతాయి. పిల్లలు వాటిలో చిక్కుకున్నారనే భయంతో రాముని తల్లికి గుండెపోటొచ్చి పడిపోతుంది. అదివరకే గుండెజబ్బున్న మనిషి కాబట్టి జబ్బు మరింత పైకొంటుంది. దానికి తగిన 'ఘట్టి' ఆయుర్వేదం మందు మాస్టారు దగ్గర లేదు. తీసుకురావటానికి చీటీ రాయించి, రామున్ని టౌనుకు పంపుతాడు. ధరలను అదుపు చేయలేని అసమర్థత ప్రభుత్వానికి 1955కు ముందే వచ్చేసింది. నిన్నటి ధర ఈరోజుండదు, ఈనాటి ధర రేపుండదు. రామునికి కావలసిన మందుకు ధర పెరిగింది. అతని దగ్గర డబ్బు చాలినంత లేదు. తరువాత తెచ్చిస్తానని ఎంత బ్రతిమాలినా అంగడి యజమాని వినుకోడు. వీధిన పడి రాముడు దారినపోయేవాల్లందరినీ దీనంగా అడుక్కుంటాడు. ఏవొక్కరు కనికరించరు. ఒక మనిషి చేతులో పర్సును లాక్కొని రాముడు పారిపోటానికి ప్రయత్నిస్తాడు. వీలుపడక పోలీసులకు చిక్కుతాడు.

రాముడు మందు కొనటానికి వెళ్ళింది వొక ఆయుర్వేదమందుల షాపు. అక్కడ మరొక కొనుగోలుదారుడు వుండకపోవడం, కూనిరాగాలతో పుస్తకం చదువుకునే ఆ షాపు యజమాని వాలకం - మొదలైన వాతావరణ మంతా నిరాదరణకు గురౌతున్న ఆయుర్వేద వైద్యానికి ప్రతీక. ర్యాక్‌లోనుండి మందుసీసాను తీసి పట్టుకొచ్చేముందు ఆషాపు యజమాని దానికి పట్టిన దుమ్మును నోటితో ఊదేయడం హైలైట్.

తల్లి ఆరోగ్యం ప్రమాదంలో వుందనే దిగులు రాముణ్ణి తెగించేలా చేస్తుంది. మూత్రం పోయడానికని మరుగుదొడ్లో దూరి, పోలీసుల కన్నుగప్పి, గోడదూకి పారిపోతాడు. ఒట్టి చేతులతో ఇంటికి తిరిగొచ్చిన రామునితో మందు తక్షణం కావాలంటాడు పంతులు. 'ఇప్పుడెందుకులే నాయనా' అంటూ తల్లి వారించినా వినకుండా రాముడు మిగతా డబ్బుకోసం తల్లి తలదిండు కింద తారాడుతాడు. డబ్బు వుండదు. తల్లి ఎందుకు వద్దందో అతనికి అప్పుడు అర్థమౌతుంది. మిగతా డబ్బులు మాస్టారు జేబి నుండి తీసిచ్చి వెంటనేవెళ్ళి మందు తీసుకురమ్మంటాడు. డబ్బును తలగడకింద దాచుకునే మధ్యతరగతి అలవాటును ఇక్కడ దర్శకుడు వాడుకోవడం గమనార్హం.

పారిపోయిన రామునికోసం గాలిస్తున్న పోలీసులు అతన్ని గుమ్మంలోనే

అటకాయిస్తారు. జబ్బుతో మంచంమీదున్న తల్లి ఎంత ప్రాధేయపడినా జాలిచూపరు. పంతులు ఎంత సర్దిచెప్పినా ఖాతరు చెయ్యకుండా రాముణ్ణి లాక్కెలతారు. మానసికంగా తట్టుకోలేని అతని తల్లి చనిపోతుంది. కూతురును మాస్టారు చేతిలోపెట్టి చనిపోతుంది. దిక్కులేని ఆడపిల్లపట్ల బాధ్యత మరువ కుండా, ఆఅమ్మాయిని మాస్టారు వొక అనాధశరణాలయంలో చేర్పిస్తాడు.

రామునికి శిక్ష పడుతుంది. బోస్టన్‌స్కూలుండే జైలుకు పంపిస్తారు. వయసొచ్చిందాకా రాముడు జైల్లోనూ, లక్ష్మి అనాధాశ్రమంలోనూ పెరుగుతారు. పిల్లలు పెరిగినట్టు కథలో చెప్పినంత తేలిగ్గా తెరమీద చెప్పడం కుదరదు. చిన్నతనంలో చూపించే నటుడు వేరు, పెరిగిన తరువాత చూపించే నటుడు వేరు. ఆపాత్రే ఇది అని చూపటానికి దర్శకులంతా డిసొల్యూషన్ తంత్రాన్ని(dissolve technique ను) ఉపయోగిస్తారు. అంటే, చిన్నపిల్లలుగా తెరమీద కనిపించే బొమ్మ క్రమంగా పలుచబడి కనుమరుగౌతుండగా, పెరిగిన వయసులో వున్న పాత్ర అదే స్థానంలో లీలగా మొదలై ఘనీభవిస్తుంది. ఈ చిత్రంలో కె.వి.రెడ్డి మరో కొత్త టెక్నిక్ ప్రవేశపెట్టాడు. కారు ఇంజను రిపేరు జేసే వొక చేతిని క్లోజప్‌లో చూపిస్తూ, మెల్లిగా కెమెరాను ఆమనిషి ఆకారం పూర్తిగా కనిపించేదాకా లాక్కెళతాడు. దగ్గరగా చేతిని చూపించినప్పుడు దానిమీద 'రాముడు' అనే పచ్చబొట్టు వుండటం కనిపిస్తుంది. మనిషి పూర్తిగా కనిపించగానే, ఆ చెయ్యి అక్కినేని నాగేశ్వరరావు నటించిన రాముని పాత్రదని తెలిసిపోతుంది. బాగానేవుందిగానీ, ఈ రాముడే మనం చిన్నప్పుడు చూసిన రాముడని గుర్తేమిటి? ఉంది. ఆ గుర్తింపుకు ఏర్పాటు ఎప్పుడో జరిగిపోయింది. జైల్లో పెట్టేముందు ఖైదీ శరీరం మీదుండే రెండు మూడు గుర్తింపు కనమలను(identification marks ను) నమోదు చోసుకోవాలని నిబంధన వుంది. ఆసందర్భంలో రాముని చేతిమీద ఈ పచ్చబొట్టుందనే విషయం చప్పుడుకాకుండా అదివరకటి సీనులో జొప్పించాడు దర్శకుడు.

సీను మొదలుపెట్టడానికి కె.వి.రెడ్డి అనుసరించే పద్ధతిని ఈచిత్రంలో మనం ప్రత్యేకంగా గమనించాలి. నాటకంలో డైలాగులు చెప్పటానికి అదేపనిగా ప్రవేశించే పాత్రల్లా కనిపించవు ఆయన సినిమాల్లో పాత్రలు. సాధారణ జీవితానికి సంబంధించిన ఏదోవొక పని చేసుకుంటూ వుండగా సన్నివేశాన్ని

ప్రారంభిస్తాడు. దీనివల్ల కథ నాటకంలా గాక, అచ్చం జీవితంలా నడుస్తుంది. పెరిగి పెద్దైన రాముణ్ణి ప్రవేశపెట్టేందుకు కారు రిపేరు చేస్తున్న రామునితో సీను మొదలౌతుంది. ఈ కారు రిపేరు తతంగంతో తరువాతగూడా కొంత అవసరముంది. ఈ నైపుణ్యంతోనే అతడు జగ్గయ్య దగ్గర మెప్పుపొంది, ఉద్యోగం సంపాదించుకుంటాడు. సుదూరంలో రాబోయే సంఘటనలకు అవసరమైన బంధనాలు (Linking) ముందే పొందుపరచడంలో కె.వి.రెడ్డిది ఆరితేరిన హస్తం.

నరసరాజుగారి సున్నిత హాస్యాన్నిగూడా ఈ సందర్భంలో మనం ఆస్వాదించొచ్చు. ఇంజను రిపేరుజేసి ట్రయల్ చూస్తున్న రామునికి సూపరెండెంటు పిలుస్తున్నట్టు కబురొస్తుంది. రాముడు ఆయన దగ్గరికెళ్ళి 'ఐ మేక్డిట్ ఆల్‌రైట్ సర్' అని బట్లర్ ఇంగ్లీషులో అంటాడు. ఇది వొట్టి జోకుగాదు, రాముని మనోభావాలకు ప్రతిరూపం. డాంబికంగా కనిపించాలనే అతని తపనను వెల్లడిస్తుంది. ఇంగ్లీషులో మాట్లాడటం నాగరికతకు లక్షణమనీ, సంస్కృతం విరివిగా వాడటం పాండిత్యానికి గీటురాయనీ భావించే మనుషులు మనకు ఇప్పుడుగూడా అక్కడక్కడ తగులుతుంటారు. హెచ్చుల కోసం రాముడు వచ్చీరాని ఇంగ్లీషు మాట్లాడినట్టే, బడిపంతులు సంస్కృతం వాడే ఛలోక్తి మరొకచోట కనిపిస్తుంది. లక్ష్మిని అనాధశరణాలయంలో చేరుస్తూ, తన చిరునామా చెప్పవలసి వచ్చినప్పుడు, ఊరిపేరు 'జంబూకరంధ్రాపుర అగ్రహారం' అంటాడు. తెల్లబోయి చూసిన మేనేజరుకు 'దాన్నే నక్కబొక్కల పాడు అంటారులెండి' అని తెలుగులోకి తర్జుమాచేసి చెబుతాడు.

శిక్ష ముగించుకుని స్వగ్రామానికి వచ్చిన రామునికి తల్లి చనిపోయిందని తెలుస్తుంది. చెల్లెలి విషయం విచారించగా ఎక్కడో అనాధశరణాలయంలో చేర్చినట్టు తెలుస్తుంది. ఏ శరణాలయమో, ఏ వూర్లోవుందో తెలుసుకోటానికి బడిపంతులు లేడు. ఆయన ఏఊరికి బదిలీ అయ్యాడో గ్రామస్తులకు తెలియదు. చెల్లెలిని వెదుక్కుంటూ రాముడు శరణాలయాలవెంట పడతాడు. ఆ అన్వేషణలో అతడు అనేక పట్టణాల మధ్య బాటసారౌతాడు.

కె.వి.రెడ్డి చిత్రాల్లో ప్రయోగించబడే కొన్ని మాటలు జనాన్ని పట్టుకుంటే వొక తాయాన వదలవు. పాతాళభైరవి సినిమాలో 'గురూ' అనే

పదం ఇందుకు ఉదాహరణ. కోస్తాజిల్లాల్లో దాదాపు ఇరవై సంవత్సరాలపాటు ఏనోట విన్నా అదే సంబోధన. రిక్షావాలానుండి హాస్టల్‌వాలాదాకా ప్రతివొక్కరూ పరస్పరం 'గురూ' అని పిలుచుకునే వాళ్ళు. దొంగరాముడులో 'గ్యాస్' అనే మాటగూడా అలాటిదే. అపద్ధానికి మారుపేరుగా వాడిన ఈ పదం ఇప్పటికీ విస్తృతంగా వాడుకలోవుంది. రచయితలకు దర్శకుడు చెప్పి ఇలాటివి రాయించుకుంటాడో, రచయితలే దర్శకునికి సలహా ఇస్తారో తెలీదుగానీ, కె.వి.రెడ్డి సినిమాల్లోనే ఇవి కనబడతాయి.

దారిలో వెలుతున్న రామునికి చిన్నపిల్లవాడి రోదన వినిపిస్తుంది. ఎక్కడని వెదకగా, మోరీకింద దొంగొకడు ఎవరో పిల్లవాడి నగలు వొలుచు కోవాలని ప్రయత్నిస్తుంటాడు. రాముడు దొంగమీద కలబడతాడు. ఇంతలో నలుగురూ ప్రోగయ్యేసరికి పిల్లవాణ్ణి వదిలేసి దొంగ పారిపోతాడు. ఆ పసి పిల్లవాడు రావుబహుదూరు వీరభద్రయ్య కొడుకుగా ఆ ఊరివాళ్ళు గుర్తిస్తారు. పిల్లాణ్ణీ, రామునీ్న భద్రయ్య దగ్గరికి తీసుకెల్తారు. ఈ సన్నివేశంద్వారా రెండు కొత్తపాత్రలు పరిచయమౌతాయి. ఆర్.నాగేశ్వరరావు నటించిన విలన్‌పాత్ర ఆ దొంగ. రేలంగి వెంకట్రామయ్య నటించిన భద్రయ్య తదుపరి సీనులో కనిపించబోయే రావుబహుదూరు. అవసరానికి దొంగతనం చేసే వ్యక్తి రాముడైతే, దొంగతనమే వృత్తిగాగలది అర్.నాగేశ్వరరావు నటించిన బాబులుపాత్ర. రేలంగి నటించిన భద్రయ్యకు 'పీనాసి బద్రయ్య' అని మారుపేరు.

తెరమీదికి పాత్రలను ఎక్కించే విధానంలో కె.వి.రెడ్డి స్క్రీన్‌ప్లే అద్వితీయమైన చాకచక్యం ప్రదర్శిస్తుంది. కొత్తపాత్ర రంగంలో ప్రవేశిస్తు న్నట్టు ప్రేక్షకులకు పట్టివ్వనంత సాఫీగా, సహజంగా అది జొరబడిపోతుంది. అంతేగాదు, ఆపాత్ర స్వభావంగూడా వీలైనంతవరకు పరిచయంలోనే తెలిసి పోతుంది. లక్ష్మీదేవి పటానికి మొక్కుకుంటున్న భద్రయ్యతో సీను మొదలౌ తుంది. వడ్డీవ్యాపారస్తుని ఇలవేల్పు లక్ష్మిదేవిగాక వేరెవరుంటారు?

**భ: అమ్మా శ్రీమహాలక్ష్మీ, మా అబ్బాయి ఎక్కడో తప్పిపోయాడు నీకు తెలుసుగా. వాణ్ణి భద్రంగా, వొంటిమీది సొమ్ములతో సహా, మా ఇంటికి పంపించు. పంపిస్తే, నీకూ . . . ఏం చేయించను, . . ఆ . . ఆకుపూజ చేయిస్తాను.**

భార్య: (పటం దగ్గరికొచ్చి) అమ్మా శ్రీమహాలక్షుమ్మతల్లీ ..

భ: నేను ముక్కుకున్నాను చాల్లేవే. నువ్వుగూడా ఎందుకు?

భా: అబ్బా ఉండవయ్యా. తల్లీ, మమ్మల్ని దయచూడమ్మా. మాబిడ్డ మాకు దక్కితే వందమంది బ్రాహ్మలకు వనసంతర్పణ చేయిస్తా తల్లీ.

భ: ఆ . . వనసంతర్పనే. ఎందుకు దండగ. అమ్మవారికి ఆకుపూజే ఎక్కువ ఇష్టం. వనసంతర్పనైతే వాళ్ళెవల్లో తినిపోతారు. ఆకుపూజైతే నేరుగా అమ్మవారికే ముడుతుంది. . . . . అమ్మాతల్లీ, దాని మాటలకేంలే. ఆకుపూజే ఖాయం.

లక్ష్మిదేవితో బేరాలాడడంలోగూడా పక్కా వ్యాపారస్తుని ధోరణి వీసమెత్తు తగ్గలేదు. అంతలో అబ్బాయిని తీసుకొచ్చిన మనుషులు 'ఇడుగోనండీ మీ అబ్బాయి' అని అప్పగిస్తారు. భద్రయ్య మురిసిపోతూ భార్యను పిలిచి -

భ: అన్నట్టు, సొమ్ములన్నీ ఉన్నాయా. చూడు చూడు ఏమేమున్నట్టో.

భా: (విసుగ్గా) ఉన్నాయిలే వుండవయ్యా గోల.

భ: అన్నట్టు అమ్మకు చూపించు, తొందరపడి చచ్చుతుందేమో. అన్నట్టు చెంచయ్యా, మా అబ్బాయి ఎక్కడ దొరికాడు?

చెం: ఇడుగో ఇతనే మీ అబ్బాయిని రక్షించాడు. ఎవడో దొంగ ఊరిబయటికి తీసుకెల్లి పిల్లవాడి నగలు వొలుచుకుంటున్నాడట. అప్పుడు ఈ అబ్బాయి చూసి వాడిమీద కలబడ్డాడు. అంతలోకి మేమొచ్చాం. మమ్మల్ని చూసి ఆ దొంగ అదే పరుగు. పాపం ఇతడు వెంటపడ్డాడుగానీ దొరకలా.

భ: నాయనా, దేవుడిలా వచ్చి నా బిడ్డను కాపాడావ్. నీ రుణం ఎలా తీర్చు కోగలం?

చెం: మీరిస్తానన్న నూటపదహార్లు, పాపం, ఈ కుర్రాడికి ఇప్పించండి.

భ: నూటపదహార్లా! పిచ్చివాడా. ఇతడు చేసిన మేలుకి నూరులక్షలిచ్చినా రుణం తీరుతుందా? ఇదిగో అబ్బాయ్, డబ్బుదేముంది వెధవ డబ్బు. ఈవాళొస్తుంది రేపు పోతుంది. మాట శాశ్వతంగా వుంటుంది. నీ మేలు నేను చచ్చిందాకా మరిచిపోతాననుకున్నావా? మరువను.

భద్రయ్య స్వభావాన్ని పిండారబోసినట్టు ఆరబోశాడు రచయిత. ఈ

గొడవ మధ్యలో భద్రయ్య కూతురు హార్మోనియం మీద 'ఎంత ఘాటు ప్రేమయో' అనే పాటను ప్రాక్టీస్ చేస్తుంటుంది. ఆ కేకలకు బేజారెత్తిన భద్రయ్య 'ఆపుతావా, హార్మోనియం అమ్మిపారేయమంటావా' అని కేకలేస్తాడు. అంత విసుగులోగూడా 'అవతల పారే యమంటావా' అనే గద్దింపు అతని నోటివెంట పొరబాటున పలకదు.

భద్రయ్యను పిసినారిగా నిరూపించటానికి రచయిత వొకవైపు కమ్ముకొస్తే, దర్శకుడు మరోవైపునుండి కమ్ముకుంటాడు. ఒకరోజు నిద్దురలో వుండగా భద్రయ్యకు దప్పికౌతుంది. మంచం పక్కనే వున్న కూజానుండి నీళ్ళు వంచుకుంటాడు. లోటా (టంబ్లర్) నిండుకూ నీళ్ళు వంగుతాయి. కానీ, అతని దప్పికకు సగం చాలు. సగం తాగి, అందరిలా మిగతావాటిని విసిరి పారెయ్యడు. తాగకముందే ఎక్కువ వంగిన సగాన్ని కూజాలోకి మార్చేస్తాడు. అతడు పడుకోవడంగూడా ఇనప్పెట్టె దగ్గరే. ఇనప్పెట్టెకు తలాపుజేసి మంచం వేసుకుంటాడు. నిద్రలో పాటు పొర్లేటప్పుడు ఇనప్పెట్టె గడియను ఊతగా పట్టుకుని పొర్లుతాడు. మరో సన్నివేశంలో భద్రయ్య ప్రయాణానికి సిద్ధమౌతుంటాడు. అది ఆపాలని, రాముడు అతని కోటులో తేలును విడుస్తాడు. భద్రయ్య కోటు తగిలించుకుని, నోట్లో వేసుకోటానికి వక్కపొడి అందుకున్న తరువాత తేలు వీపున కుడుతుంది. అంత బాధలోను వక్కపొడిని నేలమీద వదిలెయ్యడు భద్రయ్య. భరిణెలో వేసి తరువాత బాధపడతాడు.

తల్లీతండ్రీ లేనివాడినని చెప్పి, భద్రయ్య దగ్గర జీతంలేని నౌకరుగా చేరిపోతాడు రాముడు. తల్లీతండ్రీ లేనిమాట నిజమేగానీ, ఆ సాకుతో సాను భూతి సంపాదించేంత చిరువయసుగాదు రామునిది. దానికంటే, 'నా అన్న వాళ్ళు లేనోన్నండీ' అంటే బావుండేది.

కూరగాయలమ్ముకునే సీత అనే అమ్మాయిని రౌడీ బాబులు బజార్లో అల్లరి పెడుతూంటే రాముడు అటకాయిస్తాడు. ఇద్దరి మధ్య పోరు జరుగుతుంది. బాబులుగా నటించిన అర్.నాగేశ్వరరావు ఆజానుబాహుడు. దిట్టంగా వస్తాదులా వుంటాడు. అక్కినేని నాగేశ్వరరావుది చిన్న విగ్రహం. కథ ప్రకారం హీరోనే గెలవాలి. ఇందుకోసం ఆ ఫైటింగ్‌ను సరికొత్త బాటలో రూపొందించారు.

రాముని చురుకుతనం బాబులు కండబలంమీద దెబ్బతీసేలా డిజైన్ చేశారు. హీరోతో విలన్ కలబడటం ఇది రెండవ సారి. రెండు తడవలూ బాబులు ఆట సాగదు. తరువాత, రాముణ్ణి చూస్తేనే బెదురుకునే 'ఈక తక్కువ' కోడిలా తయారౌతాడు బాబులు. సీతారాముళ్ళమధ్య క్రమంగా చనువు పెరుగుతుంది.

భద్రయ్య కూతురుకు వొక పెళ్లిసంబంధం తీసుకుని బడిపంతులు అతని ఇంటికొస్తాడు. ఆ సమయంలో రాముడు ఇంట్లో వుండడు. తిరిగి వెళ్ళేప్పుడు దారిలో కలుసుకుంటాడు. ఆయన్నడిగి చెల్లెలు అడ్రసు తెలుసుకుంటాడు. ఆ శరణాలయం ఇదివరకు తను గాలించిందే. 'నీ బొంద. నీ అవతారం, నీ ఆకతాయితనం చూస్తే నీకెవడైనా సరైన సమాధానం చెబుతాడూ' అంటాడు పంతులు. ఈసారి మరో పద్ధతిలో వెళ్ళటానికి రామున్ని అది ప్రేరేపిస్తుంది.

భద్రయ్యకూతురి పెళ్ళిచూపుల ప్రహసనం తెరమీద చూడాలేతప్ప మాటల్తో చెబితే మజావుండదు. అది హాస్యం కోసం కల్పించిందా? ఔను, హాస్యం కోసమే. ఐనా, అది కొన్ని కుటుంబాల సాంప్రదాయానికి ప్రతిబింబం. పెళ్ళికావలసిన అమ్మాయికి సంగీతం వచ్చివుండాలనే అభిప్రాయం ధనికకుటుంబాల్లో ఇదివరకు బాగా వ్యాప్తిలో వుండేది. హార్మోనియం మీదనో, ఫిడేలు మీదనో అదే పనిగా సంగీతం నేర్పించేవారు. పెళ్ళిచూపుల్లో అమ్మాయిని పాడమని అడగటంగూడా ఆచారంగా వుండేది. పాటపాడే గొంతు వేలల్లో వొకటికి మించదు. ఆచారంకోసం ప్రతి ఆడపిల్లతో పాటలు పాడిస్తే ఎంత దుర్భరంగా వుంటుందో చూపించే ఈ సన్నివేశం కడుపు చెక్కలయ్యేలా నవ్విస్తుంది.

చెల్లెలిని చూడటానికి అనాధశరణాలయం వెళ్ళాలి. కానీ ఎలా? ఇతరులతో ఆలోచించడం, సలహాలు తీసుకోవడం రామునికి అలవాటులేనిపని. విపరీతమైన ఆత్మవిశ్వాసం కలిగిన ప్రవృత్తి అతనిది. ఆ ప్రవృత్తిని నిరూపించే పునాదులను కథలో ఇదివరకే పొందుపరిచారు. లక్ష్మి భవిష్యత్తు గురించి బెంగపడే తల్లితో, 'లక్ష్మిని బాగా చదివించి, మంచి మొగణ్ణి తెచ్చి పెళ్ళిచేస్తా' నంటాడు రాముడు. 'ఏమో నాయనా, ఎలా రాసుందో' అంటూ తల్లి

నిరుత్సాహపడితే, 'ఎలా రాసుండడమేమిటమ్మా, నేను చెబుతుంటే' అంటాడు ధీమాగా. మరో సందర్భంలో, తన పరిస్థితి తలుచుకుని సీత కన్నీరు పెట్టుకుంటుంది. 'పక్కన రాములవారుండగా అలా జారిపోతావేమిటి? పాతాళభైరవి సినిమా చూశావా? ఏమన్నాడు మా బ్రదర్ తోటరాముడు? ధైర్యే సాహసే లక్ష్మీ అన్నాడు' అంటూ ఓదార్చుతాడు.

అనాథశరణాలయంలో పనిజరిగే పథకాన్ని స్వయంగా ఆలోచిస్తాడు. అద్దె సూటు తగిలించుకుని అక్కడికి వెల్తాడు. కోటీశ్వరుణ్ణని కోతలు కోస్తాడు. చెల్లెలు కాలేజిలో చేరటానికి కావలసిన ఫీజు వెంటనే పంపుతానని హెడ్మిస్ట్రెస్ జమునాబాయమ్మతో చెప్పి బయటపడతాడు. శరణాలయం మేనేజరు సీతారామయ్యగా నటించిన అల్లు రామలింగయ్య నటనాకౌశల్యం ఎవరికి తెలియనిది? అది అత్యున్నత శిఖరం చేరిన ఘట్టం ఇక్కడుంది. అతడు ఏడుగురు ఆడపిల్లల తండ్రి. రాంబాబు, అంటే సూటూ బూటులో వున్న దొంగరాముడు, పెళ్ళికావలసిన కోటీశ్వరున్నని చెబితే నమ్ముతాడు. విదేశాల్లో వ్యాపారం చేస్తున్నా, భారతీయ పడుచునే పెళ్ళాడుతాననీ, అందులోనూ పేదపిల్లనే ఎన్నుకుంటానని అతడు చెప్పిన ఆదర్శానికి ఉబ్బిపోతాడు. సరిగ్గా ఆ సమయంలో అతని పెద్దకూతురు క్యారియర్ ఇచ్చిపోటానికి అక్కడికొస్తుంది. ఆ అమ్మాయిని చూపులతోనే రాంబాబుకు పరిచయంచేసే తీరు వొక్క అల్లుగారికే చెల్లు. ఆ చూపులో ఎన్నివేల ఆశలో! దాంట్లో రవ్వంత వెకిలి తనంగూడా కలిసుంటుంది. ఆ వెకిలితనంలో పడుపువృత్తి నడిపే బ్రోకరు ప్రవర్తన ఛమక్కుమంటుంది. సంస్కరణకు నోచుకోని సమాజంలో ఆడపిల్లల తండ్రికీ, ఆడపిల్లల బ్రోకరుకూ ఆట్టే తేడా వుండదని తెలిపే ఆ చూపు గుండెలను పిసికేస్తుంది.

రాముని చిన్ననాటి వొక సన్నివేశంలో, అమ్మ అన్నం తినటానికి రామున్ని పిలుస్తుంది. 'నాకు ఆకలి కాలే'దంటాడు. 'నువ్వు రావే' అని లక్ష్మిని పిలుస్తుంది. 'నాకూ ఆకలి కాలే'దంటుంది లక్ష్మి. 'ఆ . . నువ్వూ నేర్చుకుంటున్నావ్' అనే తల్లి మాటలో 'ఆ' అంటూ హేమలత తీసే దీర్ఘంలో మాడ్యులేషన్ గమనించతగ్గది. ఆ దీర్ఘంలోని సహజదనమే హేమలత. మరో సన్నివేశంలో, బాబులు డబ్బు కావాలని భద్రయ్య దగ్గరికొస్తాడు.

'అబ్బే, డబ్బులేవురా' అంటాడు భద్రయ్య. పాత్రస్వభావాన్ని జీర్ణించుకొని పలికిన ఆ మాడ్యులేషనే రేలంగి వెంకట్రామయ్య.

బడాయి ప్రదర్శించటమేగానీ, రాముని దగ్గర డబ్బెక్కడుంది? 'ఉన్నట్టుండి మూడువందలు కావాలనుకో, ఎట్టా దొరుకుతుంది?' అని సీతను అడుగుతాడు. అతడు సలహా ఆశించిన మొట్టమొదటి సందర్భం ఇదే. సీతతో ఏర్పడిన సాన్నిహిత్యమేగాక, సీతమీద అతని నమ్మకాన్నీ ఇది తెలుపుతుంది. 'మనందరినీ కలిపి అమ్మినా రాదు' అంటాడు అక్కడేవున్న సీత తండ్రి. గుట్టు బయటపడేంత లోతుకు దిగకుండా రాముడు మాటలు దాటేస్తాడు. దొంగతనం చేయవలసిన అవసరం రామునికి మరోసారి ఎదురైంది. ఆరాత్రి, భద్రయ్య ఇంట్లో, ఆడవాళ్ల అల్మారాలోవున్న డబ్బును కాజెయ్యాలని తంటాలు పడుతుంటాడు. సరిగ్గా అదే సమయానికి, అదే పనిమీద, బాబులు ఆ ఇంట్లో దూరుతాడు. ఈసారి ఇద్దరిమధ్యా తగాదా జరగదు. గుట్టుగా భాగాలు పంచుకుంటారు. డబ్బులో సగం బాబులుకిచ్చి, పట్టుచీరె, నగతో సహా మిగతా సొమ్మును రాముడు ఉంచుకుంటాడు. వాటిని చెల్లెలికి చేరుస్తాడు.

శరణాలయం వార్షికోత్సవానికి భద్రయ్యను పిలవాలని వచ్చిన జమునా బాయి రాంబాబును గురించి వారికి చెప్పి, భద్రయ్య కూతురుకు ఆ సంబంధం కుదిరిస్తానని భరోసా ఇస్తుంది. వార్షికోత్సవానికి వస్తే రాంబాబును చూసుకోవచ్చని చెబుతుంది. వెళ్ళటానికి భద్రయ్యదంపతులు సిద్ధమౌతారు. వారు వెళితే కొంపలంటుకుంటాయని రామునికి తెలుసు. లక్ష్మి ఆ పట్టుచీర కట్టుకుంటుంది. నెక్లెస్ వేసుకుంటుంది. వీళ్ళు గుర్తుపట్టి గొడవ చేస్తారు. లక్ష్మి భవిష్యత్తు పాడౌతుంది. ఆ ప్రయాణం ఎలాగైనా ఆపాలని చూస్తాడు రాముడు. భద్రయ్య కోటులో తేలునుగూడా విడుస్తాడు. కానీ ప్రయాణం ఆగదు. చివరకు రాముడు ఊహించినట్టే జరుగుతుంది. లక్ష్మి వీధుల పాలౌతుంది. సంబరాల రాంబాబు చెరసాలపాలౌతాడు. చెల్లెల్ని గురించి పీడకలలు కంటూ జైల్లో వుండిపోతాడు.

తెరమీద ఇక లక్ష్మి కథ మొదలౌతుంది. రాముడు జైల్లోవున్న తెరపి (Gap)ని లక్ష్మి కథ డెవలప్ చెయ్యటానికి స్క్రీన్‌ప్లేలో చోటుచేశారు.

పరువుపోయిన చోట నిలువ లేక లక్ష్మి శరణాలయంనుండి చెప్పకుండా పారిపోతుంది. గాలివాననుండి తలదాచుకోటానికి వొక ఇంటి వసారాలో చేరుతుంది. అది రౌడీబాబులు నివాసం! బాబులు ఇంట్లోనే వున్నాడు. ఆమెను లోపలికి రమ్మని మర్యాదస్తుడిలా పిలుస్తాడు. లోపలికి చేరినవెంటనే తలుపు బిగించి బలవంతానికి దిగుతాడు. ఆ దారిన పోతున్న సీత, ఆడమనిషి కేకలు విని లోపలికి తొంగిచూస్తుంది. చాకచక్యంగా బాబులును వడిసి పట్టి లక్ష్మిని కాపాడి, తనింటికి తీసుకెల్తుంది. ఖాళీ బుట్టను చంకన పెట్టుకుని వర్షంలో సావిత్రి వేసే అడుగులు నిజంగా ఆమె వర్షంలో నడుస్తున్నట్టే వుంటాయిగాని సెట్టులో నటిస్తున్నట్టే అనిపించదు. అందుకే మరి, రెండు దశాబ్దాలకాలం తెలుగుతెరను తిరుగులేని నటీమణిగా ఏలగలిగిందామె.

మానసికంగా దెబ్బ తినటమేగాక, వానలో తడిసిన లక్ష్మికి జబ్బు చేస్తుంది. డాక్టరుగా నటించిన జగ్గయ్య వైద్యం చేస్తాడు. సీత తండ్రి డాక్టరింట్లో నౌకరుగా వుంటాడు గాబట్టి, సీత డాక్టరుకు అదివరకే తెలుసు. అతని అన్న పబ్లిక్‌ప్రాసిక్యూటరు. ఇద్దరు పిల్లల తండ్రి. భార్య చనిపోయింది. డాక్టరుకింకా పెళ్ళికాలేదు. అందువల్ల, వారి ముదుసలి తల్లి ఇంటిని సవరిస్తూ వుంటుంది. ఆమెకు ఉబ్బసం వ్యాధి. డాక్టరుకు ధన్యవాదాలు చెప్పిపోటానికి వచ్చిన లక్ష్మి, సీతా ఆ ముసలావిడ బాధను గమనిస్తారు. ఆమె కోలుకునేవరకు తాను అక్కడే వుంటానని లక్ష్మి అడుగుతుంది. డాక్టరు సరేనంటాడు. లక్ష్మి ఆ కుటుంబంలో బాగా ఇమిడిపోతుంది. ఆమె గుణగణాలు డాక్టరును ఆకర్షిస్తాయి. ఆమెను పెళ్ళిచేసుకోవాలని నిశ్చయించుకుంటాడు.

లక్షరూపాయల కట్నంతో తన కూతురును డాక్టరుకు ఇవ్వాలని భద్రయ్య ఎగబడతాడు. కాదని లక్ష్మిని చేసుకోటానికి ప్రాసిక్యూటర్ వొప్పుకోడు. కులం, గోత్రం, అంతస్తు లేని పిల్లను చేసుకోవడం పరువు తక్కువ అంటాడు. గుణం ప్రధానంగానీ, కులం కాదంటాడు డాక్టరు. తల్లి ఎలాగో నచ్చజెప్పి పెద్దకొడుకును ఒప్పిస్తుంది. పెళ్ళి ఖరారౌతుంది.

మంచి విమర్శకుల దృష్టినిగూడా దాటుకునే వొక ముఖ్యమైన అంశాన్ని రచయిత ఇక్కడ పొందుపరిచాడు. ధనికకుటుంబాలుగా చూపిన రెంటిల్లోనూ ముదుసలి తల్లుల పాత్రలున్నాయి. వాటి నడవడికల మధ్య వ్యత్యాసం

కొట్టొచ్చినట్టు కనబడుతుంది. పెళ్ళి విషయంగా డాక్టరూ, ప్రాసిక్యూటరూ తగాదా పడుతూంటే తల్లి జోక్యం చేసుకుంటుంది.

'నాయనా, తలపెట్టింది శుభకార్యం. దాన్ని గురించి ఇలా ఘర్షణ పడటం శుభంగాదు. ఎలా జరగవలసివుందో అలా జరుగుతుంది. అనవసరంగా మాటలు పెంచుకోకండి. ఆ విషయాలన్నీ తరువాత ఆలోచించుకుందాం.' అంటూ తగాదాను నివారిస్తుంది. ఆ తరవాత, 'అబ్బాయి సంగతి నీకు తెలియందేముంది నాయనా. ఎన్ని సంబంధాలు వచ్చినా వద్దనేవాడు. ఈనాటికి వాడంతట వాడే చేసుకుంటానంటున్నాడు. అంతే చాలు. లక్ష్మిగూడా చాలా యోగ్యత కలిగిన పిల్ల. బుద్ధిమంతురాలు. మనలో బాగా కలిసిపోయింది. పిల్లలకు కూడా బాగా మాలిమి అయింది. వేరే సంబంధం చూస్తే ఏలాటి కోడలొస్తుందో. అసలే వాళ్ళు తల్లిలేని పిల్లలు. వాళ్ళకీ ఆమెకీ కలవక పోతే మళ్ళీ అదొక దిగులు తయారౌతుంది. ఇవన్నీ ఆలోచిస్తే అబ్బాయి మాట ప్రకారమే పోవడం మంచిదనిపిస్తుంది.' అంటూ పెద్దకొడుక్కు నచ్చజెప్పి పెళ్ళికి వొప్పిస్తుంది.

భద్రయ్య ఇంటి వాతావరణం వేరు. ఆ ఇంట్లో ముసలావిడ 'అరే భద్రుడూ, ఈ పెళ్ళికి నేనొప్పుకోను' అంటూ గోలచేస్తుంది. ఆ రెండు కుటుంబాల సంస్కారంలో వున్నతేడా ప్రతిబింబించేలా పాత్రల రూపకల్పన చేయడం నరసరాజుగారి ప్రతిభకు మరో తార్కాణం.

సమాజప్రగతికి అడ్డుగోడగా నిలిచిన కులాన్ని కూల్చితే తప్ప ముందుకు పోలే మనే ఆదర్శంతో అప్పట్లో తెలుగునాట సంస్కరణోద్యమం పెద్దగా సాగింది. ఆ ఉద్యమానికి అనుకూలమైన భావాలను ఈచిత్రం స్పష్టంగా ప్రభోదిస్తుంది. సీత తండ్రి రామున్ని 'మనదే వర్ణం?' అని అడిగితే, 'మన దంతా వొకటే కులం, కూటికిలేని కులం' అంటాడు రాముడు. ఇదే కాకుండా, సమకాలీన సమాజంలో జరుగుతున్న మరో పోరాటాన్నిగూడా చూచాయగా ఈ చిత్రం ప్రతిబింబిస్తుంది. బ్రాహ్మణాధిపత్యానికి వ్యతిరేకంగా త్రిపురనేని రామస్వామి చౌదరిగారి నాయకత్వంలో మొదలైన శూద్రుల తిరుగుబాటు తీవ్రస్థాయికి చేరిన రోజులవి. అదివరకు శూద్రుల భోజనపు అలవాట్లను అపవిత్రంగానూ, అసహ్యంగానూ భావించేవారు. వాటిని గురించి బహి

రంగంగా ప్రస్తావించడమే నీచంగా కనిపించేది. దాన్ని తుంచటానికి ఈ చిత్రంలో సాహసం చేశారు. 'రావోయి మాయింటికి' పాటలో -

**ఆకలైతె సన్నబియ్యం కూడున్నది,**
**అందులోకి అరకోడి కూరున్నది,**
**ఆపైన రొయ్యపొట్టు చారున్నది**
అనడమేగాక,
**రంగైన మీగడ పెరుగున్నది,**
**నంజుకోను ఆవకాయ ముక్కున్నది**
అనగానే,
**'ఛీ ఛీ, డోంట్ వాంట్ '** అనిపిస్తారు గూడా.

ఈపాట ప్రజల ఆదరణ పొందటంతో ఆ కోవకు చెందిన రచయితలకూ, దర్శకులకూ మరింత ముందుకేళ్ళే ధైర్యం సమకూరింది. అంతేగాదు, తండ్రి తమ్ముణ్ని 'బాబాయ్' అని పిలవకుండా 'చిన్నాన్నా' అనిపించడంలో రాయలసీమ వాడుకభాషను ఉపయోగించుకునే ప్రయత్నంగూడా జరిగింది.

రాముడు జైలునుండి విడుదలౌతాడు. చెల్లెలికోసం శరణాలయం వెళతాడు. 'ఆమె నదిలో దూకి చనిపోయిం'దని కాపలామనిషి నారాయణ చెబుతాడు. దుఃఖంతో రాముడు సీత దగ్గరి కొస్తాడు. ఆమె చీదరించుకుంటుంది. చెల్లెలు చనిపోయిన విషయం చెప్పి బావురు మంటాడు. సీత కరిగిపోయి చేరదీస్తుంది.

కారు టైరు పంక్చరై దారిమధ్యలో నిలిచిపోతాడు డాక్టరు. స్టెప్నీ ఉందిగానీ, జాకీ లేదు. ఆదారిన్నే పోతున్న రాముడు తన ఉపాయంతో జాకీ లేకుండా స్టెప్నీ తగిలించి డాక్టరుతో శభాస్ అనిపించుకుంటాడు. డ్రైవరుగా అక్కడే నౌకిరిలో చేరుతాడు. ఆఇంట్లోనుండి అతనికొక పాట వినిపిస్తుంది. అది చిన్నప్పుడు తనను గురించి చెల్లెలు పాడే పాట. ప్రాణం లేచొస్తుంది. కిటికీలో నుండి చూడటానికి ప్రయత్నిస్తాడు. లక్ష్మిని డాక్టరు పెళ్ళిచేసుకోబోతున్నాడని సీత తండ్రిద్వారా రామునికి తెలుస్తుంది. ఐతే, లక్ష్మి అదృష్టాన్ని నాశనంజేసే మిత్తువులా తను మళ్ళీ దాపురించాడు!

పిల్లలను స్కూలుకు తీసుకెళ్ళమని డ్రైవరును ఆదేశిస్తాడు డాక్టరు.

డ్రైవరు కొత్తవాడు కాబట్టి బడి చూపించటానికి లక్ష్మినిగూడా కార్లో వెళ్ళ మంటాడు. దర్శకత్వంలోని ఆద్భుతమైన విలువలను చాటే సన్నివేశాల్లో ఇదొకటి. యజమానురాలు కూర్చోటానికి కారు డోరు తెరిచి పట్టుకుంటాడు రాముడు. ఆమె కూర్చుంటుంది. అతడెవరో ఆమెకు తెలుసు, ఆమె ఎవరో అతనికి తెలుసు. కానీ, అక్కడ యజమానురాలు, డ్రైవరు తప్ప ఇంకేమీ లేదు. స్కూలు దగ్గరికి చేరగానే రాముడు దిగి డోరు తెరుస్తాడు. ఆమె దిగి, పిల్లలను బడిలో వదిలి పరుగుపరుగున తిరిగొస్తుంది. అన్నను జూసి బావురు మంటుంది. తాము అన్నాచెల్లెల్లమని బయట చెప్పకుండా రాముడు చెల్లెలితో వొట్టేయించుకుంటాడు. తరువాత ఆమె డోరు తీసుకుని కారెక్కుతుంది. ఇల్లు చేరింతరువాత రాముడు దిగి డోరు తెరుస్తాడు. సంబంధానికీ అసంబంధానికీ ఎంత సున్నితమైన తేడాను ఊహించగలిగాడు దర్శకుడు!

నౌకిరి మానుకుంటానంటాడు రాముడు. కారణం చెప్పమంటాడు డాక్టరు. రాముడు నసుగుతాడు. ఈ తర్జనభర్జన ఇలా జరుగుతుండగానే, ప్రాసిక్యూటరు రిస్ట్ వాచి కనబడలేదని కలకలం బయలుదేరుతుంది ఇంట్లో. ఆ సమయంలో అక్కడికొచ్చిన భద్రయ్య రాముణ్ణి గుర్తుపట్టి, అతడు దొంగని చెబుతాడు. లక్ష్మి కళ్ళ ఎదుటే అతన్ని కొట్టి బయటికి తోసేస్తారు. ఈ సన్నివేశాల పరంపర ప్రేక్షకుల మనసుల్లో దొంగరామునిపట్ల విపరీతమైన జాలి కలిగిస్తుంది.

చెల్లెలి పెళ్ళికి బంగారునగ కానుకగా ఇవ్వాలని ఆరాటపడతాడు రాముడు. నచ్చిన నగ ఖరీదు వందరూపాయలు! రేయింబవళ్ళు కాయకష్టం చేసి చివరకు కొనగలుగుతాడు. ఇంతలో మరో అవాంతరం ముంచుకొస్తుంది. భద్రయ్య లక్ష్మిని గుర్తు పడతాడు. పెళ్ళి చెడగొట్టాలని పంతం పడతాడు. భద్రయ్యను ఇల్లు కదలకుండా చేస్తేతప్ప లక్ష్మి పెళ్ళి జరగదని, రాముడు ఆ పనికి పూనుకుంటాడు. కత్తితో భద్రయ్యను బెదిరించి బయటికి రాకుండా కొద్దిసేపు కాపలా కాస్తాడు. ముహూర్తం దగ్గరపడుతూంది. చెల్లెలి పెళ్ళి కళ్ళారా చూడాలి. గడ్డిబొమ్మను ఎదురుగావుంచి తను వెళిపోతాడు. అది గడ్డిబొమ్మని తెలియగానే భద్రయ్య తిరిగి ప్రయాణమౌతుంటాడు. దొంగ తనానికి వచ్చిన బాబులు అతన్ని అటకాయిస్తాడు. ముసుగులో వున్న

బాబులును రాముడే అనుకుంటాడు భద్రయ్య. నగలూ, నట్రా తీసుకుని పారిపోయే సమయంలో భద్రయ్య వదలకుండా పట్టుకుని కేకేస్తాడు. విడిపించు కోటానికి కత్తి గుండెల్లో దించి బాబులు పారిపోతాడు. ఇరుగుపొరుగు వచ్చి చేరగానే భద్రయ్య 'రాముడు, మా నౌకరు' అంటూ ప్రాణం విడుస్తాడు. రామునిమీద కేసు నమోదౌతుంది.

పెళ్ళికూతురు అలంకారంలో వున్న చెల్లెలిని రాముడు పెరట్లో కలుసుకునే సన్నివేశం కంట తడిపెట్టిస్తుంది. ఆప్యాయత, ఆనందం, రాముని దీనావస్థ ప్రదర్శించడంలో అక్కినేనిగారి నటన మరువరానిది. బంగారుదండ కానుకగా ఇచ్చినప్పుడు అనుమానంతో లక్ష్మి చూసే చూపుకు ఇచ్చే సమాధానం, చూపే ముఖకవళికలకు గుండె తరుక్కుపోతుంది.

పెళ్ళినుండి తిరిగొస్తున్న రామున్ని పోలీసులు పట్టుకుంటారు. కానీ, ఆలస్యం లేకుండా దొంగసొమ్ముతో బాబులు దొరికిపోవడంతో రాముడు బయటపడి కథ సుఖాంతమౌతుంది. సుఖాంతమైగూడా చివరివరకు టెంపో (tempo) ఏమాత్రం తగ్గకుండా నడిచే అరుదైనకథల్లో ఇదొకటి. అందుకే 'దొంగరాముడు' విజయానికి ప్రధానకారకులు రచయిత, దర్శకుడేనని గుర్తింపు పొందగలిగారు. అద్భుతమైన క్యారెక్టరైజేషన్, అపురూపమైన మాడ్యులేషన్ ఈ చిత్రానికి అదనపు ఆభరణాలు. ఆరితేరిన నటీనటవర్గం కాబట్టి, చిన్ననౌకరు నుండి హీరో వరకు ప్రతివొక్కరు డైలాగులు ఉచ్చరించిన తీరు అనేకమందికి మార్గదర్శకం. ఇలా చెప్పుకుంటూపోతే తరిగేవి కావు 'దొంగరాముడు' విశేషాలు. ఏదిఏమైనా, విలన్‌గా నటించిన ఆర్.నాగేశ్వరరావు నటనను మెచ్చుకోకుండా ముగించడం అన్యాయమౌతుంది. 'ఆయన అరిచాడండి, నేను పొడి చానండి. అంతే నేను చంపాలని చంపలేదండి, ఆయనంతట ఆయనే చచ్చిపోయాడండి.' అనే చివరి మాటదాకా అద్భుతమైన నటనను ప్రదర్శించిన నటుడాయన.

ఈ సినిమాకు పెండ్యాలవారు కూర్చిన బాణీలవల్ల పాటలు బహుళ ప్రచారం పొందాయి. హాయిగా సాగే 'అనురాగము విరిసేనా', ఉల్లాసంగా సాగే 'అందచందాలా సొగసరివాడు', వైవిధ్యం కలిగిన 'రావోయి మాయింటికి', ఉర్రూతలూపిన 'చిగు రాకులలో చిలకమ్మా', విషాదనేపథ్యంకోసం కూర్చిన

'చెరసాల పాలైనావా', చెంగు చెంగున దూకే 'లేవోయి చినవాడా' పాటలు ఇప్పటికీ సజీవంగా వున్నాయి. కానీ, కథతో పాటలు అతికిపోయాయని చెప్పలేం. ఇది కథకు ప్రాధాన్యత కలిగిన చిత్రమే గానీ, సంగీతం మీద ఆధారపడింది కాదు. సాధారణంగా కె.వి.రెడ్డికి తన సినిమాల్లో పాటలను క్రమబద్ధమైన ఇంటర్వెల్స్‌తో పొందుపరిచే అలవాటుంది. ఈ చిత్రంలో అది కనిపించదు. మరి ఈ మాత్రానికి పెండ్యాల నెందుకు తీసుకున్నారు అని అనిపించొచ్చు. కానీ, కేవలం పెండ్యాలవల్ల పాటలు జనాన్ని మెప్పిం చాయే తప్ప సినిమాలోని సందర్భాలకు పొత్తుండి కాదు. పెండ్యాలను తీసుకోవడానికి మరో కారణంగూడా వుండొచ్చు. కొంతకొంతమంది వెంటలేక పోతే కె.వి.రెడ్డి పనిచెయ్యలేడేమో నని నా అనుమానం. సంగీతానికి పెండ్యాలో, ఘంటసాలో వుండాలి. రచనకు పింగళి వుండాలి. జానపద సినిమా తీస్తే వొక ఎలుగుబంటి వుండాలి. ఇలాటి వేవేవో కొందరి నమ్మకాలు.

పాటలకూ కథకూ పొంతన కుదరకపోవడం వొక్క 'దొంగరాముడు'లోనే కాదు, అన్నపూర్ణావారి అన్ని చిత్రాల్లోను కనిపిస్తుంది. సంగీతం బావుండకనా అంటే అదీగాదు. ప్రజలను ఆకట్టుకునే మనోహరమైన పాటలతో నిండి వుంటాయి. సంగీతానికి రాజేశ్వరరావూ, పెండ్యాల వంటి గజఈతగాళ్ళమీదే ఆధారపడతారు. కానీ, సాంఘిక చిత్రాలకు పాటలను జోడించడం తేలికైన పనిగాదు. మరో తరగతికి చెందిన ఇతివృత్తాలను ముట్టనే ముట్టకుండా సాంఘికాలకు మాత్రమే కట్టుబడిన సంస్థ తెలుగురంగంలో బహుశా ఇదొక్క టేనేమో. కాబట్టి వారి సాహసమే ప్రశంసనీయం. ఈ లొసుగు వారి రెండవ చిత్రం 'తోడికోడళ్ళు'లో మరింత ఎక్కువగా కనిపిస్తుంది. సాహిత్యం అభ్యుదయ పంథాలో ప్రయాణిస్తున్న రోజుల్లో ఈ సినిమా తయారైంది. శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర వంటి సోషలిస్టు భావాలుగల రచయితలు సినిమా రంగంలో ప్రవేశించారు. 'తోడికోడళ్ళ'కు రాసిన పాటల్లో దాదాపు ప్రతిదాంట్లో, చివరకు విజయ దశమి కోలాటం పాటలోగూడా, అభ్యుదయం ఛాయలు కనిపిస్తాయి. ఆత్రేయగారు రాసిన 'కారులో షికారుకెళ్ళే' పాటను నోట పలుకని యువకుడు ఆరోజుల్లో  అరుదు.

కారులో షికారు కెళ్ళే పాలబుగ్గల పసిడి చానా
బుగ్గమీద గులాబిరంగు ఎలా వచ్చెనో చెప్పగలవా?
నిన్ను మించిన కన్నెలెందరొ మండుటెండలొ మాడిపోతే
వారి బుగ్గల నిగ్గు నీకు వచ్చిచేరెను తెలుసుకో.
కారులో షికారు కెళ్ళే పాలబుగ్గల పసిడి చానా
నిలిచి విను నీ బడాయి చాలు, తెలుసుకోవే నిజానిజాలు.
చలువరాతి మేడలోన కులుకుతావే కుర్రదానా
మేడగట్టిన చలువరాళ్ళు ఎలావచ్చెనో చెప్పగలవా?
కడుపుకాలే కష్టజీవులు వొడలు విరిచి, గనులు తొలిచి
చెమట చలువను చేర్చి రాళ్ళను తీర్చినారూ తెలుసుకో .
గాలిలోన తేలిపోయే చీరగట్టిన చిన్నాదానా
జిలుగువెలుగుల చీరె శిల్పం ఎలావచ్చెనో చెప్పగలవా?
చిరుగుపాతల బడుగు బ్రతుకుల నేతగాల్లే నేసినారు
చాకిరొకరిది సౌఖ్యమొకరిది సాగదింక తెలుసుకో.

సోషలిస్టు అభిప్రాయాన్ని ముసుగులేకుండా వక్కాణించిన పాట ఇది. మాస్టర్ వేణు కూర్చిన బాణీతో ఇది పేదప్రజల్లోకి బాణంలా దూసుకుపోయింది. కానీ ఆ భావాలకు తగిన సన్నివేశం సినిమాలో లేదు. 'తోడికోడళ్ళు' కేవలం కుటుంబకలహాలకు సంబంధించిన కథ. ఈ పాటకోసం కల్పించిన సన్నివేశమే అందులో వుందిగానీ, సన్నివేశంకోసం రాసిన పాట కాదిది.

కొన్ని సాంఘికచిత్రాల్లో పాటలూ, సంగీతం బాగా అతికిపోతుంది. అలా అతకడానికి బహుశా ప్రేమ అనే జిగురు అవసరమేమో! కాకపోతే, 'దేవదాసు' పాటలు యాభైయ్యేళ్ళుగా మరుగుపడకుండా నిలుస్తాయా?

# దేవదాసు

సాంఘిక చిత్రాల్లో 'దేవదాసు' లాగా ప్రజాదరణ పొందిన సినిమా మరొకటి లేదనటం అతిశయోక్తికాదు. ఆంధ్రదేశం గర్వంగా చెప్పుకునే నిర్మాణాల్లో ఇదొకటి. చిత్రమేమిటంటే, ఇందులో ఏదీ తెలుగువాల్లది కాదు. బెంగాలీ శరత్‌బాబుది కథ; బెంగాలీ, హిందీ సినిమాల నిర్మాణానికి పి.సి.బారువాగారు రూపొందించింది స్క్రీన్‌ప్లే. తమిళుడైన సుబ్బరామన్‌గారు కూర్చిపెట్టింది సంగీతం. నటులు తప్ప ఇందులో తెలుగు వాసనే లేదు. మరి తెలుగు ప్రేక్షకుల మనసుకు ఈచిత్రం ఇంత దగ్గర కావటానికి కారణమేమిటి?

ఆచారవ్యవహారాల్లో ఏదైనా ప్రత్యేకత వుందా అంటే అదీ చెప్పలేం. ఆ విషయంలో ఆంధ్రులకు అతి దగ్గరగా వుండేది బెంగాలీ సమాజం. బెంగాలీనవలల్లో పాదధూళి ప్రస్తావన పదేపదే కనిపిస్తుంది. పెద్దవారిముందు వినయాన్ని ప్రదర్శించే బెంగాలీయుల అలవాటది. దాన్ని తీసేసి, తెలుగు సాంప్రదాయం ఇరికిస్తే తెలుగుదనమొస్తుంది. చిన్నచిన్న మార్పులతో బెంగాలీకథకు తెలుగుదనం తెప్పించడం కష్టమైన పనిగాదు. పోనీ, పరిసరాలవల్ల ఆ భావన కలిగిందా? రావులపాలెం, దుర్గాపురం అనే ఊరిపేర్లు తప్ప, తెలుగునాడుగా ప్రత్యేకించి చెప్పుకోడానికి ఇందులో ఏమీలేదు. దాదాపు సినిమా మొత్తం సెట్టింగుల్లో పూర్తైనదేగాని బయట చిత్రీకరించింది బహుకొద్ది. 'పల్లెకు పోదాం, పారును చూద్దాం' అనే పాటకూ, సావిత్రి మేనాలో వెళ్ళటానికీ తీసిన షాట్స్‌లో తప్ప ఔట్‌డోర్ చిత్రీకరణ అంతగా కనిపించదు. టాంగా నడిచే రోడ్డూ, రోడ్డు కిరువైపులా చెట్లూ, మేనా సాగే కాలిబాట, దాని కిరువైపులా కంపచెట్లు - ఇవి బంగ్లాలోనూ అలాగే వుంటాయి, బందరు లోనూ అలాగే వుంటాయి. పైగా టాంగాను చూపించి మరింత బెంగాలీయం చేసినట్టయింది.

మరి, తెలుగుప్రజలను ఇంత బలంగా ఆకట్టుకోడానికి ఏదోవొక కారణం వుండాలిగదా, ఏమిటది? దర్శకత్వంలో గొప్పదనమా? ఔనని చెప్పలేం.

ఈసినిమా తీసేనాటికి వేదాంతం రాఘవయ్యగారిలో చెప్పుకోదగ్గ పరిపక్వత కనిపించదు. పరిపక్వతే వుంటే, క్యారెక్టరైజేషన్‌లో పార్వతీ, దేవదాసుల బాల్యం అంత ఘోరంగా విఫలం కాదు. దేవదాసులోని దుడుకుతనం తప్ప అతని బాల్యంలో కథకు అవసరమైన మిగతా స్వభావాలు కనిపించవు. చదువుమీద ధ్యాసలేని దేవదాసును పార్వతినుండి విడదీసి పట్నం పంపగానే అంత ప్రయోజకుడు కావడం చూస్తే, అదివరకు అతడు పాడుగావటానికి పార్వతి కారణమా లేక ఆ పల్లె కారణమా అని అనుమానం కలుగుతుంది. కుర్రదేవదాసు పట్నం వెళ్ళే సమయంలో పార్వతితో అంటాడు - 'నిన్ను విడిచిపెట్టి నేనుంటానా? పారిపోయైనా వస్తాను' అని. అదివరకటి ప్రవర్తనలో అతనికి పార్వతి మీద ఆప్యాయత కాదుగదా, కనీసం గుర్తింపైనా వున్నట్టు మనకు తెలిసిరాదు. పోనీ, చదువుకునే రోజుల్లో ఎప్పుడేగాని గుర్తొచ్చినట్టైనా లేదు. నేరుగా పెద్దవాడై పార్వతిని గురించి పాడుకుంటూ ఊరికి తిరిగొస్తాడు. కాదనకుండా మంచి బంగారునగ కానుకగా తెస్తాడు. చదువు మీద ధ్యాసలేని జులాయివాడు 'దొంగరాముడు'లో జులాయి గానే ఎదుగుతాడు. బలమైన కారణం లేకుండా స్వభావాలు సులభంగా మారిపోవడం అసాధ్యం.

చిన్నపార్వతి క్యారెక్టరైజేషన్ మరీ అధ్వాన్నం. అటుకులు తీసుకెళ్ళటంలోనే ఆప్యాయతంతా చిత్రించడం కుదరదు. దేవదాసు చితకబాదినా అతనిమీద చెప్పకుండా నిర్దోషైన బడిపంతులు మీదికి నేరం నెట్టడంలో ఆమె స్వభావానికి ఏ దుర్గతి పట్టినట్టు? మరో సందర్భంలో దేవదాసుమీదే అతని తండ్రికి ఫిర్యాదు చేస్తుంది. తోటలో చేరి రోజూ సిగరెట్లు కాలుస్తున్నట్టు పితూరీలు చెబుతుంది. పెద్దైన తరువాత పార్వతిలో కనిపించే స్వభావానికీ దీనికీ పొంతనేలేదు. పార్వతి నాయనమ్మ ఆమెకు బడిచదువు మానిపిస్తూ, 'జాబులు వ్రాయటం, కాస్త రామాయణం చదవడం వస్తే చాలు ఆడపిల్లకు' అంటుంది. సినిమాలో కనిపించే చిన్నపార్వతి వయసు జాబులు రాసేదిగా, రామాయణం చదివేదిగా అనిపించదు.

క్యారెక్టరైజేషన్‌లో ఘోరంగా విఫలమైన మరోపాత్ర పేకేటి శివరాంది. ఆ పాత్ర పేరు భగవాన్. దేవదాసును వేశ్యతో కలిపే పాత్ర ఇది. ఈ పాత్రను పరిచయం చేసే మొట్టమొదటి సన్నివేశంలో, అతనికి అప్పులున్నట్టూ,

అప్పులవాళ్లకు అతడు టోకరా ఇస్తున్నట్టూ చూపించారు. దురలవాట్లున్నవానికి అప్పులు కావడం సహజం. కానీ, ఆ అప్పులకూ, తరువాతి సినిమాలో అతని పాత్రకూ రవ్వంతైనా పొత్తులేదు. దీనివల్ల అనవసర సంఘటన వొకటి చోటుచేసుకోవడం, అవసరమైన వాటికి స్థానం లేకపోవడం జరిగింది. సరిగ్గా ఇలాటి సందర్భమే 'పూజాఫలం' సినిమాలో వొకటుంది. ఇందులోనూ నటించింది పేకేటి శివరాంగారే. ఇది గూడా హీరోకు వేశ్యను అంటగట్టే పాత్రే. పరిచయంజేసే సీన్‌లోనే అతడు నాట్యాలంకరణలో వున్న ఇద్దరు అమ్మాయిలను వెంటతీసుకొస్తాడు. వారిని కుమారి కూచిపూడి, కుమారి మణిపురిలుగా హీరోకు పరిచయం చేస్తాడు. నాట్యప్రదర్శన టికెట్లు అడక్కుండానే చింపి చేతిలో పెడతాడు. పర్సులో పెద్దనోటును చొరవగా తనే తీసుకుంటాడు. తిరిగి వెళ్ళేప్పుడు మరో విద్యార్థి ఎదురై, కాలేజికి రావటంలేదేమని అడిగితే, కళాసేవకే సమయం చాలటంలేదని జవాబిచ్చి జారుకుంటాడు. ఇదిగూడా వ్యసనపరుని పాత్రే గాబట్టి అతని వ్యాపకానికి తగ్గట్టు అనేకానేక ఇబ్బందులు ఉండొచ్చు. కాలేజికి సక్రమంగారాని విద్యార్థిగా ప్రిన్సిపాల్‌తో రోజూ చీవాట్లు తింటుండొచ్చు. కానీ అవన్నీ తరువాతి కథకు పనికిరావు. అతని స్వభావాన్ని కథకు అవసరమైన మేరకు ప్రారంభంలోనే అచ్చుగుద్దాడు దర్శకుడు.

దేవదాసుకు వొక స్నేహితుడున్నట్టే, పార్వతికి వొక స్నేహితురాలు వుంది. ఆమె పేరు మనోరమ. చిన్నతనంలో వారిద్దరూ వొక్కసారైనా కలిసినట్టు సినిమాలో మనకు  కనిపించదు. బహుశా, దేవదాసు పట్నం వెళ్ళిన తరువాత, పార్వతికి పొద్దుబోక ఈమెతో నేస్తం కలిపుండొచ్చు. కానీ, ఆ పాత్ర కర్తవ్యమే అగోచరం. దర్శకత్వంలో బలహీనతకు ఈపాత్ర నికరమైన నిదర్శనం. మరో చిన్న విడ్డూరం వొక చోట కనిపిస్తుంది. పెరిగి పెద్దైన దేవదాసు పట్నంనుండి మొదటిసారి స్వగ్రామం తిరిగొచ్చేప్పుడు పార్వతికోసం నగను కానుకగా తెస్తాడు. పార్వతి ఆ నగను అపురూపంగా ధరిస్తుంది. విడువకుండా ఆ నగను వేసుకునే తిరుగుతుంది. పెళ్ళిగాని పిల్లకు పరాయి మగవాడిచ్చిన కానుక గురించి ఇంట్లోవారుగాని, ఊళ్ళోవారుగాని ఏమీ పట్టించుకోకపోవడం వింతగా కనిపిస్తుంది. అటువంటి విషయాలను తెలుగు సమాజంలో తేలిగ్గా తీసుకోరు.

ఈ చిత్రానికి సమకూర్చిన సంభాషణల సామర్థ్యంగూడా అంతంత మాత్రమే. కొంత బలహీనత ఎస్.వి.రంగారావు రెండరింగులో మాసిపోయి వుండొచ్చు, దేవదాసు తాగుబోతుతనంలో కొంత మరుగుపడి వుండొచ్చు. కానీ, పాత్రల స్వభావాన్ని ప్రతిబింబించలేని బలహీనత తుదకంటా తొంగి చూస్తూనేవుంటుంది. ఏ డైలాగుకు ఆ డైలాగు విడివిడిగా తీస్తే చాలా ఇంపుగా వుంటాయి. అనేక సందర్భాల్లో 'కోట్' చెయ్యటానిగ్గూడా పనికొస్తాయి. కానీ, సినిమా సీక్వెన్స్‌లో పేలవంగా వుంటాయి; అర్థరహితంగా, అదేపనిగా ఏరుకుని కూర్చినట్టుగా వుంటాయి.

ఇలాటి వెసులుబాట్లు కొల్లలుగా వున్నా, జనమంతా వెర్రిగా 'దేవదాసు' వెంట పడటానికీ, ఆకాశానికెత్తి ఆరాధించటానికీ కారణమేమిటి? సుబ్బరామన్, సుబ్బరామన్, సుబ్బరామన్.

సి.ఆర్.సుబ్బరామన్‌గారి అజరామరమైన సంగీతం 'దేవదాసు'కు ఆయువుపట్టు. ఒక్క కర్ణాటక, హిందుస్థానీ సంగీతాలేకాక, అరబ్బీ, స్పానిష్ సంగీతాల్లోని మెలొడీని సందర్భానికి తగ్గట్టు వాడి, పాటలతోపాటు నేపథ్య సంగీతాన్నిగూడా మనోరంజకంగా సమర్పించిన ఘనత సుబ్బరామన్‌గారిది. సంగీతవిన్యాసంలో వొక తరానికీ మరోతరానికీ పోల్చుకోలేనంత వ్యత్యాసం చోటుచేసుకుంటూంది; అభిరుచుల్లో రోజురోజుకు తేడా పెరిగిపోతూంది; కానీ, మూడుతరాల తెలుగు ప్రేక్షకులను వశం చేసుకున్న దేవదాసు సంగీతంలోని సమ్మోహన శక్తి ఇప్పటికీ ఏమాత్రం తరగలేదు. సుబ్బరామన్ ఏ ప్రాంతీయుడనే ప్రశ్న ఎక్కడా ఉదయించనేలేదు. కళాభినివేశాన్ని జాతి, మతము, భాష, ప్రాంతము వంటి సంకుచితమైన హద్దులు అడ్డుకోలేవు. 'చంద్రలేఖ' చిత్రం దీనికి మరో ఉదాహరణ. ఆ సినిమాను నేను చాలా చిన్నప్పుడు చూశాను. భాష నాకు గుర్తు లేదు. దానికున్న ప్రచారాన్నిబట్టి తెలుగులో డబ్బింగ్ చేసిన సినిమా అనుకున్నాను. తరువాత చూసినప్పుడుగానీ తెలీలేదు దానికి డబ్బింగ్ చెయ్యలేదని. అది అరవభాషలోనే తెలుగునాట అఖండవిజయం సాధించింది.

సినిమాను బ్రతికించింది సంగీతమైతే, ఆ సంగీతానికి ప్రాణమిచ్చింది ఘంటసాల గాత్రం. ఆయన కంఠంనుండి జాలువారినవి స్వరాలుగావు,

మధురాతిమధురమైన తేనెల జాలు. 'నన్నూ చూడగానే చిననాటి చెలిమి చూపేనో' అన్నప్పుడు తొణికిసలాడే ఉల్లాసం, 'బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్' అన్నప్పుడు జాలువారే విషాదం, 'సుడిలో దూకి ఎదురీదక మునకే సుఖమనుకోవోయ్' అన్నప్పుడు ధ్వనించే నైరాశ్యం, 'మరపురాని బాధకన్నా మధురమే లేదూ' అన్నప్పుడు కలిగించే అనుభూతి, ఆ గొంతులోతప్ప మరెక్కడా పలుకదు. ఎన్నిసార్లైనా విను, మళ్ళీ అవి కొత్త పాటలే; ఎంత సేపైనా విను, 'ఏదీ ఇంకొక్కసా'రని అడుగవలసిందే.

సాంఘికచిత్రమైనా 'దేవదాసు' సంగీతాన్ని చక్కగా ఇముడ్చుకో గలిగింది. ఇది ప్రేమకథ కావడమే అందుకు కారణం. మనోతంత్రులను మీటే అనుభూతి ప్రేమ. అదే స్వభావం కలిగింది సంగీతం. ఈ రెండిటిదీ వొకే వేవ్‌లెంగ్త్ కావడంవల్ల, వీటిమధ్య అన్యోన్యత ఎక్కువ. భగ్నప్రేమలో సంగీతం మరింత రాణిస్తుందని సుబ్బరామన్‌గారు 'లైలామజ్నూ'లో అప్పటికే నిరూపించివున్నారు. ఇంగ్లిష్ థియేటర్‌లో షేక్స్పియర్ విషాదాంత నాటకాల ప్రభావం సినిమారంగం మీద అప్పుడప్పుడే పడుతూంది. 'లైలామజ్నూ' విజయం తెలుగు నిర్మాతల దృష్టిని విషాదాంత కథలవైపు మళ్లించింది. శరత్‌గారి దేవదాసు నవలను ఏభాషలో సినిమా తీసినా జయభేరి మ్రోగిస్తూంది. అందువల్ల, వినోదావారు ఈ కథను ఎన్నుకోవడానికి ధైర్యం చేశారు.

దేవదాసు పాటలకు కర్ణామృతం వంటి సాహిత్యాన్ని అదించినవారు సముద్రాల రాఘవాచార్యులు. సుబ్బరామన్ సంగీతానికి ఆపాటలే అమరాయో లేక సముద్రాల పాటలకు ఆ సంగీతమే అమరిందోగానీ, అది మరపురాని సమ్మేళనంగా నిలిచి పోయింది. పాటలు మొత్తం సముద్రాలగారే రాసినట్టు ప్రకటించినా, అందులో కొన్ని మల్లాదివారివనే పుకారు అప్పట్లో ప్రబలంగా ప్రాకింది. మల్లాదివారికి సముద్రాల చాలా సన్నిహితుడు. దాదాపు శిష్యుని వంటివాడు. గురువు ప్రభావం శిష్యునిమీద పడివుండొచ్చు. శిష్యున్ని పైకి తేవాలని గురువు సహకరించీ వుండొచ్చు. ఏదైతేనేం, కొన్ని పాటల శైలి, ఫిలాసఫీల్లో ఎందుకో మల్లాదివారే కనబడతారు. ఆయనది నిరాశావాదం. ఈ చిత్రంలోని 'కుడి ఎడమైతే పొరబాటు లేదోయ్' పాట ఆ ఫిలాసఫీకి ప్రతిరూపం.

**కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్, ఓడిపోలేదోయ్**
**సుడిలో దూకి ఎదురీదక మునకే సుఖమనుకోవోయ్ ..**

ఒకటి కుడి, మరొకటి ఎడమ అని ప్రపంచంలో విడివిడిగా లేవు. అన్నీ పక్క పక్కన్నే వున్నాయి. అటు తిరిగితే కుడిగా వుండేది, ఇటు తిరిగితే ఎడమ ఔతుంది. చావుబ్రతుకులు జీవితానికి కుడిఎడమలు. ఒకవైపు ఇదుంటే రెండవవైపు అదుండితీరుతుంది. అంతమాత్రానికి బెంబేలెత్తడ మెందుకు? దూకింది సుడిలోనని తెలుసు. దాన్నుండి బయటపడటం కుదరదనీ తెలుసు. బయటపడాలని ప్రయత్నిస్తే ప్రయాస మిగులుతుందేతప్ప ప్రయో జనముండదు. అందువల్ల ఆ చచ్చేదేదో సుఖంగా చావటం మేలు - అనేది నిరాశావాదం.

**మేడమీద అలపైడి బొమ్మా, నీడనే చిలకమ్మా,**
**కొండలే రగిలే వడగాలీ, నీ సిగలో పువ్వేనోయ్ ..**

బంగారపు బొమ్మలాటి అమ్మాయి మేడమీదుంది. ఆ గోడ పక్కన్నే చిలకలాటి పేదపిల్లుంది. కొండలనైనా రగిలించే వడగాలీ ఈ లోకంలో వుంది; చల్లని, సుసుమెత్తని కుసుమమూ ఇక్కడే వుంది. పరస్పర విరుద్ధమైన గుణాలుండే రెండూ లోకంలో వున్నాయనే ఎరుక నీకు కలిగితే, వడగాలైనా నీ సిగలో పువ్వంత ఆహ్లాదం కలిగిస్తుంది.

**చందమామా మసకేసిపోయే ముందుగా కబురేలోయ్**
**లాయి(హి)రీ నడిసంద్రములోన లంగరుతో పనిలేదోయ్ ..**

చందమామను మబ్బులు కమ్ముకున్నాయి. అది మసకబారిపోయింది. అలా కావడం నీకు ఇష్టంలేదు. కానీ ఆపడం నీ చేతగాదు. అంతమాత్రానికి 'అయ్యో నాకు ముందు తెలియకపోయెనే' అని వాపోవడం దండుగ. నావ సముద్రం లోతులకు జారి పోకుండా ఒడ్డును అంటిపెట్టుకుని ఉండటానికి వేసేది లంగరు. ఇప్పుడు నువ్వుండేదే నడిసముద్రంలో. ఇక లంగరుతో పనేమిటి? గాలివాటు ఎటు తోసుకెళ్తే అటు వెళ్ళడం తప్ప నీ చేతుల్లో ఏమీలేదు - అనేది మల్లాదివారి ఫిలాసోఫీ. 'చిరంజీవులు' చిత్రానికి ఆయన రాసిన విషాదగీతంలో ఇదే వేదాంతం కనబడుతుంది.

**విరజాజి శిలపైన రాలేందుకే, మరుమల్లె పెంధూళి కలిసేందుకే**

**మనసైన చినదాని మనసిందుకే, బ్రతుకిందుకే.**

ఇది శ్రీశ్రీ వేదానికి పూర్తిగా విరుద్ధమైంది. 'అగాధమౌ జలనిధిలోన ఆణిముత్య మున్నటులే, శోకాల మరుగున దాగి సుఖమున్నది' కాబట్టి ఆశ వదలవద్దంటాడు, ప్రయత్నం ఆపవద్దంటాడు శ్రీశ్రీ. అందనివాటికి ఆరాటపడితే దక్కేది ఆయాసమేతప్ప ప్రయోజనం కాదంటాడు మల్లాది. దేవదాసు పాటల్లో వొక్కచోట కాదు, ఈ తరహా ధోరణి ఎన్నోసార్లు దొర్లుతుంది. మరో పాటలో -

**కల యిదనీ నిజమిదనీ తెలియదులే బ్రతుకింతేనులే**

**పసితనపూ మనోరథం వెన్నెలనీడై పోయేనులే, బ్రతుకింతేనులే**

**ఎవియో మురిపాలు, ఎటకో పయనాలు దైవాల నీమాలింతే,**

**చివురించిన పూదీవే విరియగా, విరితావులు దూరాలై చనేనులె**

**ప్రేమ ఇంతేలే, పరిణామమింతేలే.**

**నెరవేరని ఈ మమకారాలేమో, ఈ దూర పారాలేమో, హితవేమో,**

**ఎదినేరని ప్రాయాన్నా తనువునా రవళించిన రాగమ్మే తిరమ్మౌ**

**యోగమింతేలే, అనురాగమింతేలే.**

పూతీగె తన శక్తినంతా కూడదీసుకుని చిగురిస్తుంది, మొగ్గ తొడుగుతుంది. ఆ మొగ్గలో సువాసనంతా దాచుకుంటుంది. కానీ, ఆ మొగ్గ విరిసీవిరియంగానే, ఇంత కాలం దాచుకున్న సువాసన తనకు దక్కకుండా దూరం వెళిపోతుంది. ప్రేమ ఆ సువాసనలాటిది. ఎడబాటు దాని పరిణామం.

ఈ పాటలో రచయిత ప్రయోగించిన 'వెన్నెల నీడ' అనే పదం గమనార్హం. వెన్నెల సృష్టించే నీడ బలహీనమైంది. ఇది చాలా అరుదైన ప్రయోగం.

'జగమే మాయ' పాటలో మొత్తంగా ఇదే సిద్ధాంతం. 'చెలియలేదూ చెలిమి లేదు' అనే డ్యూయట్‌లో కూడా -

**మరపురానీ బాధకన్నా మధురమే లేదు,**

**గతము తలచి వగచేకన్నా సౌఖ్యమే లేదు,**

**అందరాని పొందుకన్నా అందమేలేదు, ఆనందమే లేదు -**

అంటాడు రచయిత. ఇది ఎంత చక్కని అనుభూతి. నిరాశలో

కొట్టుమిట్టాడే మనిషికి మిగిలే సంతోషం కలలు మాత్రమే. ఐనా, గతాన్ని నెమరేసుకుని సంబరపడని మానవుడూ, గడచిపోయిన కష్టాన్ని తలచుకుని తేలిగ్గా నవ్వుకోని మానవుడు లోకంలో వుంటారా?

గుండెలో ఊపిరాడకుండా నిండుకున్న ఆవేదన ఎంత దుర్భరంగా వుంటుందో పోల్చటానికి వరదతో నిండిన చెరువునూ, లావాతో నిండిన పర్వతాన్నీ తీసుకున్నాడు కవి. తట్టుకోలేనంతగా వరదతో నిండినప్పుడు చెరువు గట్లమీద పొంగుతుంది, లేదా గట్టు తెంచుకుంటుంది. అది దానికి ఉపశమనం. అలాగే లావాను భరించలేనప్పుడు పర్వతం బద్దలవుతుంది. లావాను బయటికి వెళ్ళగక్కుతుంది. ఇది దీనికి ఉపశమనం. కానీ, ఏదారీలేని మనసు గతేమిటి? చెరువులకూ, కొండలకూ గూడా రిలీఫ్ అవసరమౌతూంటే, ఆ దారిలేని గుండె ఏమౌతుంది? అది ఊహించడానికే సాధ్యంగాని అవస్థ. అంతటి అవస్థకు నాయిక గురైంది.

**వరదపాలౌ చెరువులైనా పొరలిపారేనే,**
**రగిలి పొగలౌ కొండలైనా పగిలి జారేనే**
**దారిలేనీ బాధతో నే నారిపోయేనా, కథ తీరిపోయేనా?**

మరొకచోట, వేశ్య నాట్యంకోసం క్షేత్రయ్య కృతి నొకదాన్ని ఇందులో ప్రవేశపెట్టారు. క్షేత్రయ్య సాహిత్యమంతా చివరకు వేశ్యలపాలు గావటం దురదృష్టమే. ఆయన రచనలో కనిపించే తాదాత్మ్యతకు సాటిరాగల సాహిత్యం మరెక్కడా దొరకదు. 'ఇంత తెలిసియుండి ఈ గుణ మేలరా' అనే పల్లవితో మొదలయ్యే ఈ పాటలో -

**అలుక చేసి నాపై ఇంటికి రావైతివి**
**చెలికత్తెలున్నారా, పిలువ వచ్చేరా**
**చెలికత్తెలైన నీవె, చెలువుడవైన నీవె**
**తలచిచూడ నాపాలి దైవము నీవె ..**

నామీద అలిగి ఇంటికి రాకుండా కూర్చున్నావు. నిన్ను పిలిపించు కోటానికి నాకేమైనా చెలికత్తెలు వున్నారా? నాకు నువ్వుతప్ప ఎవరూ లేరు. చెలికత్తెవూ నువ్వే, చెలికానివీ నువ్వే. నాకు వేరే దేవుడుగూడా లేడు. నా దేవునివీ నువ్వే.

**వింతదానివలె నన్ను వేరుచేసి రావైతివి**
**అంతరంగులున్నారా నన్నాదరించేరా**
**అంతరంగమైన నీవె, ఆదరించిన నీవె**
**చింతించిచూడ నా జీవనమూ నీవె**

నన్ను పరాయిదాన్ని చేసి రాకుండా కూర్చున్నావ్. నన్నింక ఓదార్చే దెవరు? ఓదార్చటానికీ, ఆదరించటానికీ నాకెవరైనా ఆత్మీయులున్నా రనుకున్నావా? నిన్నుకాదని నాకు ఆత్మీయులు ఎవరున్నారు? కాబట్టి, ఆత్మీయునివీ నీవే, ఆదరించవలసిందీ నువ్వే. ఇదీ అదీ ఎందుకు, నా జీవితమే నువ్వు - దేహాలు వేరుగాని, ప్రాణాలు రెండు కాదనే ప్రేమభావన ఎంత పతాకస్థాయికి తీసుకెళ్ళాడు మహాకవి క్షేత్రయ్య!

దేవదాసుది భగ్నప్రేమ. అంతస్థుల్లో తారతమ్యంవల్ల అతని తలి దండ్రులు పార్వతిని పెళ్ళిచేసుకోటానికి వొప్పుకోరు. జమీందారైన దేవదాసు తండ్రి మందలించటానికి పార్వతి తండ్రిని పిలిపించి అవమానకరంగా మాట్లాడతాడు. ఇంతకంటే మంచిసంబంధం తీసుకురావాలనే పంతంతో పార్వతితండ్రి బయలుదేరుతాడు. మనసులో వొకరుండగా మనువు మరొకరితో జరగడం పార్వతి అంగీకరించలేదు. అనర్థం జరుగకుండా ఆపటానికి దేవదాసుతో స్వయంగా సంప్రదించాలని పార్వతి పూనుకుంటుంది. అర్ధరాత్రివేళ అతని పడకగదిలో ప్రవేశిస్తుంది. దేవదాసు నిశ్చింతగా నిద్రపోతుంటాడు. పార్వతి అతన్ని నిద్ర లేపుతుంది.

**దే: పారూ, అర్ధరాత్రి ఏమిటి ఈ రావడం? ఎవరూ చూడలేదు కదా?**
**పా: ధర్మన్న చూశాడు. ఇంకా . .**
**దే: ఎవరైనా చూశారా?**
**పా: వరండాలో చాలామంది పడుకున్నారు. ఎవరైనా చూశారేమో.**
**దే: ఆ . . (తలుపు మూసొచ్చి) ఛీఛీ, ఎంతపని చేశావు పారూ. నువ్వింకా చిన్నపిల్లవేనా? ఈ సంగతి బయటికి తెలిస్తే రేపు సిగ్గుతో నీ తల వాలి పోదూ.**
**పా: నువ్వు నన్ను కాపాడుతావనే నమ్మకం లేకపోతేగా.**
**దే: నేనుమాత్రం నవ్వులపాలు కాకుంటేగా.**

పా: నీకేం దేవదా. నువ్వు మగవాడివి. పైగా శ్రీమంతుడివి. నిన్నేమంటారు. ఈ అభాగ్యురాలు పార్వతి నీ దయాభిక్ష ఆశించడానికి అర్ధరాత్రి నీదగ్గరి కొచ్చిందని ఎవ్వరూ అనుకోరు.

దే: పైగా అపనింద అంటగడతారు.

పా: నింద, ఈ బొందికేగా. కప్పిపుచ్చుకోడానికి నదిలో కావలిసినంత నీరుందిలే దేవదా. (ఏడుస్తుంది)

దే: పారూ

పా: ఇక్కడే నీ పాదాల దగ్గిర కాస్తా చోటివ్వు దేవదా.

దే: ఎలా పారూ. మన వివాహం మా అమ్మకూ నాన్నకూ బొత్తిగా ఇష్టంలేదు. ఈ సంగతి మీ నాన్నగారితో ఖండితంగా చెప్పారు.

పా: ఆ అవమానంతోనే మరో సంబంధం నిశ్చయించుకొస్తానని మానాన్న శపథంచేసి వెళ్ళాడు. తల్లిదండ్రుల అహంకారాలకు మన స్నేహం, ప్రేమ బలిచేస్తావా? నా బ్రతుకు పరాధీనం చేస్తావా దేవదా?

దే: కనిపెంచినవారిమాట కాదనమంటావా?

పా: అంటే ఏం?

దే: అలా చేస్తే నాకీయింట్లో చోటుంటుందా? అప్పుడు నువ్వెక్కడుంటావ్ పారూ?

పా: నీ పాదాల దగ్గర. నీ సన్నిధిలో వుంటే ఎన్ని కష్టాలైనా సంతోషంగా భరిస్తాను. నన్ను అన్యాయం చెయ్యకు దేవదా.

దే: నన్ను కొంచెం ఆలోచించుకోనీ పారూ.

పా: ఆలస్యం చేస్తే మానాన్న అన్నంతపనీ చేసుకునే వస్తాడు. తరువాత ఏమీ చేయలేం. చెప్పు దేవదా.

దే: సరే. నాన్నగారితో మాట్లాడి, రేపే నీకు సమాధానం చెబుతాను. పద.

మరుసటి దినం తండ్రిని వొప్పించటానికి దేవదాసు ప్రయత్నిస్తాడు. తండ్రి వొప్పుకోడు. పార్వతితో ఈ విషయం చెప్పటానికి మనసొప్పక, పట్నానికి పారిపోతాడు. పారిపోయి ఊరుకుంటే బావుండేదేమో. ఊరుకోకుండా పార్వతికి జాబు రాస్తాడు. మా అమ్మా నాన్నా ఇష్టపడటం లేదంటాడు; నన్ను మరచిపో అనేస్తాడు తేలిగ్గా. అంతవరకు ఆగినా వొకలా వుండేది.

అనవసరంగా ఆ ఉత్తరంలో 'మీరు కులం తక్కువ వాళ్ళట. పిల్లల్ని అమ్ముకునే వంశమట' అనే మాటలు ప్రస్తావిస్తాడు. ఇవి రెచ్చగొట్టే మాటలుగాని, ఉపశమనం కలిగించేవి కావు. ఇక పార్వతి చేయగలిగిందేముంది? ఆత్మీయత తొలగిపోయి ఆ స్థానాన్ని పంతం ఆక్రమిస్తుంది. ఇంతవరకు జరిగిన కథలో దేవదాసంటే పార్వతి పడిచస్తుందిగాని, దేవదాసుకు పార్వతి మీదుండేది కేవలం అటాచ్‌మెంట్ తప్ప, లోతైన ప్రేమ కాదనిపిస్తుంది.

'తల్లితండ్రి జానేదేవ్. వాళ్ళకోసం మన జీవితం పాడుచేసుకుంటామా? నాకు నచ్చిన పిల్లనే నేను చేసుకుంటా'నంటాడు దేవదాసు స్నేహితుడు భగవాన్. నచ్చడం వరకైతే దేవదాసుకు పార్వతే నచ్చింది. మరో అమ్మాయితో పరిచయంగూడా లేదతనికి. భగవాన్ మాటలు అతన్ని ప్రేరేపిస్తాయి. పార్వతి కోసం వెంటనే తిరుగు ప్రయాణం కడతాడు. స్వగ్రామం చేరేవేళకు సీను మారిపోయింది. పార్వతికి వయసుమళ్లిన ఒక జమీందారు సంబంధం నిశ్చయించుకుని ఆమెతండ్రి తిరిగొస్తాడు. లేతపిల్లను ముదుసలికి కట్టబెట్టడానికి ఆమెతల్లీ, నాయనమ్మ ఇష్టపడరు. పార్వతి మాత్రం సరేనంటుంది.

దేవదాసు తిరిగొచ్చి పార్వతిని కలుసుకుంటాడు.

దే: పారూ, వచ్చాను పారూ.

పా: దేనికీ?

దే: నీకోసమే.

పా: నాతో నీకేం పని?

దే: అదేం మాట పారూ. నామీద కోపమొచ్చిందా?

పా: వస్తే నీకేమిటి? నేనేం తల్లినా తండ్రినా బెదిరించటానికి? కులంలేని పేద పిల్లను.

దే: ఏమిటా మాటలు.

పా: నువ్వు రాసిన మాటే.

దే: అప్పుడంతదూరం ఆలోచించలేకపోయాను. అందుకోసమే పరిగెత్తుకొచ్చాను. క్షమించు పారూ.

పా: నిన్నేనా క్షమించవలసింది. చిన్ననాటినుండి చేసిన సావాసానికీ, పెట్టుకున్న ఆశలకు నీవు చేసిన పనికి నిన్ను దేవుడైనా క్షమిస్తాడా దేవదా?

దే: అవన్నీ మరిచిపో పారూ. నువ్వు సరేనంటే ఎలాగైనా మాఅమ్మనూ నాన్ననూ వొప్పిస్తాను.

పా: నీకేనా అమ్మానాన్నా వుంది? నాకులేరా? వాళ్ళొప్పుకోవద్దూ?

దే: మన పెళ్ళి వారికిష్టమేగా.

పా: ఐతే ఈ సంబంధం ఎందుకు నిశ్చయం చేస్తారు?

దే: నీకిష్టం లేదను.

పా: ఎందుకనాలి? నీకు సిగ్గులేదని నాకూ లేదనుకున్నావా దేవదా?

దే: పారూ. నాకు ఆలోచన తక్కువని ఆవేశం ఎక్కువని నీకు తెలుసుగా.

పా: తెలీకేం, బాగా తెలుసు. చిన్నప్పటినుండి నువ్వంటే భయపడుతున్నానని బెదిరించటానికి వచ్చావా?

దే: ఆ.. నేనంటే భయమేగానీ మరేమీలేదా పారూ?

పా: ఊహు.

దే: నిజంగానా?

పా: ఆ. ముమ్మాటికీ. కాస్తోకూస్తో ఇదివరకున్న గౌరవంగూడా మాసిపోయింది.

దే: ఆ .. ఇంత అహంకారమా.

పా: తప్పేముంది. నీకున్న సిరిసంపదలు మావాళ్ళకు లేకపోయినా మావాళ్లు తిరిపెమెత్తుకుని తిరగటంలేదు. నీకు రూపముంది గానీ గుణంలేదు. నాకు రూపమూ గుణమూ రెండూ వున్నాయి. ఇకముందు నీ తలదన్నే సిరిసంపదలు గూడా వుంటాయి. ఇప్పుడు నన్ను కోరి పెళ్ళాడేవారు నీకన్నా ధనవంతులు, బుద్ధిమంతులు, ధైర్యవంతులు, ధార్మికులు. వారిని కాదని నీవంటి అజ్ఞానినీ, చపలచిత్తుణ్ణీ ఎందుకు వరించాలి?

దే: పారూ .. నా సంగతి తెలుసుగా.

పా: ఏంచేస్తావేం? సిగ్గులేకుండా అర్ధరాత్రి నీ ఇంటికొచ్చి ఆశ్రయించానని అపవాదులేస్తావ్. అంతేగా.

దే: నేనంత నీచుణ్ణా, ఛీ

అంటూ పార్వతిని కర్రతో బలంగా కొడతాడు. నుదిటిమీద రక్తగాయమౌతుంది. పెళ్ళికూతురు, నుదుటిమీద నెత్తురుగాయం, సంబాలించుకుంటాడు. సంభాలించుకుని అంటాడు -

**'ఎప్పటికీ మన చిన్నతనం మరపురాకుండా గుర్తు. గాయం త్వరగానే మానుతుందిలే పారూ. మచ్చమాత్రం స్థిరంగా వుంటుంది. పారూ, అత్తవారింట్లో అద్దం చూసుకున్నప్పుడల్లా నన్ను అనుకుంటావుగదూ.'**

ఈ మాట వింటూనే ప్రేక్షకుల మనస్సు చివుక్కుమంటుంది. ప్రేమికుల ఎడబాటును, అందులోనూ శాశ్వతమైన ఎడబాటును, ఈమాట నిర్ధారణ చేస్తూవుందని అందరూ గ్రహించకపోయినా ప్రతివారికీ నొప్పిమాత్రం కలుగుతుంది.

కొందరికి పోగొట్టుకున్నదాకా సొత్తు విలువ తెలీదు. పోయిన తరువాత దాని కోసం ప్రాకులాడుతారు. దేవదాసు అలాంటివారిలో వొకడు. పార్వతికి పెళ్ళైపోతుంది. దేవదాసు పట్నం చేరిపోతాడు. ఏదో తెలియని అశాంతి, ఆవేదనా అతన్ని వెంటాడుతాయి. విరుగుడు కోసం, మిత్రుడు భగవాన్ తీసుకెళ్ళగా, చంద్రముఖి అనే పేరుమోసిన వేశ్య ఇంటికి వెళతాడు. కానీ, ఆ వాతావరణం అతనికి ఏవగింపు కలిగిస్తుంది. ఆమె ముఖాన డబ్బు విసిరికొట్టి, పరువుగా బ్రతకడం నేర్చుకోమని మందలించి వస్తాడు. చంద్రముఖికి కనువిప్పు కలుగుతుంది. వృత్తి మానేసి దేవదాసుకోసం పరితపిస్తుంది.

దేవదాసు క్రుంగిపోవడం చూడలేక బ్రాందీ తాపిస్తాడు భగవాన్. బాధను మరువడానికి అది బావుందని, దేవదాసు ఇంకా కావాలంటాడు. వద్దంటే వినడు. స్వయంగా తెచ్చుకోటానికి పూనుకుంటాడు. విధిలేక, భగవాన్ మళ్లీమళ్లీ తీసుకొస్తాడు. దేవదాసు ఇలా తాగుబోతౌతాడు. దేవదాసును వొక్కసారి తనింటికి తీసుకురమ్మని భగవాన్ను చంద్రముఖి బ్రతిమాలుతుంది. తాగుడు మైకంలో వున్న దేవదాసును ఆమె ఇంటికి చేరుస్తాడు భగవాన్. అంత మైకంలోనూ చంద్రముఖిని దేవదాసు సోకనివ్వడు. ఇంతలో తండ్రి చనిపోయినట్టు దేవదాసుకు కబురొస్తుంది. స్వగ్రామానికొచ్చి, అంత్యక్రియలు ముగించుకుని, కొంతకాలం అక్కడే వుండిపోతాడు. ఆ సమయంలో పార్వతి పుట్టింటి కొస్తుంది. పలకరించి పోదామని దేవదాసు దగ్గరికొస్తుంది. అతని పరిస్థితి ఏమీ బావుండలేదనీ, తాగుడు మాన్పించడం ఆమె వొక్కదానికే సాధ్యమనీ గుమ్మం వెలుపలే బంట్రోతు ధర్మన్న చెబుతాడు. లోపలికొచ్చిన పార్వతికి దేవదాసు పరిస్థితి క్షణంలో అర్థమౌతుంది. చూసీ చూడగానే

పార్వతికి దేవదాసు పరిస్థితి అర్థం కావడానికి కారణం - మేకప్ ఆర్టిస్టు మంగయ్య. నాగేశ్వరరావు ముఖంలో, దేహంలో త్రాగుడుతో చితికిపోయిన సౌష్ఠవాన్ని చూపించాడు; కళ్ళలో ఆవేదన గూడుకట్టుకున్న దైన్యాన్ని చూపించాడు; చిదుగుల్లో అవసానానికి దగ్గరపడిన అవశేషాన్ని చూపించాడు; చూడగానే ప్రేక్షకులు జాలితో కరిగిపోయే నాగేశ్వరరావును చూపించాడు.

గదిలో ప్రవేశించిన పార్వతిని చూసి ఆశ్చర్యపోతాడు దేవదాసు -

దే: రా పారూ. గ్రహించానులే పారూ. సిగ్గుపడుతున్నావుగదూ. ఇంకా సిగ్గెందుకు? చిన్నతనంలో ఏవో చిలిపిచేష్టలు చేశాం. మధ్యలో రసాభాసైంది. నీ నోటి కొచ్చినట్టు నువ్వన్నావ్. నాచేతి కొచ్చినట్టు నేను కొట్టాను. కానీ ఆ మచ్చ ఇంకా మాసిపోలేదు పారూ. చిన్నతనం ఎంత హాయిగా గడిచిందో ఇప్పుడంత బాధగావుంది పారూ. నాన్నగారు పోయారు. ఇంట్లో అందరి సంగతి నీకు తెలిసిందే. ఏమీ పాలుపోవటంలేదు. హు, పారూ, నువ్వే నా పక్కనుంటే ఈ గొడవలన్నీ నీ కప్పగించి జీవితమంతా హాయిగా గడిపేవాణ్ణి. .... ఏమిటి పారూ, ఏడుస్తున్నావా? ఐతే నా బాధలేవీ నీతో చెప్పనులే.

(చిన్ననాటి ముచ్చట్లతో పరామర్శించడం బాగానేవుంది. కానీ, 'చిలిపిచేష్టలు' అనే పదం ఇక్కడ ఎందుకు వాడారో తెలీదు. పార్వతి శీలాన్ని అపార్థం చేసుకునే అవకాశానికి ఆ పదం తావిస్తుంది.)

పా: లేదులే దేవదా, చెప్పు.

దే: కూర్చో పారూ. (నవ్వుతూ) నిన్ను చూస్తే నవ్వొస్తోంది పారూ. ఇంత పిల్లవు, ఎంతలో పెద్దదానివైపోయావ్. పెద్ద జమీందారీ, పేద్దపెద్ద భవనాలూ, నీకంటే పెద్ద పిల్లలూ, ఇంకా పేద్ద .. (ఇద్దరూ నవ్వుకుంటారు) అంతా బావున్నారా?

పా: ఆ. కానీ ..

దే: ఆగిపోయావేం.

పా: నిన్నొక మాట అడగనా?

దే: ఒక్కటేమిటి, మనసులో వున్నవన్నీ అడిగెయ్.

పా: అహోరాత్రాలూ అదేపనిగా తాగుతున్నమాట నిజమేనా?

దే: ధర్మన్న చెప్పాడా?

పా: ఎవరైతేనేం, నిజమేనా?

దే: నిజమే.

పా: ఆ భయంకర పానపిశాచికి దాసులై, ఎందరో మానప్రాణాలు పోగొట్టు కున్నారు. దేవదా, ఇకనైనా తాగనని మాటియ్.

(చక్కని భాష. ఫ్లవరీ అండ్ పొయెటిక్ ఎక్స్‌ప్రెషన్. కానీ, సాధారణ గృహిని మాట్లాడే భాష కాదు.)

దే: సరే, నువ్వెప్పుడూ నన్ను తలుచుకోనని మాటియ్.

పా: ఉహు, నావల్లకాదు.

దే: అదే మన సమాధానం.

పా: కాదు, నువ్వు తలుచుకుంటే ఏపనైనా చెయ్యగలవ్.

(ఏపనైనా సాధించే దాఖలాలు ఇదివరకు ఎక్కడా చూపలేదు.)

దే: అలాగా? ఐతే, ఈ రాత్రికిరాత్రి నిన్ను లేవదీసుకుపోగలనా?

పా: ఆ.

దే: అదెంత సాధ్యమో ఇదీ అంతే.

పా: పోనీ, మంచిపిల్లను చూసి పెళ్ళాడితే మనసు మారుతుందేమో.

దే: ఆఆ, నాకూ సంసారి కావాలనే వుంది, నీలాంటి పిల్ల దొరికితే.

పా: నాలాంటిదా, ఎక్కడ దొరుకుతుంది?

దే: ఉండదు గనుకనే మనం ఇలావున్నాం. ఆ, మసకపడుతూంది. ఇంటికి పో. (పార్వతి తలుపేస్తుంది.) తలుపుతియ్ పారూ.

పా: తాగనని ప్రమాణం చెయ్.

దే: అన్నీ తెలిసిగూడా బలవంతపెట్టకు పారూ. తలుపుతీ.

పా: ఊహు. ప్రమాణం చేస్తేగాని నేనిక్కడినుంచి కదలను.

దే: పారూ, మండిపోయే ఆవేదనను దీనివల్లనైనా కొంత మరిచిపోగలుగు తున్నాను. ప్రమాణం చేయించి ఆ కాస్తా శాంతిగూడా లేకుండా చేస్తావా పారూ.

(పార్వతి తలుపుకేసి తల బాదుకుంటుంది.)

పా: మన్నించు దేవదా. నిన్ను సుఖపెట్టలేకపోగా, నిరంతర బాధలు అంట గట్టాను. నీకు సేవజేసి నా పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటాను. మా యింటికిరా దేవదా.

దే: సేవతో ఆవేదన చల్లారుతుందా పారూ.

పా: ఆ, చిన్నప్పటినుండి నాకున్న కోరిక అది. అది తీరితే నేనేమైనా దిగుల్లేదు. రా దేవదా.

దే: అలాగే వస్తాను పారూ.

పా: నా చేతిలో చెయివేసి చెప్పు.

దే: వస్తాను పారూ, నిజంగా వస్తాను. ప్రాణాలు పోయేలోగా తప్పకుండా వస్తాను. ఈమాట మరిచిపోను.

ఇది గుండెలు పిండే సన్నివేశం. సెంటిమెంటుతో మెదడు మొద్దుబారుతుంది. హృదయం విలపిస్తుంది. కానీ, . . . ఇంత గొప్ప సన్నివేశానికి కూర్చిన సంభాషణ ఎంత ముదనష్టంగా వుండాలో అంతవరకూ వుంది. తాగుబోతు దేవదాసుతో ఫలానా డైలాగులు చెప్పిస్తే బావుంటుందనుకున్నవి ముందు తయారుజేసుకుని, అవి జవాబులుగా రావటానికి అవసరమైన ప్రశ్నలూ, మాటలూ పార్వతితో మాట్లాడించడమేతప్ప వాస్తవికంగా లేవు. చనిపోయేముందు పార్వతిని చూడాలనే కోరిక దేవదాసులో సహజంగా కలగకుండా, కేవలం పార్వతికిచ్చిన మాటకోసం ఆమె దగ్గరికి వెళ్ళేలా చేయటంలో ఔచిత్యం గాయపడింది. దేవదాసు పాత్రను చివరకు హృదయంలేని యంత్రంగా మలిచాడు రచయిత.

సేవ చేసుకోటానికి తనింటికి రమ్మంటుంది పార్వతి. ఏ ఇంటికి? పుట్టింటికా, భర్తింటికా? అకారణంగా సంసారాన్ని వదిలిపెట్టి ఆమె పుట్టింటికి రానూలేదు; భర్త, పిల్లలు, పరివారం, ప్రపంచాలను కాదని అతన్ని భర్త ఇంట్లో ఉంచుకోనూలేదు. పార్వతిది ఆలోచన కలిగిన పాత్రగా చెప్పుకుంటూ వచ్చి, ఈ ఆలోచనలేని ఆహ్వానాన్ని ఆమెకెందుకు తగలగట్టడం? అత్తవారిల్లంటే ఆశ్రమం కాదు. ఇతడెవరని అక్కడివారు అడిగినప్పుడు పార్వతి ఏమని సమాధానం చెప్పాలి? చిన్న మెలోడ్రమా కోసం పాత్రల స్వభావాన్నీ, నడవడికనూ ఇంత తీవ్రంగా దెబ్బతీయడం సహించరాని అపరాధం.

తాగి వీధిలో పడిపోయిన దేవదాసును ధర్మన్న, చంద్రముఖి కలిసి టాంగాలో ఇంటికి తీసుకొస్తారు. డాక్టరును పిలిపిస్తారు. ఆయన దేవదాసును పరీక్షించి ఎక్కువ కాలం బ్రతకడని తీర్మానిస్తాడు. దేవదాసును స్వగ్రామం వెళ్ళమంటుంది చంద్రముఖి. అతడు బయలుదేరుతాడు. వైద్యుని మాటలు అతనికి వినిపించివున్నాయి గాబట్టి, కారణం అతనికి తెలుసు. ప్రయాణంలో రైలు వొక ప్లాట్‌ఫాం మీద ఆగుతుంది. అది దుర్గాపురం రోడ్డుగా ప్రకటన వినిపిస్తుంది. పార్వతి అత్తగారి ఊరు దుర్గాపురం. ఊరిపేరు వినగానే పార్వతికి తనిచ్చిన మాట జ్ఞాపకమొస్తుంది దేవదాసుకు. ధర్మన్నను నిద్రలేపకుండా అతడక్కడ దిగిపోతాడు. రైలు కదిలిపోతుంది.

దుర్గాపురం వెళడానికి ఎద్దులబండి మాట్లాడుకుంటాడు దేవదాసు. అక్కడికి ఆవూరు చాలాదూరం. దారిగూడా సరిగాలేదు. అవసరంగా వెళ్ళాలని బ్రతిమాలితే బండిమనిషి కనికరం చూపిస్తాడు. దారిలో దేవదాసు ఆరోగ్యం నిమిషనిమిషానికీ క్షీణిస్తుంది. కొనవూపిరితో  దుర్గాపురం చేరుకుంటాడు. చివరకు పార్వతిని చూడకుండానే మరణిస్తాడు. ఇది తెలిసిన పార్వతి శవం దగ్గరికని పరిగెత్తుతుంది. కోట దర్వాజా మూయడంతో, ఆమె వాటికి ఢీకొని ప్రాణాలు విడుస్తుంది. ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవలసింది బండితోలేవాడుగా నటించిన నటుని గురించి. ఆ కొద్దిసేపూ - దేవదాసును స్టేషన్నుండి దుర్గాపురం తీసుకొచ్చిందాకా, ఆ చిన్నపాత్రలో అతడు కనబరచిన సామర్థ్యం అంతా యింతాగాదు. నటనలో మొదటి బహుమతికి ఈ చిత్రంలో ఆ పాత్రధారుడే అర్హుడు.

గొప్ప సెంటిమెంటుతో, మంచి పట్టు కలిగిన కథ గాబట్టి, చిత్రీకరణలో ఔచిత్యానికి ఎంత విపత్తు కలిగినా తట్టుకుని, ప్రేక్షకులను మెప్పించగలిగింది. మంచికథకు తగినట్టు మంచి తారాగణం కుదిరింది. దేవదాసుపాత్ర అక్కినేని నాగేశ్వరరావును సాంఘికచిత్రాలకు తిరుగులేని హీరోగా నిలబెట్టింది. కథా నాయకిగా అదివరకు పెద్ద అనుభవంలేని సావిత్రిలో దాగివున్న కళాకారిణి ఈచిత్రంవల్ల వెలుగులోకివచ్చి, తెలుగుతెరమీద ఆమెకు అధిపత్యాన్ని కట్ట బెట్టింది. దేవదాసు తండ్రిగా ఎస్.వి.రంగారావు, పార్వతి తండ్రిగా దొరస్వామి, ఆమె నాయనమ్మగా సురభి కమలాబాయి, భర్తగా సి.ఎస్.ఆర్. ఆంజనేయులు

మొదలైనవారు అదివరకే ప్రఖ్యాతిగాంచిన నటులు గాబట్టి వారి ప్రతిభను గురించి ప్రత్యేకంగా చెప్పేదేముంది? చెప్పవలసింది చంద్రముఖి పాత్రను పోషించిన లలిత గురించి. ఆమె వెండితెరకు కొత్తగాదు. అదివరకు డ్యాన్సరుగా చాలా చిత్రాల్లో నటించింది. కథలో పాత్రను నిర్వహించడం ఇదే మొదటిసారి. మాతృభాష తెలుగుకాదు. ఐనా, ఎక్కడా లోపంలేని ఉచ్చారణతో చక్కగా నటించింది.

దేవదాసు నిర్మాణం వొక 'టీం వర్క్' అని చాలామంది అంటుంటారు. స్క్రిప్ట్‌లో చెయ్యిపెట్టిన దగ్గరినుండి, చివరివరకు దర్శకుడూ, సాంకేతిక బృందం, నటీనటవర్గం కలిసి ఆలోచించి రూపొందిస్తే టీంవర్క్ అవుతుంది. ఇందులో అందుకు ఆస్కారం లేదు. కథ కొత్తదిగాదు. స్క్రిప్ట్‌పని ఇతర భాషల్లో అదివరకే సిద్ధంగావుంది. సుబ్బరామన్‌కు సలహా ఇవ్వగల సంగీత ప్రవేశం మిగతా ఎవ్వరిలోనూ కనిపించదు. తనదైన శైలిలో ప్రఖ్యాతిగాంచిన ఫొటోగ్రాఫర్ బి.ఎస్.రంగా. సెట్టుమీద కలుపుగోలుగా వుండడం, వొకరినొకరు ప్రోత్సహించుకోవడం, సమయం వృధాకాకుండా షూటింగువేళలకు రావడం, ఆలస్యమైనా తొందరపడకుండా నిలిచి పని పూర్తిజేసుకోవడం వంటి సహకారం 'టీం స్పిరిట్' అవుతుందేతప్ప 'టీం వర్క్' కాజాలదు.

కమలాన్ని కోసుకుందామని కొలన్లో దిగితే కాసింత బురద అంటుకుంది. పువ్వు దొరికిందికాబట్టి దిగుల్లేదు. కడిగేసుకుంటే బురద విడిచిపోతుంది. బురదను కడి గేయటానికి బురదనీరు బావుండదు. శుభ్రంగా వుండేవైతే - అవి దొరికితే కడగటంతో సరిపెట్టుకోవడమెందుకు, దిగి ఏకంగా జలకాలే ఆడొచ్చు. అందుకు అనువైన గంగాస్రవంతి ఉండనేవుంది. దాని పేరు వాహినీవారి 'బంగారు పాప.'

# బంగారుపాప

**తాధిమి తకధిమి తోల్బొమ్మా, దీని తమాస సూడవె కీల్బొమ్మా**
**దీని తమాస సూడవె మాయబొమ్మా**
**ఆటమ్మా పాటమ్మా, జగమంతా బొమ్మాలాటమ్మా**
**తలాంగు తకధిమి తోల్బొమ్మా తోం తకతై తకతై మాయబొమ్మా**
**ఆయి ఆయి ఆయీ ఆపదలు కాయీ**

మద్రాసులో, పాండీబజారులోని వొక సినిమాథియేటర్‌నుండి ఈపాట బయటికి వినిపిస్తూంది. అది ఆ దారిన నడుస్తున్న ఎస్.వి.రంగారావు చెవిలో పడింది. ఆయన తిన్నగా థియేటర్ గేటువైపు నడిచాడు. గేటు తాళం వేసుంది. అప్పటికే దాదాపు సగం సినిమా జరిగిపోయింది. బయట లైట్లన్నీ తీసేశారు. పాట పూర్తయినంతవరకు తల గేటుకానించి వింటూ నిలుచున్నాడు. పూర్తి కాగానే తృప్తిగా నిట్టూర్చి తన దారిన వెళ్ళిపోయాడు. 'బంగారుపాప' చిత్రమంటే రంగారావుగారికి అంత ప్రాణం. అది తనను ప్రధమశ్రేణి కళాకారునిగా ప్రపంచానికి నిరూపించిన చిత్రం. తన జీవితానికి మాస్టర్‌పీస్.

రంగారావు జీవితానికే కాదు, యావత్భారతదేశంలో తీసిన సాంఘిక చిత్రాలకే అది మకుటం వంటిది. ఇందులో వృధాగా తీసిన వొక్కసన్నివేశం కనిపించదు, వృధాగా పలికించిన వొక్క మాట వినిపించదు. ఒక సన్నివేశంనుండి మరొకదానికి మారే సమయంలో గతుకులు లేకుండా, పిల్లతెమ్మెర వీచినంత కమ్మగా చిత్రమంతా సాగిపోతుంది. 'మల్లీశ్వరి' తరువాత, 1954లో, బి.ఎన్.రెడ్డి దర్శకత్వాన వాహినీసంస్థ నిర్మించిన కళాఖండమిది.

హీరో పాత్రలను ఇద్దరుముగ్గురు నటులు దత్తత చేసుకున్న రోజులవి. ఆ నటుల ముఖాలు కనిపించకుండా సినిమా తీసే సాహసం నిర్మాతలు తలపెట్టలేని దశ. హీరో అంటే అన్నీ ఉత్తమ లక్షణాలే వుండాలనే భావన ప్రేక్షకుల మెదడులో పాదుగొన్న సమయం. ఆ వాతావరణంలో, చెడిపోయిన వొక కంసలోడి కథను, ముసలివేషాలు వేసే ఎస్.వి.రంగారావును హీరోగా

చేసి, ముక్కుపచ్చలారని కృష్ణకుమారిని హీరోయిన్‌గా తీసుకుని, సినిమాను నిర్మించాడంటే, బి.ఎన్.రెడ్డి ఎంత గుండెలు తీసిన బంటు!

1951లో 'మల్లీశ్వరి' ద్వారా దేవులపల్లి కృష్ణశాస్త్రిని సినిమాకు పరిచయం చేసినట్టే, ఈసారి పాలగుమ్మి పద్మరాజును రంగంమీదికి తీసుకొచ్చాడు బి.ఎన్.రెడ్డి. జార్జ్ ఎలియట్ నవల 'సైలాస్ మార్నర్' ను తెలుగు సినిమాగా తీయాలనేది అతని కోరిక. తెలుగుకథగా మలిచే పనిని పద్మరాజు గారికి అప్పగించాడు. ఇద్దరూ కలిసి రూపకల్పన చేశారు. కథకు అనుకూలంగా స్క్రీన్‌ప్లే, దానికి అనుకూలంగా కథ, మార్చిమార్చి సరిజూసుకున్నారు. పాటలు వ్రాసే కార్యక్రమం దేవులపల్లివారికి అప్పగించారు. సంగీతం పగ్గాలు అద్దేపల్లి రామారావుగారికి అందించారు. ఒక్కొక్క పాత్రనూ ఆలోచించి, రంగంలో వుండే ముఖాలనుండి ఖచ్చితంగా ఆ పాత్రలకు సరిపడే తారాగణాన్ని ఏరుకున్నారు.

ఈ కథలో నాయకుడైన కోటయ్య జీవితం మూడు దశలుగా జరుగుతుంది. మొదట దగాపడిన ప్రేమికుడు. తరువాత, తాగుబోతు రౌడీ, చివరకు పరిపూర్ణంగా పరవర్తన చెందిన తండ్రి. ఇన్ని వైవిధ్యాలు కలిగిన పాత్రకు న్యాయం చేయాలంటే వొక్క రంగారావుకే చెల్లు. సంతలో కోటయ్య మరో రౌడీతో కలబడే సమయంలో సినిమా మొదలౌతుంది. ఆ గలాటా కాగానే, తప్పతాగి రోడ్డుకు అడ్డంగా జారగిలబడి పడుకుంటాడు. తన ఊరి జమీందారుగారి ఏకైక పుత్రుడు మనోహర్ ఆ దారిన కార్లో వస్తూ, కోటయ్య అడ్డొచ్చి ఆగిపోతాడు. తప్పుకుని దారి ఇమ్మంటాడు. కోటయ్య ఖాతరు చెయ్యడు. దబాయిస్తూ మనోహర్ కారు దిగిపోతాడు. క్రూరంగా ఆ కారు యజమాని ముఖంలోకి చూసిన కోటయ్య, మనోహర్‌ను గుర్తుపడతాడు. అతడు తన చినబాబే. 'రేయ్, ఎవరనుకున్నావ్‌రా, మన చినబాబుగార్రా, లే, తప్పుకో' అంటూ తన పెంపుడుకుక్కకు చెబుతూ, 'ఎల్లండి బాబయ్యా, ఎల్లండి' అంటూ వినయంగా దారిచేస్తాడు. 'చూడనేలేదు గుడ్డినాయాల్ని' అంటూ తనలో తను సనుక్కుంటాడు. మనోహర్ కారును స్టార్ట్ చేసి వెళిపోతుండగా, ఆ కారులో వొక ఆడమనిషి ఉండటం గమనించిన కోటయ్య, 'చెడిపోతావ్ చినబాబూ, ఆడదాన్ని నమ్మొద్దు, చెడిపోతావ్,' అంటూ కారు

వెంటపడి బ్రతిమాలుతాడు. ఆగకుండా కారు వెలిపోతుంది.

కోటయ్య పాత్రను రౌడీగా ప్రవేశపెట్టడం జరిగిపోయింది. ఆఊరి జమీందారు కుటుంబమంటే అతనికి గౌరవమని ప్రత్యేకంగా చెప్పకుండానే పూర్తయింది. అంతాకలిసి నాలుగు నిమిషాల సీను. ఒక్కగానొక్క పాత్ర స్వభావాన్ని మూసపోయడానికి బి.ఎన్.రెడ్డికి అంతకంటే ఎక్కువ సమయం అక్కరలేదు. దానికితోడు పక్కన్నే ఎస్.వి. రంగారావు వుండనేవుండె. కారు వేగం పుంజుకోగానే కుక్క మొరుగుడు వినిపించడం ఈ సీనులో ప్రత్యేకంగా గమనించవలసిన అంశం. పరిగెత్తే కారును చూస్తే కుక్కలకెందుకో సివమె క్కుతుంది. ఇంత మెలుకువ పాటించిగూడా, ఆ సీనులో కనిపించిన కుక్క సినిమా మొత్తంలో మరెక్కడా కనిపించకపోవడ మొక్కటీ అంత బావుండలేదు.

మనోహర్‌తోపాటు కారులో వున్న ఆడమనిషి మరెవరో కాదు, అతని భార్య శాంత. పరాయి కులానికి చెందిన ఆ పేదపిల్లను మనోహర్ రహస్యంగా పెళ్ళిచేసుకుని రెండేళ్ళు దాటిపోయింది. వారికొక కూతురుగూడా పుట్టింది. ఆ వివాహం గురించి మనోహర్ ఇంట్లోగానీ, ఊర్లోగానీ ఎవరికీ తెలియనివ్వడు. అందుకే కోటయ్య ఆమెను పరాయిస్త్రీగా భావించాడు. రైల్వేగేటు మూసుం డడం వల్ల, మనోహర్, శాంత అక్కడ ఆగవలసి వస్తుంది. కారుదిగి అలా పక్కకు పోయి, సిగరెట్ వెలిగిస్తాడు మనోహర్. శాంతగూడా కారుదిగి అతని దగ్గరికి చేరుకుంటుంది. కోటయ్య మాటలకు ఆమెలో కలిగిన ఆందోళన ముఖంలో కనిపిస్తూ వుంటుంది. కోటయ్య చాలా నిజాయితీపరుడని మనోహర్ ఆమెతో చెబుతాడు. అంత మంచిమనిషి ఎందుకిలా తయారయ్యాడంటే -

**'మా ఊర్లో రామి అని వొక పిల్లుండేది. మాఇంట్లోనే పనిచేస్తూ వుండేది. రామి అంటే కోటయ్యకు ప్రాణం. కోటయ్య కొలిమి దగ్గర పనిజేసుకుంటూంటే, రోజూ రామి అక్కడికి ఏదో నెపంమీద వస్తూండేది. కోటయ్య రామితో సరసా లాడుతూ వుండేవాడు.**

**'ప్రతిరోజూ కోటయ్య పాటకజనంతో కలిసి రామభజన చేస్తూండేవాడు. ఆ భజనపార్టీకి పెద్ద గోపాలస్వామి. కోటయ్య గోపాలస్వామిని గురువుగా పూజించేవాడు.**

**'కోటయ్య తల్లీ, చెల్లెలూ, బావా రామితో అతని పెళ్ళికి మూహూర్తం**

నిశ్చయించారు. చెల్లెలు మంగమ్మకుగూడా రామంటే ఎంతో ఇష్టం. అన్నగారి పెళ్ళి నిశ్చయమయిందని ఆమె ఎంతో మురిసిపోయింది.

'కోటయ్యంటే మా నాన్నాగారికి చాలా అభిమానం. మా నాన్నగారంటే కోటయ్యకు చాలా భక్తి, గౌరవం. చిన్నపనికీ పెద్దపనికీ మేము వాణ్ణే పిలుస్తుండేవాళ్ళం.

'పెళ్ళికూతురుకు బంగారు నగలేవైనా కొనిపెట్టమని కోటయ్యతల్లి గోపాలస్వామిని బ్రతిమాలింది. గోపాలస్వామి వొట్టి నీచుడు. దుర్మార్గుడు. అతని వేషం చూసి, పాపం, ఆ అమాయకులైన వాళ్ళు మోసపోయారు. గోపాలస్వామికీ రామికీ రహస్యంగా స్నేహం ముదిరిందని వాళ్ళెరుగరు. కోటయ్యకీ రామికీ పెళ్ళైతే తమ స్నేహానికి అంతరాయం వస్తుందని ఇద్దరికీ ఆదుర్దా ఎక్కువైంది.

'గోపాలస్వామీ, రామీ కలిసి తుచ్ఛమైన వారి సుఖానికి అడ్డైన కోటయ్యను తొలగించటానికి దారుణమైన పన్నాగం పన్నారు. ఒకనాడు మేమంతా సినిమా చూడ్డానికని పట్నం పోయాం. ఇంట్లో రామితప్ప మరెవ్వరూ లేరు. గోపాలస్వామీ, రామీ కలిసి మా భోషాణంలో వున్న పాతనగలన్నీ దొంగిలించారు. వాటిల్లో కొన్ని నగలు పెళ్ళికూతురు కోసం పట్నంనుండి కొనితెచ్చానని చెప్పి గోపాలస్వామి కోటయ్య తల్లి కిచ్చాడు. నగలు పోయాయని మా నాన్నగారు పోలీసులకు రిపోర్టిచ్చారు. పోలీసులు వచ్చి దర్యాప్తు చేశారు.

'కోటయ్యకు శిక్ష వేశారు. నెల తిరక్కుండానే కోటయ్యతల్లి గుండెపగిలి చచ్చిపోయింది. గోపాలస్వామీ, రామీ కలిసి అతన్ని సర్వనాశనం చేశారు. అమాయకుడైన అతని మనసులో మిగిలిందల్లా వారిమీద అంతులేని పగ. తరువాత కొద్దిరోజులకే నిజం బయటపడింది. రామి గోపాలస్వామితో ఎక్కడికో లేచిపోయింది. మాఇంట్లో పోయిన నగలు అమ్ముతుండగా గోపాలస్వామిని పోలీసులు పట్టుకున్నారు. వెంటనే మానాన్నగారు కోటయ్యను జైలునుండి విడిపించారు. పాపం, అప్పటినుండి వాడిలా తయారయ్యాడు. తాగుడూ, జూదం, అల్లరి. ఆడదాన్ని నమ్మొద్దని అందరికీ సలహా ఇస్తుంటాడు. పాపం, ఎలాంటివాడు ఎలా ఐపోయాడో.'

పూసగుచ్చినట్టు మనోహర్ చెప్పిన చరిత్రలో ప్రధానపాత్రలన్నీ దాదాపు పరిచయమైపోతాయి. ఒక్కొక్క పూస దగ్గిర వొక్కొక్క సన్నివేశం చూపెడుతూ గతాన్నంతా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాడు దర్శకుడు. నేపథ్యం తాలూకు

కథ చెప్పడంలో జగ్గయ్య గడుసరి. అతడు మనోహర్‌గానూ, జమున శాంత గానూ నటించారు. మనోహర్ తండ్రిగా డా.శివరామకృష్ణయ్య, గోపాలస్వామిగా వంగర, మంగమ్మగా హేమలత, నటించారు. కోటయ్య బావగా నటించిన వ్యక్తి ప్రసిద్ధుడేగానీ, నాకు పేరు తెలియదు. పాత్ర పెద్దదైనా చిన్నదైనా, ప్రతివొక్కరు వాటిల్లో జీవించినవారే. ఈ పదినిముషాల చరిత్రలో, వృత్తిపరంగా కోటయ్యకు మంచి పనితనముందనీ, భక్తిపరుడనీ, భజనపాటలు పాడతాడనీ తెలుస్తుంది. అమాయకుడేగానీ పగపడితే ప్రమాదకరమైనవాడని తెలుస్తుంది. భజనబృదంతో కలిసి కోటయ్య చెక్కభజన చేసే సన్నివేశంలో పల్లెటూరి జీవితం తెలిసిన కాల్పనికుడు కనిపిస్తాడు. ఒకనాటి గ్రామసీమల్లో భక్తికీ, వినోదానికీ ఏకైక సాధనమైన భజనపాటను అదే సాంప్రదాయంలో అదే వాతావరణంలో అతి సహజంగా చిత్రీకరించాడు దర్శకుడు.

జీవితంలో తగిలిన ఎదురుదెబ్బ కారణంగా, మంచిమనసుండే కోటయ్య చెడుమార్గం పట్టాడు. తనకుతాను తాగి తిరగడమే కాక, అతడొక పబ్లిక్ న్యూసెన్స్‌గా తయారయ్యాడని చెప్పడానికి వొక సన్నివేశాన్ని రూపొందించారు. ఊర్లో హరికథ జరుగుతుంటుంది. మంచి హరిదాసును తీసుకొచ్చారు. అతని నటన అద్భుతం. కంఠం శ్రావ్యంగా వుంది. ఆలాపన మధురంగా వుంది. జనమంతా వొళ్లుమరిచి వింటున్నారు. కోటయ్యొచ్చి అడ్డుతగులుతాడు. 'సీతను రావణుడు ఎత్తుకుపోయింది నువ్వు చూశావా' అని హరిదాసును నిలదీస్తాడు. గోపాలస్వామి రామిని ఎత్తుకెళ్లడం అందరికీ తెలిసిన వాస్తవం కాబట్టి, ఆ కథ చెప్పమని మొండికేస్తాడు. ఎవరు చెప్పినా వినకుండా పేచీకి దిగుతాడు. అంతలో చెల్లెలూ, బావా వచ్చి అతన్ని మందలిస్తూ ఇంటికి లాక్కెళతారు. చెల్లెలు రాగానే మెత్తబడ్డాడంటే, అతని గుండెలోతుల్లో ఇంకా అభిమానమూ, ఆత్మీయతలు దాగివున్నట్టే. కొత్త ప్రవర్తన అతని సహజ స్వభావాన్ని కప్పిపెట్టిందేతప్ప తుడిచిపెట్టలేదు.

ప్రకృతిని కళ్ళకు కట్టినట్టు వర్ణించడంలో దేవులపల్లిగారి ప్రతిభ మనకు కొత్తది కాదు. 'ఆకులో ఆకునై, పూవులో పూవునై, కొమ్మలో కొమ్మనై, నునులేత రెమ్మనై, ఈ అడవి దాగిపోనా' అని చదువుతూంటే మనకు అడవిని చూస్తున్న అనుభూతి కలుగుతుంది. ఆ గేయం కంటే ఎన్నోయేళ్ళకు

ముందే, బంగారుపాప కోసం రాసిన హరికథలో ఆ నడక, ఆ సొగసు, ఆ అనుభూతి కలిగించే  పదాలను ఆయన మనకు వినిపించారు. రాముడు వెంటపడి వస్తున్నప్పుడు బంగారులేడి కదలికలను గురించి ఆయన చెప్పింది వింటే నిజంగా జింకపిల్ల మనముందు కదులుతున్నట్టు అనిపిస్తుంది.

**మిసమిసలాడే పసిడిలేడికై మిథిలానందన వేడ**
**బిసబిస నా రఘువీరవరేణ్యుడు వెడలె లేడి జాడ,**
**అది వెనుకకొక్కపరి చూచి, తన మునికాళ్ళపైని లేచి,**
**అట వేచి తన మెడను చాచి,**
**భయ మెదను తోచి, తన యొడలు దాచి,**
**మరి దారి పొదలలో దూరి, అటవి బంగారులేడి పరువెత్తె.**

వేటగాన్ని చూసిన జింక ఎంత చలాకిగా తప్పుకుందో. అది చూసే సందర్భం కృష్ణశాస్త్రిగారికి ఎలా దొరికిందో!

మంగమ్మకు ఏకైక తోబుట్టువు కోటయ్య. ఎంత చెడిపోయినా ఆమె అన్నమీది మమకారం వదులుకోలేదు. ఎంత పోరినా కోటయ్య మారడు. హరికథనుండి ఇంటికి తీసుకొచ్చినప్పుడు గూడా మందలిస్తుంది; హితబోధ చేస్తుంది; బాగుపడమని బ్రతి మాలుతుంది.

**మం: అమ్మ చచ్చిపోయిందో సుకపడింది. అమ్మతోగూడా నేనూపోతే పీడా పోయేది. ఊరంతా ఉమ్మేత్తున్నా నీకు సిగ్గులేదు. మీబావ ఊల్లో తలెత్తుకోడానికి లేకుండావుంది. మీ బావేమో ఆ తాగుబోతు ఎదవ ఇంటి కెల్లొద్దంటాడు. నువ్ జూత్తే ఈ తాగుడూ, జూదం మానేట్టులేవు. నన్నెందు కిట్టా సంపుతావురా అన్నయ్యా. నాకెవరున్నారురా నువ్ తప్ప. నామాటిన్రా. ఈ పాడు బతుకు మానెయ్‌రా. మీబావతో సెప్పి సిలకలాంటి పిల్లను తెచ్చి నీకు పెల్లి సేత్తాను. ఏరా అన్నయ్యా, ఊ అనరా. లచ్చనంగా పెల్లి సేసుకోరా.**

**కో: (నవ్వి) పెల్లి. నాకింకా పెల్లెందుకే సిట్టీ, నీ పిచ్చిగానీ. బతికి సుకపడే రాత ఎప్పుడో ఐపోయింది. నాసామిరంగా, ఆ గోపాలసామిగాన్నీ రామినీ నరికెయ్యాల, నేను బతుకు సాలించెయ్యాల. సిట్టీ, నేను బతికున్నా సచ్చినోడితోనేగదే జమ.**

కోటయ్య ధ్యేయం బయటపడింది. గోపాలస్వామినీ, రామినీ నరికెయ్యాలనేది తప్ప అతని జీవితానికి ఏకోరికా మిగల్లేదు. అతడు బ్రతికుండడమే దానికోసం. ఆ కసీ, విరక్తీ కలిసిన భావం రంగారావును కంటితో చూస్తేనే తెలిసేది. మంగమ్మగా నటించిన హేమలత తన కళానైపుణ్యాన్నంతా ఈ సన్నివేశంలో ప్రదర్శించింది. మాటమాటకు ఆమె గొంతులో కదిలే ప్రకంపనాల పరంపర అపారమైన ఆమె మాడ్యు లేషన్ శక్తిని నిరూపిస్తాయి. దీర్ఘ మైన డైలాగు కావడంవల్ల ఆమె తన ప్రతిభను వెల్లడిం చేందుకు చక్కని అవకాశం దొరికింది.

కోటయ్యను తప్పిస్తే, తక్కిన పాత్రల్లో ప్రధానమైనవి మనోహర్, శేఖర్ పాత్రలు. మనోహర్ మంచి వ్యక్తిత్వంగల మనిషి. జాలిగుండె కలవాడు. కానీ, మనో స్థైర్యం తక్కువ. ఆటుపోట్లకు తాళలేని బలహీనుడు. శేఖర్ అతని అక్కకొడుకు. మేనమామ కున్న మంచి గుణాలకుతోడు అతనికి మనోస్థైర్యం, పట్టుదలలుగూడా వున్నాయి (a strong willed personality). ధైర్యం చాలనప్పుడు మనోహర్‌లో కనిపించే సర్దుబాటు ధోరణి, అవకాశవాదాలకు తావియ్యకుండా, పరిస్థితిని సాహసంతో ఎదుర్కొనే వ్యక్తిత్వం శేఖరుది. ఆ తేడాను అడుగడుగునా తెలిసేట్టు చేయడంలో దర్శకుడు సార్థకత సాధించాడు.

తమ పెళ్ళిని గురించి ఇకనైనా ఇంట్లో తెలపమని శాంత పోరు పెడుతుంది. ఒక్క నాలుగుమాసాలు ఓపిక పట్టమని సముదాయిస్తాడు మనోహర్. ఇంతలో అతని తండ్రి అతనికి పెళ్ళి నిశ్చయిస్తాడు. మనోహర్‌తో చెప్పి ముహూర్తం పెడదామని అల్లుడు చెబుతున్నా వినిపించుకోడు. చిన్నప్పటినుండి అనుకున్న సంబంధమే గనుక, ఆ అవసరం లేదంటాడు. ముహూర్తం ఖాయం చేసి, విషయం తెలపకుండా మనోహర్‌ను పిలిపిస్తూ కబురు పంపుతారు. జమీందారు అల్లుడు సత్యం (మనోహర్ బావ)పాత్రను ధరించిన రామన్నపంతులు మంచి ఆర్టిస్టు. కుటుంబవిషయాల సర్దుబాటుకు ప్రయత్నం చేస్తాడు. ఎవరూ ఖాతరు చెయ్యరు. ఐనా నొచ్చుకోడు. పౌరుషాన్ని జయించిన రుషిపుంగవునిలా తన కర్తవ్యం నిర్వర్తించడం తప్ప ఎలాటి ఉద్రేకానికీ లోనుగాడు. మరొక్క విషయం - శేఖర్ అప్పటికి నాలుగైదేళ్ళ

కుర్రాడు. పెళ్ళిని గురించి పెద్దవాల్లంతా తర్జనభర్జన పడుతూంటే, ఏదోవొక శబ్దం చేస్తూ విసిగిస్తుంటాడు. అది చిన్నపిల్లల సహజమైన ప్రవర్తనేగాక, రాబోవు రోజుల్లో ఆ కుటుంబానికి అతడు తలనొప్పి కాబోతాడనే సూచనగూడా అందులో వుందేమో.

మనోహర్ రాగానే గొడవ మొదలౌతుంది. పెళ్ళి జరిగితీరాలంటాడు తండ్రి. ససేమిరా కుదరదంటాడు మనోహర్. అక్కా బావా నచ్చజెప్పాలని చూస్తారు. వినిపించుకోడు. ఇంతలో శాంత దగ్గరినుండి ఉత్తరం వస్తుంది. ఈ పెళ్ళివిషయం ఆమెకు తెలిసిపోయింది. న్యాయాన్యాయాలు అతని తండ్రి దగ్గరే తేల్చుకోటానికి వస్తున్నానని రాసింది. అది ఆ రూపంగా జరగడమే మంచిదని మనోహర్ అనుకుంటాడు. చంటిబిడ్డతో ఆమె రైలుదిగి వస్తూండగా ప్రమాదం జరుగుతుంది. గాలివానకు చెట్టు కూలి ఆమెమీద పడుతుంది. ఆమె ప్రాణాలు విడుస్తుంది. చంటిదానికి అపాయం జరగదు. జోగాడుకుంటూ వొక దాపుకు చేరి ఏడుస్తుంటుంది.

అదే రాత్రి గోపాలస్వామి రైలుస్టేషన్‌లో దిగుతాడని కోటయ్యకు తెలుసు. ఆ ఊర్లో వున్న తన ఇంటిని ఎలాగైనా అమ్మి, సొమ్ముజేసుకోవాలని గోపాలస్వామి తిప్పలు పడుతుంటాడు. కోటయ్య భయానికి నేరుగా ఊర్లోకి రాలేక, మధ్యవర్తిద్వారా రాందాసు అనే చిల్లరకొట్టు యజమానికి బేరం పెడతాడు. అడ్వాన్సు ఇచ్చి ఇరికించుకుంటాడుగానీ, ఆ తరువాతి వ్యవహారం తెగనివ్వడు రాందాసు. అతన్ని రైలుస్టేషన్‌కే పిలిపించుకుని, ఎదోవొకటి తెంచేసుకోటానికి గోపాలస్వామి ఏర్పాటు చేసుకుంటాడు. కోటయ్యకు ఇంతకంటే మంచి అదను దొరకదు. ఈతపులికి (వేటకొడవలికి) పదును పెట్టడంలోనే కోటయ్య పగా, పట్టుదలా, బలి చేతికందుతూందన్న ఆనందం కళ్ళల్లో మెరుస్తుంటాయి. 'నాసామిరంగా, చచ్చి సొరగానవున్న మాయమ్మ భలేరా కోటయ్యా అనుకోవాల ఈయాల' అంటూ కొడవలి నూరుతాడు. పదును చూడటానికి పుల్లొకటి తీసుకుని, కత్తి తాకిస్తాడు. ఛక్కున తెగి, తుంట ఎగిరిపోతుంది. ఆ పుల్లను నరకడంలో పదునేమైనా తగ్గిందేమోనని మళ్ళీ నూరుతాడు. కొడవలి చంకకింద దాచుకొని స్టేషన్‌కు బయలుదేరుతాడు. గాలీ వానా; దారి కడ్డంగా పడిపోయిన చెట్టు; చెట్టుకింద కొనవూపిరితో

వున్న ఆడకూతురు; ఆ పక్కనే గుక్కతిరక్కుండా ఏడుస్తున్న చంటిపాప - కోటయ్య అడుగు ముందుకు పడకుండా వొక్క క్షణం ఆపుతాయి. వల్లగాదు, దొరక్కదొరక్క దొరికిన అవకాశం చేజార్చుకోగూడదు. గోపాలస్వామి నెత్తురుతో తల్లికి తర్పణమివ్వాల. తుడుచుకుని ముందుకు పోబోతాడు కోటయ్య. కేరుమని చంటిదాని రోదన మళ్లీ చెవులు తాకుతుంది. కాస్సేపు కొట్టుమిట్టాడుతాడు కోటయ్య. అతనిలో నిద్రపోతున్న మానవత్వం మేలుకుంటుంది. తల నరకడం కోసం పదునుపెట్టిన కొడవలితో ఛటుక్కున కొమ్మ నరుకుతాడు - అదే కసితో, అదే తోజుతో. ప్రాణాపాయంలో వున్న స్త్రీని భుజాన వేసుకుంటాడు. చంటిదాన్ని చంక కెత్తుకుంటాడు. ఇంటికి చేరి చెల్లెలిని పిలుస్తాడు. ఆమె నక్కడ కాపలావుంచి జమీందారు దగ్గరికి పరిగెత్తుతాడు. సమయానికి అక్కడేవున్న డాక్టరును పంపమని ప్రాధేయపడతాడు. డాక్టరు కోటయ్య ఇంటికొచ్చి, ఆ తల్లిని పరీక్షించి, అప్పటికే చనిపోయిందని చెప్పి వెళిపోతాడు.

కాస్సేపటికి మనోహర్ అక్కడికొస్తాడు. శాంతను గుర్తిస్తాడు. కళ్లనిండా నీళ్ళు పెట్టుకుని దుఃఖిస్తాడు. కానీ, ఆమె ఎవరనేది బయటికి చెప్పలేడు. శాంతకు అంత్య క్రియలు కోటయ్యే జరిపిస్తాడు. ఆ అనాధ శిశువును పెంచే బాధ్యత మీదేసుకుంటాడు. ఆ పాపే అతని 'బంగారుపాప.'

తండ్రి నిశ్చయించిన పెళ్ళికి ఇక అడ్డుచెప్పే అవసరంలేదు మనోహర్‌కి. పార్వతిని పెళ్ళాడి స్థిరపడిపోతాడు. ఏదోవొక పని కల్పించుకుని అప్పుడప్పుడు కోటయ్య దగ్గరికి పోయి, పాపను చూసివస్తుంటాడు. కోటయ్య పనికి అదనంగా డబ్బులిస్తూ వుంటాడు. పాపకు ఏదోవొక వస్తువు కానుకగా తీసుకెళ్ళి ఇస్తుంటాడు. లోతుగా పరిశీలిస్తే, కథలో చెప్పదలచిన సందేశం ఈపాటికే కొంత తెలిసిపోతుంది - మోసపోవటానికి మగవాడైనా వొకటే, ఆడదైనా వొకటే; అలాగే, మోసగించటానికి మగవాడెంతో, ఆడదీ అంతే.

పాప పెరుగుదలను నాలుగు దశలుగా విభజించి, మమతానురాగాల కోటయ్య పెంపకాన్ని చిత్రీకరించారు. మొదటిదశ ఉయ్యాలలో పసిగుడ్డు. రెండవదశ చిన్నిచిన్ని పద్యాలు పలికే నాలుగైదేళ్ళ కూన. ఆ తరువాత స్కూల్లో చదువుకునే పదిపన్నెండేళ్ళ చిన్నారి. చివరిగా పెళ్ళీడు కెదిగిన అమ్మాయి. ప్రతిదశలోనూ కోటయ్య జీవితం పాపతో ఎంతగా పెనవేసు

కుంటుందో చూపెట్టడంలో దర్శకుని ప్రతిభ ఆకాశాన్ని అంటుకుంటుంది. ఆ అనుబంధం తనకు తెలీకుండానే కోటయ్యలో అంతుదొరకని పరివర్తన తీసుకొస్తుంది. అలా చూపగలిగినందుకే, ఆరోజుల్లో తెలుగుసినిమారంగంలో దర్శకులుగా ప్రవేశించిన ప్రతివొక్కరికి బి.ఎన్.రెడ్డి ఆదర్శమైనాడు.

**తల్లిదండ్రులందు దయలేని పుత్రుండు, పుట్టనేమి వాడు గిట్టనేమి,**
**పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా విశ్వదాభిరామ వినుర వేమ.**

వచ్చీరాని మాటలతో పాప పద్యం చెబుతూంటే, వొక తండ్రి, ఎంతో మమకారంతో పెంచే తండ్రి, గుండెల్లోనుండి ఉబికే సంబరాన్ని కోటయ్య పాత్రలోని రంగారావులోనే చూడాలి. గోపాలస్వామి దగ్గర నేర్చుకున్న ఆటాపాటా ఇప్పుడు పాపను బుజ్జగించటానికి ఉపయోగపడుతున్నాయతనికి. పాప అన్నం తినాలన్నా, నిద్రపోవాలన్నా వొక కథో, వొక పాటో ఖచ్చితంగా అవసరం. లేకపోతే మారాం చేస్తుంది. పాపను నిద్రపుచ్చటానికి పాడిన జోలపాటే 'తాధిమి తకధిమి తోల్బొమ్మా.' దీన్ని పాడిన గాయకుడు మాధవపెద్ది సత్యం. హీరోలకు ప్లేబ్యాక్ అందివ్వడంలో ఘంటసాలగారిది ప్రధమస్థానమైతే, క్యారెక్టర్ నటులకు ప్లేబ్యాక్ ఇవ్వడంలో సత్యంగారిది ప్రధమస్థానం. ఆయనది గాంభీర్యం ఉట్టిపడే గాత్రం. అందుకే ఎస్.వి.రంగారావు పాడే పాటలకూ, పద్యాలకూ విధిగా మాధవపెద్దిగారి కంఠం అవసరమౌతుంది. హాస్యంగానీ ఉద్రేకంగానీ, దుఖ్ఖంగానీ, చలాకీతనంగానీ - భావంలో సంపూర్ణంగా నిమగ్నమై పాడటం ఆయన ప్రత్యేకత. 'మాయాబజార్' చిత్రానికి పాడిన పాటలు, పద్యాల్లో కనిపించే రసవైవిధ్యం ఆయన సామర్థ్యాన్ని నిరూపిస్తుంది.

**నాలుగు దిక్కుల నడిమి సంతలో తూగే తుళ్ళే తోల్బొమ్మా**
**ఎవరికెవ్వరో ఏమౌతారో ఇవరము తెలుసా కీల్బొమ్మా**
**ఈ ఇవరము తెలుసా మాయబొమ్మా**
**కోపము తాపము క్రూరకర్మలూ కూడని పనులే కీల్బొమ్మా**
**పాపపు రొంపిని పడబోకే, పరమాత్ముని నమ్మవె తోల్బొమ్మా**

ఇందులో 'నాలుగు దిక్కుల నడిమి సంతలో తూగేతుల్లే తోల్బొమ్మా, ఎవరికెవ్వరో ఏమౌతారో ఇవరము తెలుసా కీల్బొమ్మా' అనే చరణం తనను గురించి చెప్పుకొన్నదే. ఐనా, అది మొత్తం మానవాళికే వర్తిస్తుంది. పాప

ఎవరూ, అతడెవరు? పాపతో అతనికి ఎలాటి రక్తసంబంధం లేదు. పాప తలిదండ్రులల పేరైనా అతనికి తెలీదు. మరి ఈ అనుబంధం ఎలా ఏర్పడింది? ఇంత మమకారం ఎందుకు పెరిగింది? ఆ సంబంధమే మానవత్వం. అది అన్నిటికీ అతీతమైన బంధం. మనిషిని పశువునుండి వేరుచేసే ఉద్రేకం. ఆ మానవతా సంబంధమే కోటయ్యను తిరిగి మనిషయ్యేలా చేసింది.

**మం: అన్నయ్యా. ఏలెడంత లేదు, ఈ పిల్ల నిన్ను ఎట్టా మార్సేసిం దిరా అన్నయ్యా. నువ్విట్టా మల్లీ మనుసుల్లో పడతావనుకోలేదు. ఎనకటి రోజుల్లో ఈయాలప్పుడు ఇంటో వుండేవాడివా? ఏ కల్లు పాకలోనో . .**

**కో: వద్దమ్మా, ఆ ఊసెత్తద్దు. అవన్నీ గాచారం రోజులు.**

ఆ గ్రహచారం రోజులను జ్ఞాపకం చేసుకోటానిగ్గూడా కోటయ్యకు ఇష్టంలేదు. పాప ధ్యాస తప్ప అతనికి వేరే ప్రపంచమే లేదు. ఒకసారి, ఆడుకుంటూ పాప బురద పూసుకుంటుంది. దండించడానికి వెంటబడతాడు కోటయ్య. చేతికి చిక్కకుండా దాక్కుంటూ పాప సతాయిస్తుంది. కోటయ్యకు కోపమొస్తుంది. ఆ తండ్రీకూతుర్ల ముచ్చట మంగమ్మ చూసి నవ్వుతూ వుంటుంది. చేతికి చిక్కంగానే పాప -

**పా: మానాన్న బంగారు.**

**కో: ఓసి దొంగముండ, ఎన్నిటక్కులు నేర్చావే. సూసి సూసి నిన్ను కొట్ట లేను గందాని నీకూ తెలుసు.**

**మం: ఏడిసినట్టే వుంది. ఇదేనట్రా కూతురుకు బయం సెప్పటం.**

**కో: ఊరుకోయే నువ్వు మరీను. పాప వొంటిమీద సెయ్యేసి నేను బతగ్గలనంటే సిట్టీ. ఇదిగో పిల్లదానికి కాస్తా నీల్లోసి, బట్టలెయ్.**

**మం: పిల్లంటే పిల్లకాదురా. ముక్కుకు తాడేసి మూడు చెరువుల నీల్లు తాగిత్తాందిలే. ఆ, సరేగాని, నేను సెప్పిన మాటేమైనా గ్యాపకముందా.**

**కో: ఏంటది?**

**మం: రేపు యాకాసినాడు పాప తల్లికి బట్టలెట్టాలి.**

**కో: ఔను.**

**మం: సీరా, రైకా తెమ్మని రాందాసుకు డబ్బిచ్చావా?**

**కో: అరె, ఎంత పొరపాటైపోయింది. ఇప్పుడెల్లొత్తానుండు.**

**మం: ఏడ్సినట్టే వుంది. తొరగా ఎల్లు. ఈయాలే రాందాసు పట్టం పోతుం డాడంట. ఇదిగో అన్నయ్యా, సీరలో నల్లపోగు ఉండగూడదని సెప్పు.**

నల్లపోగు ఉండగూడదనే సాంప్రదాయం ఎంతబాగా గుర్తుంది రచయితకు!

ఆ సరుకు కోసం రామదాసు కొట్టు దగ్గరికి పోతాడు కోటయ్య. రహస్యంగా అక్కడికొచ్చి రామదాసుతో బేరాలాడుతున్న గోపాలస్వామి, కోటయ్యను చూడగానే డబ్బాల సందున దూరి దాక్కుంటాడు. డబ్బాలు జారిపడే శబ్దం విని కోటయ్య అటువైపు చూస్తాడు. గోపాలస్వామిని పట్టుకుని ఇంటికి లాక్కుపోతాడు. 'ఈ దెబ్బతో గోపాల స్వామి గోవింద' అంటాడు రామదాసు. 'పోనీలేబ్బా పీడ. మనింటి కాడ సంపకుండా లాక్కుపొయినాడు.' అనుకుంటూ ఆ కొట్టుయజమాని తృప్తిపడతాడు.

ఇంటికి తీసుకొచ్చిన గోపాలస్వామిని కోటయ్య ఆదరంగా చూస్తాడు. తన పాపను గురించి అతనికి చెబుతాడు. పాపతో పాటపాడించి వినిపిస్తాడు.

**కో: గోపాలసామీ, నారాయణమూర్తి పాపరూపంలో కనపడి అడ్డు పడ్డాడుగానీ, లేకుంటే, నాసామిరంగా, నిన్ను ఆనాడే నరికే వాన్ని. నేను యాడో ఎదవసావు సచ్చేవోన్ని. గోపాలసామీ, నీ మూలాన్నే పాప నా సేతిలో పడిందనుకో. నీకీ సంగతి సెప్పాలనే ఇంతకాలం నుండి సూత్తున్నా. ఏదీ, నువ్ అగుపడందే.**

**గో: కోటయ్యా, నువ్వు మనసారా నారాయణమూర్తిని నమ్ముకున్నావూ, ఆ మహానుభావుడు ఈ పాపను నీకిచ్చి, నీకొక మంచి దారిని కల్పించాడు. దౌర్భాగ్యుణ్ణి, నారాయణమూర్తి పేరుజెప్పి, నేను నలుగుర్నీ మోసం చేశాను. అందుకే నాకీ ఛండాలపు బ్రతుకు.**

జమీందారు కుటుంబాన్ని విషాదం అలుముకుంటుంది. పార్వతికి మూడోసారిగూడా గర్భం నిలువదు. పైగా, ఆమె ఆరోగ్యం కోసం గర్భాశయాన్ని తొలగించవలసి వస్తుంది. ఇక ఆమెకు సంతానం కలిగే యోగం లేదు. అంతటితో వంశం అంతరించకుండా మరొకరిని వివాహ మాడమంటుంది. మనోహర్ అందుకు వొప్పుకోడు. పాతకథను పార్వతికి చెప్పాలని సన్నద్ధ

మౌతాడు. అంతలోనే అవరోధం కలుగుతుంది. అక్కకొడుకు శేఖర్‌ను వారి దగ్గరే వుంచుకుంటారు. చిన్నపిల్లవాడుగా శేఖర్ అత్తామామల వద్ద పెరుగుతాడు.

పాప కొంచెం పెద్దదవుతుంది. పాపకు చక్కగా చదువు అబ్బుతుంది. తియ్యని గొంతుతో పాడుతుంది.

**కన్న దేవకివంతు కన్నీరే కానీ,**
**కన్నార నీ లీల కాంచలేదాయె, కృష్ణా**
**ఏ కొరనోములు ఏమి నోచెనో కన్నదేవకికి కన్నీరాయె,**
**నీ మురిపెములూ, నీ చిరుసొగసులు పేద యశోదా పెన్నిధులాయె -**

పిల్లలు పెరిగేకొద్దీ ఇంటికి దూరమౌతారు. దూరమయ్యేకొద్దీ తలి దండ్రులను ఆందోళనకు గురిచేస్తారు. తల్లిగానీ, తండ్రిగానీ పిల్లలతో మనసారా జీవితాన్ని పంచుకోగలిగేది వారు చిన్నతనంలో వున్నప్పుడే. చిన్నతనంలో వారితో గడపడం వొక అదృష్టం, ఆనందం. ఒక్కొక్కసారి ఆ అదృష్టానికి కొందరు దూరమౌతారు. పరమాత్ముడైన కృష్ణున్ని కడుపారా కన్నది దేవకీదేవి. కానీ ఆమెకు బిడ్డను చేతులారా పెంచే భాగ్యం కలుగలేదు. ఆ అదృష్టం యశోదకు దక్కింది.

వాయిద్యాల గోలంటే బి.ఎన్‌కు గిట్టదు. వీలైన చోటల్లా వాటి ఆర్భాటాన్ని తగ్గించాలని చూస్తాడు. ఈపాటకు తబలా, వేణువు, ఫిడేలు తప్ప ఇతర వాయిద్యాలే వున్నట్టు అగుపించదు. ఐనా, వినటానికి హాయిగా వుంది. పాటలో 'దేవకికి' అనే పదముంది. 'కి' అనే అక్షరం రెండుసార్లు పలకటానికి ఇంపుగా ఉండదని బి.ఎన్ అభ్యంతరం. కృష్ణశాస్త్రిగారు నిజమేనన్నారు. మార్గాంతరం కోసం వెదికారు. దొరకలేదు. ప్రయత్నం ఆపేసి ఉన్నదాంతోనే సర్దుకున్నారు. ఈ సందర్భంలో శంకరాభరణంలో వొక పాట గుర్తుకొస్తుంది. అందులో 'శంకర గళ నిగళము' అనే పదం విని మళ్ళీ నిఘంటువు చూడవలసి వచ్చింది. 'నిగళము' అంటే సంకెల అనే అర్థమే వుంది. శివుని మెడలోని పామును ఆభరణంగా చెప్పటం విన్నానుగానీ, సంకెలగా వినడం ఇదే ప్రథమం. మరో సినిమాలో 'తెలవారదేమో స్వామీ' అనే పాట ఎంతో ఆహ్లాదంగా వుంది. రచన అన్నమయ్యగారిదేమో నన్న అనుమానం కలిగిస్తుంది. కానీ,

'కలల అలజడి' అనే పదాలను కలపడంలో పొరబాటు జరిగింది. వాటికి సవర్ణదీర్ఘసంధి చేసి 'కల లాలజడికి' అన్నాడు కవి. రెండు తెనుగుపదాల మధ్య సవర్ణదీర్ఘసంధి పరమ అసహ్యంగా వుంటుంది. అర్థమేలేకుండా పోతుంది. ఇంతింత పెద్దతప్పులు తేలిగ్గా చేసే కాలంలో వొక్క అక్షరం కోసం తహతహలాడే మనషులు చాదస్తులుగా కనిపిస్తారు.

ఈ చిత్రంలో పాత్రల అలంకరణపై చూపించిన శ్రద్ధ గురించి ఎంత చెప్పినా తక్కువే ఔతుంది. మిగతా సినిమాలకుమల్లే కాకుండా, ఈ చిత్రం కొన్ని ప్రత్యేకమైన ఇబ్బందులు కొనితెచ్చింది మేకప్‌మ్యాన్‌కు. మిగతా సినిమాల్లో సాధారణంగా పిల్లలు వొకే అంచెలో పెద్దవాళ్ళుగా పెరిగిపోతారు. ఈ కథకు పాపను నాలుగు వయోభేదాల్లో చూపడం అవసరం. పసిబిడ్డగా ప్రవేశించిన పాప మూడంచెలుగా పెరుగుతుంది. పాప వయసులో ఎంత తేడా వస్తుందో మిగతా పాత్రల వయసులోగూడా అంతే తేడా కనిపించాలి. ప్రతి అంచెలో ఆ వైవిధ్యం తీసుకురావాలి. పిసరంత పొరపాటు లేకుండా ఆ తేడాను చూపగలిగాడు మేకప్‌మ్యాన్. ఆ రోజుల్లో అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఇంతటి దక్షత బహుశా, ఏ ఇతర భారతీయ చలన చిత్రంలోనూ మనం చూడలేం. తెలుగు సినిమారంగం గర్వించదగిన విశిష్ట కళానైపుణ్యమది.

పాప, శేఖరు చిన్నప్పటినుండి వొకే బడిలో చదువుకుంటారు. ఇద్దరూ మంచి స్నేహితులౌతారు. హైస్కూల్లో పాప ఉత్తమ విద్యార్థి. స్కూలు పిల్లలకు బహుమతి ప్రదానం చెయ్యటానికి వచ్చిన మనోహర్ పాపను మెచ్చుకుంటూ, ఆమె ఎంతవరకు చదువుకుంటే అంతవరకు ఖర్చంతా తానే భరిస్తానని ప్రకటిస్తాడు. పాపను చదివించాలనే కోటయ్య మోజు. 'మనకెందుకురా సదువులు' అని మంగమ్మంటే కోటయ్య వొప్పుకోడు. 'పెద్దింటి పార్వతమ్మ గోరూ, డాక్టరుబాబు పెళ్ళాం మాట్లాడినట్టు పాప మాట్లాడితే' వినాలని కోటయ్య కుతూహలం. కానీ, పాప హైస్కూల్ చదువుతోనే మానేస్తుంది. కాలేజికి వెళ్ళమంటే వెళ్ళదు. 'మానాన్న పెద్దవాడైపోయాడు. నన్ను వదిలి వొక్కక్షణం వుండలేడు' అంటుంది మనోహర్‌తో.

శేఖర్ పట్నం వెళ్ళి కాలేజిలో చేరుతాడు. సెలవుల్లో వచ్చినప్పుడంతా

పాపతో చనువుగా తిరుగుతుంటాడు. అలా తిరగడం అతని అత్తయ్య పార్వతికి గిట్టదు. త్వరగా పెళ్ళి చెయ్యాలని ప్రయత్నిస్తుంది. చదువు పూర్తయిందాకా చేసుకోనంటాడు శేఖర్. పట్నంనుండి వచ్చేప్పుడు దారిలోనే కోటయ్య ఇంటిదగ్గర దిగుతాడు శేఖర్. కోటయ్యకు బహుమతిగా తెచ్చిన ముక్కుపొడుం డబ్బాను అతనికి అందిస్తాడు. కోటయ్య ఆ డబ్బాను పరిశీలనగా చూసి 'మంచిపనివాడేనయ్యా' అని మెచ్చుకోవడం మనుషుల ప్రవర్తన తెలిసిన రచయిత ఇంగితం. వృత్తిమీద బ్రతికే మనిషి కంటికి ఏది కనిపించినా, అందులోని పనితనం మీదికే దృష్టి పోతుంది. అతని మనస్సు సాటి పని వాని నైపుణ్యాన్ని ప్రశంసిస్తుంది.

నేరుగా ఇంటికి రాకుండా శేఖర్ కోటయ్య దగ్గర దిగటం జమీందారింట్లో గొడవ రేపుతుంది.

**పార్వ: శేఖర్ ఏడీ.**

**నౌకరు: కోటయ్య ఇంటికాడ దిగాడండీ.**

**జమీం: శేఖర్ రాలేదా?**

**పార్వ: వచ్చాడట. ఉన్నారుగా మన ఆత్మబంధువులూ, ఆ కమ్మరాల్లింట్లో దిగాడట. మామగారూ, నాకిదేం బాగలేదు. మన అంతస్తేమిటి వాళ్ళ అంతస్తేమిటి.**

**మనో: (అక్కడికొస్తూ) ఏమిటది?**

**పార్వ: ఏముందీ, ఎప్పుడూవున్న సంగతే.**

**జమీం: వచ్చినవాడు సరాసరి ఇంటికి రాకుండా ఆ కోటయ్యింట్లో దిగాడట.**

**మనో: దీనికేనా ఇంత రాద్ధాంతం. ఏదో చిన్నప్పటినుండి కోటయ్య దగ్గర చనువు వాడికి.**

**పార్వ: మీరలానే అంటారులెండి. కోటయ్యకోసం కాదు వాడక్కడ దిగింది.**

**మనో: ఎందుకు పార్వతీ అస్తమానం నీకీ ఎత్తిపొడుపు మాటలు. పాప చేసిన అపచారమేమిటి? ఏమీలేందే విపరీతమైన అర్థాలుతీసి నాన్నగారి మనసు పాడుచేస్తున్నావు.**

రంపు ఆ ఇంటి కొక్కదానికే పరిమితమైలేదు. చదువు పూర్తిచేసుకుని

వచ్చిన శేఖర్, పాపతో బలాదూరుగా తిరగడం నలుగురూ చిలువాపలువలుగా చెప్పుకోవడం మొదలైంది. ఆడపిల్ల గురించి జనాలు చేసే పరిహాసం చివరిగా తెలిసేది ఇంట్లో వారికే. పాపను గురించి హీనంగా చెప్పుకోవడం కోటయ్య చెవిన పడుతుంది. ఆ చెప్పుకునేవాల్లమీదికి అతడు ఎగబడతాడు. రాందాసు సర్దుబాటుచేసి కోటయ్యను ఇంటికి పంపిస్తాడు. ఇంటి దగ్గర మంగమ్మతో ఈ విషయం ప్రస్తావిస్తాడు కోటయ్య. ఆమె అది వరకే అలాటి సూటిపోటు మాటలు స్వయంగా వినివుంది.

**కో: నాసామిరంగా, పాతేత్తా కొడుకుల్ని. సూడు మంగమ్మా, మనమ్మాయి గురించి ఎదవల కెందుకంట. సమయానికి రాందాసు అడ్డొచ్చాడుగానీ, నాసామిరంగా, మక్కలిరగదన్నేవాన్ని. ఎదవనాయాల్లు.**

**మం: ఎందుకురా అంత కోపం. ఊరిమీద ఇరసకపడతావెందుకు. అన్నారంటే అనరూ. మనం కళ్ళుమూసుకున్నా లోకం కళ్ళు మూసుకుంటుందా.**

**కో: నువ్వూ అట్టాగే అంటావ్ సిట్టీ.**

**మం: పాప ఇంకా సంటిపిల్ల అనుకుంటున్నావా. సిన్నతనంలో ఏదో కలిసి అడుకున్నారంటే బావుంది. ఇప్పుడూ అట్టానే తిరిగితే ఏం బావుం టుందిరా. నువ్ సెప్పాల దానికట్టా తిరగొద్దని.**

**కో: నువ్వూ అట్టాగే అంటావ్ సిట్టీ.**

పెద్దజమీందారు కోటయ్య ఇంటిదగ్గరికొచ్చి పరామర్శిస్తూ -

**జ: పిల్లదానికి సంబంధాలేమైనా చూస్తున్నావా?**

**కో: ఇంకా లేదు బాబయ్యా. సూడాలండీ.**

**జ: తొందరగా చూసి చేసెయ్‌రాదూ. నీగ్గూడా బరువు తగ్గుతుంది.**

**కో: దేనికైనా గడియ రావాల బాబయ్యా.**

**జ: ఖర్చుకేమైనా కావాలంటే నేనిస్తాన్లే.**

**కో: అంతా తమ సలవేనండీ.**

కోటయ్యకు పరిస్థితి బాగా అర్థమైంది. చెప్పదలచుకొన్నది నర్మ గర్భంగా చెప్పి వెళిపోయాడు జమీందారు. పాపకోసం కోటయ్య వెదుక్కుంటూ పోతాడు. ఆమె శేఖర్‌తో కలిసి తోటలో ఉయ్యాల ఊగుతుంటుంది. ఇంటికి పొమ్మని పాపను గదురుకుంటాడు కోటయ్య. ఏం జరిగిందని శేఖర్ అడిగితే,

'అవంతా ఎందుకులే బాబయ్యా. మీరు పాపతో కలిసి ఇకను తిరగొద్దండి. మమ్మల్నిట్టా బతకనివ్వండి.' అంటాడు నిష్ఠురంగా. పాపకు నచ్చజెప్పడానికి మంగమ్మ ప్రయత్నిస్తుంది.

**మం: పాపా, నామాటినమ్మా. ఈ నేస్తం నీకు మంచిదిగాదు తల్లీ.**

**పా: మా నేస్తంలో ఎవరూ సిగ్గుపడవలసింది ఏమీలేదు.**

**మం: నీకూ ఆ అబ్బాయికీ నేస్తమేమిటి. ఆ అబ్బాయి జమీందారు బిడ్డ. నువ్వు కమ్మరాడి కూతురువి. ఇది గ్యాపకం పెట్టుకో పాపా. నీకూ ఆ అబ్బాయికీ పెళ్ళవటం కలలో మాట. మీనాన్న అన్ని పానాలూ నీమీదే పెట్టుకున్నాడు. ఆడిమనసు కష్టపెట్టొద్దు తల్లీ. నీతో సెప్పలేక ఆడెంతో బాదపడ తన్నాడు. నిన్నా సేకరంబాబుతో తిరగనియ్యొద్దని పెద్దయ్య గోరొచ్చిసెప్పిపోయారు.**

చిన్నచిన్న మాటలతో ఎంత గంభీరమైన విషయాన్నైనా చెప్పొచ్చునని నేర్పిస్తున్నారు మనకు పద్మరాజుగారు. పెద్దవారికే గాదు, చిన్నవాళ్ల మధ్యన గూడా క్లిష్టమైన సమస్యలుంటాయి; చదువరులకే కాదు, పామరులకు గూడా గంభీరమైన భావాలుంటాయి. మరి చెప్పుకోటానికి భాష లేకుండా ఎందుకుంటుంది? తప్పకుండా వుంది. మన ఆడంబరం దాన్ని గమనించడంలేదు.

అక్కడ, జమీందారింట్లో, మరో బాంబు ప్రేలుతుంది. పాపను తప్ప మరొకరిని పెళ్ళాడే ప్రసక్తే లేదని శేఖర్ తేల్చి చెప్పేస్తాడు. కోటయ్యనూ, పాపనూ ఊర్లోనుండి వెళ్ళగొట్టాలనే అత్తయ్య ఆలోచనను ఖండిస్తాడు. డబ్బు, అధికారం వుందని అలా చేసినంత మాత్రాన పాపతో తన పెళ్ళి ఆపలేరని సవాలు చేస్తాడు. వారు తమతో తూగలేరంటే, వారి అంతస్తుకే తాను దిగిపోతానంటాడు. అతడు పట్టుదల విరమించేలా మనోహర్‌గూడా ప్రయత్నిస్తాడు. ఏ కారణంతోనైనా ఈ పెళ్ళి జరగకపోతే ఆభంశుభం తెలియని పాప గతి ఏమౌతుందో విచారించమంటాడు. 'నేనంత నీచుణ్ణికాదు మామయ్యా' అంటూ శేఖరిచ్చిన సమాధానానికి అతడు చిన్నబోతాడు.

ఇంట్లోవారికి తన అంతరంగాన్ని ప్రకటించగలిగినందుకు శేఖర్ మురిసిపోతాడు. సంతోషం పట్టలేక, ఈ విషయం వెంటనే పాపకు చెప్పాలని ఉబలాటపడతాడు. పాపను కలిసి జరిగింది చెబుతాడు. కానీ, పాపలో మునుపటి

ఉత్సాహం లేదు. తనను మరిచిపొమ్మని శేఖర్‌కు చెప్పి విలపిస్తుంది. ఇంతలో శేఖర్ అత్తయ్య కోటయ్య ఇంటి దగ్గరకు స్వయంగా వస్తుంది. కోటయ్యను నీచంగా నిందిస్తుంది. ఆ సంవాదం సాగుతుండగానే శేఖర్, పాప దూరంనుండి వస్తూ కనిపిస్తారు. 'చూడు నీ కూతురు ఏంజేస్తూందో' - ప్రత్యక్ష నిదర్శనం చూపిస్తూ పార్వతమ్మ దెప్పిపొడుస్తుంది. శేఖర్‌ను కార్లో ఎక్కించుకుని ఆమె వెళిపోతుంది. 'నాన్నా' అంటూ దగ్గరికొచ్చిన పాపను పట్టరాని ఆవేశంతో కోటయ్య చెంపమీద ఛెల్లుమనిపిస్తాడు. కోటయ్య జీవితంలో పాపమీద చెయ్యి చేసుకున్న మొట్టమొదటి సంఘటన ఇది. పాప చెంపమీద వాతలు ఏర్పడతాయి. వాటిని చూసిన కోటయ్యకు కడుపు తరుక్కుపోతుంది. 'ఇవే పాతరోజులైతే, నాసామిరంగా, ఈ పాటికి పెద్దింటోళ్ళ నంతా నరికేసుండేవాన్ని' అనుకుంటూ కుమిలిపోతాడు. ఇక ఆ ఊర్లో వుండటం మంచిది కాదనుకుంటుంది పాప. ఎక్కడికైనా దూరంగా వెళ్ళి పోదామని తండ్రిని అడుగుతుంది. కోటయ్య సరేనంటాడు. ఇల్లూ వాకిలీ అమ్మేసి ఊరు వదలిపోడానికి ఏర్పాట్లు చేస్తాడు.

శేఖర్ మొండిపట్టుదల పెద్దలను కాస్త సడిలేలా చేస్తుంది. అందరూ కలిసి వొక మధ్యేమార్గాన్ని ఆలోచిస్తారు. కోటయ్యను వదిలించుకుని, పాపను మాత్రం స్వీకరించటానికి అంగీకరిస్తారు. తట్టనిండా డబ్బు సిద్ధం చేసి కోటయ్యను పిలిపిస్తారు. పాపను వదిలేసి ఎక్కడికైనా వెళ్ళిపొమ్మంటారు. పాపను చూడకుండా బతకలేనంటాడు కోటయ్య. పాప సుఖంకోసం ఈ త్యాగం చెయ్యమని కోటయ్యకు మనోహర్ నచ్చజెపుతాడు. కోటయ్య సరే నంటాడు. డబ్బు తీసుకోమంటే వద్దంటాడు. 'పాపను అమ్ముకోలేను బాబూ' అంటూ వెనక్కు మరలుతాడు. అంతలో పాప అక్కడికి పరిగెత్తుకొస్తుంది. తన నాన్నతో పంచుకోలేని సుఖం తనకు అక్కరలేదంటుంది. తనను మరచి పొమ్మని శేఖరుకు చెపుతుంది.

**శే: పాపా, నీకోసం మీనాన్న తన సర్వస్వాన్నీ త్యాగం చెయ్యగలిగాడు. నువ్వు మీనాన్న కోసం నీ జీవితసుఖాన్ని వదులుకోగలిగావ్. మీకు కులగోత్రాలూ, వంశమర్యాదలూ లేవుగాబట్టి అది సాధ్యమైంది. మావంటి గొప్పవాళ్ళకు అవన్నీ పుస్తకాల్లో చదుకోవలసిందే.**

కులమూ, కలిమీ, సంప్రదాయాలు ఆత్మీయులపట్ల వున్న బాధ్యతను

దాచివేస్తాయి. అవి లేనిచోట ఆత్మీయతలు స్వయంప్రకాశంగా వుంటాయి. అవే మానవతా విలువలు. కోటయ్యను నడిపించుకుంటూ పాప గడపవైపు సాగిపోతున్న సమయంలో, 'పాపా ఆగు' అంటూ మనోహర్ వారిని ఆపుతాడు. ఆపి, పాప తన కూతురని నలుగురి ఎదుటా వెల్లడిస్తాడు. అతని అంతరాత్మ పాతాళంనుండి పైకిలేచింది. పాపను సందిట్లోకి తీసుకోటానికి ముందుకు పోతాడు. విషయం తెలిసిన తరువాతగూడా పాప అతనికి దగ్గరగా పోలేదు. చిత్రంగా మనోహర్‌ను ఎగాదిగా చూసి, కోటయ్యవైపు తిరిగి 'నాన్నా' అంటూ అతన్ని కౌగలించుకుంటుంది. పాప మనసు కోటయ్యనే తండ్రిగా ఆమోదించిందిగానీ, మనోహర్‌ను కాదని ఇందుమూలంగా తెలిపాడు దర్శకుడు.

ఈ చిత్రంలో మనోహర్‌ది మలినమైన పాత్ర. స్వభావరీత్యా అతడు మంచివాడే కావచ్చు; పేదలపట్ల కారుణ్యం కలిగినవాడే కావచ్చు; భావాల్లో అభ్యుదయం వున్నవాడే కావచ్చు - కానీ, అవసరానికి తగిన సాహసం చెయ్యగల సత్తా అతనిలో లేదు. తెగువకు పోకుండా సర్దుకునే అవకాశమొస్తే గుట్టుగా ఆమోదిస్తాడు. అతని ఈ బలహీనతవల్ల శాంతకు దిక్కులేని చావు దాపురించింది. అతని పిరికితనం వల్ల పాపకు తీరని ద్రోహం జరిగింది. కానీ అతడు దుర్మార్గుడు మాత్రంకాదు. ఈ పరస్పర విరుద్ధమైన ప్రవర్తనను చిత్రీకరించడంలో అరుదైన శిల్పాన్ని మన కందిస్తుంది 'బంగారుపాప' చిత్రం.

ఈ ఘట్టానికి ముందు, కోటయ్యను జమీందారు బంగ్లాకు మనోహర్ తనతో తీసుకెళ్ళినప్పుడు -

**పా: అత్తయ్యా, నాకెందుకో దిగులుగా వుందత్తయ్యా. పెద్దింటివాళ్ళంటే నాన్నకు వొళ్ళుతెలీని కోపం.**

**మం: మరేం బయంలేదమ్మా, సినబాబుగోరున్నారుగా.**

**పా: ఏమోనత్తా, నాకు భయంగావుంది. నాన్న వొట్టి తొందరమనిషి.**

**మం: బయపడకు తల్లీ, సినబాబుగోరున్నారు.**

ఆ పాత్ర నీచంగా కనబడకుండా వుండటానికి ఇలాటి సందర్భాలనేకం కూర్చి పైకి ఎత్తిపట్టుకుంటాడు (elevation) దర్శకుడు.

ఈ సినిమా గురించి ఇంకా ఎన్నో విశేషాలు చెప్పవలసి వుందిగానీ,

చిత్రం మొత్తంగా ఇప్పుడు గుర్తుచేసుకోవడం కష్టం. ఈ సినిమాను నేను చివరిసారిగా చూసి దాదాపు పాతిక సంవత్సరాలు దాటిపోయింది. ఇదొక్కటే కాదు, చాలావరకు పాత సినిమాలు ఆ సమయంలో చూసినవే. కొత్త ప్రింట్లు తీసే నాథుడు లేడు. అనేక సినిమాలను తుంటలుతుంటలుగా తెగిన రీల్లతో చూశాను. సౌండ్ ట్రాక్‌ను ఆడియో టేపుల్లో పట్టుకున్నాను. ఆ టేపులను ప్రాణప్రదంగా నేను దాచుకుంటే, వాటిని మాఇంట్లో 'బంగారు బిస్కత్తు' లని ఎత్తిపొడిచేవారు. ఆ నిధిని ఇన్నాళ్ళకు ఉపయోగపెట్టగలిగినందుకు నాకు అమితమైన ఆనందంగా వుంది.

వీడియోలు ప్రచారంలో కొచ్చిన తరువాత, కొన్ని పాతసినిమాలు వీడియో క్యాసెట్లలో విడుదలయ్యాయి. తరువాత సి.డి.లుగాకూడా తయార య్యాయి. వాటిని చూసి నాకు సంతోషం కలిగింది. ఐతే, అదెంతసేపో నిలువలేదు. ఆ సినిమాలకున్న ఆదరణను సొమ్ము చేసుకోవాలనే చింత తప్ప, విడుదల చేసినవారికి వాటిపట్ల రవ్వంతైనా మర్యాద లేకపోవడం విచారం కలిగించింది. క్యాసెట్లు తయారు చేయటానికి కనీసం కొత్త ప్రింటైనా తీసుకోలేదు. మార్కెట్‌లో దొరికిన ఏదోవొక కాపీని పట్టుకుని, అది ఎంత ముక్కలైందైనా సరే, దాన్నే టేపుకు ఎక్కించారు. ఆ ప్రింటులో రీలు నెంబర్లు తెగిపోయి వుంటాయిగాబట్టి దొరకవు. వ్యాపారం చేసుకునేవారికి ఆ సినిమా గురించి తెలియదు. అందువల్ల, కొన్ని సినిమాల్లో ముందు రీల్లు వెనక, వెనక రీల్లు ముందు తగిలించి తయారుచేశారు. 'మల్లీశ్వరి' సినిమాలో నాకు ఈ అవకతవక కనిపించింది. మార్కెట్లో వారు అలాగే అమ్ముతున్నారు, ప్రజలు అలాగే కొంటున్నారు. ఆక్షేపించేవాడు లేకుండా ఉత్పత్తిదారులకు ఆదాయం అందుతూంది. జాతికి గర్వకారణమైన కళాఖండాలతో ఇంత హీనంగా డబ్బుచేసుకుంటున్న ద్రోహానికి దండన లేదు. తెలుగుప్రజ వీరిని ఉపేక్షించడం చోద్యంగా తోస్తుంది. సి.డి.లైతే మరీ ఛండాలం. వాటిని ఒరి జినల్ ఫిలింనుండి కాక, అదివరకు చేసివుంచిన వీడియో టేపునుండి సి.డి.కి కాపీచెయ్యడం వల్ల క్వాలిటీ పూర్తిగా దెబ్బతినిపోయింది. నా దగ్గరున్న ఆడియోటేపులు వింటూంటే నాకొక విషయం బయటపడింది. పాతిక సంవత్సరాల కిందట నాకు దొరికిన ప్రింటుకూ, వీడియో క్యాసెట్ల కెక్కిన

ప్రింటుకూ తేడాలేదు! కాక పోతే, కాలక్రమంలో చిరుగులు ఎక్కువయ్యాయి.

'బంగారుపాప'ది విశిష్టమైన కథ, కథకు తగిన ట్రీట్‌మెంట్, తేలిక మాటలతో కూర్చిన సంభాషణ, ప్రతి పలుకులో అబ్బురపాటు కలిగించే మాడ్యులేషన్, నిండుదనం తొణికిసలాడే పాత్రలు, పాత్రల్లో జీవించిన నటీనటులు, సాటిలేని మేకప్ ప్రతిభ, చక్కని ఛాయాగ్రహణం, పసందైన సంగీతం, అత్యుత్తమమైన దర్శకత్వం - కానీ, బాక్సాఫీసుకు ఘోరాతి ఘోరంగా విఫలమైన చిత్రమిది. దీన్ని గురించి పాలగుమ్మి పద్మరాజుగారు - 'బి.ఎన్.రెడ్డి తెలుగు సినిమాకు వైభవమూ, గౌరవమూ తెచ్చిన వ్యక్తి. గౌరవస్తులకు గూడా తెలుగు సినిమారంగంలో చోటుందని నిరూపించిన వ్యక్తి. దర్శకులందరికీ ఆదర్శప్రాయుడైన వ్యక్తి. కానీ, ఆయన మంచి వ్యాపారవేత్త కాలేకపోయాడు.' అంటూ విశ్లేషించారు.

మంచి సాంఘికచిత్రాలకు తెలుగు సినిమారంగం అనంతమైన అక్షయ పాత్ర. ఇలా చెప్పుకుంటూపోతే ఈనాటి దర్శకుడు కె.విశ్వనాథ్‌గారి దాకా ఎన్నైనా చెప్పుకుంటూపోవచ్చు. కానీ, ఇప్పటికే మూడు సాంఘికాలను పరిశీలించాం. మిగతా తరగతికి చెందిన చిత్రాలు అలాగే మిగిలిపోయాయి. ముఖ్యంగా జానపదాలూ, పౌరాణికాలు. ఈ తరహా సినిమాల్లో మనదేశంలోని ఏ ఇతర భాషాచిత్రాలు తెలుగు సినిమాతో పోటీకి తట్టుకుని నిలువలేవు. ఇతరులకు దుర్లభమైన ఆ వొరవడిని తెలుగుసినిమాకు అందించిన 'పాతాళ భైరవి' చిత్రంలో వొకసారి పర్యటించి ఆవలకుదాటుకుందాం.

# పాతాళభైరవి

'జనం జనం, నేపాళమాంత్రికునికి డింగిరీలనండి, వందనాలనండి.'

'ఐతే డింగరి, జనం కోరేది మనం సేయడమా, మనం సేసేది జనం సూడడమా?'

'మన కన్నే, మన చెవే, మన మాటే మన జనం. మనం కోరతాం, మీరు సేయండి. గాగీగూగే మోటాటీటూ, వీళ్ళందరికీ టోపీలు పెట్టండి.'

'ఐతే సూడరా. హాంఫట్.' (ఎదుటుండే జనాల తలలకు టోపీలొస్తాయి)

'ఇంకేమి సేయవలెరా డింగరీ?'

'నీమునానో మామీమేమో, ఈ రాతిని కోతిని సేయండి.'

'ఐతే సూడరా. హాంఫట్.' (రాయి కోతిగా మారుతుంది)

'ఇంకేమి సేయవలెరా డింగరీ?'

'హాహాహూహూ, హిహిహీహ్హీ .... వీళ్ళందరికీ వస్త్రాపహరణం సెయ్యండి.'

'మనం ప్రజాబంధులం. ప్రజారంజన శాయవలెరా. చక్కని కోరిక కోరుమురా డింగరీ.'

'డీడూడేడో డూడూడూడూ, ఈ కోతిని నాతిని సెయ్యండి.'

'ఐతే సూడరా. హాంఫట్. (కోతి అమ్మాయిగా మారుతుంది) మహాజనానికి మరదలుపిల్లా, అందరూ బావలే. గలగలలాడవే గజ్జలకోడీ.'

(వగలోయ్ వగలూ - అని పాడుతూ ఆ అమ్మాయి నాట్యం చేస్తుంది.)

ఆ మాంత్రికుడు ఎస్.వి.రంగారావు. సదాజపుడనే అతని శిష్యుడు పద్మనాభం. ఆ సంభాషణ పింగళి నాగేంద్రరావు 'పాతాళభైరవి' చిత్రం కోసం రచించింది. అదివరకు ఏవొక్కరూ అనుసరించని ప్రత్యేకపంథాలో తయారైన డైలాగులవి. ఏదైనా 'ట్రిక్' చేసి చూపే సమయంలో, ఈ రోజు వరకు, చిన్నపిల్లల నోటంటాగూడా వెలువడే 'హాం ఫట్' పదానికి మూలం ఇదే. 'డింగరీ' అనే మాటను తెలుగు వ్యవహారంలో చేర్చివేసిన వొరవడి ఇదే. 'గురూ' అనే పిలుపును మారుమూల గ్రామాలకు గూడా వెదజల్లి, జనం నాలుకపై ఎడతెగకుండా మసలేలా చేసిన సినిమా ఇదే. 'ధైర్యే

సాహసే లక్ష్మి' అనే ధీరవచనాన్నీ, 'నరుడా ఏమి నీ కోరిక ' అన్న మాటలు పరాచికంగానూ తెలుగునేలలో ప్రవేశపెట్టిన 'పాతాళభైరవి' ఇదే.

1951లో విజయా ప్రొడక్షన్స్ బ్యానర్ కింద విడుదలైన జానపద చిత్రమిది. జానపదాలు నీచజాతి చిత్రాలని కొడవటిగంటి కుటుంబరావుగారి అభిప్రాయం. సమాజానికి అందివ్వగల సందేశం వాటిల్లో ఏమీ వుండదని ఆయన అలా అన్నారు. 'సందేశం పంపాలంటే టెలెగ్రాంను వాడుకోవాలేగాని, సినిమా తియ్యగూడ'దంటారు చక్రపాణిగారు. రచయితేగాక, చిత్రనిర్మాతగూడా కావడంవల్ల సాధకబాధకాలు తెలిసిన అనుభవజ్ఞుడు చక్రపాణి. జనాన్ని ఉర్రూతలూగించిన 'పాతాళభైరవి'కి నాగిరెడ్డి, చక్రపాణి ఉమ్మడి నిర్మాతలు. మునిసిపాలిటీకి వొకటిరెండు మించి సినిమా థియేటర్లు లేని ఆ కాలంలో, దాదాపు 28 సెంటర్లలో శతదినోత్సవాలు జరుపుకుని, తెలుగు సినీ చరిత్రలో రికార్డు సృష్టించిన చిత్రం 'పాతాళభైరవి.'

మొదట్లో దర్శకుడు కె.వి.రెడ్డి జానపదాల జోలికి పోలేదు. ఆయన వాహినీ ప్రొడక్షన్స్‌లో భాగస్వామిగా వుంటూ, ప్రొడక్షన్ ఎగ్జిక్యుటివ్‌గా బాధ్యత నిర్వహించేవాడు. సందేశాత్మక సాంఘిక చిత్రాలకు ఆ సంస్థ పెన్నిది. 1942లో కె.వి.రెడ్డికి దర్శకత్వం నిర్వహించే అవకాశం వచ్చినప్పుడు, భక్తిచిత్రాలవైపు ఆయన దారి మళ్లించాడు. తన తొలిచిత్రం 'భక్త పోతన'కు మంచి ఆదరణ లభించింది. భక్తి, ముక్తి, చరిత్రలను కలిపి తన రెండవచిత్రం 'యోగి వేమన'ను 1947లో విడుదల చేశాడు. పండితవర్గంనుండి అది గొప్పగా ప్రశంసలు పొందిందిగానీ, జనాదరణ కరువై డబ్బాలు తొందరగా తిరిగొచ్చాయి. కె.వి.రెడ్డి నిరుత్సాహంలో పడిపోయాడు. ఏదో తెలియని అక్కసుతో అతని మనస్సు కుతకుతలాడింది. సందేశం పంపాలంటే టెలెగ్రాం వుంది గదా - మిత్రుడు చక్రపాణి పరిహాసంగా అన్నమాట కె.వి.ని జానపదం వైపు ఉసిగొల్పింది. మంత్రాలూ, మాయలఫకీర్లూ అంటే కె.వి.కి కొంత అడ్మిరేషన్‌గూడా ఉన్నట్టుంది. అందువల్ల, 'బాలనాగమ్మకథ'ను ఎంపిక చేసుకున్నాడు.ససేమిరా ఆకథ వద్దంటాడు బి.ఎన్.రెడ్డి. సవతితల్లిని క్రూరంగా చూపే కథ సమాజానికి తప్పుడు సంకేతం పంపుతుందని బి.యన్. వాదన. 'మంచి సందేశం ఇవ్వకపోతే మాను. కానీ, తప్పుడు సందేశం ఇవ్వొద్దు'

అన్నాడు. కె.వి.కి ఆయన గురుతుల్యుడు. ఆయన మాటను కె.వి. తోసెయ్య లేడు. అందువల్ల, షేక్స్పియర్ నాటకమైన 'కింగ్ లియర్' ఆధారంగా 'గుణసుందరి కథ'ను తయారుచేసుకుని, విజయం సాధించాడు. కానీ, మాంత్రికునిమీద అతనికున్న మక్కువ చావలేదు. తమ విజయా బ్యానర్ కింద జానపదానికి దర్శకత్వం నిర్వహించమని కె.వి.రెడ్డిని చక్రపాణీ, నాగిరెడ్డి ఆహ్వానించారు. ఆస్థాన రచయిత పింగళి నాగేంద్రరావుతో కూర్చుని, మాంత్రి కున్ని వదలకుండా, కథ సిద్ధం చేయించాడు కె.వి.రెడ్డి. అదే 'పాతాళభైరవి.' ప్రేమకోసం ప్రాణాలకు తెగించిన యువకుని వీరగాధ ఇది.

**ప్రేమకోసమై వలలో పడనే పాపం పసివాడూ,**
**అయ్యో పాపం పసివాడూ**
**ప్రేమలు దక్కని బ్రతుకేలాయని, ఆ మాయావిని నమ్ముకొనీ**
**ఏమి వ్రాసెనో అటు కానిమ్మని, బ్రహ్మదేవునిదె భారమనీ**

ప్రమాదాలు కొని తెచ్చుకున్న నిరుపేద సాహసికుడా ఆ యువకుడు. పేరు రాముడు. ఉజ్జయినీ మహరాజు తోటలో పూలుకోసి మాలలు కట్టే ముసలిదాని కుమారుడు. ప్రేమించిందేమో రాకుమారిని; ఉజ్జయినీ మహారాజు ఏకైక కుమార్తె ఇందుమతీ దేవిని. రాకుమారి ఉద్యానవనాని కొస్తుంది. వచ్చినప్పుడల్లా రాముడు అమెను చూస్తూ కలలు కంటాడు. ఒక్కసారి అమె పక్కన నిలబడాలని అతని ఉబలాటం. 'ప్రాణాలు పోతాయి' అంటాడు మిత్రుడు అంజి. 'పోతేనేంరా, వొక్కసారి నిలబడితే చాలు' అంటాడు రాముడు. కోరికలో తీవ్రత వుండడమే గాదు, రాముడు సాహసిగూడానని ఇందుమూలంగా తెలుస్తుంది.

కథానాయకుణ్ణి పరమ 'హీరోయిక్'గా చూపెట్టడంలో కె.వి.రెడ్డి సిద్ధ హస్తుడు. బలహీన మనస్తత్వం వుండే పాత్రలను హీరోగా ఆయన ఎప్పుడూ ఎన్నుకోడు. హీరో దొంగైనా ఫరవాలేదుగానీ, జబర్దస్తీకి కొదవుండరాదు. తన కథానాయకుని లక్షణాలు తొందరగా ప్రేక్షకులకు తెలిసేలా మొట్టమొదటి సన్నివేశంలోనే పునాది వేస్తాడు. తోటరాముడు అంజితో కర్రసాము తర్ఫీదు ఔతూండగా 'పాతాళభైరవి' తొలిఘట్టం మొదలౌతుంది. కథానాయకునిగా నటించింది ఎన్.టి.రామారావు. అంజిగా నటించింది బాలకృష్ణ. ఈ సినిమావల్ల

బాలకృష్ణకు 'అంజిగాడు' అనేది శాశ్వత నామధేయమైంది. కథానాయకుని అవయవసౌష్ఠవం కనువిందుగా ప్రదర్శించే అవకాశాన్నిగూడా ఇక్కడ ఉపయోగించుకున్నాడు దర్శకుడు. అతని ఎగువ శరీరంమీద ఏ ఆచ్ఛాదన లేకుండా ఎక్స్పోజ్ (expose) చేస్తాడు. అంతేగాదు, సినిమా మొత్తంలో ప్రతి ఫ్రేములోనూ, ప్రతి కోణంలోనూ హీరో ఎంతో ఆకర్షణీయంగా వుండేలా శ్రమ తీసుకుని, సౌందర్యం ఆడవారి శరీరానికే పరిమితమైన ఆనందం కాదని ఈచిత్రంలో రుజువుచేస్తాడు. రామారావును చూడాలని స్త్రీజనం పరిగెత్తుకొచ్చేలా ప్రేరేపించడంలో విజయవంతమయ్యాడు గూడా. అంతలేందే రాకుమారి అతన్ని వరిస్తుందా మరి!

పురవీధిలో వీరగాధ పాడుతుంటారు.

**ధైర్యే సాహసే లక్ష్మి అని -**
**శూలాగ్రానికి సూటిగ గురియై**
**వీలిన సాహస విక్రమార్కుడూ,**
**మట్టిబొమ్మలను మహారణానికి**
**జట్టునడిపినా శాలివాహనుడు**
**విజయ సాధనల వింత కథలతో**
**ఉజ్జయినీపురి నుద్భవించిరే**

కథ సాగే సమయంలో రాణిగారి తమ్ముడు శూరసేనుడు అక్కడి కొస్తాడు. వినోదానికి పన్నిచ్చుకోవాలని అందరిమీదా దౌర్జన్యం చేస్తాడు. శృతి మించగానే రాముడు జోక్యం చేసుకుని, అతన్ని తన్ని పంపిస్తాడు. తేలిగ్గా చూస్తే ఈ సన్నివేశం కాస్తా వినోదానికనీ, రాణీ తమ్ముణ్ని పరిచయం చెయ్యడానికనీ, రామునితో అతనికి విరోధం ఏర్పడటానికనీ ఉద్దేశించినట్టు కనబడుతుంది. కొంచెం లోతుగా పరిశీలిస్తే ఇంకాకొన్ని విషయాలు బయటపడతాయి. కథానాయకుడు పుట్టిన గడ్డే పోతుగడ్డని ఇందులో చెప్పడమైంది. సాహసాలతో వింతకథలు సృష్టించే వారసత్వం అతనికుందని తెలపడమైంది. వినోదంకోసం చెప్పుకునే వీధిభాగవతంలోగూడా సాహసాన్నీ, పరాక్రమాన్నీ పురిగొల్పడం ఆ ఊరి సంప్రదాయంగా నెలకొల్పడమైంది. కాబట్టి, నాయకుడు చెయ్యబోయే సాహసానికి రంగం తయారుజేయడమే

గాక, అతడు ఎంత సాహసం చేసినా సహజంగానే కనిపించే మత్తుమందును చిన్నమోతాదులో ప్రేక్షకులకు ఎక్కించడమైంది.

హీరోయిజాన్ని ఇనుమడింప జేసేందుకు రచయిత మరో సాధనాన్ని గూడా ఉపయోగించాడు. సంజాయిషీ ఇచ్చుకోవలసి వచ్చినప్పుడు 'నిజం చెప్పమంటారా, అపద్దం చెప్పమంటారా' అని అడగటం హీరోకు అలవాటైన మాటగా చేర్చాడు. రాణి తమ్ముణ్ని కొట్టినందుకు రాజుగారి సమక్షంలో జరిగే విచారణలోగూడా అలాగే అడుగుతాడు. తలవంచి నిలుచోమంటే వినడు. 'తలవంచుకోటానికి నేనేం తప్పు చేశానని' అంటూ ఎదిరిస్తాడు. ఆ రాజు సరసుడు. వీరలక్షణాన్ని గౌరవించే మనిషి. 'ఎవరికినీ తలవంచని యువకుల సాహసమే లక్ష్మి ఉజ్జయినికి' అని మెచ్చుకుంటాడు. తప్పుచేసిన వారిని దండించే అధికారం రాజుకే వుంటుందిగానీ, ఇతరులకు ఉండదని మందలించి రాముణ్ని వదిలేస్తాడు. అతిసాహసానికి ప్రమాదమైతే ప్రస్తుతానికి తప్పిందిగానీ, రాముని ఆ అలవాటు ఎల్లవేళలా క్షేమం కాదని తరువాత తెలుస్తుంది. మరో విషయంగూడా ఇక్కడ మనం గమనించాలి. రాముని పేదరికాన్నిమాత్రం రామునిమీద చిత్రించడు దర్శకుడు. అలా తీస్తే 'ఇమేజ్' దెబ్బతింటుంది. అందువల్ల, అతనితో పాటు అతని గుడిసెలోనే పెరిగే అంజికి అతుకులేసిన చొక్కా తగిలించి వారి ఉమ్మడి పేదరికాన్ని తెలిసేలా చేస్తాడు.

రాముడు నిలుచున్న తీవి, మాట్లాడిన తీరు, చూపించిన తెగువ రాకుమారిని ముగ్ధురాలిగా చేస్తుంది. ఆమెకు అతనిమీద మనసు పడుతుంది. ఆ ప్రేమావస్థను తెలిపే సన్నివేశాన్ని అద్వితీయంగా చిత్రీకరించాడు దర్శకుడు. రాకుమారి అద్దం ముందు నిలుచుంటుంది. రాముడు కట్టుకున్నట్టే చేతులు కట్టుకుంటుంది. అదే తీవిని ప్రదర్శించాలని ప్రయత్నిస్తుంది. 'ఎవరికీ తలవంచని యువకుల సాహసమే లక్ష్మి ఉజ్జయినికి' అన్న తండ్రి మాటలను పునరుచ్చరిస్తుంది. రాకుమారిగా నటించిన మాలతి తీవిని ప్రదర్శించడంలో తక్కువ తిన్నది గాదు.

రాజకుమారిలో ఉబుకుతున్న పొంగును చెలికత్తె నళిని పసిగడుతుంది. 'భలే రాముడంటే ఏమనుకున్నారు, భలే సాహసిగూడా. లేకుంటే మహారాజా

వారూ, మహారాణీవారూ అక్కడుండగనే మీకు జోహారు చేస్తాడా' అంటూ వేలాకోలమాడుతుంది. చిరుకోపం నటిస్తూ రాకుమారి ఆమెను తరుము కుంటుంది. చెలికత్తెనైతే తరిమిందిగానీ, మనసులో మెదిలే తియ్యటి జ్ఞాపకాలను తరుమగలదా! మళ్లీ అద్దం ముందు నిలుచుని అందానికి మెరుగులు దిద్దుకుంటుంది. ప్రియుడు దగ్గరౌతున్నప్పుడుగాదు, మనసులో మెదలగానే సోకులు సరిజేసుకోవడమంటే నిజంగా అది 'ఘాటుప్రేమే.' వీరి ప్రేమను ప్రతిబింబించడానికే కొత్తగా 'ఘాటుప్రేమ' అనే పదాన్ని ఉత్పత్తిజేసి వొక యుగళగీతంలో ఇరికిస్తాడు రచయిత.

మార్కస్ బార్ట్లే ఫొటోగ్రఫీని గురించి ఇక్కడొకమాట చెప్పుకోవడం అవసరం. బ్లాక్ అండ్ వైట్ ఫిలింతో ఆహ్లాదం కలిగించడంలో బార్ట్లేకి సాటిరాగల నేర్పరి భారతదేశంలో లేడని నిర్వివాదంగా చెప్పొచ్చు. వెన్నెలలో సన్నివేశాలు చిత్రీకరించినప్పుడు ఆ గొప్పతనం మరింతగా ఇనుమడిస్తుంది. ఈ చిత్రంలో రాకుమారి ఎన్నో పర్యాయాలు వెన్నెల్లో విహరిస్తూ కనిపిస్తుంది. సినిమాల్లో చంద్రుణ్ణి తెరమీద బొమ్మగా గీస్తారు. ఆ వైపునుండి లైటింగ్ వుండనందువల్ల, మనిషి నీడ చంద్రుడు ఉన్నవైపే పడుతూ ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. బార్ట్లే ఫొటోగ్రఫీలో చంద్రుడు ఎటువైపుంటే వెలుతురుగూడా అటువైపునుండే ప్రసరిస్తుంది.

ఎంత పనికిమాలినవాడైనా తమ్ముడు తమ్ముడే గాబట్టి, రాణీకి తన కూతురును తమ్మునికిచ్చి పెళ్ళిచేయాలని అభిలాష. రాజుకూ, రాకుమారికీ అతడంటే చులకన. 'ప్రేమిస్తేగాని అది పెళ్ళిచేసుకోదురా' అంటుంది రాణి తమ్మునితో. అదేదో కొత్త ఆధారం దొరికినట్టు సంబరపడతాడు శూరసేనుడు. 'ఇంతకాలం చెప్పావుకాదేమే అక్కూ. ప్రేమైతే ఎంతైనా చేస్తానే అక్కూ' అంటూ ఇందుమతికోసం తక్షణం బయలు దేరుతాడు. వెదుక్కుంటూ ఉద్యానవనం చేరుకుంటాడు. చెలికత్తె నళిని ఎదురౌతుంది. మూడోమనిషుంటే ప్రేమించడానికి అడ్డంకు. అందుకని నళినిని వెలిపొమ్మంటాడు. చెలికత్తె సేవలు లేకుంటే రాకుమారికి కష్టమౌతుందని అతనికి తెలుసు. అందుకే, 'ఆ పాటి చెలికత్తెతనం తనకూ చేతౌతుంది' గాబట్టి ఆమె అవసరం లేదంటాడు. పాత్ర స్థాయిని తెలపటానికి ఎంతగొప్ప నిర్వచనమో ఇది. తన నైపుణ్యాన్ని

తాను పోల్చుకోవడంలోనే మనిషి స్థాయి తెలిసిపోతుంది. అలాగే, మనిషిలోని కంగారును ప్రదర్శించటానిగ్గూడా రచయిత అపూర్వమైన పద్ధతిని ప్రయోగించాడు వొకచోట. నళినిని పిలువబోయి, ఇందుమతి కంగారులో 'ఇందూ' అంటూ తనపేరు తానే పిలుచుకుంటుంది. మనగ్గూడా అప్పుడప్పుడు ఇలా జరగడం కద్దు.

ఇందుమతితో సరసాలాడటానికి మేనమామ తంటాలు పడుతున్న సమయంలో పొదల్లోనుండి పామొకటి బయటికొచ్చి పడగెత్తుతుంది. చెట్టుమీద దాక్కుని తమాషా చూస్తున్న రాముడు దాన్ని గమనిస్తాడు. కిందికి దూకి, అది రాకుమారిని కాటందుకోకుండా రక్షిస్తాడు. పామును చూసి శూరసేనుడు పారిపోతాడు. విషయం విన్న రాజు, ఆ శకునం గురించి తెలుసుకోటానికి జ్యోతిష్యులను పిలిపిస్తాడు. వారి అభిప్రాయం తెలుసుకుని, ఇందుమతి అంతఃపురం వదిలి వెళ్ళకుండా కట్టుదిట్టం చేస్తాడు.

ఇంతదాకా చెప్పుకున్నదంతా పూర్వరంగం. ఇంతవరకు ప్రేమతో, సంగీతంతో సినిమా సరదాగా సాగింది. ఇక సీరియస్‌గా వుండే సీన్లు రాబోతున్నాయి. కె.వి.రెడ్డి ఊహల్లో వెలిసిన మాంత్రికుడు ఇప్పుడు తెరమీదికి దిగుతాడు. ఉన్నపళంగా అతన్ని తెరమీదికి తెస్తే మోటుగా వుంటుంది. కాబట్టి, అతని దగ్గరకు తీసుకుపోటానికి ఇక్కడే లీడ్ (lead) తీసుకున్నాడు. 'అమ్మాయిామణివారి జాతకం చిత్ర విచిత్రాలతో కూడుకునివుంది. ఎనిమిదింట విషదృష్టిస్థానంలో ఇంద్రుడు ఇంద్రజాల మహేంద్రజాలాలను చేస్తున్నాడు' అనే జ్యోతిష్యుల వాక్యంతో మంత్రగాని గుహకు దారి చూపుతాడు.

మాంత్రికుడు మంత్రాధిదేవత ఉపాసనలో వున్నాడు. అతనిది విలక్షణమైన స్వరూపం. చూపులో క్రూరత్వం, మాటలో కాఠిన్యం, ఉపాసనలో బీభత్సం - కలలోకొస్తే పిల్లలు జడుసుకుని ఏడుస్తారు. అతని గుహగూడా అంతే భయంకరం. తను అనుకున్న ముఖ్యపాత్రకు ఏవిధంగా మేకప్ చేయించాలో నిర్ణయించడానికి కె.వి.రెడ్డి అనుసరించే పద్ధతి వొకటుంది. అలాటి పాత్రకు తగిన నటున్ని ముందే నిర్ణయించుకుంటాడు. రకరకాల భంగిమల్లో, పలురకాల సైజుల్లో అతని స్టిల్ ఫొటోలు తీయిస్తాడు. వాటిని కళాదర్శకునికి అప్పగించి ఎన్నోతరహాల మేకప్‌లతోనూ, దుస్తులతోనూ

ఆ ఫొటోలపై డ్రాయింగులు గీయిస్తాడు. వాటినుండి తనకు నచ్చినదాన్ని ఎంపికజేసి మేకప్‌వారికి అందజేస్తాడు. అందంగా చిత్రించాలన్నా ఇదే పద్ధతి, అసహ్యంగా చూపాలన్నా ఇదేపద్ధతి. 'మాయాబజార్' చిత్రంలో ఎన్.టి. రామారావుకోసం కృష్ణునిపాత్ర మలిచేందుకు గూడా ఇదే పద్ధతి అవలంభించాడు. స్థూలకాయుడైన రామారావు కృష్ణునిగా పనికిరాడని చిత్రసీమ మొత్తం పక్కకు నెట్టేసింది. కానీ, కె.వి.రెడ్డికి అతడు పర్మనెంట్ కథానాయకుడు. అతనితోనే ఆ వేషం వేయించాలని తీర్మానించుకున్నాడు కె.వి.రెడ్డి. అదొక ఛాలెంజ్‌గా తీసుకుని, మేకప్‌నుండి మాటల వరకు ప్రతి అంశం రామారావును దృష్టిలో వుంచుకుని మలుచుకుంటూపోయాడు. చివరకు, చూసినవాళ్లంతా కృష్ణుడంటే రామారావే అనుకునేలా చేశాడు. ఆ కృష్ణుని పటాలు దేవునిగదిలో వుంచుకుని పూజచేసినవాళ్ళు ఎంతోమంది వున్నారు. 'పాతాళభైరవి'కి అదే ప్రయోగం రంగారావు మీద జరిగింది.

పరిశ్రమలో ఎస్.వి.రంగారావు పరిస్థితి ఆసమయంలో అంత బాగోలేదు. మంచి రంగస్థల నటుడైవుండి ఎన్నో ఆశలతో చెన్నపట్నం చేరిన రంగారావుకు నిరాశ ఎదురైంది. 'వరూధిని' చిత్రానికి హీరోగా వచ్చిన నటునికి, ఆ సినిమా పరాజయం పొందడంతో కష్టకాలం దాపురించింది. ఆయనలో దాగిన ప్రతిభను గుర్తించగలిగినవాడూ లేడు, ఆదరించినవాడూ లేడు. చిన్నచిన్న అవకాశాలతో గడుపుకొస్తున్నాడు. రంగారావే తన మాంత్రికుని పాత్రకు తగిన నటుడని కె.వి.రెడ్డి ఎలా గుర్తించగలిగాడో తెలియదుగానీ, ముమ్మూర్తులా సరిపడే నటున్ని పట్టుకున్నాడు. రంగారావు దొరకడం కె.వి.రెడ్డి అదృష్టమో, కె.వి.రెడ్డి దొరకడం రంగారావు అదృష్టమోగాని, అదొక మహాద్భుతమైన సాంగత్యంగా సినిమా చరిత్రలో నిలిచిపోయింది. 'పాతాళభైరవి' విజయంతో ఎస్.వి. రంగారావు నటసార్వభౌముడిగా వెలిగాడు; కె.వి.రెడ్డి 'జానపద బ్రహ్మ'గా కీర్తించబడ్డాడు. నిర్మాతలైన నాగిరెడ్డి, చక్రపాణిలు సంచులతో డబ్బు గుమ్మరించుకున్నారు. మొత్తంమీద 'పాతాళభైరవి' అందరినీ సంతృప్తిపరిచింది.

మాంత్రికుడు ఉపాసనలో వున్నాడు. దీక్షనుండి దృష్టి మరల్చకుండా శిష్యుని కేకేస్తాడు. సంజీవిని సిద్ధం చెయ్యమంటాడు. 'ఎందుకు గురూ' అని అడిగితే 'సేయ రా' అంటూ గదురుకుంటాడు. దీక్షలో వున్నప్పుడు

మనసు మరల్చగూడదు. కుడి చేతిలో వున్నకత్తితో తన ఎడమచేతిని మంత్రాధిదేవతకు బలిగా నరుక్కుంటాడు. ఆ దేవత ప్రత్యక్షమౌతుంది.

'కాపాలికా, ఏమి నీ కోరిక?'

'అన్నికోర్కెలనూ ఇచ్చేది, అన్ని శక్తులనూ జయించేది, ఏది ఆ పరమశక్తి? దేవీ పలుకు.'

'పాతాళభైరవి, పాతాళభైరవి.'

'ఆ శక్తి ఎచ్చట వున్నది? దేవీ పలుకు.'

'ఉజ్జయినికి ఉత్తరాన, యోజనగిరి కోనలోన, మంత్రాల మర్రిక్రింద, భూగర్భంలో యక్షనిక్షిప్తమై వున్నది.'

'ఆ పరమశక్తి సిద్ధించే ఉపాయమేది? దేవీ పలుకు.'

'నీయంతటి మంత్రసిద్ధునిగాని, లేదా మహా సాహసవంతుడు, సన్మార్గుడూ ఐన ఒక యువకునిగాని ఆశక్తికి బలిఇవ్వాలి.'

తెగిన చేతిని దాని స్థానంలోవుంచి శిష్యుడు సంజీవినితో స్పర్శచేస్తాడు. చెయ్యి యథావిధిగా అతుక్కుంటుంది. అప్పుడు మాంత్రికుని దృష్టి బలిమీదికి మరలుతుంది. 'మహాసాహసవంతుడు సన్మార్గుడు, ఎక్కడరా ఆ యువకుడు' అంటూ చేతిలోని కత్తిని దిమ్మెమీద గుచ్చే ఆవేశం రంగారావు శరీరంలో చూడాలి; ఆకలిగొన్న మృగంలా బలికోసం వెదికే క్రూరత్వం అతని కళ్ళల్లోనే చూడాలి. విసురుగా మంత్రదర్శిని దగ్గరికి చేరుతాడు. ఆ యువకునికోసం దాని సహాయంతో గాలిస్తాడు.

'మహాసాహసవంతుడే, వాని జోలి మనకొద్దు గురూ. కీడు మూడేను. మంత్రసిద్ధులు తమరే పనికొస్తారుగా గురూ.'

'నోరు మూయుమురా.' రాముడు దర్శినిలో కనిపించగానే, 'అడ్డడుగోరా డింభకుడు.'

'ఎక్కడ గురూ?'

'ఉజ్జయిని రాజకోట ప్రాకారం దాటుతున్నాడురా. పదరా ప్రయాణం శాయరా.'

దర్శినిలో కనిపించినప్పుడు రాముడు అంజితో కర్రసాము చేస్తున్నట్టు చూపొచ్చు; మరెవరితోనైనా మల్లయుద్ధం చేస్తున్నట్టు చూపొచ్చు; తల్లితో

మాట్లాడుతున్నట్టు చూపొచ్చు - కానీ, కోటగోడ దాటుతున్నట్టు చూపినప్పుడే రాముని తెంపరితనం మరింత నిండుగా కనిపించేది. హీరోను హీరోయిక్‌గా చూపడమంటే అదే. రాముడు ఉబుసుపోక ప్రాకారం ఎక్కటంలేదు. కోటలో వున్న రాకుమారిని చూడాలని ప్రాణానికి తెగించాడు. ఆమె తోటకు రావటం లేదు. ఆమెను చూడకుండా రాముడు ఉండలేడు. ఎట్టకేలకు అంతఃపురంలో ఆమెను కలుసుకుంటాడు. కానీ, శూరసేనుని కంటబడి, తిరిగొచ్చే సమయంలో దొరికిపోతాడు. అంతఃపుర ద్రోహానికి పాల్పడిన నేరస్తుడికి విధించేది మరణశిక్షే. తెల్లవారగానే ఉరి తీయమని రాజు ఉత్తరువు చేస్తాడు. చెరసాల నుండి అతన్ని తప్పించాలని రాజకుమారి వెళుతుంది. పారిపోవటానికి రాముడు వొప్పుకోడు. తల్లినీ, రాజకుమారినీ విడిచి, రాజాజ్ఞ ధిక్కరించి, హీనంగా తలదాచు కోవడం తనవల్ల కాదని మొండికేస్తాడు. ఆ సమయంలో కూతురును వెదుక్కుంటూ రాజు అక్కడికొస్తాడు. పాముకాటునుండి తన ప్రాణాన్ని రక్షించిన మనిషిని కాపాడమని రాకుమారి వేడుకుంటుంది. రాజు అతన్ని క్షమించి వదిలేస్తాడు. అంతస్తుకు మించిన ఆశలు పెట్టుకోవద్దని రాముణ్ణి హెచ్చరిస్తాడు. భవనాలూ, పల్లకీలూ, పరివారం కలిగిన శ్రీమంతుడిగా ఎదిగిన తరువాతగానీ తన కూతురు ప్రసక్తి ఎత్తొద్దంటాడు.

మాంత్రికుడు ఉజ్జయిని చేరుకున్నాడు. తీరికవేళల్లో రాముడు కూర్చునే సత్రం దగ్గర జనాన్ని గుంపుచేస్తాడు. సమయానికి రాముడు గూడా అక్కడే వున్నాడు. రామునికి తన శక్తిని ప్రదర్శించాలి. రామునికి తనమీద గురి కుదిరేలా చేయాలి. నమ్మకం కుదిరితేతప్ప అతడు తన చేతిలోకి రాడు.

**'హాం. అహాం. అష్టభైరవినీ కజ్జ - కాం, కథం, కాలభైరవినీ కజ్జ - హోం, సహోం, కాపాలినీ కజ్జ - నేనిక మంత్రబలం చూపించేను, మనోబలం చూపించేను.'**

**'జనం జనం. నేపాలమాంత్రికునికి డింగిరీ లనండి. వందనాలనండి.'**

రామున్ని ఇన్వాల్వ్ చెయ్యడమే మాంత్రికుని ప్రదర్శనకు ధ్యేయం గాబట్టి, గుంపులోనుండి అతన్ని ముందుకు పట్టుకొస్తూ -

**'యువకులంతా ముందుకురండి. యువతులంతా ముందుకురండి. నడుములు వంగిన నాయకులంతా గడబిడసేయక వెనకుండండి.'**

'ఐతే ఢింగరి, జనం కోరేది మనం సేయడమా, మనం సేసేది జనం సూడడమా? ఏరా డింగరీ.'

'మన కన్నే, మన చెవే, మన మాటే మన జనం. జనమంతా నేనే. మనంకోరతాం, మీరు సేయండి.'

రాతిని కోతిగా చేస్తాడు, ఆ కోతిని నాతిగా చేసి నాట్యం చేయిస్తాడు. రంజుగా నాట్యంచేసి ఆ అమ్మాయి మాయమౌతుంది. ఈ సన్నివేశంలో చూడాలి కె.వి.రెడ్డి, రంగారావుల అద్వితీయమైన ప్రావీణ్యత. కెమెరాముందున్న ఏ నటుడూ ఖాళీగా కనిపించడు. డైలాగు చెప్పేదెవరైనా, మిగతా వాళ్లంతా నటనలో వుంటారు. మాంత్రికుని కన్నంతా రామునిమీదే వుంది. అతడు ఇంప్రెస్ అవుతున్నాడో లేదో గమనించే ఆ చూపులో, కనికట్టు చేసే సమయంలో ప్రదర్శించే చేతివ్రేళ్ళ వొంపుల్లో రంగారావు నటనకు సాటి లేనేలేదు. మాంత్రికుని భావప్రకటన కోసం వొక 'ఫేసియల్ టిక్'ను ప్రవేశ పెట్టాడు దర్శకుడు. అది వైద్యులకు మాత్రమే తెలిసిన అసంకల్పిత చర్య. కె.వి.రెడ్డికి దాన్ని గురించి ఎలా తెలిసిందో ఆశ్చర్యం కలిగిస్తుంది. సంతోషం, దుఃఖం, భయం వంటి ఉద్రేకాలు అతిగా కలిగినప్పుడు కొందరిలో కొన్ని ముఖకండరాలు అసంకల్పితంగా బిగుసుకుంటాయి. దాని వల్ల ముఖంలో కలిగే కదలిక వారి అదుపులో వుండదు. కొందరికి ముక్కుపుటాలు వెడల్పుగా సాగుతాయి. కొందరికి వొక కన్ను టపటపా కొట్టుకుంటుంది. మరికొందరికి నోరు సొట్ట పోతుంది. కొందరిలో రెండురకాల ప్రకంపనాలు వొకేసారి కనిపించొచ్చు. కాపాలికునికి కుడికన్ను మూసుకుపోతుంది. దాంతోపాటు కుడివైపుకు మూతి ఎగలాగుతుంది. అతడెంతటి మంత్రసిద్ధుడైనా ధైర్యం కలవాడుమాత్రం కాదని చెప్పటానికి ఈ ఫేసియల్ టిక్ను ఉపయోగించు కున్నాడు దర్శకుడు. ఎలాగో తెలుసుకుని దర్శకుడు ఆ 'టిక్'ను ప్రవేశపెట్టడమైతే బాగానేవుంది. కానీ, దాన్ని ప్రదర్శించడం తెలిసిన నటుడు కావాలిగదా. అది సాధారణ నటునితో  సాధ్యమయ్యే విద్యగాదు. బహుశా అందుకే ఎస్.వి.రంగారావును ఏరికోరి ఎన్నుకున్నారేమో!

కథానాయకున్ని వశం చేసుకునే ఎత్తులు ఇంకా ఏమున్నాయా అని మాంత్రికుడు యోచిస్తున్నాడు. అంతలో అతని ఆలోచనకు చిన్నఅంతరాయం

కలుగుతుంది. రాణి తమ్ముడు శూరసేనుడు అక్కడి కొస్తాడు. 'ఎవరు నువ్వు?' అంటూ మాంత్రికున్ని గద్దిస్తాడు. మాంత్రికునికి వొళ్లు మండుతుంది. అతీతశక్తులమీద అధిపత్యం సంపాదించిన మహాసిద్ధుడు వొక బఫూన్‌కు తన గుర్తింపు తానుగా చెప్పుకుంటాడా? చెప్పవలసివస్తే ఏ రూపంలో చెప్పేవాడోగాని, ఆ అవసరం కలగకుండా శిష్యుడు జవాబిస్తాడు 'నేపాళ మాంత్రికుడు' అని. 'నేపాళ మాంత్రికుడెవడు, భూపాలం పగిలేను' - రాణి తమ్ముడు నిర్లక్ష్యం చేస్తాడు. మాంత్రికుని కోపం నషాలానికి అంటుకుంటుంది. 'హాం ఫట్ ' అంటాడు. అనగానే శూరసేనుడు ఆడమనిషిగా మారిపోతాడు. ఈ సన్నివేశంలో చూడాలి రేలంగి వెంకట్రామయ్యగారి భావప్రకటనా ప్రౌఢిమ. శరీరంలోపల ఏదో తెలియని వికారం పుట్టుకొస్తున్నట్టు కంపిస్తాడు. మీసాలు తడుముకుంటాడు. కనిపించనందుకు ఆశ్చర్యపోతాడు - మగవాడిలాగానే. వీపున ఏదో వ్రేలాడుతున్నట్టుంటే, దాన్ని చేత్తో ముందుకు తీసుకుంటాడు. అది జడ. సిగ్గుపడిపోతాడు - మగవాడిలా కాదు, చిటికెనవ్రేలు కొరుక్కుంటూ ఆడపిల్లలా సిగ్గుపడతాడు. భావంలోగూడా సంపూర్ణంగా ఆడతనం ప్రవేశించిం దని తెలియజేస్తాడు. తాను పోషించేది బఫూన్ పాత్రేగదా అనే చులకనభావంతో ఆయన నటించలేదు. మార్పును అంచెలంచెలుగా ప్రదర్శించడంలో కెమెరాను డామినేట్ చేశాడు. దక్షత కలిగిన నటునికి వొకపాత్ర మంచిదీ, వొకపాత్ర పనికిరానిదీ వుంటుందా? పాత్రనుబట్టి పాయసం రుచి మారబోదు.

లెంపలేసుకుని శూరసేనుడు మాంత్రికునిముందు మోకరిల్లుతాడు. 'విద్యలు వినోదాలు కావురా, బుద్ధికలిగి బ్రతికివుండు' అంటూ మాంత్రికుడు అతన్ని కనికరిస్తాడు. అంతటితో ఆ ప్రహసనం ముగుస్తుంది.

మాం: అరే ఢింగరి, మహాజనమంతా మన భక్తులు. ఎవరికేమి కావాలో కోరుమురా, బహుమానాలిస్తాం.

**సదా: ఇందరికి బహుమానా లెక్కడినుండి ఇస్తారు గురూ.**

**మాం: ఇదిగోరా అక్షయఘటం. ఎవరికేమి కావాలో ఇప్పించుమురా.**

**సదా: కూకంకాకీ, కేకీకూకే, ఈ తాతయ్య కొక అరటిపండివ్వండి.**

**మాం: అరటిపండు కావాలి. (తీసిస్తాడు)**

**సదా: బూధావాడా, మేమూయాగే, ఈ ముద్దుగుమ్మ కొక కుంకుమభరిణె ఇవ్వండి.**

**మాం: కుంకుమభరిణె కావాలి. (బయటకు తీసి) ఇదోరా.**

**అంజి: మన్నించాలి మహామాంత్రికా. నమస్కార బాణం. రేపోమాపో, తాతోతూటా, నాకో వంద వరహాలిప్పించండి.**

**మాం: నచ్చినావురా. మెచ్చినానురా. (ఘటంతో) వరహాలు కావాలి.**

(అంజి పట్టిన టోపీలో గుమ్మరిస్తాడు)

వరహాలకోసం జనమంతా 'నాకూ నాకూ' అంటూ ఎగబడతారు. రామునిలో ఉక్కిరిబిక్కిరౌతున్న వాంఛ మేల్కొంటుంది. తన కోరిక తీరడానికి ఆ ఘటం దొరికితే చాలనే ఆలోచన కలుగుతుంది. మాంత్రికుని చేతినుండి దాన్ని అమాంతం లాక్కుని, వొక్క ఊపున గోడ దూకి ఊరి బయటకు పరుగుతీస్తాడు. ఇక్కడ దర్శకుని ప్రతిభ మరొక్కసారి ఛమక్కుమంటుంది. రాముడు ఘటాన్ని లాక్కుని పరిగెత్తే ఊపును రామునిమీద చూపడు. ఆ తాకిడికి విసురుకుపోయి కిందబడే ఇద్దరు మనుషులను చూపుతాడు. ఆ బిస, ఆ దూకుడు రాముని మీద చిత్రీకరించడం కష్టం. అందువల్ల, విసురుకుని పడిపోయి క్రింద దొర్లే మనుషుల ద్వారా రాముని తోపు ఎంత బలమైనదో ప్రేక్షకులకు తెలిసేలా చేస్తాడు.

ఇక్కడ కథలో మరోసారి మెలోడ్రమా ప్రవేశిస్తూవుంది. ఊరి బయలుకు చేరిన రాముడు మాంత్రికున్ని అనుకరిస్తూ ఏవేవో పిచ్చిపిచ్చి మంత్రాలు చదివి ఘటంలో తారాడుతాడు. ఏవీ కనిపించవు. రెండోసారి మంత్రం మరోలా చదివి దాన్ని బోర్లిస్తాడు. ప్రయోజనం లేదు. మూడోసారిగూడా ఏమీ కనిపించక పోవడంతో రెచ్చిపోయి ఘటాన్ని బలంకొద్దీ నేలకు విసిరికొడతాడు. సరిగ్గా అదే సమయంలో, ఎక్కడి నుండో వినిపించే అట్టహాసాన్ని ఆ సీనుతో సింక్రొనైజ్ చేస్తాడు దర్శకుడు. క్షణంసేపు మనిషి కనిపించకుండా వినిపించే ఆ నవ్వు ప్రేక్షకుల్లో దడ పుట్టిస్తుంది. ఇప్పుడు కెమెరా ఆ నవ్వు వినిపించినవైపు తిరుగుతుంది. దూరంనుండి మాంత్రికుడు, గాలికి రెపరెపలాడే పొడవాటి అంగీతో, దూకుడుగా ముందుకొస్తూ కనిపిస్తాడు.

**మాం: అందులో ఏముందిరా డింభకా. అంతా మా మంత్రశక్తిలో వుందిరా. తెలుసుకున్నానురా నీ మనసులోని మర్మమంతా. ప్రేమించావు గదరా ఉజ్జయినీ రాజకుమారిని. భవనాలూ, పల్లకీలూ, పరివారాలూ**

**తెస్తే కూతుర్నిస్తానన్నాడు గదరా రాజు. సన్మార్గుడివిరా డింభకా. సన్మార్గులకు సహాయపడటం మా వ్రతంరా. నీ కోరికతీరే కీలకం చూపిస్తాను, సాహసం శాయగలవురా?**

**రాము: మీరేం చెయ్యమన్నా చేస్తాను. ప్రాణాలైనా ఇస్తాను.**

**మాం: భలే డింభకా భలే. జై పాతాళభైరవి. ఊ, పదరా.**

మాంత్రికుడు దారితీస్తాడు. రాముడు అనుసరిస్తాడు. ఇక్కడ దర్శకునికి వొక ఇబ్బంది ఎదురౌతుంది. రాముస్ని కాపాలికుడు ఎక్కడికి తీసుకుపోతు న్నాడో, ఎందుకు తీసుకుపోతున్నాడో ప్రేక్షకులకు ముందే తెలుసు. కాబట్టి ఇక్కడ సస్పెన్స్ అనేది లేకుండా పోయింది. అప్పటిదాకా తారాస్థాయిలో పట్టుకొచ్చిన టెంపో అదే స్థాయిలో కొనసాగకపోతే సినిమా వొక్కసారిగా కుప్పగూలిపోతుంది. దారివెంట ఎంత దట్టమైన అడవులు చూపించినా, ఎంత దుర్గమమైన కొండలు చూపించినా గతించిపోయిన కుతూహలాన్ని తిరిగి ప్రవేశపెట్టడం సాధ్యంకాదు. కాబట్టి, ఆ కొద్దిసేపూ యాంటీక్లైమాక్స్‌లోకి జారిపోకుండా ఎలాగో వొకలాగున పట్టుకురావాలి. సస్పెన్స్‌కు బదులు మరోరకమైన ఉద్రేకంతో ఆ భాగాన్ని నింపాలి. దానికోసం 'జాలి'ని ప్రవేశ పెట్టాలనుకున్నాడు దర్శకుడు. కానీ, ఉన్నట్టుండి జాలిని పుట్టించడం అనుకు న్నంత తేలికగాదు. రచయితతో అందుకుతగిన పాటను రాయించాడు. తను ఆశించిన స్పందన ప్రేక్షకునికి కలిగేలా చేయటానికి ఘంటసాలను ఆశ్రయిం చాడు.

కె.వి.రెడ్డి కోరికను అలవోకగా తృప్తిపరచిన సంగీత స్రష్ట ఘంటసాల. నేపథ్యంలో, వి.జె.వర్మగారి గాత్రంతో వినిపించే 'ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసి వాడు' అనే పాటను ఆయన తీర్చిదిద్దిన తీరు అద్వితీయమైంది. పాటకు మొదలుబెట్టే సంగీతంలోనే వొక విధమైన ఆందోళనా, పాటలో 'అయ్యో పాపం' అనిపించే జాలి అనుకోకుండానే ప్రేక్షకునిలో కలిగిస్తుంది. మళ్ళీ సస్పెన్స్ అందుకునే మంత్రాలమర్రి దాకా టెంపో తగ్గకుండా తన సంగీత ప్రభావంతో సన్నివేశాన్ని నడిపిస్తాడు ఘంటసాల. ఆయన మధురగాయ కుడే గాక, ప్రథమశ్రేణికి చెందిన సంగీత దర్శకుడని రుజువుచేసిన చిత్రం పాతాళభైరవి. ఇందులోని ప్రతిపాటా ఎన్నిసార్లు విన్నా తనివితీరనిది. ప్రజలు

నోరారా పాడుకోని పాటంటూ ఇందులో లేదు. 'కలవరమాయే మదిలో', 'ఎంతఘాటు ప్రేమయో', 'ప్రణయజీవులకు దేవి వరాలే' - ఈ మూడు ముచ్చటైన యుగళగీతాలు, 'కనుగొనగలనో లేనో' అనే విషాదగీతం ఈ సినిమాలోనివే.

మంత్రాలమర్రి దగ్గరినుండి, ప్రేక్షకుల్లో కలిగిన మానసికోద్రేకాన్ని తగ్గకుండా పట్టుకొచ్చే బాధ్యతను కళాదర్శకుడు గోఖలే అందుకుంటాడు. ఆ మర్రిచెట్టునూ, ఆ పాతాళగుహలనూ, తాటిచెట్టు ప్రమాణంలో వుండే పాతాళభైరవి విగ్రహాన్నీ అపూర్వమైన రీతిలో రూపొందించి ఆయన సార్ధకత సాధించాడు. పాతాళభైరవి దగ్గరకు చేరే దారి దుర్భేద్యమైంది. ఆ మంత్రాల మర్రిచెట్టు చాలా విశాలమైంది. అంతటి విశాలమైన ప్రదేశంలో పాతాళబిలం ఎక్కడుందో కనిపెట్టాలి. దానికోసం దర్శకుడూ కళాదర్శకుడూ కలిసి కొన్ని సంకేతాలను తాంత్రికశాస్త్రరీత్యా రూపొందిచారు. అవి శిల్పాల రూపంలో వుంటాయి. మర్రిచెట్టు కిందుండే వొక రాతిబొమ్మ తన చూపుడువ్రేళ్ళు రెంటినీ నేలకేసి చూపుతుంటుంది. కాపాలికుడు గుప్తవిద్యలో ప్రవేశమున్నవాడు గాబట్టి ఆ సంకేతాల వ్యాఖ్యానం గ్రహిస్తాడు. ఆ బొమ్మ పాతాళబిలముండే ప్రదేశాన్ని చూపిస్తూందని తెలుసుకుంటాడు. బిలంనుండి పాతాళగుహలో దిగిన తరువాత మరో సమస్య ఎదురౌతుంది. అది అన్నివైపులూ మూసుకుపోయిన గవి. ఎటు పోవడానికీ దారి కనిపించదు. అక్కడ, గోడమీద మలచిన మరో శిలావిగ్రహం మాంత్రికుని కంటబడుతుంది. దాని కుడి చూపుడువ్రేలు దాని బొజ్జమీదున్న బొడ్డువైపు సూచిస్తూంటుంది. ఎడమ చూపుడువ్రేలితో పక్కన్నేవున్న ఉక్కుగదను చూపుతూంటుంది.

> **'చూస్తివిరా బొడ్డుదేవరను. ఆ ఉక్కుగదతో తన పొట్టను పగలమోద మంటూందిరా. ఆజ్ఞ సేయరా'**

అంటాడు మాంత్రికుడు. రాముడు గదను ఎత్తుకుంటాడు. తూకమంతా వొకవైపే వుంటుందిగాబట్టి గదను పైకెత్తడం అంత సులభంకాదు. శక్తినంతా కూడదీసుకుని రాముడు గదను లేపుతాడు. రాతిబొమ్మ బొజ్జమీద బలంగా తాటిస్తాడు. రాతిది గదా, చెక్కు చెదరదు. రెండవ దెబ్బకు వ్రేలు ముక్కబోతుంది. మూడవ దెబ్బకు ముక్కలుముక్కలుగా విరిగి దారిచేస్తుంది.

మంత్రాలమర్రి దాపులకు చేరినదగ్గరినుండి ఏదోవొక భయంకరమైన కూత గాలిలో వినిపిస్తుంటుంది. అది విన్నప్పుడల్లా మాంత్రికుడు ఉలికిపడు తుంటాడు. భయాన్ని సూచించే ఫేసియల్ టిక్ ముఖంలో కనిపిస్తుంది. నరాలను కూడదీసు కోటానికి 'జై పాతాళభైరవీ' అని స్మరిస్తుంటాడు. 'ఏమిటి స్వామీ ఆ శబ్దం' - రాముడు అడుగు తాడు. 'పాతాళభైరవిరా, తీసుకుపొమ్మని పిలుస్తూందిరా' అంటాడు మాంత్రికుడు. పాతాళబిలానికి ఎగువగావున్న మర్రిశాఖమీదికి రామున్ని చేరుకోమంటాడు. యక్షుల మాయలను అధిగమిస్తూ రాముడు ఆ కొమ్మమీదికి చేరుకుంటాడు. పాతాళానికి సొరంగం చేయడానికై తన మంత్రశక్తితో మంటను చేస్తాడు కాపాలికుడు. రామున్ని అందులో దూకమంటాడు. రాముడు సందేహిస్తాడు.

'పాతాళభైరవి ప్రసన్నమౌతుంది. జయంకోరి మంటలో దూకరా' అని పిలుస్తాడు. ఆ పాతాళభైరవితో రామునికి పనేముంది. ఆ కోరిక రామున్ని ఉసిగొలుపలేదని మాంత్రికుడు గ్రహిస్తాడు. 'సంకల్పం సిద్ధిస్తుంది. రాజకుమారి లభిస్తుంది. జయం కోరి మంటలో దూకరా' అనగానే రాముడు అందులో దూకేస్తాడు. వ్యక్తుల మనస్తత్వాలనుబట్టి వారివారి కోరికల్లోవుండే తేడాను రచయిత మరోసారి ఇక్కడ వెల్లడించాడు.

తలెత్తి ఎగజూసేటంత భారీవిగ్రహం పాతాళభైరవి శిల. ఆకృతిలో భీకరత్వమే గాదు, అన్ని శక్తులనూ మించిన శక్తి ఈమేనన్న నమ్మకాన్నిగూడా కలిగించేలా ఉంటుందా విగ్రహం. 'దేవిని నేను ప్రసన్నం చేస్తాను, నువ్వు ఆ పుష్కరిణిలో స్నానంజేసి శుచివై రమ్మం'టాడు రామునితో మాంత్రికుడు. ఆ దారిని సూచిస్తూ నీటిపై పారాడే వెలుతురు (reflection) గుహ గోడలమీద తళుకుతళుకుమని ప్రసరిస్తూంటుంది. దాంట్లో దిగేముందు రాముడు నీటిని చేత్తో తీసుకుంటాడు. అది ఈతగాని లక్షణం. ఏటిలోగాని, కొలనులోగాని దిగేముందు ఈతగాడు నీటిని చేతిలోకి తీసుకుంటాడు. దానివల్ల ఆ నీటి ఉష్ణోగ్రత తెలుస్తుంది, సాంద్రత తెలుస్తుంది, వాసన తెలుస్తుంది. నీటి మంచిచెడ్డలు తెలుసుకుని వాటిలో దిగినట్టౌతుంది.

కానీ, ఆ నీటిలో మొసలి వుందని రామునికి తెలీదు. నీటిలో దిగిన రామున్ని అది కాలు పట్టేస్తుంది. ముందు జాగ్రత్తగా తన పిడిబాకును

రాముడు కొలను గట్టునే్నవుంచి దిగుంటాడు. ఎలాగో ఆ బాకును చేతికి అందుకుని మొసలిని చంపేస్తాడు. అది నిజంగా మొసలిగాదు, శాపగ్రస్తమైన యక్షకన్య. తనకు శాపవిమోచనం కలిగించి నందుకు కృతజ్ఞతగా రామునికి ఉపకారం చేస్తుంది. కాపాలికుని దుర్మార్గమైన ఆలోచన రామునికి తెలియ జేస్తుంది. ఆ మాంత్రికుణ్నే బలియిస్తే దేవి రాముణ్నే కటాక్షిస్తుందని సలహా ఇచ్చి మాయమౌతుంది. రాముని దగ్గరున్న బాకు గురించి వొక్కమాట ఇక్కడ చెప్పుకోవడం అవసరం. అతనిదగ్గర ఉన్నట్టుండి మొసలిని జయిం చడం కోసమే బాకును కల్పించకుండా, ముందే వొక లింకును కల్పించాడు దర్శకుడు. ఘటాన్ని నేలకు విసిరినప్పుడు వికటాట్టహాసం చేస్తూ తనను సమీపించే కాపాలికుని చూసి రాముడు తన బొగ్గిట్లోనుండి బాకు దూస్తాడు. అది వీరుని సహజలక్షణంగానేగాక, అతని దగ్గర పిడిబాకు అప్పటినుండే వుందని నిరూపించడానికై సృష్టించిన లింకిది. కె.వి.రెడ్డి పాటించే సున్నితమైన మెళుకువలను తెలియజేసే తార్కాణాల్లో ఇదొకటి.

వంచించాలని చూసిన మాంత్రికుణ్ని తనే వంచించి, తల నరికేస్తాడు కథానాయకుడు. పాతాళభైరవి ప్రత్యక్షమౌతుంది. తన శక్తిని ప్రతిమ రూపంలో ప్రసాదిస్తుంది. దేవిని తలుచుకుని ఆ ప్రతిమను నుదుట సోకితే ఆమె ప్రత్యక్షమై అడిగినవన్నీ నెరవేరుస్తుంది. రాముడు ఆ ప్రతిమను అందుకుంటాడు. దేవి అంతర్ధానమౌతుంది. వెనుదిరిగి వస్తున్న రాముడు తన పాతబట్టలను అక్కడే వదిలేయకుండా చంకన పెట్టుకురావడం దర్శకుని సూక్ష్మబుద్ధికి తార్కాణం.

కథానాయకుడు తిరిగొచ్చి, రాజకుమారిని పెళ్ళాడి, సుఖంగా సంసారం చేసుకుంటే ఏ తంటా లేదు. కానీ, కథ అక్కడే ముగిస్తే పేలవంగావుండేది. హీరోగూడా ఏ గొడవ లేకుండా గడిచిపోతుందనే అనుకుంటాడు. తన పూరిగుడిసె స్థానంలో రాత్రికిరాత్రే మాయామహల్ నిర్మిస్తాడు. హోదాకు తగిన కానుకలు రాజకుటుంబానికి నజరానాగా పంపిస్తాడు. రాజకుమారిని తనకిచ్చి వివాహం చేసేలా రాజును మెప్పిస్తాడు. ముహూర్తం నిర్ణయ మౌతుంది. పాతస్నేహితులను ఆహ్వానిస్తూ అంజి సత్రం దగ్గరికి చేరుతాడు. అక్కడే మిగిలిపోయిన సదాజపుడు అంజికి తటస్థిస్తాడు. వేలాకోలంచేస్తూ అంజి అతన్నిగూడా పెళ్ళికి ఆహ్వానిస్తాడు. గురువు పన్నాగం పారలేదని

సదాజపుడు గ్రహిస్తాడు. గురువుకోసం దుర్భిణితో వెదుకుతాడు. తల తెగిపడిన మాంత్రికుని శవం పాతాళగుహలో కనిపిస్తుంది. పరుగుపరుగున సదాజపుడు అక్కడికి చేరుకుంటాడు. సంజీవిని తాకించి గురువును బ్రతికించుకుంటాడు. సరిగ్గా రాముని పెళ్ళినాటికి గురుశిష్యులిద్దరూ ఉజ్జయిని పొలిమేరకు చేరుకుంటారు.

లగ్నం ఎప్పుడని స్నేహితులు అడగ్గా, జ్యేష్ఠమాసంలో ఏదో తిథిని చెబుతాడు అంజి. పెద్దకొడుక్కుగానీ, పెద్దకూతురుకు గానీ జ్యేష్ఠమాసంలో వివాహం చేసే ఆచారం ఆంధ్రదేశంలో లేదు. మరి ఉజ్జయిని సాంప్రదాయమేదో మనకు తెలీదు. నాయకుడు పంపిన కానుకలను సమర్పించేందుకు రాజదర్బారుకు వచ్చిన అంజి, కొన్ని కానుకలను చూపిస్తూ, 'ఇవి రాజకుమారికి' అంటాడు. 'రాజకుమారిగారికి' అనే పాటి మర్యాదైనా పాటించడు. అంత అమర్యాదగా ప్రవర్తించిన మనిషిని రాజు ఎందుకు ఉపేక్షించాడో దర్శకునికే తెలియాలి. రాజుగా నటించిన సి.ఎస్.ఆర్. చాలా హుందాగా వుంటాడు. రాణిగూడా ఠీవిగానే వుంటుంది. రాజకుమారిగా నటించిన మాలతి నడకలోనే రాజహంస ఠీవి తొణికిసలాడుతుంది. కానీ, ఎందుకో, ఆ రాజకుటుంబాన్ని చిత్రీకరించడంలో హుందాతనం లోపించినట్టు అగుపిస్తుంది.

ఇందుమతి దక్కలేదనే దిగులుతో శూరసేనుడు ఆత్మహత్య చేసుకోవాలని ఊరిబయట అవస్తపడుతుంటాడు. అతనికే రాజకుమారిని కట్టబెడతానని నమ్మించి, అతనిద్వారా కాపాలికుడు పాతాళభైరవి ప్రతిమను చేజిక్కించుకుంటాడు. రాజకుమారినీ, మాయామహలునూ పాతాళభైరవి సహాయంతో తన తావుకు చేర్చుకుంటాడు. తనను వరించమని రాకుమారిని పోరుపెడతాడు.

మాం: సదాజపా, సదాజపా. మీ అమ్మణ్ణి ఏం చేస్తోందిరా?

సదా: కోపం చేస్తూంది గురూ.

మాం: ఏలరా? (రాజకుమారి దగ్గరికి పోతాడు) మూర్ఛలోనే ముద్దొచ్చావే బుల్‌బుల్. మోహంలో నన్ను ముంచేసినావే. ఇక దిగులు మానవే బుల్‌బుల్. సర్వాలంకారం శాయవే. సర్వ భోజనం శాయవే. నాతో సంబరం శాయవే బుల్‌బుల్.

రాకు: నన్నెందుకిలా పీడిస్తారు. కనికరం లేదూ. నేను మీకే మపకారం చేశాను.

మాం: అ. అపకారం కాదే బుల్‌బుల్. ఆడమొకం ఎరుగని ఈ మంకు మాంత్రికుని గుండెల్లో వలపురేపి వసంతగాలి వీయించావే బుల్‌బుల్. బలవంతం సేయనీక, రసవంతంగా నన్ను వరించి వశ్యంకావే బుల్‌బుల్.

రాకు: ఛీ. నీచుడా. నిన్నా నేను వరించేది. నా ప్రాణం పోయినా నీ వశం గాను.

మాం: వరెవరెవరె వాడికత్తీ. నువ్వెంతే. నిన్ను మించిన మోహినీ, ఢాకినీ, మారినీ మహాశక్తులనే వశం చేసుకున్నానే. అనుకుంటే రాళ్ళనీ రప్పల్నీ బొమ్మల్నీగూడా వశ్యం శాయగలనే. హాంఫట్ (బొమ్మ ముందుకు జరుగుతుంది) చూస్తివే నా మహిమ. కానీ, నీతో శృంగారం చేస్తానే బుల్‌బుల్. సరసంలో శఠం భటం నాకు పసందుకాదే. మర్యాదగా నీ మనసు నా వైపు మల్లించుకోవే.

రాకు: హమ్మా (అంటూ సొమ్మసిల్లిపోతుంది).

అమ్మతో ఇందుమతికి ఏ పొద్దూ చనువులేదు. కాబట్టి, ఈ సందర్భంలో నాన్నను తలుచుకుంటే బావుండేది. బి.ఎన్.రెడ్డిగారైతే బహుశా 'నాన్నా' అనిపించి వుండేవారేమో.

మాంత్రికుని స్థావరాన్ని వెదకటానికి, అంజిని వెంటతీసుకుని, రాముడు అడవులవెంట పడతాడు. ఇక్కడగూడా అంజి తొడుక్కున్న చొక్కాకు చిరుగుల అతుకుండడం బాగానేవుందిగానీ, ఆ చిరుగు సినిమామొత్తం వొకేచోట వుండటం ఎబ్బెట్టుగావుంది. అక్కడ రాకుమారి సేవకురాల్లందరినీ బయటికి తరిమి తలుపులు బిగిస్తుంది. కానీ, కాపాలికుని అవి అడ్డుకోలేవు. మంత్రబలంతో లోపలికొస్తాడు. తన మంత్రబలంతో రామున్ని కట్టిపడేసి తన ఎదుటికి తెప్పించు కుంటాడు. రాకుమారి పరిగెత్తుకుంటూ వెళ్ళి రామునిమీద పడుతుంది. 'ఈ ధగిడీని దూరంగా లాగండి' అంటూ మాంత్రికుడు ఆజ్ఞాపించగానే, సేవకురాళ్ళు ఆమెను పట్టి లాక్కెలతారు. బయటికి పంపేసిన సేవకురాళ్ళు హఠాత్తుగా లోపలుండటం ఎలా జరిగిందో మనకైతే తెలిసిరాదు. రాకుమారిని లొంగదీసుకోటానికి, ఆమె సమక్షంలోనే రామున్ని మాంత్రికుడు కొరడాలతో కొట్టిస్తాడు. తెల్లవారి అతన్ని బలికి సిద్ధం చెయ్యమంటాడు.

**రాకు: అయ్యో, అతన్నేం చెయ్యకండి. కావాలంటే నన్ను చంపండి.**

**మాం: అదెట్టాగే బుల్‌బుల్. నువ్వుండాలే. నువ్వు నా గుండెవే.**

రాకుమారి మూర్ఛపోతుంది. అడవిలో వొంటరిగా మిగిలిపోయిన అంజి, అక్కడి భూతాలనుండి యుక్తితో మాయచెప్పులనూ, మాయదుప్పటినీ సంగ్రహించి, వాటి సాయంతో రాముని దగ్గరికి చేరుకుంటాడు. రాముడు మాంత్రికున్ని మట్టుబెట్టి, రాజకుమారిని తీసుకొచ్చి ఆమె తలిదండ్రులకు అప్పగిస్తాడు. అంతటితో కథ కంచికి, ప్రేక్షకులు ఇంటికి చేరుకుంటారు. తన సినిమా చూడొచ్చిన జనానికి ఏదోవొక దైవంతో 'ఆయురారోగ్య ఐశ్వర్యాలు' సమకూరేలా దీవింపజేసి ఇంటికి పంపడం కె.వి.రెడ్డి రివాజు.

మొత్తంమీద 'పాతాళభైరవి' తెలుగు ప్రేక్షకులమీద మత్తుమందు చల్లింది. జనం ఈ చిత్రాన్ని చూడటానికి ఎగబడినట్టు అప్పటివరకు విడుదలైన ఏ సినిమాకూ ఎగబడలేదు. సినీప్రేక్షకుల్లో దాదాపు తొంభైశాతం ఈ చిత్రాన్ని ఐదుసార్లకు మించి చూసిన వాళ్లే. రికార్డులో దీన్ని అధిగమించిన చిత్రం ఆతరువాత వచ్చిన 'మాయాబజార్' తప్ప మరొకటి లేదు. 'మాయాబజారు' కైతే ప్రజాదరణ మరీ విపరీతం. దాన్ని ముప్ఫైనలభైసార్లు చూసిన ప్రేక్షకులే వేలల్లో కనిపిస్తారు. 'పాతాళభైరవి'కి మించిన మకరందం 'మాయాబజార్'లో ఏందొరుకుతుందో వొకసారి పరిశీలిద్దాం.

# మాయాబజార్

ఇదివరకు లేదు, ఇకమీద రాదు - అనిపించుకున్న తెలుగు పౌరాణిక చిత్రం 'మాయాబజార్.' 'పౌరాణికాలకైతే తెలుగుసినిమాలే చూడాలి'అని యావద్భారతదేశం తలఊపిన వొరవడిని తెలుగుసినిమారంగానికి దత్తం చేసిన చిత్రమిది. ఇంతకూ ఇది పౌరాణికమా, జానపదమా? బలరామునికి శశిరేఖ అనబడే కూతురు వున్నట్టూ, ఆమెను అభిమన్యుడు పెళ్ళిచేసుకున్నట్టూ మన పురాతన గ్రంథాల్లో ఎక్కడా కనిపించదు. పద్మవ్యూహంలో అభిమన్యుడు చనిపోయినప్పుడు, ఆడవారు యుద్ధరంగానికొచ్చి విలపించే సందర్భంలో గూడా అభిమన్యుని భార్యగా ఉత్తరను ప్రస్తావిస్తారేతప్ప, శశిరేఖ గురించి మాటమాత్రంగానైనా లేదు. మరి దీన్ని జానపదమందామా? అననివ్వరు. శశిరేఖ మినహా, మిగిలిన పాత్రలూ, వాటిమధ్య బంధుత్వాలూ మొదలైనవన్నీ పురాణభారతం లోనివే. అదీగాక, ఈ కథ 'శశిరేఖా పరిణయం', 'వీరఘటో త్కచ' తదితర పేర్లతో రంగస్థలంమీద పురాణగాథగా అప్పటికే ప్రజల ఆమోదం సంపాదించింది. మూకీల కాలంనుండి మన దేశంలో, ప్రతి భాషలోనూ పదేపదే సినిమాగా నిర్మింపబడిన ఇతివృత్తాలు రెండే - ఒకటి సత్యహరిశ్చంద్ర, రెండవది ఈ మాయాబజార్. హైటెక్ విధానంలో మరో మాయాబజార్ భవిష్యత్తులో రావచ్చునేమోగానీ, ప్రస్తుతానికి విజయా వారి 'మాయాబజార్' చివరిదిగా నిలిచిపోయింది. విజయావారి 'మాయాబజార్' చూసిన తరువాత, ఆ కథను తిరిగి సినిమాగా తీయటానికి మరెవరూ సాహసించలేదు.

'మాయాబజార్'ను తయారుచెయ్యమని విజయా ప్రొడక్షన్స్‌వారు కె.వి.రెడ్డికి బాధ్యత అప్పగించారు. అంతా తయారైన తరువాత చూసుకుంటే దాని ఖర్చు దాదాపు ముప్ఫైలక్షలకు చేరుకునేలావుంది. విజయావారు తటపటాయించారు. పదిలక్షల పెట్టుబడితో మంచి సినిమా తీయగల రోజులవి. దానికి మూడింతలు పెరిగితే అసలుకే మోసమొస్తుందేమోననే అనుమానంలో పడ్డారు. 'ధైర్యే సాహసే లక్ష్మీ' - తోటరాముడు గుర్తుకొచ్చాడేమో, ధైర్యం

కూడగట్టుకుని కానివ్వమన్నారు. సాహసం ఫలించింది. వారి 'మాయాబజార్' విజయదుందుభి మ్రోగించింది. కె.వి.రెడ్డికి 'సెసిల్ బి.డి. మిల్లే ఆఫ్ సౌత్ ఇండియా'గా గుర్తింపు లభించింది. కాలపరిమితులు దీని సంపాదనాశక్తిని అడ్డుకోలేకపోయాయి. 1957 చిత్రం ఈరోజు విడుదలైనా దాని వాటాకు లోటురాకుండా మూటగట్టుకుని యజమానులకు చేరుస్తూవుంది.

కథేమో మహాభారత పాత్రలతో నడిచేదే. పాండవులకూ యాదవులకూ వియ్యమేర్పడే ఇతివృత్తం. కానీ, సినిమా మొత్తంలో పాండవులను చూపించే అవసరమే లేకుండా స్క్రీన్‌ప్లే తయారుజేసి, తనంతటి 'క్రాఫ్ట్స్‌మన్' లేడనిపించుకున్నాడు కె.వి.రెడ్డి. మాయాబజార్ స్క్రీన్‌ప్లేని అత్యుత్తమమైనదిగా, భావితరాలకు ఆదర్శప్రాయమైనదిగా వుండేలా తీర్చిదిద్దాడు. తెలుగు సినిమారంగంలోని ప్రఖ్యాత తారాగణమంతా ఈ సినిమాలో మనకు కనిపిస్తుంది. ఎస్.వి.రంగారావు, ఎన్.టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, ముక్కామల, సి.ఎస్.ఆర్, రేలంగి, నాగభూషణం, మిక్కిలినేని, ఆర్. నాగేశ్వరరావు, వంగర, అల్లు రామలింగయ్య, నల రామ్మూర్తి, బాలకృష్ణ, రమణారెడ్డి, చదలవాడ కుటుంబరావు, సావిత్రి, ఋష్యేంద్రమణి, ఛాయాదేవి, సంధ్య, సూర్యకాంతం - అబ్బో, వీరుగాక, చిన్నచిన్న పాత్రల్లో మాధవపెద్ది సత్యం, కంచి నరసింహారావు, కాకినాడ రాజరత్నం, వగైరావగైరా, ఇక పాండవులను చూపడానికి నటులెక్కడ మిగిలారు!

ఎక్కడా పొరపాటే లేకుండా ఈ సినిమా నడిపించారా? అది సాధ్యమేనా? తప్పులు ఉన్నాయేమో, బయటికిమాత్రం తెలియకుండా పకడ్బంధీగా నిర్మించారు. అదేపనిగా సినిమాకెళ్ళి మూడునాలుగుసార్లు నేను ప్రయత్నించాను. సాధ్యం కాలేదు. కారణం? మొదలైన కొద్దిక్షణాలకే ఈ సినిమా ప్రేక్షకులను తనలో లీనం చేసుకుంటుంది. అందులో పూర్తిగా కలిసిపోకుండా కాస్తా వెలుపల ఉండగలిగితేనే లోపాలు తెలిసొచ్చేది. కానీ, ఈ సినిమా మనకా అవకాశం ఇవ్వదు. పదవసారి చూసే ప్రేక్షకుణ్ణైనా తనలో కలిపేసుకుంటుంది; తన ప్రవాహంలోకి ఈడ్చుకుపోతుంది.

చాలామంది ప్రేక్షకులు సినిమా టైటిల్స్ మీద పెద్దగా శ్రద్ధ చూపరు.

అవి ముగిసిందాకా వరండాల్లో నిలబడి కబుర్లు చెప్పుకుంటుంటారు. 'మాయా బజారు'కు మాత్రం అలా జరుగలేదు. విజయావారి పతాకం తెరమీద కనిపించగానే వినిపించే శంఖారావానికి తొక్కిసలాడుకుంటూ థియేటర్లో దూరి సీట్లను ఆక్రమిస్తారు. చిన్న ముక్కగూడా తప్పిపోకుండా టైటిల్స్ మొదలు అంతా చూడాలనే కుతూహలం చూపరులకు కలిగించిన తెలుగు సినిమా బహుశా ఇదొక్కటేనేమో. ఒకవైపు అభిమన్యుడు, మరోవైపు ఘటోత్కచుడు - వొకరి మీద వొకరు ఆయుధాలు విసురుకుంటే, అవి ఆకాశమార్గంలో ఢీకొని నిప్పులు చెరగుతూంటే, ఆ నిప్పురవ్వలో పేర్లు మారుస్తూ టైటిల్స్ మొదలౌతాయి. ఈ చిన్న కిటుకుతోనే చూపరులు వశంతప్పి కె.వి.రెడ్డి చేతిలో చిక్కిపోతారు.

కోట బురుజుల మీద నిలబడి కొమ్ములూదే మనుషులతో కథ మొదలౌతుంది. ద్వారకానగరంలో జరుగుతున్న వేడుకకు అది ప్రకటన. ఆ ప్రకటనలోనే యాదవ సంప్రదాయాన్నీ, ఆచారాన్నీ ప్రవేశపెడుతున్నాడు దర్శకుడు. కొమ్ము' అనేది బహుప్రాచీనమైన ఊదుడు వాయిద్యం. రాలిపోయిన జంతువుల కొమ్ములను అనాది కాలంలో బూరలుగా వాడేవారు. ముఖ్యంగా పశువుల కాపరులు పరస్పరం సంకేతాలు పంపుకోడానికి వీటిని ఉపయోగించే వారు. లోహయుగం ప్రవేశించిన తరువాత, జంతువుల కొమ్ము ఆకారంలో లోహపు పరికరం ప్రవేశించింది. పరిణామక్రమంలో అది ఎన్నో రూపాంతరాలు చెంది, బారుగా వంకరతిరిగిన ఆకారంలో వుండే వాయిద్యం 'కొమ్ము' అనే పేరుతో మనదేశంలో నిలిచిపోయింది. యాదవులది పశువులకాపరి వృత్తినుండి వచ్చిన తెగ కాబట్టి, వారి సంప్రదాయంలో కొమ్ము అత్యంత ప్రాముఖ్యత కలిగిన వాద్య విశేషం. ముప్ఫైయ్యేళ్ళకు పూర్వం, యాదవులు జరుపుకునే ప్రతి సంబరంలో 'కొమ్ము' తప్పనిసరి లాంఛనం.

శశిరేఖ పుట్టినరోజో లేక పెద్దమనిషిగా ఎదిగిన సందర్భమో, పేరంటాళ్ళు పాట పాడుతూంటే, పెద్దవారొచ్చి దీవించిపోతుంటారు.

**సకల సౌభాగ్యవతి రేవతీదేవీ, తల్లియై దయలెల్ల వెల్లివిరియగనూ**
**అడుగకే వరములిడు బలరామదేవులే జనకులై కోరిన వరములీయగనూ**
**శ్రీ కళల విలసిల్లు రుక్మిణీదేవీ, పినతల్లియై నిన్ను గారాము శాయా**
**అఖిల మహిమలు కలుగు కృష్ణపరమాత్ములే పినతండ్రియై**

**సకల రక్షణలు శాయ ..**

**ఘనవీర మాతయగు శ్రీసుభద్రాదేవి మేనత్తయై నిన్ను ముద్దు శాయగనూ**

**పాండవా యువరాజు బాలుడభిమన్యుడే బావయై**

**నీవె తన లోకమని మురియ ..**

**వర్ధిల్లు మాతల్లి వర్ధిల్లవమ్మా, చిన్నారి శశిరేఖ వర్ధిల్లవమ్మా.**

ఈ వేడుక చూపించకున్నా మాయాబజార్ కథకు ఇబ్బందిలేదు. కానీ ఇది చూపించితీరాలి. ఎందుకంటే, ఈ కథకు పాత్రలు మెండు. దాదాపు అన్ని పాత్రలూ ప్రాముఖ్యత కలిగినవే. పాత్రను ప్రేక్షకులకు పరిచయం చెయ్యటానికి వొక నిర్దిష్టమైన సందర్భం వుండాలనేది కె.వి.రెడ్డి నిశ్చయం. రంగస్థలంమీద పాత్రలు ప్రవేశించినట్టు తెరమీద జరుగరాదంటాడు. అందుకని, ప్రధానపాత్రల్లో సగభాగాన్ని మొదట్లోనే తేల్చెయ్యడానికి ఈ సన్నివేశాన్ని సృష్టించాడు. ఒకేవొక్క సన్నివేశంతో శశిరేఖతోపాటు, రేవతీబలరాములను, రుక్మిణీకృష్ణులను, సుభద్రాభిమన్యులను మొత్తంగా పరిచయంచేసి కథలోకి ప్రవేశిస్తాడు.

పింగళి నాగేంద్రరావుగారి సున్నిత హాస్యానికి మచ్చుతునకగా ఇక్కడొక సన్నివేశముంది. పుట్టింటి వేడుకలో పాల్గొనటానికి వచ్చిన సుభద్ర, వాటిని ముగించుకుని ఇంద్రప్రస్థానికి బయలుదేరుతుంటుంది. తనుగూడా మేనత్తతో కలిసి వెళ్ళటానికి శశిరేఖ ముందుగానే రథమెక్కి కూర్చుంటుంది. బాలాభిమన్యుడుగూడా రథంలో వుంటాడు.

**రేవ: ఏమయ్యా అల్లుడా, నువ్వు మాదగ్గర వుండరాదూ.**

**అభి: ఊహూ. నేనుండను. శశిని మావూరు తీసుకెల్తున్నాంగా.**

**రుక్మి: బాగుంది. తండ్రిని మించిన కొడుకే అనిపించాడు.**

అంటే, అతని తండ్రి తామెవరూ లేకుండాచూసి, సుభద్రను లేవదీసుకు పోగా, ఇతడేమో అందరి కళ్ళముందే ఎత్తుకుపోతున్నాడనే పరాచికం.

**సుభ: పోనీ, రానీలే వదినా.**

**రేవ: ఇవాళ గనుక ఇంత తేలిగ్గా అన్నావు. ఆ రోజు వచ్చినప్పుడు ఇంత కన్నా నిక్కచ్చిగానే అడుగుతావూ, నేను పంపకా తప్పదు. అంత వరకైనా నాకూతుర్ని నాదగ్గర ఉండనివ్వమ్మా.**

శశిరేఖను సాత్యకి రథం దింపుతాడు. ఆమె అయిష్టంగా రథం దిగుతుంది. ఉద్యానవనానికి పోయి పరధ్యానంగా కూర్చుంటుంది. అల్లరి పెడుతూ చెలికత్తెలు చుట్టుకుంటారు. శశిరేఖకు చిన్నప్పటినుండి అభిమన్యుడంటే ఇష్టమని ధ్రువపరచడం పూర్తయింది. ఇక ఆమె పెద్దదైన తరువాత ఎలా జరుగుతుందో చూపాలి. చెలికత్తెలను తప్పించుకుని, బాలశశిరేఖ కొలను గట్టున కూర్చుంటుంది. శశిరేఖను పెద్దదానిగా చెయ్యటానికి సింపుల్ డిసొల్యూషన్ బదులు మరో సరికొత్త ప్రయోగాన్ని ప్రవేశపెట్టాడు దర్శకుడు. చిన్నారి శశిరేఖ ప్రతిబింబం నీటిలో చూపిస్తాడు. కొలనులో నీరు తొలికి అలలుగా మారుతుంది. అవి నిశ్చలం కాగానే, అదేచోట, అదే భంగిమలో వయసొచ్చిన శశిరేఖ కనిపిస్తుంది. అప్పట్లో ఈ టెక్నిక్‌ను చిత్రసీమలో చాలాగొప్పగా చెప్పుకున్నారు.

'మాయాబజార్' సినిమాను నిశితంగా పరిశీలిస్తే, ఆ రచయితగానీ, ఆ దర్శకుడుగానీ మహాభారతాన్ని పైపైన చదివి వదిలేసినవారు కారనీ, ఆ గ్రంధాన్ని కూలంకషంగా పరిశోధించినవారనీ విదితమౌతుంది. అందుకు ఈ రెండు సన్నివేశాలే ఉదాహరణ -

ధర్మరాజు రాజసూయయాగం చేస్తాడు. ఆ యాగానికి బలరాముడు వెళ్ళలేకపోతాడు. కృష్ణుడు మాత్రమే వెళతాడు. తోడుగా సాత్యకిని తీసుకుపోయినట్టు ఈ సినిమాలో కల్పించారు. తోడుకు అతడే ఎందుకుండాలి అంటే, దానికి కారణముంది. కురుక్షేత్ర యుద్ధానికి ముందు పాండవులకూ కౌరవులకూ కృష్ణుడు యాదవసైన్యాన్ని పంచుతాడు. తనొక్కడూ పాండవుల వాటాకు రాగా, తక్కిన యదు సైన్యమంతా దుర్యోధనునికి దక్కుతుంది. యుద్ధానికి ముందే యదుసైన్యం సాత్యకి నాయకత్వాన హస్తినాపురం చేరుకుంటుంది. ఆ తరువాత, యుద్ధం దగ్గరపడేముందు, రాయబారానికని కృష్ణుడు పాండవదూతగా హస్తినకు పోవలసివస్తుంది. కౌరవులు తనమీద కుట్ర చేయవచ్చుననే అనుమానం కృష్ణునికి ఎందుకు కలిగిందోగానీ, ఆనాటి కురుసభను యదుసైన్యంతో నింపి జాగ్రత్తగా వుండమని సాత్యకికి రహస్యంగా కబురు పంపుతాడు. హస్తిన చేరింతరువాత, దుర్యోధనుడు తనకు రాచ మర్యాదలతో ఏర్పాటుచేసిన విందును తిరస్కరించి, తన మీద భక్తిభావం

కలిగిన విదురుని ఇంట్లో భోజనం చేస్తాడు. కృష్ణుడు అనుమానించినట్టే కురుసభలో కుట్ర జరుగుతుంది. అది భగ్నం కావటం వెనుక సాత్యకి సహకారంగూడా వుంది. దీన్నిబట్టి సాత్యకిమీద కృష్ణునికున్న నమ్మకం తెలిసొస్తుంది.

రాజసూయ యాగానికి ముగింపుగా ఇచ్చే అగ్రతాంబూలాన్ని ధర్మరాజు కృష్ణునికి ఇవ్వాలని సంకల్పించినట్టు కృష్ణునికి తెలుసు. దాన్ని క్షత్రియలోకం సహించదనిగూడా అతనికి తెలుసు. ఎందుకంటే, వొక్క పాండవులు మినహా, తక్కిన రాజలోకం కృష్ణున్ని తమకు సాటివానిగా గుర్తించలేదుగాబట్టి. అందువల్ల, ఏదోవొక రూపంలో వారి ఆక్షేపణ అక్కడ ఎదుర్కోక తప్పదు. అందుకు తనవెంట వుండదగిన వీరుణ్ణి సాత్యకిలో గుర్తించడం చాలా సహేతుకమైన ఆలోచన. దీన్నిబట్టి, మహాభారతం మీద పింగళి, కె.వి.రెడ్డిగార్లు ఎంత విస్తృతమైన అవగాహన కలిగిన వ్యక్తులో తెలుస్తుంది.

అగ్రతాంబూలం అందుకుని ఇంద్రప్రస్తంనుండి కృష్ణుడూ, సాత్యకీ ద్వారకానగరానికి తిరిగొస్తారు. అక్కడి విశేషాలను బలరామునికి చిత్రపటాల ద్వారా వివరిస్తూవుంటారు. ఫొటోలూ, కెమెరాలూ లేని కాలం కాబట్టి, కొత్త తరహాలో చిత్రపటాల ఆల్బంను ప్రవేశపెట్టడం వొక ప్రత్యేకత. బలరామునితోపాటు రేవతీదేవీ, రుక్మిణి అక్కడే వుంటారు.

**సాత్య: రాజసూయానికి విచ్చేసిన సర్వులకు సంభ్రమాశ్చర్యాలు కలిగించి, న భూతో న భవిష్యతి అని అందరిచేతా ప్రశంసించబడిన ఆ మయ సభ ఇదే. ఈ మయసభంతా కనకరత్నమణిమయం. స్తంభాలూ, ద్వారాలూ, తోరణాలూ, వనాలూ, తటాకాలూ సర్వం . . .**

**రేవ: (అడ్డొస్తూ) ఏమిటీ, వనాలూ, తటాకాలూ కూడా మణిమయాలేనా!**

**సాత్య: ఔను వదినా. అందులో సహజ వనాలూ, సహజ తటాకాలూ గూడా వున్నాయి. ఏవి నిజాలో, ఏవి కల్పితాలో తెలుసుకోలేక మన కౌరవ సోదరులు గల్లంతు పడిపోయారు. ఇదిగో ఇదే, దుర్యోధన చక్రవర్తి నేల అని భ్రమపడి మడుగులో పడిన ఘట్టం.**

**రేవ: పాపం. ఈ చిత్రాలు చూస్తూంటేనే ఇంత కళ్ళు చెదురుతున్నాయే, అసలు భవనాలు చూస్తే ఎలావుంటుందో.**

కృ: వదినా, మీకీ కోరిక వుందని ధర్మరాజుకు కబురుచేస్తే, ఆ మయసభనే తెప్పించి మన ద్వారకముందు పెట్టిస్తాడు.

రుక్మి: ఔనౌను. మన శశి పెళ్ళినాటికి వాళ్ళకు అదే విడిదిగాగూడా అవుతుంది.

రేవ: బావుందమ్మా రుక్మిణీ. విడిదింటినిగూడా వెంటతెచ్చుకోమనడానికి మనకేం తక్కువా?

బల: ఔను.

కృ: (అంతటితో ఆ సంవాదాన్ని తుంచేస్తూ) అన్నయ్యా, రాజసూయానికి మహర్షులంతా వేంచేశారు. వారి గోష్ఠిలో రాజర్షులు మీరు లేరే అని ధర్మరాజు చాలా విచారించాడు. . . . . మీరు సత్యవ్రతులనీ, మీరే దీనికి అర్హులని, ధర్మరాజు ఈ కానుక మీకు పంపించాడు.

బల: ఏమిటది?

బంధువులైనా బలరామునికి పాండవులంటే గిట్టదు. ఆ బంధుత్వం సజావుగా ఏర్పడింది కాదు. బలరాముడు కౌరవులవైపు మొగ్గకుండా చెయ్యటానికి కృష్ణుడు వేసిన ఎత్తుగడతో ఏర్పడిన బంధుత్వం. తన కన్నుగప్పి అర్జునుడు తన చెల్లెలు సుభద్రను దొంగగా లేవదీసుకుపోవడంవల్ల ఏర్పడిన బంధుత్వం. అంతా ఐపోయిన తరువాత, చేసేదిలేక మనసును ఉగ్గబట్టి ఆమోదించిన బంధుత్వం. అందుకే, పాండవుల ఔన్నత్యం చెబుతున్నప్పుడు బలరామునికి వెగటు కలుగకుండా, కృష్ణుడు చాకచక్యంగా మసలుకుంటున్నాడు.

కృ: త్రికాలాలలో దాచుకున్న సత్యాన్ని త్రికరణశుద్ధిగా వ్యక్తులచేత బహిరంగం చేయించే దివ్యమహిమ గల సత్యపీఠమిది.

సాత్య: పూర్వము హరిశ్చంద్రుడి సత్యసంధతకు మెచ్చి విశ్వామిత్రుడు సృష్టించి ఇచ్చెనని ప్రతీతి.

కృ: మరి దీని ప్రభావం వినండి. ఎవరినైనా ఈ పీఠం ఎక్కించిన చాలు, వారిచేత, వారి నోటివెంటే, వారు అనుకున్నది, అనుకుంటున్నది, అనుకోబోయేది - గూఢాలోచన లన్నింటిని బయటకు పంపిస్తుంది.

బల: ఓహో.

రేవ: ఈ ప్రపంచంలో ఇటువంటి చిత్రాలుగూడా వుంటాయని నేనెప్పుడూ విసలేదు.

బల: సాత్యకీ, ఈ సత్యపీఠాన్ని మన పూజాగృహంలో భద్రం చేయించు.

(అంతలో శశిరేఖ అక్కడికొస్తుంది.)

కృ: సాత్యకీ, మన శశికి పంపిన కానుక ఏదీ?

రుక్మి: ఎవరు పంపారో ఏమిటో, చెప్పకుండానేనా ఇవ్వటం.

కృ: అన్నీ తెలుస్తాయి. శశీ, నీ గదిలోకి వెళ్ళి ఏకాంతంగా ఈ పేటిక తెరిచి చూడు.

(పేటిక తీసుకుని శశి వెళిపోతుంది.)

సాత్య: అది ప్రియదర్శిని వదినా. ఆ పేటిక తెరిచిచూస్తే అందులో ఎవరి ప్రియవస్తువు వారికి కనిపిస్తుంది.

రేవ: ఆహా. పాండవుల అదృష్టమే అదృష్టం. ఇంద్రవైభవమంతా అక్కడే వుంది.

రుక్మి: ఔను, ఇంద్రుని కొడుకే వున్నాడక్కడ.

బల: రుక్మిణీ, అక్కడ నా తమ్ముడు కృష్ణుడే లేకపోతే, ఇంద్రునికొడుకూ కాదు, ఇంద్రుని తండ్రీ కాదు, ఎవరివల్లా ఏపనీ అయ్యేదికాదు. ధర్మరాజుచేత రాజసూయం దిగ్విజయంగా చేయించి, అంతటి సభలోనూ అగ్రతాంబూలం అందుకుని, అధిక్షేపించిన శిశుపాలుని శిరచ్ఛేదం చేసి, దుష్టశిక్షణ చేసివచ్చాడు. కృష్ణా, నిన్ను నేను సత్క రించాలి. ఇలారా. (అంటూ కౌగలించుకుంటాడు.)

పాండవుల గొప్పతనాన్ని హర్షించే సదుద్దేశం బలరామునికి ఏకోశానా లేదు. అతనిలో దాగున్న పాండవద్వేషాన్ని ఎక్కడా బయటికి పొక్కనియ్యడు రచయిత. బంధుత్వమూ, ద్వేషమూ కలిసిన భావన(mixed feeling)ను ఇందులో అతి నైపుణ్యంగా చిత్రీకరిస్తాడు. ఈ సన్నివేశానికి పూర్వం ఇలాటిదే మరొక సందర్భం తటస్థిస్తుంది. అది శశిరేఖాభిమన్యుల బాల్యం నాటిది. అభిమన్యుడు తన అస్త్రవిద్యా కౌశలాన్ని ప్రదర్శిస్తూ, శశిరేఖ తలమీద పండుంచి బాణం సంధిస్తాడు. అంతలో రేవతి అడ్డొచ్చి అతన్ని ఆపుతుంది. సంభాషణలో దింపి అసలు విషయం మరిచేలా చేస్తుంది. 'అత్తయ్యా,

మా అమ్మంత చమత్కారంగా వెయ్యగలవా బాణం?' అడుగుతాడు అభిమన్యుడు. 'ఐతే రామరి, మీ అమ్మదగ్గరే చూపిస్తాను నా చమత్కారం' అంటూ అతన్ని అంతఃపురంలోకి తీసుకుపోతుంది.

రేవ: ఏం వదినా, చూశావా మీ కుమారుడు ఏంచేస్తున్నాడో. మా శశి తల మీద పండు పెట్టుకుని నిలుచుంది. ఈ వీరుడు బాణంపెట్టి కొడుతున్నాడు. బాణం అమ్మాయికి తగిలితే ఏంకావాలి చెప్పు.

సుభ: నీ భయమేగానీ, మా అబ్బాయి గురి తప్పడు వదినా.

అభి: అత్తయ్యా, నువ్వు జడవకుండా నిలుచో, నీ ముక్కుకు తగలకుండా నీ నత్తును కొట్టేస్తా.

బల: భలే అల్లుడూ భలే. కృష్ణా, ఇదే చెబుతున్నాను. నీ పంచపాండవుల పరాక్రమమంతా వొక ఎత్తు, నా మేనల్లుడి వీరవిక్రమం వొకెత్తు. జ్ఞాపకముంచుకో.

ఇది పాండవులను తీసేసినట్టూ గాదు; అందుకని పాండవులను ప్రశంసించినట్టూగాదు. ఇందులో 'నీ' పంచపాండవులు, 'నా' మేనల్లుడు అన్న వేరుబంధం గమనిస్తేనే పాత్ర అంతరంగం మనకు తెలిసేది. రవ్వంత సందు దొరికితే చాలు, అందులో దూరిపోవడం కృష్ణుని మేధావితనం.

కృ: సుభద్రా. ఇంతటి వీరపుత్రున్ని కన్నందుకు అన్నగారు ఏం వరం ఇస్తారో అడుగు.

బల: కోరుకో సుభద్రా. ఏ వరమైనా సరే, ఇచ్చేస్తాను.

సుభ: శశి నా కోడలైతే చాలు. ఇంతకంటే ఇంకేం వరం కావాలన్నయ్యా.

రేవ: ఇదీ వొక పెద్ద వరమేనా సుభద్రా. అమ్మాయి పుట్టినప్పుడే నీ కోడలు అనుకున్నాం.

కృ: (సుభద్రను ఇంకా పూనదోలుతూ) సుభద్రా, సందేహిస్తున్నావా?

బల: ఇంకా సందేహమా? ఇదిగో, శశి నీ కోడలు. సరేనా -

అంటూ శశిరేఖ చేతిని సుభద్ర చేతిలో పెడతాడు. ఎలాగో వొకలా శశిరేఖను అభిమన్యునికి ఇచ్చేలా చేసి, బాంధవ్యాన్ని గట్టిపరచడం రుక్మిణీ వాసుదేవుల అభిమతం. అందుకు బలరామునితో వాగ్దానం చేయించడమేగాదు, ఆ విషయాన్ని మాటిమాటికి ప్రస్తావిస్తూ, రేవతీబలరాములను సైకలాజికల్‌గా

తయారుజేసే విధానాన్ని ఎంత చాకచక్యంగా ఈ సినిమాలో చూపిస్తున్నారో గమనించితీరాలి. మయసభ చిత్రాలు చూసి రేవతి నివ్వెరపోతున్న అదనులోగూడా ఈ విషయాన్ని అలా తాకి వదిలేస్తారు. 'కావాలంటే ఆ మయసభను మన ద్వారక ముందే పెట్టిస్తాడు ధర్మరాజు' అని కృష్ణుడంటే, 'ఔనౌను, అది మన శశి పెళ్ళినాటికి వారికి విడిది అవుతుంది' అంటూ రుక్మిణి బలపరుస్తుంది.

ప్రియదర్శిని తీసుకెల్లిన శశిరేఖ, దాన్ని ఏకాంతంగా తెరిచి చూస్తుంది. అభిమన్యుడు కనిపిస్తాడు. అతన్తో ఆమె ముచ్చట ముగుస్తుండగనే, ఆమె తల్లి, తండ్రి, పినతల్లి, చిన్నాన్నా అక్కడికొస్తారు. ఆ పేటిక మహాత్మ్యం తెలియడానికి రేవతి దాన్ని తెరిచి చూస్తుంది. రకరకాల ఆభరణాలూ, చీనిచీనాంబరాలూ ఆమెకు కనిపిస్తాయి. తరువాత బలరామున్ని చూడ మంటారు. తనకు నమస్కరిస్తూ దుర్యోధనుడు అందులో కనిపిస్తాడు. అతన్ని చూడగానే బలరాముని ముఖంలో కనిపించే సంతృప్తిని గుమ్మడి వ్యక్తీకరించిన తీరు ప్రశస్తమైంది. పాండవులు రాజసూయాన్ని దిగ్విజయంగా పూర్తిచే యడం ద్వారా ఎంత ఎత్తుకు ఎదిగారో బలరాముడు చూస్తున్నాడు; ఇంద్ర వైభవానికి తక్కువగాని ఐశ్వర్యానికి అధిపతులయ్యారని ఇంతదాకా విన్నాడు; ఐనా అతనికి తన శిష్యుడైన దుర్యోధనుని మీదున్న అభిమానం చెదరలేదని చెప్పటానికి ఈ పేటికను వాడుకున్నారు దర్శకుడూ, రచయిత.

**బల: కృష్ణా. నువ్వు చూడు, ఎవరు కనిపిస్తారో.**

**కృ: అందరికీ తెలిసిన విషయమేగా, అర్జునుడు కనిపిస్తాడు. వేరే చూడాలా అన్నయ్యా.**

కృష్ణుడు దాటెయ్యాలని చూస్తాడు. కానీ వదలరు. అతడు ఎనిమిదిమంది పట్టపు రాణులకేగాక, పదహారువేలమంది గోపికలకు మొగుడనే ఎత్తిపొడుపుతో రేవతి ఛలోక్తి విసురుతుంది -

**రేవ: ఇంతమాత్రానికి రుక్మిణి ఏమీ అనుకోదుగానీ, చూడవయ్యా క్రిష్ణా.**

**కృ: సరే. నాకెవరు కనిపించినా మీరెవరూ మూర్ఛపోరాదు. నాకు ప్రియులెవరో, అప్రియులెవరో నాకే తెలియదుగా మరి.**

కాబట్టి, అందరూ అనుకునేదానికి భిన్నమైన అనుబంధమేదో కృష్ణుని

కుంది. అది అందరినీ దిగ్భ్రాంతులను చేసేంత తీవ్రమైనదని గూడా ముందుగానే హెచ్చరిస్తున్నారు. నిజమే. అందరినీ ఆశ్చర్యంలో ముంచే విశేషమే అది. ప్రియదర్శినిలో కృష్ణునికి కనిపించిన మనిషి శకుని!

**బల: అరె, జూదానికి పిలుస్తూ శకుని ప్రత్యక్షమయ్యాడే.**

**కృ: ఊరికే కనిపిస్తారా అన్నయ్యా మహానుభావులు. ఏం నాటకం ఆడబో తున్నాడో.**

అంటూ సర్దేస్తాడు కృష్ణుడు. కానీ, కృష్ణునికి శకుని కనిపించింది ప్రియదర్శినిలో. ప్రియమైనవారిని చూపించడమే ఆ పేటిక మహత్మ్యం. మరి కృష్ణునికి ప్రియమైనవాడు శకునేనా? ఔను. ముమ్మాటికీ అతడే. ధ్యేయాలు కలిసిన మనుషుల మధ్య ఏర్పడే అనుబంధం సాటిలేనిది. కృష్ణునిదీ శకునిదీ వొకే ధ్యేయం - క్షత్రియవంశాన్ని నాశనం చెయ్యడం. ఆ ఇద్దరూ క్షత్రియుల వల్ల నష్టపోయారు, అవమానాలపాలయ్యారు. పాండవులవైపు చేరి కృష్ణుడు, కౌరవులవైపు చేరి శకుని, వారి పగ తీర్చుకోటానికి వేసిన ఎత్తుగడల్లో ఎక్కడేగాని సమన్వయలోపం కనిపించదు. ఇద్దరూ కలిసి ఆనాటి క్షత్రియలోక సర్వస్వాన్నీ కురుక్షేత్రయుద్ధంవైపు మళ్లించారు. పద్దెనిమిది అక్షౌహిణుల సేనావాహినిని మట్టిలో కలిపి అవతారం చాలించారు. ధ్యేయంలో కృష్ణునికీ శకునికీ వున్న సామీప్యతను మహాభారతం లోతులనుండి పోల్చుకోగలిగిన మహామేధావులు పింగళి, కె.వి.రెడ్డిగార్లు. అంతేగాదు, ఇంతవరకు మనం ప్రస్తావించిన సన్నివేశాల్లో పాత్రల స్వభావం, ప్రవర్తన, వారి ఆశలు అనుబంధాలూ, వైభవాలూ, సామర్థ్యాలూ మొదలైన ఎన్నోవిషయాలు కథాగమనంలోనే ఇమిడించడంలో ప్రశస్తమైన వారి వృత్తినైపుణ్యం (craftmanship) కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది.

చాపకింద నీటిలాగా ఆ ప్రియదర్శినీ పేటిక మరో మూడు పాత్రలను చప్పుడుగాకుండా ప్రవేశపెట్టింది. యుక్తవయసుకు చేరిన అభిమన్యుడిగా అక్కినేని నాగేశ్వరరావు అందులో కనిపిస్తాడు. దీంతో బాలాభిమన్యుడిని అదేపనిగా పెంచి పెద్దజేసే శ్రమ తప్పిపోయింది. అంతేగాక, అభిమన్యుడిని ఐశ్వర్యంతో చూపే ఈవొక్క అవకాశాన్నీ వినియోగించుకున్నట్టయింది. దుర్యోధనసార్వభౌముడిగా ముక్కామల, శకునిగా సి.ఎస్.ఆర్ లనుగూడా

పేటిక పరిచయం చేసింది. తరువాతి సీన్‌లో కౌరవులను చూపించడానికి తగిన లీడ్‌ను ఇది తయారుజేసింది. మయసభలో దుర్యోధనునికి జరిగిన అవమానానికి ప్రతీకారం చెయ్యాలని దుర్యోధనుడూ, దుశ్శాసనుడూ, శకునీ, కర్ణుడూ ఆలోచిస్తుంటారు. జూదంలో పాండవులను ఓడించడమే సులువైన మార్గమని వారందరినీ శకుని వొప్పిస్తాడు.

ఇక్కడ ద్వారకలో రాచకుటుంబమంతా వినోదం చూస్తుంటారు. వారు చూస్తున్నది బలరామకృష్ణుల బాల్యవిశేషాలు తెలిపే రూపకం. అది ఆబాల గోపాలాన్నీ ఆకట్టుకునే సంగీతనృత్యనాటకం. బమ్మెర పోతన భాగవతంలోని 'ఓయమ్మ నీకుమారుడు, మాయిండ్లను పాలుపెరుగు మననీడమ్మా' అంటూ యశోదకు గోపికలు చేసే ఫిర్యాదును రూపకంగా మలిచారు. ప్రఖ్యాతనటి పుష్పవల్లి కుమారుడు బాబ్జీ చిన్నికృష్ణుని వేషం వేశాడు. పుష్పవల్లికుండే పెద్దకళ్ళను ఈ అబ్బాయి పుణికిపుచ్చుకున్నాడు. చలాకీతనం ఉట్టిపడే చారడేసి కళ్ళతో ఎంతో ముచ్చటగా కనిపిస్తాడు. ఆహ్లాదంగా నాటకం సాగిపోతున్న సమయంలో కృష్ణునికి ద్రౌపది ఆర్తనాదం వినిపిస్తుంది. కురు సభలో ఆమెను అవమానించడం కృష్ణునికి కనిపిస్తుంది. అభయహస్తం చూపుతూ అతడు నిశ్చేష్టంగా నిలిచిపోతాడు. మిగతా కుటుంబసభ్యులంతా కంగారుపడి అతన్ని కదిలిస్తారు. కృష్ణుడు స్పృహలోకొచ్చి, జరిగిన విషయం అందరితో చెబుతాడు - మాయాజూదంలో శకుని ధర్మరాజును ఓడించి, పాండవుల ఐశ్వర్యాన్ని రాజ్యలక్ష్మితోసహా స్వాధీనం చేసుకున్నారు; నిండు సభలో ద్రౌపదిని చీరలొలిచి అవమానించారు; పాండవులను పన్నెండేళ్ళు వనవాసం, వొక ఏడాది అజ్ఞాతవాసం పంపించారు.

**సాత్య: కౌరవుల కండకావరం. మనమీ అధర్మాన్ని సహించి ఊరుకోరాదు. అన్నయ్యా, నాకాజ్ఞ ఇవ్వండి. చతురంగబలాలతో వెళ్ళి . . .**

**బల: సాత్యకీ. నువ్వు ఆవేశపడకు. అధర్మం నేనూ సహించను. ఇప్పుడే హస్తినాపురానికి పోయి, కౌరవులకు బుద్ధిచెప్పి, పాండవులకు రాజ్యం ఇప్పించి మరీవస్తాను. దుర్యోధనుడు నా శిష్యుడు. నామాట ఎన్నడూ జవదాటడు. రథాన్ని సిద్ధంచేయించు.**

బలరాముడు హస్తినకు బయలుదేరుతాడు. మాయాజూదమూ, ద్రౌపదీ

వస్త్రాపహరణం మొదలైన సన్నివేశాలను తెరమీదికి తేవాలని ప్రయత్నించ కుండా, నాలుగు మాటలతో ముగించి, తిరిగి ప్రధాన కథనంలోకి చేరుకుంటాడు దర్శకుడు.

అక్కడ, హస్తినాపురంలో, పాండవులను పరాజితులుగా చేసినందుకు, శకునికి కౌరవసోదరులు బ్రహ్మరథం పడుతుంటారు. మామకు దిష్టి తీయించటానికి పురోహితులను పిలిపిస్తారు. వారు శాస్త్రి, శర్మలు - వంగర, అల్లు రామలింగయ్యలు. శకునికీ, దుర్యోధనునికీ గూడా దిష్టి తీస్తారు. ఆ దిష్టితీసే వచనంలోనూ మనకు ప్రత్యేక శ్రద్ధ కనిపిస్తుంది. శకునిది మేధో సంపత్తి. అందులో రాక్షసగురువు శుక్రుణ్ణీ, దేవగురువు బృహస్పతినీ మించి పోయాడట. శకుని తెలివికి అంతటివారే అసూయపడే ప్రమాదం వుంది గాబట్టి -

**'శ్రీ శకుని మహాశయులవారి ప్రచండ భీషణకు, సుప్రసిద్ధులగు శుక్ర బృహస్పతుల ఈర్ష్యారిష్ట నిష్ఠుర దృష్టిదోషంబు తగులకుండా - ఓం శాంతి, ఓం శాంతి . . .'**

కురుసభలో తమ పట్టపురాణి ద్రౌపదికి జరిగిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంటానని భీముడు బహిరంగంగా ప్రకటిస్తాడు. తన ప్రతిజ్ఞను బయటికి చెప్పకపోయినా, మనసులో ఏదో వున్నట్టు సూచిస్తూ అర్జునుడు దారివెంట ఇసుకను చల్లుకుంటూ నడుస్తాడు. కాబట్టి, దుర్యోధనునికుండే ప్రమాదం శత్రువుల ప్రతిజ్ఞలనుండి. అందువల్ల -

**'పరమ పాపిష్ఠి శత్రుజన ప్రతిజ్ఞారిష్ట కష్టంబులు కలుగకుండా - ఓం శాంతి, ఓం శాంతి . . .'** అంటూ విబూది పడతాడు.

కౌరవులు ఈ కోలాహలంలో వుండగా బలరాముడు వస్తున్నట్టు వార్త మోసు కొస్తాడు ప్రతీహారి.

శకు: ఆ . . ప్రతీహారీ, సమయానికి శుభవార్త తెచ్చావు. ఇదిగో . .

(హారం బహూకరిస్తాడు)

దుర్యో: శుభవార్త ఏమిటి మామా. నాకు భయంగావుంది. ఎందుకు వస్తున్నారో ఏమిటో. అసలే ఆయన ముక్కోపి.

శకు: పర్వాలేదు దుర్యోధనా. ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి వుండనే

వుంది. పరమ సంతుష్టాంతరంగుడై నీ గురుదేవుడు నీవడిగిన వరాన్ని అనాలోచితంగా ఇస్తాడు. పుచ్చుకో. అతని కూతురు శశిరేఖను మన లక్ష్మణకుమారునికిచ్చి వివాహం చేయించు. దానితో బలరామదేవుడు మనపక్షం. దానితో యాదవులు మనపక్షం. అవ్వారితో విధి లేక శ్రీకృష్ణడుగూడా మన పక్షం కాకతప్పదు.

కర్ణు: మామా, రాజకీయంగా మీ ఎత్తు ప్రశంసించ తగ్గదే. కానీ, తండ్రిని మించిన మానధనుడే మన లక్ష్మణకుమారుడు, ఆ యాదవకన్యను స్వీకరిస్తాడా అని.

శకు: ఆహా, తప్పక స్వీకరిస్తాడు. నాదీ భారం.

ఈ లీడ్‌తో ప్రేక్షకులకు లక్ష్మణకుమారుని వైపు దారిచేస్తున్నాడు దర్శకుడు. 'ఆ యాదవకన్యను స్వీకరిస్తాడా' అనే సందేహం కర్ణుని ద్వారా వెలుబుచ్చడంలో వొక ఆంతర్యముంది. దుర్యోధనునికి ఎంతటి ఆప్తమిత్రుడైనా కర్ణుడు సరికులస్తుడు మాత్రం కాదు. ఆతడు శూద్రుడు. మరొకరి నోటివెంట ఆమాట పలికిస్తే కర్ణుడు చిన్నబోయే అవకాశముంది. కర్ణునితోనే ఆమాట పలికిస్తే తంటా వుండదు.

అప్పట్లో లక్ష్మణకుమారుని పాత్రమీద విస్తృతంగా వినిపించిన విమర్శ వొకటుంది. కురువంశ సార్వభౌముని కుమారుణ్ణి వీరునిగా చూపకుండా జోకర్‌గా చూపడం సబబేనా అని చాలామంది ప్రశ్నించారు. 'అతడు ఫలానా తరహా మనిషని భారతంలో ఎక్కడా చెప్పలేదు. అందులో అది కేవలం అప్రధానమైన పాత్ర. మూలంలో ఔచిత్యం కలిగిన పాత్రను మరోలా మారిస్తే తప్పౌతుందిగానీ, ప్రాధాన్యత లేని పాత్రను అలా మలచడంలో తప్పులేదు' - అన్నది పింగళివారి అభిప్రాయం. విజయావారి లక్ష్మణకుమారుడు పిరికి వాడని చెప్పలేం గానీ, అసూయాపరుడు, మూర్ఖుడూ నని చెప్పొచ్చు. మనస్తత్వాలను సమూలంగా శోధించే నేర్పరి శకుని. ఆ అసూయకు గాలంవేస్తే తప్ప లక్ష్మణకుమారుడు పట్టుబడడని అతనికి బాగా ఎరుక.

శకు: ఇక నీవు వివాహం చేసుకోవాలని నేనూ, మీ నాన్నా నిశ్చయించాం.

లక్ష్మ: ఐతే నేనూ నిశ్చయించాను.

శకు: ఆ . . సంబంధంగూడా ప్రశస్తమైంది. పెళ్ళికూతురు భువనైకసుందరి,

శశిరేఖ. మన బలరామదేవుని కూతురు.

లక్ష్మ: సిగ్గు సిగ్గు. ఆ అనాగరిక యాదవ సామంతరాజుకు నేను అల్లుడ నగుటయా? అసంభవం.

శకు: ఐతే ప్రమాదమేనే. ఆ కన్యను అభిమన్యుడు వరించాడట.

లక్ష్మ: ఐతే నేనేనా వరించలేనిది. అభిమన్యుడు వరించిన కన్యలందరిని నేనే వరిస్తాను. వాడికి ఇలాతలంలో కన్య దొరక్కుండాచేస్తాను. తాతా, ఆ రేఖ నాకే కావాలి.

అసలే హాస్యపాత్ర; ఆపైన పాత్రధారుడు రేలంగి; ఘట్టం ఎంత రసవంతంగా వుంటుందో చెప్పవలసిన అవసరంలేదు. ఆస్థాన పురోహితులైన శాస్త్రి, శర్మల గురించి వొక సందేహం. నియోగి బ్రాహ్మణులకు మాత్రమే 'శర్మ' అనే తోక తగిలించుకోవడం సంప్రదాయం. నియోగులు మంత్రాంగం లోనూ, ఇతర ప్రభుత్వోద్యోగాల్లోనూ ఉండటం పరిపాటి. పౌరోహిత్యం వైదిక బ్రాహ్మణుల వృత్తేగాని, నియోగులది కాదు. మరి ఆ జంటలో ఇద్దరు శాస్త్రులనే ఉంచకుండా వొక నియోగిని ఎందుకు చేర్చారో అర్థం కాలేదు. ఆ తరువాత వచ్చే మరో సన్నివేశంలో, 'మేము పురోహితులమని ఎవరన్నారు ప్రభూ. మేము తమ విదూషకులం. వైతాళికులం.' అని లక్ష్మణకుమారుతో అంటారు. కానీ, ఇది కేవలం సమర్ధనగానే కనిపిస్తుంది. ఎందుకంటే, విదూషకులతో విబూది పట్టించుకునేంత వెర్రిబాగులవాళ్ళుకాదు శకుని, దుర్యోధనులు.

విధేయతకు లొంగిపోయే బలహీనత బలరామునిది. హస్తినాపురంలో అతనికి ఏర్పాటుచేసిన స్వాగతసత్కారం అతివిధేయతా పూర్వకంగా వుంది. చామరలు విసిరేది సేవకులు కాదు; ఖుద్దున కర్ణుడు, దుశ్శాసనుడూ ఆపని చేస్తారు. బృహస్పతిని మించిన వాడుగా పేరుగాంచిన శకుని కలశధార పోస్తూంటే, స్వయంగా దుర్యోధన సార్వభౌముడు పాదాలు కడుగుతాడు. నటనలో గుమ్మడి వెంకటేశ్వరరావుగారి పటిమను ప్రకాశింపజేసిన సన్నివేశమిది. కౌరవుల దురాగతాలను దండించే లక్ష్యంతో హస్తినకు చేరిన బలరాముడు, అంచెలంచెలుగా లొంగిపోవడాన్ని ఆయన అద్భుతంగా ప్రదర్శించారు. ఈ స్వాగతసత్కారానికి కల్యాణిరాగంలో ఘంటసాలవారు వినిపించే సంగీతం మధురాతిమధురమైందే కాక, ఎవరినో లాలిస్తున్న భావన కలిగిస్తుంది. కురు

సార్వభౌముడు చూపిన విధేయతకు బలరాముడు చిత్తైపోతాడు. తప్పంతా పాండవులదే నని అంగీకరిస్తాడు. శశిరేఖను లక్ష్మణకుమారునికిచ్చి వివాహం చేసేలా వరమిస్తాడు.

వనవాసంనుండి చెల్లెలు సుభద్రనూ, మేనల్లుడు అభిమన్యున్నీ వెంటతీసుకుని ద్వారకకొస్తాడు కృష్ణుడు. వైభవానికి దూరమైన సుభద్రకు వదినె రేవతీదేవి ఆదరణగూడా దూరమౌతుంది. శశిరేఖకు మాత్రం అభిమన్యునిమీద అనురాగం మాసిపోదు. ఆమె అతనితో చనువుగా తిరగడం రేవతి సహించలేదు. మేడగది దాటి బయటకు వెళ్ళే అవకాశం లేకుండా కట్టడి చేస్తుంది.

**శశి: ఏమ్మా బావతో ఆడుకుంటే?**

**రేవ: ఏం, బావా నువ్వూ ఇంకా చిన్నపిల్లలనుకుంటున్నారా? ఈడొచ్చిన పిల్లవు. పెళ్ళికాకముందు ఇలా తిరుగుతూంటే నలుగురూ నవ్వరూ. కులపెద్దలు తప్పుపట్టరూ.**

అంటే- ద్వారకానగరంలో కులపెద్దల వ్యవస్థ కొనసాగుతూ వుందన్న మాట. తప్పనిసరిగా ఆ వ్యవస్థ అక్కడ వుండితీరాలి. ఎందుకంటే, యాదవ సామ్రాజ్య మొక 'ట్రైబల్ కింగ్‌డం.' యదు, వృష్ణి, భోజ, కురు మొదలైన పన్నెండు తెగల సమ్మేళనం.

పున్నమిరోజు నౌకావిహారం చేయాలని ఆ బావామరదల్లు అదివరకే నిర్ణయించుకుని వుంటారు. బాణాన్ని సంకేతం చేసి అభిమన్యుడు శశిని పిలుస్తాడు. 'తలుపేసుంది బావా, ఎలా రావడం?' - అడుగుతుంది శశి. 'దూకేసెయ్, పట్టుకుంటాను' - అంటాడు అభిమన్యుడు. వీరులకు బుర్ర తక్కువుంటుందంటారు. 'మళ్ళీ పైకిరావడం ఎలా?' అడుగుతుంది శశి. అప్పుడుగానీ అతనికి తెలిసిరాదు చాటుమాటు కలయికల్లోని ఇబ్బంది. బాణాలతో మెట్లు చేస్తాడు అభిమన్యుడు. వాటివెంట దిగి ఆమె, అతనితో నౌకావిహారం వెళుతుంది. ఆ నౌకావిహారానికి రూపొందించిన పాటే 'లాహిరి లాహిరి లాహిరిలో.'

**తారాచంద్రుల విలాసములతో విరిసే వెన్నెల వరవడిలో, ఉరవడిలో**
**పూల వలపుతో ఘుమఘుమలాడే పిల్లవాయువుల లాలనలో ..**

**అలల ఊపులో తీయని వలపులు చెలరేగే ఈ కలకలలో, మిలమిలలో**
**మైమరపించే ప్రేమనౌకలో హాయిగ చేసే విహరణలో ..**

పున్నమి, వెన్నెల - మార్కస్ బార్ట్లేగారికి పండుగే పండుగ. పట్టపగలు, మండుటెండలో షూటింగ్ చేసిన నౌకావిహారం పున్నమివెన్నెల్లోలాగే కని పిస్తుంది. ఇది మొత్తం మూడు వేరువేరు స్థలాల్లో చిత్రీకరించిన సన్నివేశం. కానీ, అవి వేరువేరు స్థలాలని మనం తెలుసుకోలేం. అంతా వొక దగ్గరే జరిగినట్టుంటుంది. అంతా ఔట్‌డోర్‌లో తీసిందీగాదు; కొన్ని భాగాలు స్టూడియో సెట్టుమీద తీసినవీ ఉన్నాయి. కానీ, వెన్నెల ప్రసరించే వెలుతురు ఎంత నేర్పుగా సమన్వయం చెయ్యబడిందంటే - ఇది సెట్టులో తీసింది, ఇది బయట తీసింది అని కనిపెట్టలేనంత సమతౌల్యంగా వుంటుంది. వెలుతు రును గ్రేడింగ్ చెయ్యడంలో బార్ట్లేకున్న నైపుణ్యం అలాటిది.

మార్కస్ బార్ట్లే సేవలు విజయా సంస్థకే అంకితం. ఆయన ఇతరుల సినిమాకు పనిచేసినట్టు కనబడదు. ఇతర సంస్థలు ఆయన్ను మొయ్యడం కష్టం. సెట్టును నిర్మించడం పూర్తయిన తరువాత, షూటింగ్ మొదలెట్టకుండా ఆయనకు వొకరోజు ఖాళీగా వదిలేయాలట. పలురకాల లైటింగుల్లో ఆ ఖాళీసెట్టును ఆయన ఫొటోగ్రాఫ్ చేసుకుని, ఆ నెగెటివ్‌లు డెవలప్ చేసి చూసుకున్నాకగానీ షూటింగు ప్రారంభించడట. సినిమాకు కావలసిన ముడిఫిలిం కొనడానికే నిర్మాతలు నానా తంటాలు పడుతూంటే, ఖాళీసెట్టుకోసం ముడి ఫిలిం సరఫరా చేసే నిర్మాతలు ఈయనకు ఎవరు దొరుకుతారు?

సంగీతం విషయంగా మాయాబజార్‌కు మరో ప్రత్యేకత వుంది. రాజేశ్వర రావు, ఘంటసాలలిద్దరూ స్వరకల్పన చేసిన చిత్రం చరిత్రలో ఇదొక్కటే. టైటిల్స్‌లో ఘంటసాల పేరొక్కటే కనబడుతుంది. కానీ, ఈచిత్రానికి తొలుతగా నియమించబడిన సంగీతదర్శకుడు రాజేశ్వరరావు. కె.వి.రెడ్డి సమయ నిర్దిష్టతకూ (punctuality), రాజేశ్వరరావు స్వేచ్ఛా స్వభావానికీ పొంతన కుదరలేదు. కొంతకాలం చూసి, ఆయన్ను వదిలేసి ఘంటసాలను తీసుకున్నారు. అప్పటికే రాజేశ్వరరావు 'నీవేనా నను తలచినదీ', 'చూపులు కలసిన శుభవేళ', 'లాహిరి లాహిరి లాహిరిలో', 'నీకోసమె నే జీవించునదీ' అనే నాలుగు పాటలకు స్వరకల్పన చేసివున్నారు గానీ, రికార్డింగ్ పూర్తి కాలేదు. ఆ

బాణీలను వదిలేయకుండా, ఘంటసాలగారు తదుపరి కార్యక్రమం కొనసా గించారు. అంతటితో కె.వి.రెడ్డి, రాజేశ్వరరావుల దోస్తీ ముగిసింది. వారిద్దరి కలయికతో వొక్క సినిమానైనా చూసే అవకాశం తెలుగుప్రజలకు దక్కలేదు.

శశిరేఖాభిమన్యుల నౌకావిహారం పహరాకాసే భటుడు చూస్తాడు. రేవతీబలరాములకు తెలపాలని పరుగుతీస్తాడు. రుక్మిణి వీణానాదం వింటూ తన మందిరంలో వున్న కృష్ణుడు దిగ్గున లేస్తాడు. 'అల వైకుంఠపురంబులో, నగరిలో, నామూల సౌధంబు' నుండి నమ్మిన వారిని కాపాడటానికి పరుగులు తీయడం ఆయనకు పరిపాటేగదా. కాకపోతే ఇప్పుడు వొంటరిగా కాకుండా రుక్మిణిని తోడుగా లాక్కెలతాడు. రేఖాభిమన్యులను నౌక దింపి, పారిపొమ్మం టాడు. రుక్మిణిని నౌకలో కూర్చో బెట్టి వెన్నెలవిహారానికి తాను బయలు దేరుతాడు.

భటుడు రేవతీబలరాములకు విషయం విన్నవిస్తాడు. తేల్చుకోటానికి రేవతి లేచి, బలరామున్ని లాక్కుపోతుంది.

**రసమయ జగతిని రాసక్రీడకు ఉసిగొలిపే ఈ మధురిమలో**
**ఎల్లరి మనసులు ఝల్లన జేసే చల్లని దేవుని అల్లరిలో ..**

అని పాడుకుంటూ రుక్మిణీవాసుదేవులు కనిపిస్తారు. శశిరేఖాభిమ న్యులకు రాసిన చరణాల్లో రాసక్రీడకు సంబంధించిన పదాలు పొరబాటున్నైనా దొర్లలేదు. రుక్మిణీవాసుదేవులు వివాహితులైన జంట కాబట్టి, ఇక్కడ మాత్రమే ఆ పదం వాడుతున్నాడు కవి.

**బల:** **పాపం, వీళ్ళను చూసి భటులు పిల్లలనుకున్నారు.**

**రేవ:** **కాలమహిమ కాకపోతే, చిన్నపిల్లకుమల్లే ఈ రుక్మిణికి ఇంకా ఈ విహారాలేమిటండీ.**

**బల:** **కాలమహిమ కాదు. ప్రకృతి మహిమ. ఈ వెన్నెలలో, ఈ చల్లగాలిలో, ఆహా! ఆ, ఎలాగూ ఇంతదూరం వచ్చాంగా, రా, కాస్తా నౌకావిహారం చేసిపోదాం.**

**రేవ:** **పదండి.**

ఆఇద్దరు నౌకావిహారం చెయ్యడం వొడ్డునుండి రుక్మిణీకృష్ణులు చూస్తారు.

**రుక్మి: కాలమహిమ కాకపోతే, మా అక్కగారికి ఎందుకండీ ఈ వయసులో ఈ విహారాలు?**

**కృష్ణు: రసపట్టులో తర్కం కూడదు.**

అంటూ వారించి పిలుచుకుపోతాడు.

హీరోను పరమ హీరోయిక్‌గా చూపే కె.వి.రెడ్డి, పరమాత్ముణ్ణి హీరోగా చేసి, నమ్మినవారికి పరమ ఆత్మీయునిగా చూపటానికి ఏర్పాటుచేసిన ఘట్టమిది. శశి మేడ దిగే ఏర్పాటు మొదలు, ఇంతవరకు సాగిన ఈ ఘట్టాన్ని రూపొందించిన క్రమం సాటి లేనిది. ప్రణయంలో రవ్వంత టెంపోను కలిపి, అతి నేర్పుగా పచనంజేసిన పాకమిది. పాత్రల్లో జీవించే నటీనటుల ప్రజ్ఞా విశేషాలతోనూ, మలయమారుతంలా మనసలరించే సంగీత విభావరితోనూ, కన్నుల నిండుగా పసందుచేసే పున్నమివెన్నెల ఛాయాగ్రహణంతోనూ, తోడుకోడళ్ళ ఎత్తిపొడుపులతో మిళితమైన సున్నిత హాస్యంతోనూ, సరస కళాభూషితంగా ఈ ఘట్టాన్ని దర్శకుడు రూపొందించిన తీరు 'న భూతో న భవిష్యతి.'

పురోహితులను వెంటతీసుకుని, శకుని ద్వారకలో ప్రవేశిస్తాడు. శశి రేఖాలక్ష్మణకుమారుల వివాహానికి ముహూర్తం నిశ్చయించుకుని మరీ వస్తాడు. దాంతో, రేవతీబలరాములు ఇంతకాలం గుట్టుగా వుంచిన రహస్యం బట్టబయలౌతుంది. కౌర వ పురోహితులు నిర్ణయించిన లగ్నాన్ని యాదవ పురోహితులు సమ్మతించరు. అది దగ్ధయోగమనీ, ఆ ముహూర్తంలో పెళ్ళి జరగదనీ వాదిస్తారు. కృష్ణుని తిరకాసుంటుందనే అనుమానంతో, శకుని వారి మాటలను కొట్టేసి, తాము నిర్ణయించిన ముహూర్తాన్నే సమర్థిస్తాడు. కృష్ణుడు ఆ ముహూర్తాన్నే బలపరుస్తాడు. శకుని రాక, ముహూర్త నిర్ణయం జరిగే సన్నివేశాలకు కూర్చిన సంభాషణల్లోని చమత్కారం, ఆ నటుల ఉచ్చారణ ప్రత్యక్షంగా ఆస్వాదించాలేగానీ, మాటలతో చెప్పగలది కాదు.

అభిప్రాయబేధాలతో కుటుంబంలో వాదోపవాదాలు జరిగేది ఆ తరువాతి సన్నివేశం. అచ్చం కుటుంబసభ్యుల మధ్య జరిగినట్టే వుంటుంది. వారివారి మనస్తత్వాలు - దానికి తగిన ప్రవర్తన, ప్రవర్తనను బట్టి ఆవేశకావేశాలు - దానికి తగిన సంభాషణ, వీటన్నిటికి న్యాయం చెయ్యటానికి తగిన సామర్థ్యం

కలిగిన నటీనటులు; పోటాపోటీగా జరిగే నటనా వైదుష్యంలో నటచక్రవర్తి అక్కినేని నాగేశ్వరావుదే వొకమెట్టు తక్కువైనట్టు కనిపిస్తుంది. చివరిదాకా మౌనంగా వున్న కృష్ణుడు -

**'సుభద్రా. వీరపత్నివి, వీరమాతవు. ఇంత బేలవవుతావనుకోలేదు. అన్నగారి తాత్పర్యం తెలిసిపోయిందిగా. ఇంకా అల్లరెందుకు. ఇక్కడ నీమొర ఆల కించేవాళ్ళెరూలేరు. ఇక నీ దిక్కున్నచోటికి వెళ్ళవచ్చు.'**

ఈ మాటలు చెప్పే సమయంలో ఎన్.టి.రామారావు కళ్ళల్లో పలుచగా పారాడే తడిని గమనిస్తే తప్ప ఈ సన్నివేశంలోని లోతుపాతులు అవగతంకావు. రెప్పల కింద మెదిలే తేమను చూపించిన ప్రతిభ మరి రామారావుగారిదో, మార్కస్ బార్ట్లేగారిదో తెలియదుగానీ, అంతవరకు ఉత్సాహంగా సాగిన కథను వొక్కసారిగా అది విషాదంవైపు మళ్లిస్తుంది.

సుభద్రాభిమన్యులు వెళ్ళిపోడానికి ఏర్పాటుచేసిన రథానికి దారకుడనే వ్యక్తి చోదకుడు. ఇతడు కృష్ణుని సొంత సారథి. అదివరకు అనేకసార్లు రథాల రాకపోకలు సినిమాలో కనిపించినా, ఆ సారథులు వేరు, ఇతడు వేరు. అటవీ ప్రదేశాలు క్షుణ్ణంగా తెలిసి, గుర్తించ గలిగిన సారధి ఇప్పుడు అవసరం. అంతేగాదు, కృష్ణుడు సుభద్రతో 'నీ దిక్కున్న చోటికి వెళ్ళ'మని నిష్టూరంగా చెప్పినాడేగానీ, ఆయన తప్పవారికి వేరే దిక్కులేరని ఆయనకు తెలుసుగాబట్టి, వారిని సాగనంపే ఏర్పాటు స్వయంగా చేసినట్టు గూడా దీనివల్ల తెలుస్తుంది.

'దారుకా, సుభద్రాభిమన్యులు ద్వైతవనానికి బయలుదేరారు. కానీ, నువ్వేమీ చెప్పకుండా వారిని ఘటోత్కచుని ఆశ్రమానికి చేర్చు.' అని సారధిని రహస్యంగా ఆజ్ఞాపిస్తాడు కృష్ణుడు. ఆ ఆజ్ఞతో ఘటోత్కచుని దగ్గరకు పోవటానికి ప్రేక్షకులను మానసికంగా సన్నద్ధం చేస్తున్నాడు దర్శకుడు. ఆ రాక్షసుడుండే తావును 'ఆశ్రమం' అనడంగూడా మనం గమనించవలసిన మరో అంశం.

ఘటోత్కచుని ఆశ్రమంలో రాక్షస సంతానానికి సంస్కృత వ్యాకరణం నేర్పించే బడివుంది. ఆ బడికి పంతులైన చిన్నమయ్యవేషం కట్టింది రమణారెడ్డి. అప్పట్లో హాజరుపట్టీలు లేవుగాబట్టి, విద్యార్థులందరిని గుర్తుపెట్టుకుని గురువు నోటితో పిలువవలసిందే. పాఠ్యపుస్తకాలు లేవుగాబట్టి పాఠాలు నోటితో చెప్పి

వల్లెవేయించవలసిందే. చిన్నమయ్య రాక్షస విద్యార్థులకు చదువు చెప్పే కార్యక్రమంలో వున్నాడు. తప్పుమాట విన్నప్పుడు సాధారణంగా నోట పలికేది 'హరిహరీ' అనే మాట. రాక్షసులు హరినామ స్మరణ చేయరు. అందువల్ల, శిష్యులు తప్పు పలికితే చిన్నమయ్య 'శివశివా' అంటాడు. ఘటోత్కచుడు ఆశ్రమంలో లేనట్టుంది. 'బుద్ధిగా నేను చెప్పినట్టు చదువుకున్నారో, మీకు వాక్శుద్ధి చేస్తాను. లేదో, ఘటోత్కచులవారొచ్చి మీకు దేహశుద్ధి చేస్తారు.' అని విద్యార్థులను గురువు బెదిరిస్తుంటాడు. అంతలో, అక్కడి చెట్టుకింద పాదు జేసిన భేరి మ్రోగుతుంది. అది మామూలు భేరి కాదు; ఘటోత్కచుని పొలిమేరలు రక్షించే మంత్రభేరి. ఆ హద్దులో ఎవరు ప్రవేశించినా ఆ భేరి తడవలు తడవలుగా ప్రకాశిస్తూశబ్దం చేస్తుంది. పొలిమేరలో ఎవరో ప్రవేశించారనే వర్తమానాన్ని తెలుపుతుంది. ఇప్పుడా భేరి 'ఘటోత్కచ, ఘటోత్కచ' అంటూ వెల్లడిస్తూంది. ఎక్కడికో వెళ్ళిన నాయకుడు తిరిగి వస్తున్నాడని పరివారం గ్రహిస్తుంది. 'హైహై నాయకా, వైవై నాయకా' అంటూ పరివారం కోలాహలం చేస్తుండగా, వేదికలాటి వొక అరుగుమీద, లీలగా మొదలైన ఘటోత్కచుని రూపం, పద్యం చెప్పుకుంటూ ఘనీభవిస్తుంది.

మేకప్ విషయంలో కె.వి.రెడ్డి చాలా జాగ్రత్తలు పాటించే మనిషి. ప్రతి చిన్న పాత్రకూ దుస్తులు ఎలావుండాలో, ఆభరణాలు ఎలా వుండాలో, కట్టుబొట్టూ ఎలావుండాలో స్పష్టంగా నిర్దేశిస్తాడు. అటువంటి దర్శకుడు అతిశ్రద్ధతో రూపొందించిన అలంకరణ ఈ చిత్రంలోని కృష్ణ, ఘటోత్కచ పాత్రలది. ఆర్య, ద్రవిడ సంస్కృతుల సమ్మేళనంగా ఆయన ఘటోత్కచుని పాత్రను రూపొందించారు. ఆ మేకప్‌లోనే ఆ విషయం ప్రస్ఫుటంగా వెల్లడయ్యేలా చేస్తాడు. దీనికి తోడు, ఆ పద్యం చెప్పటానికి ఎస్.వి.రంగారావుగారు ప్రదర్శించిన నటన వొళ్లు పులకరించేలా చేస్తుంది. కళ్ళతో, కనుబొమలతో, నొసటితో, నోటితో, బాహువులతో, హస్తాలతో, ఎదతో, ఉదరంతో - తనువులోని ప్రతి అవయవంతో, మనసులోనుండి పెల్లుబికే ఆవేశంతో, తానే ఘటోత్కచుడైన తాదాత్మ్యంతో కంపించే ఆ భౌతికాకారాన్ని చూసి పరవసించని మానవుడుంటాడా!

**ఘటో: చిన్నమయ్యా, ఇక నా సహచరులకు కావలసింది ఈ చదువులు**

కాదు. శత్రుమిత్ర చరిత్రజ్ఞానం కావాలి. మిత్రులను రక్షించాలి, శత్రువులను భక్షించాలి.

పరివారం: హైహై నాయకా.

(ఆ బడినుండి వారుగూడా విముక్తి కోరుతున్నట్టుంది.)

లంబుజంబు: సిచిసిస్తాం, బచిసిస్తాం.

హిడింబి పాత్రధారిణి సూర్యకాంతం వడివడిగా అక్కడికొచ్చి,

హిడిం: సుపుత్రా, సుపుత్రా

ఘటో: మాతా.

హిడిం: నీకిది తగదంటినిగదరా. ఇప్పుడెవరిమీదికి యుద్ధం?

ఘటో: యుద్ధం ఇప్పుడుకాదు మాతా. అందుకు సన్నద్ధం చేస్తున్నాను. భీమసేన మహారాజు నీకు భర్త, నాకు జనకుడు. వారికి ద్రోహం చేసిన ఆ కౌరవాధములను తరుణంలో హతమార్చుటకు ఇది నా సన్నాహం మాతా.

హిడిం: అది మంచిపనే సుపుత్రా, మంచిపనే.

ఘటో: నమో మాతా నమోనమో.

ఆ సమయంలో మంత్రభేరిలో రథం పరుగెత్తే సంకేతం వినిపిస్తుంది.

ఘటో: ఓహో, ఎవరీ మహారథుడు? మేరమీరి నా సీమలోకే జొరబడినాడు. కుడ్యాసురా, ఎవడోవాడు, పేరు చెప్పించి, బిరుదు విడిపించి, శరణు అనిపించిరా. నాకు శరణుజొచ్చినవాడే నావాడు. ఫో.

కుడ్యాసురుడు అలజడి చేసుకుంటూ ఆ పనిమీద మాయమౌతాడు. అప్పుడు సుభద్రాభిమన్యులు దట్టమైన అడవిలో ప్రయాణం చేస్తున్నారు. అభిమన్యుడు ఆమెకు ఎడమచేతివైపు కూర్చునివుంటాడు. స్త్రీకి కుడివైపు స్థానం భర్తది, ఎడమవైపు స్థానం పుత్రులది. కుడ్యాసురుడు వారి రథాన్ని కమ్ముకుంటాడు. 'పో పో శరణు పో' అనే ధ్వని నలుదిక్కులనుండి భయంకరంగా వినిపించేలా చేస్తాడు.

సుభ: అంతా రాక్షసమాయగా వుంది. దారుకా, దారి తప్పలేదుగదా.

దార: దారిమాత్రం ఇదే తల్లీ. తెలిసే వచ్చాను. పోనీ, వెనక్కు తిరిగిపోదామంటారా?

అభి: వెనక్కు తిరగడం మనకు తెలియని విద్య. పోనీ ముందుకు. (ఆ శబ్దాలను ఉద్దేశిస్తూ) చాటున నక్కి ఏమిటా పదరు. శూరుడవయితే ఎదురుపడరా, నీ మాయలు పటాపంచలు చేస్తాను.

కుడ్యాసురుడు దారి కడ్డంగా గోడరూపంలో అడ్డుపడతాడు. అభిమన్యుడు బాణంతో ఆ గోడను ఛేదిస్తాడు. హాహాకారాలు చేసుకుంటూ గోడ కూలి పడి, కుడ్యాసురుడు మాయమౌతాడు. 'హా నాయకా' అంటూ ఘటోత్కచుని దగ్గరకు చేరి, 'ఎవడో నరుడు, నన్ను పొడిపొడి చేశాడు. సురసురలాడుతున్నాడు, కుర్రాడు.' అంటూ విన్నవిస్తాడు.

ఘటో: ఆ, నరుడా? కుర్రవాడా? ఆశ్చర్యము, ఆశ్చర్యము. హెయ్ లంబూ, హెయ్ జంబూ, ఇక సహించను. మీ మాయలు ప్రజ్వలించి వాడిని భస్మం చెయ్యండి.

ల,జ: వాడిని మసిజేసి, నుసిజేసి, పిడికిట్లో పట్టుకొస్తాం నాయకా.

ఘటో: ఆగండి. ఆ బాలవీరుని చూడ ముచ్చటగా వుంది. ప్రాణాలతో పట్టితెండి.

లంబు, జంబులు దావాగ్నిగా మారి అభిమన్యుడు ప్రయాణిస్తున్న రథాన్ని చుట్టుకుంటారు. 'పో పో శరణు పో' అనే నినాదం నాలుగు దిక్కులనుండి మళ్లీ వినిపిస్తుంది. అభిమన్యుడు వాయవ్యాస్త్రం వేస్తాడు. దాని ధాటికి తట్టుకోలేక దావానలం వెనుదిరుగుతుంది. ఆ తరుణంలో వినిపిస్తుంది ఘటోత్కచుని వికటాట్టహాసం. ఆకాశంలో ఆ నవ్వు వినిపించిన దిశగా అభిమన్యుడు బాణం సంధిస్తాడు. దాన్ని తేలిగ్గా చేత్తో పట్టుకుని విసిరేస్తూ ఘటోత్కచుని ఆకారం గగనతలంలో గోచరిస్తుంది. ఆకాశంనుండి అతడు వొక కొండచరియ మీదికి దిగుతాడు. అతని శరీరభారం ప్రేక్షకులు అంచనా వేసుకునేలా, ఆ చరియనుండి వొక ముక్క విరిగి రాలిపడుతుంది.

ఘటో: హైహై బాలకా, మెచ్చినానురా. నన్నే కదిలించిన నీవూ నీ వీరం! నేత్రోత్సవంగా వున్నావు.

అభి: ఓహో, ఇప్పటికైనా ధైర్యం చేసి, నా ఎదుట నిలిచావు. నాకూ పరమోత్సాహంగావుంది. రా.

ఘటో: వైవై బాలకా. నీ రూపం, కోపం ముద్దులొలుకుతున్నాయి. నాతో

యుద్ధానికి నువ్వు చాలవురా. పేరు చెప్పి శరణు కోరరా, నావాడ వౌతావు.

అభి: శరణు కోరమని బ్రతిమాలే నీవూ వొక వీరుడవేనా. నీ చేతనే శరణనిపిస్తాను. చూడు.

అంటూ బాణం వదులుతాడు. శరీరభారమైతే ఘటోత్కచునంత లేకపోవచ్చు గానీ, అభిమన్యుని శక్తి మాత్రం అలుకువదికాదు అని చెప్పటానికి, అతడు బాణం వదిలిన కుదుపుకు రథమంతా అదిరినట్టు చూపిస్తాడు దర్శకుడు. ఆ బాణం సూటిగా వెళ్ళి ఘటోత్కచుని పొట్టమీద తగులుతుంది.

ఘటో: ఆ, ఎంత దెబ్బ కొట్టినావురా. కానీ తిప్పికొట్టడానికి ఏలనో చేతులు రావడంలేదురా బాలకా.

ఇక్కడ 'ఏలనో' అనే పదం యాదృచ్ఛికంగా వాడింది కాదు. రక్తసంబంధాన్ని వ్యక్తీకరించటానికి ఉద్దేశించిన మాట ఇది.

అభి: చేతులు రాక కాదు, చేతగాక అని చెప్పు. లేని పెద్దరికం పైన వేసుకుని, నన్ను బాలకా అనగానే సరిపోదు. ఊ . . చూపించు నీ ప్రతాపం.

ఘటో: నువ్వెంత కవ్వించినా నీమీద కనికరమే కలుగుతూందిగానీ, కసి రేగడంలేదురా బాలకా. మాతా, ఈ ఔద్ధత్యం కూడదని బుద్ధిచెప్పి, పేరైనా చెప్పి నీ కుమారుని రక్షించుకో.

దారు: కుమారా, పోనీ పేరైనా చెప్పు.

అభి: అసంభవం. విరోధికి భయపడి పేరు చెప్పడమా. (ఘటోత్కచునితో) నీవు నన్ను జయించలేక ఈ నీచోపాయానికి దిగావు. నీవు టక్కరివి. పిరికిపందవు. నీకు పౌరుషం లేదు.

ఘటో: అర్భకా, ఏమిరా నీ ఆర్భాటం. నా బలపరీక్షకే దాపురించినట్టు నన్నే ధిక్కరిస్తున్నావు. కాచుకో.

అంటూ గద విసరబోతాడు. కానీ, అది ఘటోత్కచుని చెయ్యి దాటక ముందే అభిమన్యుడు బాణంతో ఎగరగొడతాడు. అట్టహాసంతో ఘటోత్కచుడు అంతర్ధానమై, తిరిగి ఆకాశంలో కనిపిస్తాడు. అన్నదమ్ముల మధ్య యుద్ధం

మొదలౌతుంది. ఆ యుద్ధంలో మనకు కనిపించేవి వొకరకమైన ఆయుధాలా! రకరకాల ఆకారాల్లోవున్న కత్తులూ, కొడవళ్ళూ, గొడ్డళ్ళూ ఘటోత్కచుడు విసిరితే, చిత్ర విచిత్రమైన బాణాలతో అభిమన్యుడు వాటిని వమ్ము చేస్తాడు. ఘటోత్కచునివన్నీ ద్రవిడ సాధనాలు; ఆర్యసంతతికి చెందిన అభిమన్యునివి బాణాలు. చివరకు గదను మంత్రించి ఘటోత్కచుడు విసిరేస్తాడు. అది నిప్పులు చెరగుకుంటూ మీదికి వస్తూంటే, అభిమన్యుడు వారుణాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. అది నీటిని ఎగజిమ్ముకుంటూ వెళ్ళి గదను చల్లార్చుతుంది. కానీ, చల్లారిన గద అమ్మును దాటుకొచ్చి అభిమన్యుని నుదుటికి సోకుతుంది. అతడు నేలమీద పడిపోతాడు. అందోళనతో సుభద్ర అతని దగ్గరికి చేరుతుంది.

**దారు: అది కేవలం మూర్ఛ తల్లీ. తెలివి వచ్చేలోగా అసురుడు విజృంభించ కుండా చూడాలి.**

సుభద్ర విల్లనమ్ములు అందుకుంటుంది.

**అఖిల రాక్షస మంత్రతంత్రాతిశయము**
**నెనచు శ్రీకృష్ణు సోదరి నగుదునేని,**
**అనఘు డర్జును పత్నినే అగుదునేని,**
**ఈ శరము అసురు గూల్చి, సిద్ధించుగాక**
**పాండవకులైకభూషణు ప్రాణ రక్ష.**

శత్రువుకు తగిన శాస్తి జరిగిందని సంబరపడుతున్న ఘటోత్కచుడు ఈ మాటలు వింటాడు. రెండవ చరణం వినగానే ఆశ్చర్యపోతాడు. మూడవ చరణం వినగానే తల్ల డిల్లిపోతాడు. పద్యం పూర్తయ్యేసరికి, 'శరణు మాతా శరణు, తెలియక చేసిన అపరాధమిది.' అంటూ చేతులు జోడించి, నడుము వంచి, సుభద్రముందు నిలబడతాడు. 'మాతా, నేను భీమసేన మహారాజులవారి పుత్రుడను, ఘటోత్కచుడను. అవును మాతా, తెలియక చేసిన అపరాధమిది.' అంటూ ప్రాధేయపడతాడు.

మూర్ఛతేలిన అభిమన్యుడు - 'ఓరీ అసురా, ఎక్కడరా' అని నీలుగుతూంటే, 'నేనిక్కడే వున్నాను సోదరా, మాత రక్షణలో' అంటూ ఘటోత్కచుడు చల్లబరుస్తాడు. సుభద్ర అతన్ని అభిమన్యునికి పరిచయం

చేస్తుంది. అంతలో హిడింబిగూడా అక్కడి కొస్తుంది. అక్కాచెల్లెల్లు మొదటి సారిగా కలుసుకుంటారు. 'ఆనందం మాతా, పరమా నందం. దొరక్క దొరక్క దొరికారు. రాకరాక వచ్చారు. ఇక మిమ్మల్ని విడిచి పెట్టను.' అంటాడు ఘటోత్కచుడు. అది నిజమైన ఆనందం. వారుగాక అతనికి వేరే బంధువులు లేరు. అతనింటికి చుట్టాల రాకపోకలు లేవు. తన జన్మకారకుని గురించీ, అతని అన్నదమ్ములనూ, వారి శత్రుమిత్ర సంబంధాలను గురించీ తల్లి చెప్పగా కథలా విన్నాడేతప్ప, వారిని చూసినవాడు కాడు. చూసే అవకాశం అప్పుడప్పుడే కలుగుతుందని ఊహించనైనాలేదు. అది అనుకోకుండా ఎదురైన ఆనందం.

ఆత్మీయులను సంతోషపెట్టడానికి ఘటోత్కచుని ఆశ్రమంలో వినోద ప్రదర్శన జరుగుతుంది. ఆ రాక్షసులు ప్రదర్శనకు పూనుకుంటే, బహుశా, సంస్కృతి పేరుతో మన సర్కారువారు ఏర్పాటుజేసే కోయనృత్యాల్లాగా వుండేదేమోగానీ, ఆ పోటు పొడవకుండా ఈ దర్శకుడు తెలివైనపని చేశాడు. వినోదప్రదర్శన మంత్రాలతో ఏర్పాటు చేయించాడు. అందులోని ఇతివృత్తం నీతిబోధకమైన 'మోహినీ భస్మాసుర కథ.' ఒట్టి నృత్యంతో దాన్ని రూపొం దించారు. పాట లేదుగాబట్టి, భావప్రకటనకు భంగిమలు, సంగీతం మాత్రమే సహకరిస్తాయి. పలుకు లేకుండా ప్రేక్షకులను ముగ్ధులుగా చేసే విద్య కె.వి.రెడ్డి ఎక్కడ నేర్చుకున్నాడో - బహుశా ఛార్లెస్ ఛాప్లిన్ నుండి పొందిన ప్రేరణ కావచ్చు - మొత్తంమీద అటువంటి సాహసం అప్పట్లో ఇంకెవరూ చెయ్యలేదు. ఈ ప్రయోగం చిన్నమోతాదులో 'పాతాళభైరవి' చిత్రంలోనే పరీక్షించు కున్నట్టు అనుమానం.

ఆ తరువాత తోడుకోడల్లిద్దరూ కూర్చుని కబుర్లు చెప్పుకునే సమ యంలో, తనకు జరిగిన నిష్ఠూరాలన్నీ సుభద్ర ఏకరువు పెడుతుంది.

**సుభ: ఐశ్వర్యం పూజించేవారికి ప్రతాపాలేం కనిపిస్తాయక్కా. పాండవులూ, పాండవుల ప్రతాపాలూ కౌరవుల కాలిగోటికి సాటిరావని దూషణగూడా చేశారు.**

అప్పుడే అక్కడి కొస్తున్న ఘటోత్కచుడు ఆమాట విని ఆగిపోతాడు. ఆవేశం పట్టలేక వెనక్కు తిరిగి -

ఘటో: హే లంబూ, హే జంబూ. మ్రోగించు రణభేరి.

(అంటూ బయటికి నడుస్తాడు.)

సుభ: అయ్యో, అబ్బాయి విన్నట్టున్నాడే.

హిడిం: సుపుత్రా, సుపుత్రా.

ఘటో: సహచరులారా, మీరింక సకల ఆయుధాలతో, సర్వసైన్యంతో సిద్ధంకండి. మనమిప్పుడు యుద్ధయాత్రకు వెళుతున్నాం.

అభి: (అక్కడికొస్తూ) సోదరా, ఎవరితో యుద్ధానికి? నేనూ వస్తాను.

ఘటో: నేనుండగా నీవెందుకు సోదరా. సహచరులారా . .

(అంతలో హిడింబి, సుభద్ర వస్తారు)

విన్నాను మాతా విన్నాను. ఇచ్చిన మాట తప్పుటయేగాక, తుచ్ఛ కౌరవుల పొత్తు కలుపుకుని, జగద్విదిత పరాక్రమవంతులైన మా జనకులనే తూలనాడిరిగా యాదవులు. ఎంత మద మెంత కావర మెంత పొగరు! అంతకంత ప్రతీకార మాచరించి, కౌరవుల యాదవుల కట్టగట్టి నేలమట్టు బెట్టకున్న నా మహిమ యేల?

సుభ: నాయనా, నా అన్నతో యుద్ధానికి నీవు వెళితే వొకటి అభిమన్యుడు వెళితే వొకటీనా. అది నాకు అప్రదిష్ట కాదూ.

ఘటో: ఐన మాతా, నేను హస్తినాపురికి పోయి, ఆ కౌరవాధములనైనా హతమార్చెద.

తల్లులను బ్రతిమాలుకుంటాడు ఘటోత్కచుడు. అతన్ని ఎలాగో బుజ్జగించి, యుద్ధప్రయత్నం విరమింపజేసి, ప్రత్యామ్నాయం చెబుతుంది హిడింబి.

హిడిం: నీవు ద్వారకకు వెళ్ళి, నీ మాయాబలంతో శశిరేఖను ఇచ్చటికి తీసుకురా. ఈ సుపుత్రునికిచ్చి పెళ్ళిచేస్తాను.

ఘటో: ప్రశస్తము. సుప్రశస్తము మాతా నీ ఆజ్ఞ. నేనిప్పుడే వెళ్ళెదను.

సుభ: నాయనా, నువ్వొక మాట ఇస్తేనే ఇందుకైనా నేను సమ్మతించేది. అక్కడ నీవు ఏ అఘాయిత్యమూ చెయ్యరాదు. మా చిన్నన్నయ్య శ్రీకృష్ణులు -

ఘటో: అస్మదీయులా, అట్లైన వారికి నమోనమః.

**సుభ: నీవు అక్కడికి వెళ్ళగానే వారిని చూచి -**

**హిడిం: చూడ్డం ఏమిటి, దర్శనం చేసి స్తోత్రం చెయ్యరా సుపుత్రా. వారు ప్రసన్నులౌతారు.**

**సుభ: అక్కడ నువ్వేం చేయాలో ఉపాయంగూడా చెబుతారు.**

'అస్తు అస్తు' అంటాడేగానీ, ద్వారకలో దిగిన తరువాత ఆ విషయమే మరిచిపోతాడు. కృష్ణునికోసం వెదకటం బదులు, నేరుగా శశిరేఖకోసం తారాడుతాడు. అంత మంది స్త్రీలలో శశిరేఖ ఎవరో గుర్తు తెలియక ఆలోచనలో పడిన ఘటోత్కచునికి తోటలో కూర్చుని తత్వాలు పాడుకుంటున్న వొక ముదుసలి కనిపిస్తాడు. మొదట నిర్లక్ష్యం చేసినా, తుదకు ఆ ముదుసలి కృష్ణుడేనని అతడు గుర్తిస్తాడు. కృష్ణుడు తన నిజస్వరూపంతో ప్రత్యక్షమై తదుపరి కార్యక్రమం గురించి ఘటోత్కచుని చెవిలో భోదిస్తాడు. కృష్ణుడు ఏం చెబుతున్నది మనకు వినిపించదుగానీ, ఘటోత్కచుని ముఖంలో కనిపించే కుతూహలమూ, ఆశ్చర్యమూ, ఆనందమూ మొదలైన హావభావాలనుబట్టి, అది అతనికి అన్నివిధాలా నచ్చిన కార్యక్రమమని తెలిసేలా చేస్తాడు ఎస్.వి.రంగారావు. రాయగలిగితే ఘటోత్కచునిగా ఎస్.వి.రంగారావుగారి నటనే వొక గ్రంథంగా రాయవచ్చు.

నిద్రిస్తున్న శశిరేఖను, మంచంతో సహా, మాయజేసి తన మందిరానికి తరలిస్తాడు ఘటోత్కచుడు. ద్వారక చేరి, కౌరవులకు విడిది ఏర్పాటు చేసి, వారి భరతం పట్టించటానికి చిన్నమయ్య, లంబు, జంబులను ఆదేశిస్తాడు. తను ద్వారక చేరి, శశిరేఖ రూపంలో అంతఃపురంలో పాగా వేస్తాడు. ఘటోత్కచుని ఆ శశిరేఖ రూపమే 'మాయా శశిరేఖ.' కౌరవులకోసం తన మంత్రబలంతో చిన్నమయ్య నిర్మించే విడిది గృహమే 'మాయాబజార్.'

కౌరవులు మాయాబజారులో ప్రవేశిస్తారు. వారి తాహతుకు తక్కువగాని స్వాగత సత్కారాలు అక్కడ ఏర్పాటు చేయబడ్డాయి. అక్కడ ఏర్పాటుచేసిన పలురకాల వినోదాలలో ప్రత్యేకమైనది 'ఒకటే మా వయసు' అనే నాట్యం. ఆ నాట్యగత్తె లిద్దరూ సమానమైన పొడగరులు; ఒకే నమూనాలోవున్న అంగసౌష్ఠవం కలిగిన పడుచులు. నాట్యంలోగూడా 'సింక్రొనీ' సాధించారు. సింక్రొనైజ్డ్ డ్యాన్సింగ్‌ను దక్షిణ భారతదేశంలో మొట్టమొదట ప్రయత్నించింది

'చంద్రలేఖ' చిత్రంలో. అది పూర్తిగా పాశ్చాత్య పద్ధతిలో రూపొందించిన నాట్యం. 'మాయాబజార్'లోది సంపూర్ణమైన దేశవాళి నాట్యం. ఆ తరువాత ఏ చిత్రంలోనూ సింక్రొనైజ్డ్ పద్ధతికోసం ప్రయత్నం జరుగలేదు.

అటు మామూలు శశిరేఖగా, ఇటు మాయాశశిరేఖగా సావిత్రిగారి నటన అబ్బురపాటు కలిగించడమేగాదు, సామాన్యప్రేక్షకులు మైమరిచేలా చేస్తుంది. ఇటు లాలిత్యమూ, అటు గాంభీర్యమూ; ఇటు వయ్యారమూ, అటు బీభత్సమూ; ఇటు పరిహాసమూ, అటు ద్వేషమూ - నవరసభరితంగా తన నటనా వైదుష్యాన్ని ప్రదర్శించిన నటీమణి సావిత్రి. బహుశా అప్పట్లో లైమ్‌లైట్‌లో వున్న ఏ ఇతర నటీమణిగాని ఈ పాత్రకు సావిత్రి చేసినంత న్యాయం చెయ్యగలిగి వుండేది కాదేమో!

ఇక, మిక్కిలి ప్రఖ్యాతిగాంచిన 'వివాహ భోజనంబు' పాటున్న సన్నివేశం గురించి చెప్పుకోవాలి. విడిది గృహంలో వియ్యాలవారికి చెప్పలేనన్ని వంటకాలతో చిన్నమయ్య విందుభోజనం ఏర్పాటుచేస్తాడు. వాటిని తనిఖీ చేయటానికి విదూషకులైన శాస్త్రి, శర్మలు వేంచేస్తారు. ఆడపెళ్ళివారి గొప్పతనం కీర్తించినందుకు వాల్లిద్దరూ అంతకుముందే శకుని చేత చీవాట్లు తినివుంటారు. ఇక దేన్నీ మెచ్చుకోగూడదనే స్థిరమైన నిర్ణయంతో వంటశాలలో ప్రవేశిస్తారు. కానీ, ఆ వంటకాల ఘుమఘుమలకూ, ఆ పేర్చిన విధానానికీ మురిసిపోతారు. ఐనా, అది బయటికి పొక్కగూడదు. ఆడపెళ్ళివారిని చిన్నబుచ్చాలి.

చిన్న: ఇటు చిత్తగించండి స్వాములూ. గారెలు, బూరెలు, పేణీలు, పోణీలు, బొబ్బట్లు, సాపట్లు, లడ్లు, జిలేబీలు -

శాస్త్రి: సరి. ఇవి భక్ష్యాలు.

చి: పులిహోర, దలిహోర, నలిహోర, పలిహోర -

శా: ఆ, ఇవన్నీ చిత్రాన్నాలు.

చి: పాలపాయసం, బాదంపాయసం, జీడిపప్పుపాయసం, సారపప్పు పాయసం, ఇకపోతే మధురసాలు, ఫలరసాలు -

శా: సరిసరి. ఇవన్నీ పానీయాలు.

చి: వంకాయ, బెండకాయ, బీరకాయ, బూడిదగుమ్మడికాయ -

**శా: చాలుచాలు, ఇవన్నీ కూరగాయలు.**

ఎన్ని పదార్థాలు చూపినా, వాటిని జనరల్ క్యాటగరీ కింద తోసేసి తేలికపరచడమనే అపూర్వ పద్ధతిని ఇందుకోసం ప్రయోగించారు పింగళిగారు.

గోంగూర కావాలని కోరి విదూషకులు వెళిపోతారు. తెస్తామని వొప్పుకుని బయటికొస్తారు రాక్షసులు. అంతలో మాయాశశిరేఖ ఆవైపు వస్తుంది. వంటకాల వాసన ఆమెను ఆకర్షిస్తుంది. నిజరూపంలోకి మారి ఘటోత్కచుడు వంటశాలలో ప్రవేశిస్తాడు. ఆ వంటకాలు అతన్ని ఆకర్షిస్తాయి. రాక్షసులు మాంసభక్షకులుకదా, మరి వివాహభోజనంబు అంటూ శాకాహారభోజనానికి ఘటోత్కచుడు అర్రులు చాచడమేమిటి? ఏమో, అతడు ఏ భోజనానికి అలవాటు పడినవాడో. అతని నివాసస్థలాన్ని ఆశ్రమం అనిగూడా అన్నారు.

ఆ పిండివంటలను వొక్కటొక్కటిగా తీసుకొని తినడం ఘటోత్కచునికి చాలదు. దేహాన్ని పెద్దగా పెంచేస్తాడు. గదను పక్కన పడేసుంటాడు కాబట్టి, అతన్తోపాటు అది పెరగదు. అక్కడేవున్న మంచినీళ్ళ బిందె చిన్న చెంబులా కనబడుతుంది. వండిన పదార్థాల్లో వొక్కటి మిగలకుండా తినేసి వెళ్ళిపోతాడు. వెళ్ళిపోటానికి లేస్తూ గదను చేత్తో అందుకుంటాడు. అది చిన్ని ఆటవస్తువులా చేతిలో కొస్తుంది. తను దేహాన్ని పెంచేసుకున్న సంగతి ఘటోత్కచునికి అప్పుడుగాని గుర్తురాదు. చిరునవ్వుతో సర్దుకుంటూ, మామూలు సైజుకు దిగిపోతాడు. నాయకుడు వెళ్ళిపోగానే చిన్నమయ్య పాత్రలన్నిటినీ తిరిగి వాటి స్థానంలో అమర్చేవేళకు, శాస్త్రిశర్మలు మరోసారి అక్కడికొస్తారు. పాత్రలన్నీ ఖాళీగా వుండటం చూసి డీలా పడిపోతారు. ఫిర్యాదు చెయ్యటానికి కూడబలుక్కుని బిరబిరా శకుని దగ్గరకు ఉరుకుతారు. శకుని వచ్చేలోపుగా చిన్నమయ్య పాత్రలన్నిటినీ వంటకాలతో యథాప్రకారం నింపి, శాస్త్రిశర్మలు మరోసారి చీవాట్లుతినేలా చేస్తాడు.

వియ్యాలవారికి ఏర్పాటుచేసిన విడిది అంతఃపురానికి వేరుగా వుంది గదా, అక్కడికి శశిరేఖ ఎందుకొస్తుందీ, అనే ప్రశ్నకు తావులేకుండా, అందుకు పూర్వరంగం గుట్టుగా తయారుజేశాడు దర్శకుడు. హస్తిననుండి పెళ్ళికి తరలివచ్చేముందు, పెళ్ళికూతురును చూడకుండా ఈ వివాహం చేసుకోనని లక్ష్మణకుమారుడు మొండికేస్తాడు. ద్వారక చేరగానే ఆ ఏర్పాటు చేస్తానని

మాటిచ్చి శకుని అతన్ని శాంతింపజేస్తాడు. దుర్యోధనుని పట్టమహిషి భాను మతీదేవి చూడాలంటున్నదన్న మిషతో శశిరేఖను విడిదికి పిలిపించే ఏర్పాటు చేస్తాడు శకుని. అందుకని శశిరేఖ అక్కడికొచ్చింది.

లక్ష్మణకుమారుని వివాహం మొదలౌతుంది. రకరకాల రాక్షసమాయలను తట్టుకోలేక అతడు పెళ్ళిపీటలమీద మూర్ఛపోతాడు.

దుర్యో: ఏమిటిదంతా మామా?

శకు: ఆ, ఏముంది. కృష్ణుడు ఈ లగ్నాన్ని సమర్థించినప్పుడే సందేహిం చాను. పెళ్ళికూతురును విడిదిలో చూసినప్పుడే అనుమానించాను. ఆ . . ఇప్పుడీ మాయాజాలమంతా తెలిసిపోయింది. నిర్భయంగా చెబుతున్నాను. బలదేవా, ఈ కనిపించేది నీ కూతురు శశిరేఖ కాదు. ఏదో రాక్షసి. ఇలా నిన్నూ నన్నూ మోసంచేసింది నీ తమ్ముడు కృష్ణుడే.

బల: నా తమ్ముడా? ఏమిటి మీరు మాట్లాడేది?

సాత్య: (సత్యపీఠంతో వచ్చి) అన్నయ్యా, మీరు ఆగ్రహించకండి. మోసం ఎవరిదో తేల్చుకోటానికే ఈ పీఠం సిద్ధంచేశాను. ఏం మాయాజూదరీ. ఏ దురాశా, దుర్బుద్ధీ లేకుండానే మీరు ఇక్కడికి వచ్చారా? రా, ఈ పీఠంమీద నిలుచుని మాట్లాడు.

(శకుని పీఠంమీద నిలబడతాడు. దుర్యోధనుడు అతనితో ఏదో చెప్ప బోతాడు.)

బల: ఎవరూ ఆటంకపరచకండి. ఈ మోసం ఏమిటో తెలియాలి. సాత్యకీ, ఏదీ నా ముసలం.

శకు: సావధానం బలదేవా సావధానం. ఇదిగో, నా పాచికలమీద ఒట్టు పెట్టుకుని ఉన్నది ఉన్నట్టుగా చెబుతున్నాను. ఆలకించండి. మోసం చేసి కపటద్యూతంలో పాండవుల రాజ్యం కాజేశాం. ధర్మానికి కట్టు బడి వాళ్ళు వనవాసం వెళ్ళారు. ఈ దుర్వార్త విని నీవు మమ్మల్ని దండించడానికి వచ్చావు. కానీ, నువ్వొక వెర్రిబాగుల యాదవు డవు. అఖండ సన్మానానికీ, అతి ముఖస్తుతికీ లోబడతావని నాకు తెలుసు. అలాగే లోబడ్డావు. మా సాటివాడవు కాకపోయినా, ఈ

**సంబంధం ఎందుకు కోరి తెచ్చుకున్నాం అనుకున్నావు? వన వాసానంతరం మళ్ళీ పాండవులు విజృంభిస్తే, వాళ్ళకు నీ సహాయం, నీతోపాటు నీ తమ్ముడి సహాయం లేకుండా చెయ్యటానికి. కానీ, యతో ధర్మః స్తతో జయః అన్నట్టు మాకు తగిన శాస్తే జరిగింది.**

అప్పుడు పకపకా నవ్వుతూ, మాయాశశిరేఖగా వున్న ఘటోత్కచుడు నిజరూపంతో వెలువడుతాడు. దుష్టచతుష్టయాన్ని అవమానించి, హస్తినకు పంపేస్తాడు. పెళ్ళిమంటపంలో బీభత్సం కలిగిస్తాడు. హాహాకారాలు చేసు కుంటూ జనం పారిపోతూంటే 'ఆహా, ఆర్తనాదములు ఎంత శ్రవనానంద కరముగానున్నవి' అంటూ ఘటోత్కచుడు తృప్తి పడటంలో అతని రాక్షసప్రవృత్తి ఛమక్కుమనేలా చేస్తాడు రచయిత.

'ఇంతకూ మన అమ్మాయి ఏదండీ' అంటూ రేవతి ఆందోళన పడు తూంటే, 'నమో నమః, పెద్దత్తగారికి నా మనవి. ఈ లగ్నానికే నా ఇంట్లో అభిమన్యునికీ శశిరేఖకూ సలక్షణంగా వివాహం జరిగింది. మీరు వచ్చి, ఆశీర్వదించి, నా ఆశ్రమాన్ని పావనం చెయ్యాలి.' అని కోరుకుంటాడు. ఇక్కడ 'ఈ లగ్నానికే' అనే మాట లేకుంటే బావుండేది. ఎందుకంటే, అది దగ్ధయోగమనీ, ఆ లగ్నంలో అసలు పెళ్ళే జరగదని ఇదివరకు శంఖుతీర్థులనే జ్యోతిష్యునితో చెప్పించివున్నారు గాబట్టి.

చెప్పుకుంటూపోతే తరగనంత సమాచారం కలది ఈ 'మాయాబజార్' చిత్రం. కానీ, విస్తరిస్తూ పోతే, చెప్పుకోవలసిన చాలా సినిమాలు మిగిలి పోతాయి. సంగీతంతో తెలుగుప్రజలను ఓలలాడించిన ఎన్.ఏ.టి.వారి 'జయసింహ', భరణీవారి 'విప్రనారాయణ', విజయా వారి 'మిస్సమ్మ' మొదలైన చిత్రాలను ఇంకా తాకనేలేదు. నిర్వహణలో నిగ్గుతేలిన జయంతీవారి 'శ్రీకృష్ణార్జునయుద్ధం', శంభూ ఫిలిమ్స్‌వారి 'పూజాఫలం' వంటి చిత్రాలను ప్రస్తావించనేలేదు. నటనలో ప్రౌఢలుగా ఎదిగిన కన్నాంబ, జానకి, అంజలీదేవి, ఎస్.వరలక్ష్మి తదితర నటీమణులను గురించి ఇంకా చెప్పుకోనేలేదు. అందు వల్ల, 'మాయాబజార్' ను గురించి చెప్పడం ఇంతటితో నిగ్రహించుకోవడం మంచిది.

# విప్రనారాయణ

అక్కినేని నాగేశ్వరరావు అత్యుత్తమంగా నటించిన సినిమా యేదని అడిగితే, చాలామంది 'దేవదాసు'ను చూపిస్తారు. నా దృష్టిలో మాత్రం గోకుల్ ఫిలిమ్స్‌వారి 'నిరుపేదలు', భరణీ పిక్చర్స్‌వారి 'విప్రనారాయణ' అందుకు నిదర్శనాలు. ఈ చిత్రాల్లో పాత్రకు వేరుగా నాగేశ్వరరావును చూడలేం. ఇవిగాక, పాత్రలో నాగేశ్వరరావు సంపూర్ణంగా నిమగ్నమైన ఉదాహరణలు ఇంకా రెండున్నాయి. అవి - భరణీవారి 'చక్రపాణి', విజయావారి 'మిస్సమ్మ'. ఈ రెండు చిత్రాల్లో ఆయన పోషించినవి పూర్తిగా వైవిధ్యం కలిగిన పాత్రలు. ఐనా, ఏవొక్కరికి తీసిపోకుండా వీటిల్లో రాణించారు. 1954లో విడుదలైన విప్రనారాయణ పాత్రలాటిదే చాలాకాలం తరవాత నాగేశ్వరరావు 'బుద్ధిమంతుడు' చిత్రంలో పోషించాడు. ఈ రెండు సినిమాలకు మధ్య ఇంచుమించు పదిసంవత్సరాల తేడా వుంది. ఒకే ఛాయల్లో నడిచే ఈ పాత్రలను గమనిస్తే, కాలక్రమంలో నాగేశ్వర్రావు నటనలో, అంతస్థులో, ఆలోచనలో వచ్చిన మార్పును అవి పట్టిస్తాయి. అప్పుడప్పుడే కథానాయకుడిగా ఎదుగుతున్న నాగేశ్వర్రావుకు పాత్రలో ఇమడలేనంత వాపు 'విప్రనారాయణ'లో కనిపించదు. తెరమీద చూచే విప్రనారాయణుని ప్రేక్షకులు విప్రనారాయణుడే అనుకుంటారుతప్ప నాగేశ్వర్రావని అనుకోరు.

'ఆ, ఆ, రంగనాథుడే, సాక్షాత్కరించాడా? ఎంత పుణ్యాత్మురాలివమ్మా నువ్వు. ఏమన్నాడు నా రంగయ్య? వలదని వారించాడా? నీతో మాట్లాడినాడా? ఏమన్నాడు?' అని పలుకుతున్నప్పుడు మూసబోసిన వైష్ణవభక్తుడే కనిపిస్తాడుగాని నాగేశ్వరరావు కనిపించడు.

భానుమతి గాత్రం, సాలూరివారి సంగీతంతో మనకు లభించే మాధుర్యం కొద్ది సినిమాలకే పరిమితం. అందులోనూ ఈ కళాకారులిద్దరూ తమ విశ్వరూపం ప్రదర్శించిన చిత్రాలు రెండేరెండు - మొదటిది 'మల్లీశ్వరి', రెండవది 'విప్రనారాయణ'. 'మిస్సమ్మ'లో గూడా ఆ అవకాశం దొరికుండేదేగానీ కొద్దిలో తప్పిపోయింది. ఆ సినిమాకు హీరోయిన్‌గా భానుమతిని

తీసుకోవాలని మొదట ఆలోచించిన ఎల్.వి.ప్రసాద్‌గారు* ఆ తరువాత ఎందుకో అభిప్రాయాన్ని మార్చుకుని సావిత్రిని తీసుకున్నారు. చాలాకాలం తరువాత ‘బొబ్బిలియుద్ధం’, ‘పలనాటియుద్ధం’ చిత్రాల్లో భానుమతి, రాజేశ్వరరావుల కలయిక కుదిరిందిగానీ, అది ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఈ రెండు చిత్రాల్లో భానుమతిగారిది ప్రధానభూమిక కాకపోవడంవల్ల ఆమెకు కేటాయిం చిన పాటల సంఖ్య బాగా తగ్గింది. ఆమె పాడిన ఆ కొద్దిపాటలూ బాగానే వున్నాయి; కానీ, ఏదో చెప్పలేని వెలితి వాటిని అంటిపెట్టుకున్నట్టు అనిపిస్తుంది. సంగీతంలోని సంగతులన్నీ శ్రావ్యంగా పలికే ఏకైక కంఠం భూలోకంలో అరుదు. కొన్నికొన్ని సంగతులు కొన్ని గొంతులకే నప్పుతాయి. అదే గొంతులో మరికొన్ని సంగతులు తేలిపోతాయి. అది తెలిసి స్వరాన్ని కూర్చడంలోనే సంగీతదర్శకుని సామర్థ్యం ఇనుమడిస్తుంది. ఉదాహరణకు ఎస్.వరలక్ష్మిగారి గాత్రం చూడండి. భానుమతి గొంతులాగే ఆమెదిగూడా విలక్షణమైన గాత్రం. వరలక్ష్మి గొంతులో జీర పలుకుతుంది. ఆ గొంతును ‘బాల రాజు’ చిత్రంలో అమృతప్రాయంగా పలికించిన ప్రతిభాశాలి గాలిపెంచల నరసింహారావు. ఆ తరువాత దాన్ని దివ్యగాత్రంగా మలచిన సంగీతదర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు. ఆ గొంతులో అంతటి రసమాధుర్యం తొణికేలా చేయడంలో ఇతర సంగీతదర్శకులు వొకమెట్టు దిగువన నిలిచిపోయారు. సంగీతంలో అసమాన ప్రజ్ఞాదురంధరుడు సాలూరు రాజేశ్వరరావు. వంద వాయిద్యాలు వొకేసారి, వొకే వరుస వాయిస్తూంటే, అందులో వరుస తప్పుతున్న వాయిద్య మేదో నిశితంగా చెప్పగల ప్రతిభావంతుడు. భానుమతి గొంతులో ఇంపుగా పలికే సంగతులేవో, పలుకని సంగతులేవో ఆయనకు తెలియదని అనుకోవడం అజ్ఞానం. ‘బొబ్బిలియుద్ధం’, ‘పలనాటియుద్ధా’ల్లో భానుమతి పాటలకు వరుసలు కట్టడంలో ఆయన ఎందుకో కొంత నిర్లక్ష్యం చేసిన భావన కలుగుతుంది.

పోగా, ఆ మహాద్భుత సమ్మేళనాన్ని ఆస్వాదించేందుకు మనకు మిగిలిన రెండు చిత్రాల్లో ‘విప్రనారాయణ’ వొకటి. దీన్నిబట్టి, తెలుగు సినిమాచరిత్రలో ‘విప్రనారాయణ’ కున్న ప్రాధాన్యత ఎటువంటిదో వేరుగా

---

* బుక్ చేసింది చక్రపాణిగారనీ, షూటింగుకు ఆలస్యంగా వచ్చినందుకు చక్రపాణిగారే ఆమెను తొలగించారని తెలుస్తూంది.

చెప్ప నవసరంలేదు. నటగాయకురాలిగా ప్రఖ్యాతి గడించిన భానుమతి, దీనికి ముందు వొక సొంతచిత్రానికి దర్శకత్వం నిర్వహించింది. ఇదే సంవత్సరంలో విడుదలైన తన సొంతచిత్రం 'చక్రపాణి'కి సంగీతదర్శకత్వం గూడా నిర్వహించింది. కానీ, ఈ విప్రనారాయణకు ఆ రెండు పనులు తనే చెయ్యాలనే పట్టుదలకు పోకుండా, సంగీతం సాలూరివారికీ, దర్శకత్వం తన భర్త రామకృష్ణగారికీ అప్పగించడం తెలుగువారు చేసుకున్న అదృష్టం.

టాకీల తొలిరోజులనుండి చిత్రపరిశ్రమలో అనుభవం సంపాదించిన వ్యక్తి పి.రామకృష్ణ. హెచ్.ఎమ్.రెడ్డి బావమరిది బాబు అనే దర్శకుని దగ్గర ఆయన తర్ఫీదు పొందాడు. ఆ తరువాత బి.ఎన్.రెడ్డిగారి దగ్గర కొంతకాలం పనిజేశాడు. భానుమతిని పెళ్ళాడిన తరువాత, తమ మొదటి సంతానం భరణి పేరుమీద స్వంత నిర్మాణసంస్థను ప్రారంభించి, తమ తొలిచిత్రం 'రత్నమాల'ను 1947లో విడుదల చేశారు. రామకృష్ణ దర్శకత్వానికి విప్రనారాయణ మణిపూస వంటిది.

పదుగురు కవులు పరిపరివిధాల చెప్పిన కథ విప్రనారాయణునిది. శ్రీరంగని భక్తుడై, భవబంధాలు తెంచుకుని, బ్రహ్మచారిగా జీవిస్తున్న బ్రాహ్మణుడు ఆయన. నాట్యంలో చోళమండలాధీశునితో 'శభాస్' అనిపించుకున్న వేశ్య దేవదేవి. పంతంతో విప్రనారాయణుని వ్రతం పాడుచేస్తుంది. ఆ తరువాత శ్రీరంగని అనుగ్రహంతో ఆ ఇద్దరూ దైవసాన్నిధ్యం పొందుతారు. స్థూలంగా చెప్పిన కథలో ఏ కవికీ తేడాలేదు. ఇతర పాత్రలనూ, సందర్భాలనూ కల్పించడంలో ఎవరికి తోచిన విధానం వారిది. సినిమాకోసం సముద్రాలగారు స్వీయపద్ధతిలో కథను నడిపించారు. ఆయన కథ, మాటలు, పాటలు మొత్తంగా అందించిన అనేక చిత్రాల్లో 'విప్రనారాయణ' వొకటి.

శ్రీరంగంలోని రంగనాథ దేవాలయం గోపురాలతో షాట్ మొదలై, విశ్వామిత్ర సుప్రభాతంలోని మొదటి శ్లోకంతో రంగనాథునికి మేలుకొలుపు పాడుతుండగా ఆలయంలోకి దిగుతుంది. పెరుమాళ్ళ సేవకోసం తోమాలలు తీసుకొచ్చి ఆలయంలో వేచివున్న విప్రనారాయణుడు, గర్భగుడి ద్వారాలు తెరువగనే, ఉదయరవిచంద్రిక రాగంలో మేలుకొలుపు పాట అందుకుంటాడు -

**'మేలుకో శ్రీరంగ మేలుకోవయ్యా, మేలుకోవయ్య మమ్మేలుకోవయ్యా.'**

నేపథ్యంలో ఈపాట పాడింది ఎ.ఎం.రాజాగారు. ఘంటసాలకంటే హెచ్చు స్థాయిలో పలికే కంఠం ఆయనిది. మెత్తగా, వినసొంపుగా వుంటుంది. సహజ లాలిత్యం కలిగిన ఆ గాత్రానికి కోవెల గంటల నినాదాలు మేళవించి సాలూరువారు చేసిన స్వరకల్పన చెవికి సోకినప్పుడు, గుడిలో విగ్రహం తలుపులు దాటుకుని ఎందుకు రావటంలేదా అనిపిస్తుంది.

మెచ్చుకోలంతా ఇక్కడే వొలకబోసుకుంటే కష్టం; ఆ తరువాతి పాటలకు చాలకొస్తుంది. ఈ పాటనుండి పూర్తిగా తేరుకోకముందే రాజా పాడిన మరోపాట మొదలౌతుంది. తన కుటీరం చేరిన విప్రనారాయణుడు రంగని పూజావిగ్రహం ముందు కూర్చుని సమర్పించే నివేదన అది.

**కరులును హరులును మణిమందిరములు, సురభోగాలను కోరనురా**
**దరిగనరాని భవసాగరమును దాటించుమురా గరుడతురంగా,**
**పాలించరా రంగా, మొరవిని పాలించరా రంగా,**
**కరుణాంతరంగా శ్రీరంగా.**

భావమేమో భక్తి, చేస్తున్నది నివేదన - కానీ, అందరూ విషాదానికి ఉపయోగించే శివరంజని రాగంలో ఈపాటకు స్వరకల్పన చేశాడు రాజేశ్వర రావు. నాదస్వరూపులైన త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్యలాటి మహాను భావులకు ఇది అసాధ్యం కాకపోవచ్చు. కానీ, సమకాలీన సంగీతంలో, అందునా సినిమాసంగీతంలో, ఈ ప్రయోగం చాలా అపురూపమైంది. దీనివల్ల, ఆ పాత్రకు వినమ్రత, ఆ వేడుకోలుకు దీనత్వం, ఆ భక్తికి తాదాత్మ్యం సంక్రమించి మనసును పట్టుకుంటాయి. ఆ భక్తుణ్ణి దేవుడు ఇంకా ఎందుకు వేధిస్తున్నాడా అనే కారుణ్యం ప్రేక్షకునిలో కలుగుతుంది. ఆ భావాన్ని కలి గించడంలో ఆ పాటేగాదు, అక్కినేని నటనగూడా అన్నివిధాలా దోహదం చేసింది. సర్వమూ పరిత్యజించి, రంగని కటాక్షంకోసం విలపించే వొక హృదయం తెరమీద కనిపిస్తుంది.

ఈ పాట నిర్వ ర్తించిన విధి అదొక్కటేగాదు. విప్రనారాయణుడు పరమ భాగవతోత్తముడనీ, భౌతిక సుఖాలను పరిత్యజించిన మహనీయుడనీ వొకచోట నోటితో చెప్పించడం మినహా, ఆ గుణాలను నిరూపించే సన్నివేశం వొక్కటైనా

ఇందులో లేదు. దర్శకత్వంలో చోటుచేసుకున్న ఈ బలహీనతనుగూడా ఈ పాట కప్పేసింది. అతని ఆవేదన నిజమైనదేనన్న నమ్మకాన్ని ఈపాట కలిగించింది.

విప్రనారాయణుని విన్నపం దేవున్ని కరగించకపోయినా, ఆయన దేవేరిని కదిలించింది.

**'జగన్నాథా, అనుగ్రహించండి నాథా. ఆ భక్తుడు తమ అనుగ్రహానికి ఎలా ఆత్రపడుతున్నాడో చూశారా. అన్నిటిని వదులుకుని, సర్వేశ్వరులైన తమరే ఆశ్రయులని నమ్మి, అహోరాత్రాలూ తమ నామస్మరణ చేస్తూ, తమ కైంకర్యం తప్ప మరేధ్యాసా లేకుండా కృషిస్తున్నాడే, ఇలా ఇంకెంతకాలం స్వామీ?'**

**'ఆ సుముహూర్తం సమీపిస్తున్నది దేవీ. అదిగో, అందుకు రంగం సిద్ధమౌతున్నది.'**

ఇక్కడ రామకృష్ణగారి దర్శకత్వ నైపుణ్యం వొక్కసారి తళుక్కున మెరుస్తుంది. ఆ మెరుపు ఆట్టేకాలం నిలువకుండా ఆ తరువాతి సన్నివేశంలో సృజనాత్మకత కోల్పోతుంది. ఇంతవరకు విప్రనారాయణున్ని చూపించాడు. ఇక దేవదేవిని పరిచయం చేసే తరుణం వచ్చేసింది. ఉన్నట్టుండి దేవదేవి ఇంట్లో దూకకుండా, లింకుకోసం లక్ష్మీనారాయణుల సంభాషణ వుండే ఘట్టాన్ని సృష్టించాడు. దాన్ని లీడ్‌గా తీసుకుని, దేవదేవి దగ్గరకు తీసుకుపోవడం సమంజసమైన విధానం. అది దేవదేవి ఆరంగేట్రం చేస్తున్న సన్నివేశం. తిల్లానా నృత్యంతో ఆ నాట్యగత్తెను పరిచయం చేస్తాడు దర్శకుడు. తదుపరి జీవితంలో ఆమె అనేక చోట్ల, అనేక పర్యాయాలు తన ప్రదర్శనలతో చూపరులను మెప్పిస్తేతప్ప, ఆమె ప్రతిభ చోళ భూపాలుని దృష్టికి పోదు. అందుకుగాను, నాలుగు వేరువేరు పదాలనుండి పల్లవినీ, వొక చరణాన్నీ సేకరించి మరో నాలుగు ప్రదర్శనలు ఏర్పాటు చేశాడు. సానుల నోట విని విటులు చంకలు గుద్దుకునే పాటలను ఎన్నుకున్నాడు. మొదటిది - 'ఎవడే, అతడెవడే, కలలోనా నను డాచినాడే', రెండవది - 'ఏమో రాడాయెనమ్మా', మూడవది - 'చాలుర మారాములూ', నాల్గవది - 'తెలిసే నీ నెయ్యమూ వియ్యమూ' అనేవి; ఈ పాట భైరవి, మోహన, కాపీ, వసంత రాగాల్లో కూర్చిన రాగమాలిక. రాజేశ్వరరావు సారధ్యంలో, భానుమతి పాడిన శాస్త్రీయ సంగీతాన్ని తూచడానికి మన తక్కెడ చాలదు.

భానుమతిగారిది గంధర్వగానం అంటారు. సినిమా గంధర్వులు తప్ప, అసలు గంధర్వులు పాడగా నేను వినలేదు గాబట్టి ఆ సంగతి నేను చెప్పలేను. నేను హైస్కూల్లో చదువుకునే రోజుల్లో మాఊర్లో రేడియోలు కొత్తగా ప్రవేశిస్తున్నాయి. ఇంట్లో రేడియో వుండటం అప్పట్లో హోదాకు గుర్తు. రేడియో వున్నట్టు తెలియడానికో, లేక దారిన పోయే సంగీతప్రియులకు సైతం ఆహ్లాదం కలిగించడానికో, వీధిలోకి వినిపించేంత రొదతో రేడియోలు మోగుతుండేవి. ఆ రేడియో పాటల్లో భానుమతి గొంతు వినిపిస్తే సరి, దారినబోయేవారు ఆగిపోతారు; ఎదురింటివారు గుమ్మంలో కొస్తారు.

మొలక మీసాలొచ్చిన కుర్రకారుకు ఆ రోజుల్లో వొక అలవాటుండేది. తమ కిష్టమైన సినిమాతారల బొమ్మలను పత్రికలనుండి కత్తిరించి ఎత్తి పెట్టుకునేవారు. పాఠ్యపుస్తకాల్లోనూ అవే, గది గోడలనిండా అవే. ఎక్కడ వీలుంటే అక్కడంతా ఆ హీరోయిన్ల బొమ్మలు కనిపించేలా చేసుకునేవారు. ఆ బొమ్మల్లో భానుమతివి చాలా అరుదు. ఆమె పాటంటే ప్రతివొక్కరు చెవి కోసుకుంటారుగానీ, ఆమె బొమ్మల మీద ఆసక్తి చూపరు. విప్రనారాయణుడంటే ఋష్యశృంగునికి తీసిపోని పవిత్రచరిత్రుడు. అంతటివాడిని వొంచుకోవాలంటే దేవదాసి అంగసౌష్టవం కొద్దిమేరకైనా అందుకు తగినట్టు వుండేలా జాగ్రత్త తీసుకోవాలి. ఆ జాగ్రత్త ఈ సినిమాలో ఎంతమాత్రం కనిపించదు. కానీ, ఆమె కంచుగొంతు వీటన్నిటినీ కప్పేసింది.

అపరంజి, ఆణిముత్యాలు చేతిలో వున్నంతమాత్రాన ఆభరణం తయారు గాదు. అందమైన ఆభరణంగా వాటిని తీర్చడానికి పనితనం తెలిసిన స్వర్ణకారుడు అవసరం. సరైన తావుల్లో ముత్యాలను పొదిగే స్వర్ణకారుని లాఘవం తోడుపడకపోతే ఆ ముత్యాలకు ఆకర్షణా వుండదు, ఆ బంగారానికి విలువా వుండదు. చిత్రనిర్మాణానికి దర్శకుడు స్వర్ణకారునితో సమానం. సన్నివేశాలను అతడు పొదిగే స్థానాలనుబట్టి సొగసులు ఇనుమడిస్తాయి. ఈ చిత్రంలో దేవదేవి ఎన్నో ప్రదర్శనలిచ్చినట్టు ప్రేక్షకులకు తెలిసేలా ఐదు వేరువేరు ప్రదర్శనలను ఏర్పాటుచేశాడు దర్శకుడు. కానీ, వాటి మధ్య రవ్వంతైనా వ్యవధి కలిగించక పోవడంతో ప్రేక్షకుల్లో ఆ ఇంప్యాక్ట్ కలగదు. పాటకూ పాటకూ మధ్య చిన్నచిన్న ఇతర సన్నివేశాలు జొప్పించి

వుంటే ఈ కొరత ఏర్పడేదికాదు. అలా చేయడం పెద్ద కష్టంగూడా కాదు. ఈ నాట్యం తరువాతి సన్నివేశంలో విప్రనారాయణుడూ, రంగరాజనబడే అతని శిష్యుడూ ఆశ్రమంలో అరుగు మీద కూర్చుని మాలలు కడుతూ మాట్లాడుకుంటుంటారు. భగవంతుడు లోకంలో ఈ అందమంతా ఎందుకు సృష్టించాడా అనే అనుమానం రంగరాజుకు కలుగుతుంది. లోకంలో కంటికి కనిపించే ఈ అందాన్నంతా చూసి, వీటి సృష్టికర్త మరెంత అందంగా వుంటాడోననే ఆసక్తి కలిగించడానికి, అది భగవంతుడు కల్పించిన మార్గమని అంటాడు గురువు. శిష్యుడు సమ్మతించడు. దేవుడు పప్పులో కాలేశాడని అతని అభిప్రాయం. కనిపించే అందంకోసం మానవులంతా ప్రాకులాడుతూ, కనిపించని భగవంతుని వదిలేస్తున్నారని శిష్యుని అభియోగం. భక్తికీ, భగవంతునికీ సంబంధించిన ఇలాటి చర్చలు మరో మూడింటిని సులభంగా సృష్టించొచ్చు. దేవదేవి ప్రదర్శనలమధ్య వాటిని వొకటొకటిగా జొప్పించొచ్చు. అలాగా టైం గ్యాప్ (time gap) పెరిగిన ఎఫెక్టును సాధించొచ్చు. ఒక బలమైన ఇంప్యాక్ట్ (impact) కలిగించడానికి ఆ దొంతరను వినియోగించు కోవచ్చు. అలా చేయకపోవడంతో దర్శకత్వానికి ఇక్కడ కాస్త పట్టుతప్పినట్టు కనిపిస్తుంది.

దేవదేవి కీర్తి చోళరాజన్యుని సభకు ప్రాకుతుంది. రాజసభలో ప్రదర్శన ఇవ్వటానికి ఆమెకు ఆహ్వానం అందుతుంది. 'రారా నా స్వామి రారా' అనే క్షేత్రయ్య పదంతో ఆమె నాట్యం చేస్తుంది. రెండు అనుభూతుల పీటముడి ఆ పాట. దగ్గరలేని నాయకుని ఆహ్వానించేది మొదటి చరణం. దగ్గర చేరిన నాయకుని దయచూపమని వేడేది రెండవచరణం. ఎక్కడోవున్న స్వామిని రమ్మని పిలిచే విరహవేదన వొక తరహా, వద్దకు చేరిగూడా దగ్గరకు తీయని విలవిల ఇంకో తరహా. వాటిలోని తేడాను సంగీతంలో కనబరచడం సాలూరివారి చమత్కారం. 'కూడితివిక దయలుంచరా' అనేచోట ఆయన పలికించిన దరువు ప్రియుడు దగ్గరచేరుతున్న భావం మనసులో అచ్చంగా మెది లేలాచేస్తుంది.

'కళాధరుల అభిప్రాయం అక్షరాలా నిజం. నృత్యగానాలలో ఈమెకు ఈమే సాటి' అంటూ రాజు మెచ్చుకుంటాడు. గానంలో ఆమెకు సాటిలేరనేది

నిర్వివాదం. నాట్యం విషయంలో సందేహమే. మొత్తంమీద ఆ ప్రభువును మెప్పించి సత్కారం పొందుతుంది దేవదేవి. ఆ పొగరుతో తిరుగుముఖం పట్టిన దేవదేవికి దారిలో విప్రనారాయణుడు కనిపిస్తాడు. అతనిపట్ల ప్రజలు చూపే భక్తికి ఆశ్చర్యపడి, అతన్ని గురించి వాకబు చేస్తుంది. చోళమండలం రాజధాని మధుర. దేవదేవి స్వగ్రామం తిరుత్తరంబం. ఆ రెండు పట్టణాల మధ్యగావుంది శ్రీరంగం. తన అక్క మధురవాణితో స్వగ్రామం తిరిగొచ్చే దారిలో, కావేరీ తీరాన, వొక అందమైన పూలతోట ఆమెకు కనిపిస్తుంది. అది విప్రనారాయణస్వామి నివాసం. అక్కడ కాస్సేపాగి పోదామంటుంది దేవదేవి. ఆయన దర్శనం చేయాలని పట్టుబట్టుతుంది. అంతలో విప్రనారాయణుడు రానే వస్తాడు. అక్కా చెల్లెళ్ళు వినయంగా తలవంచి అతనికి చేతులు జోడిస్తారు. భక్తి పారవశ్యంలో నడిచే నారాయణుడు వారిని గమనించకుండా దాటిపోతాడు. కావాలనే చులకన చేశాడని దేవదేవి అపోహ పడుతుంది. అతని నిష్ఠ ఏపాటిదో తెలుసుకోవాలని పంతం పడుతుంది.

దే: కపటి. దురహంకారి. మర్యాదలేనివారంతా మహనీయులు, దురహంకారులంతా హరిభక్తులు. అంతా లోకవంచన.

మ: చెల్లీ, చెల్లీ, ఏమిటమ్మా ఈ అవేశం. స్వాములు కన్నెత్తి చూడలేదనేనా ఈ ఆగ్రహం. వద్దమ్మా. రా ఇంటికి పోదాం.

దే: చాలక్కా చాలు. మనమేం మనుషులం కామా. చెట్టూచేమలకన్నా చెడిపోయామా. పల్లెత్తి పలకరించలేకపోతే కన్నెత్తి చూడరాదా, చెయ్యెత్తి దీవించరాదా. అంతలోనే ఆయన గొప్పతనానికి లోటొస్తుందా, తపస్సు కొల్లబోతుందా.

మ: దేవీ, వారటువంటివారు కాదమ్మా. చెయ్యాలని అవమానం చెయ్యలేదు. పారవశ్యంలో మనను గమనించలేదు.

దే: అది పారవశ్యం కాదు. కోరితెచ్చుకున్న మైమరపు. అంతా నటన.

మ: అపచారం చెల్లీ. ముఖమెరుగని మనముందు నటించవలసిన అవసరం వారికి లేదమ్మా. హరిభక్తులకు నిరంతర భగవద్ధ్యానమేతప్ప అన్య చింతలు ఉండవు తల్లీ.

దే: ఆయనేం దేవలోకంనుండి దిగివచ్చిన ధీరుడా. మనవంటి మానవుడేగా.

అంతలోనే అంత అంతర్ముఖుడైనాడా. పరాశరుని కంటే బ్రహ్మణ్యుడా, కౌశికునికంటే తపస్సంపన్నుడా, భీష్ముని మరపించే బ్రహ్మదీక్షాపరుడా. ఏమిటమ్మా ఈ తోటమాలి ఘనత.

మ: అహంకారంలో అజ్ఞానంలో నీవు అర్థం చేసుకోలేకపోతున్నావు దేవీ. దైవ భక్తులను దూషించడం దైవాన్ని దూషించడమమ్మా.

దే: నన్ను మన్నించకపోవడం నాట్య శారదను అగౌరవించినట్టు కాదూ. ఆ అపచారం ఊరకే పోతుందా.

మ: ఏమైనా కానీ చెల్లీ. కోరికోరి హరిదాసుతో వైరం తలపెట్టకు. వచ్చిన దారినే వెళ్ళిపోదాం రామ్మా.

దే: రాను. ఈ కపటబ్రహ్మచారి అంతు తెలుసుకోందే రాను. ఆ హరిభక్తి పారవశ్యమేమిటో చూస్తాను.

మధురవాణి సర్దుబాటుచేసి ఇంటికి తీసుకుపోతుంది. భానుమతి స్వభావానికి అతికినట్టు సరిపడే సన్నివేశమిది. దేవదేవి అహంకారాన్నీ, ఆవేశాన్నీ కంచుగొంతుతో నటించి భానుమతి ప్రేక్షకులతో 'ఔరా' అని పించుకున్న సన్నివేశంగూడా. అహం మీద దెబ్బ పడిందిగాబట్టి ఆ గాయం సులభంగా మానదు. రగిలిపోయే పగ దేవదేవిని దహిస్తుంది. తట్టుకోలేక, వజ్రాన్ని వజ్రంతోనే కోయాలనే ఎత్తుగడతో, సన్యాసిని వేషంలో ఇల్లు విడిచి బయలుదేరుతుంది.

కథ రసకందాయం చేరుకుంది. ఇల్లు విడిచి దేవదేవి విప్రనారాయణుని కుటీరానికి చేరే సన్నివేశంతో అది కుతకుతలాడుతుంది. కానీ, ఆ సందర్భానికి తగిన నటనను ప్రదర్శించే ఆసక్తి భానుమతిలో లోపించింది. డైలాగులు పొగరుగా వల్లెవేయడంద్వారా సామాన్యప్రేక్షకుని కవ్వించొచ్చు. అదే సమ యంలో ఔచిత్యానికి భంగంరాకుండా చూసే బాధ్యతగూడా నటులపై వుంటుందని మరిచిపోగూడదు. బలమైన సవాలును ఎదుర్కోబోతున్న తీవ్రతను ప్రదర్శించే బదులు, తన సహజధోరణిలో ఆమె ఇక్కడ వెకిలితనాన్ని ప్రద ర్శించింది. విప్రనారాయణుని జయించడం దేవదేవికి తీవ్రమైన సమస్యగా కనిపించలేదేమో అనుకోవటానికి కుదరదు. ఎందుకంటే, అతని బ్రహ్మ చర్యం ఏమింత తేలికపాటిదైనా అసలుకథకే ప్రాధాన్యత నశిస్తుంది. పోనీ,

తనమీద తనకున్న విశ్వాసంవల్ల ఆమె తేలిగ్గా తీసుకున్నదని అనుకుందామా, మరో చిక్కు వచ్చిపడుతుంది. ఎలాటి పురుషుడినైనా వంచుకునే ధీమా ఆమెలో వుండాలంటే, ఆమె ఆపాటికే లోతులు తెలిసిన గడసానై వుండాలి. అప్పుడు, దేవదేవి కన్యగా వుందా, లేక ఈపాటికే వృత్తిలో సుమారుగా ఈదులాడిందా అనే సందేహం కలుగుతుంది. నాట్యప్రదర్శనలే తప్ప, సానివృత్తిలో దేవదేవి కాలుమోపిన ఆచూకీ ఈచిత్రంలో ఎక్కడా దొరకదు.

దేవదేవి హుటాహుటిన విప్రనారాయణుని ఆశ్రమానికి చేరుకుంటుంది. కల్లబొల్లి కబుర్లు చెప్పి, ఆశ్రమంలో వుండిపోడానికి అతని అనుమతి పొందు తుంది. శిష్యుడు రంగరాజుకు ఆమెపట్ల సదభిప్రాయం కలుగదు. గురువు మాట తోసెయ్యలేక సహిస్తుంటాడు. ఒక వెన్నెలరాత్రిని ముహూర్తంగా ఎంచుకుని ఆమె తన పథకాన్ని అమలుచేయడం ఆరంభిస్తుంది. కమ్మటి గానంతో జయదేవుని అష్టపదులనుండి 'సా విరహే తవ దీనా' అనే ఆలాపన చేస్తుంది. దాన్ని ఆలకించిన విప్రనారాయణుడు కుటీరంనుండి వెలుపలికొస్తాడు.

**వి: పాట అమృతప్రాయంగా వుంది దేవీ.**

**దే: ఏపాట స్వామీ?**

**వి: రెండు పాటలున్నూ. అసలు పాటా, నీపాటా గూడా.**

**దే: జయదేవకవి కవిత్వమే అంత స్వామీ.**

**వి: ఆ అమృతానికి నీగానం పరిమళం జోడించింది. ఆనంద సాక్షా త్కారానికి అలమటించే భక్తుల విరహాన్ని మాటమాటలో తొణికిస లాడిస్తూంది. ఆహా, ఏదీ, మరొక్కసారి పాడు.**

అదివరకు జయదేవుని అష్టపదులను తెలుగుసినిమాల్లో వాడుకున్నారో లేదో గానీ, ఈపాటతో జయదేవుని కవిత్వానికి తెలుగునాట కనీవినీ ఎరుగని ఖ్యాతి లభించింది. ఆయన అష్టపదులు సంస్కృతభాషలో వున్నందువల్ల అదివరకు వాటితో పండితులకు మాత్రమే పరిచయం వుండేది. కానీ, విప్రనారాయణలో ఈపాట విన్న తరువాత, పెద్దాలేదూ చిన్నాలేదు, పండి తుడూ లేదూ పామరుడూ లేదు, ఆడా లేదూ మగా లేదు - అందరి నోటా ఈపాటే. భాషాపరిమితులకు అతీతంగా ఇది ప్రాకిపోయింది. దీని అర్థం తెలియక, పెళ్ళిచూపుల్లో ఆడపిల్లలు ఈపాట పాడి వినిపించడం గుర్తుకొస్తే నవ్వొస్తుంది.

భానుమతి పాడిన పాటలన్నిటికీగాను, వెన్నెల జాలులా ప్రవహించే మూటిల్లో ఇది మూడవది. 'మల్లీశ్వరి'లోని 'మనసున మల్లెల మాల లూగెనే' రెండవది. ప్రేమ, విరహాలను వర్ణించడంలో జయదేవుని సంస్కృతకవిత్వ మాధుర్యానికి ఎంతమాత్రం తీసిపోనిది దేవులపల్లి వారి తెలుగుకవిత. ఏ స్వరానికి ఏ సరిగమలు సరిపోతాయో సంపూర్ణంగా తెలిసిన విద్వాంసుడు సాలూరు రాజేశ్వరరావు. మనసులకు మత్తెక్కించే మాదకపదార్థాలివి. ఇదే నిషాను కలిగించే మరోపాట అదివరకొకటుంది. పాడింది భానుమతే. రాసింది బాలాంత్రపు రజనీ కాంతారావు. సంగీతం చిత్తూరు నాగయ్యది. చిత్రం వాహినీవారి 'స్వర్గసీమ.' ఋష్యశృంగ నాటకంలో వేశ్య 'ఓహో, తపోధరా, సుందరా' అంటూ తపస్సులోవున్న మునికుమారుని కవ్వించే అమరగానం. ఈతరం వారెవరూ బహుశా ఆపాటను వినివుండకపోవచ్చు.

పాట పాడినా, పద్యం చదివినా, పూమాలల గురించి ప్రస్తావించినా, పురాణాలు పఠించినా, దేవదేవిది వొకటే చింత - అది విప్రనారాయణునికి చాపల్యం కలిగించడం. తోమాల అలంకారంలో శ్రీరంగని సౌందర్య పిపాస గురించి చర్చిస్తుంది. ఆలయంనుండి తిరిగొస్తూ కాస్త కాటుక, బుక్కాము తీసుకురమ్మని పురమాయిస్తుంది. అవకాశం దొరికినప్పుడంతా ఎన్నెన్నో సోయగాలు ప్రదర్శిస్తుంది. అంతమంది గోపికలతో క్రీడించిన గోపాలదేవుడు వ్యభిచారి కాడా అని ప్రశ్నిస్తుంది.

దే: గోపికలు జారబుద్ధితో సమీపించారనీ, కృష్ణపరమాత్మ వల్లవీ కేళీలోలుడనీ పెద్దలంటారే, ఆయన జారుడేనా అని -

వి: ఆయన జారు డెన్నటికీ కాడు. గోపవధూటీ దుకూల చోరాయ అంటే గొల్లభామల వలువ లపహరించాడనే చెబుతామా దేవీ?

దే: తమరే సెలవియ్యాలి స్వామీ.

వి: అంటే వారి అజ్ఞానాన్ని అపహరించాడనే అర్థాన్నే చెప్పాలి. అలాగే జారబుద్ధినిగూడా అన్వయించుకోవాలి. శ్రీకృష్ణపరమాత్మ వేణుగానం చేసినప్పుడు గోపికలందరూ ఆయన్ను చేరగలిగారా. కొందరు పడక టింట్లలో, కొందరు నడవలో, మరికొందరు ముంగిట్లోనే ఆగిపోయా రన్నారే, ఎందువల్ల?

రం: తండ్రో, తమ్ముడో, మగడో, మామగారో ఎదురైవుంటారు. కాళ్ళు చల్లబడివుంటాయి.

వి: కాదు రంగా. వారి అజ్ఞానం అంతవరకే నశించిందన్నమాట. వారికి శరీర బంధువుల మీదుండే భయభ్రాంతులు పూర్తిగా పోలేదన్నమాట. ఈ విషయాన్ని నిరూపించటానికే వ్యాసులవారు లోకవ్యవహారాన్ని నిదర్శనంగా సూచించారు. స్త్రీ ఏవిధంగా వంశమర్యాదలనూ, ఆత్మబంధువుల ఆదరాభిమానాలనూ, ప్రపంచ విమర్శ వదులుకొని పరపురుషునికోసం పరుగులు తీస్తుందో, అదేవిధంగా జీవుడు తన శారీరికమైన సమస్త మమకారాలనూ వదిలించుకుని పరమాత్మ సమీపానికి పోవాలన్నారు. జారులకుండే త్యాగబుద్ధినే ఇక్కడ లక్ష్యంగా తీసుకోవాలిగాని, జారుడనే బుద్ధిగా గ్రహించరాదు. ఇప్పుడు నీ సంశయం తీరిందా దేవీ.

ఎన్ని టక్కులు పోయినా విప్రనారాయణునికి ఆమె తమతోపాటు జీవించే వొక మనిషిగా కనిపిస్తుందే తప్ప, అతనిలో శృంగార భావన కలుగదు. తనకు ఓటమి తప్పదని దేవదేవికి తెలిపోయింది. వ్యాకులపాటుతో పరమాత్మునికి తన మొర వినిపి స్తుంది.

ఏలా నాపై దయ చూపవు దేవా, వేడుక చూసేవా?
దారిన పోయే ఈ జడదారీ తీరులూ చూపీ,
కూరిమి మాపీ, వైరము రేపీ, ఆరడి చేసేవా?
లోకమునందూ చౌకగ చేసీ నవ్వులపాలూ చేయుదువా?
రోసము మానీ, వేసము మారీ, దాసినై మసలీ
చేసిన సేవా, మోసిన ఆశా, నాశము చేసేవా?
వన్నె సన్న లెరుగడాయెనే, వలపు తెలిసి పలుకడాయెనే
వాని మనసు మలపగోరగా నాదు మాట నిలుపజాలవా, దేవా.

జోంపురి రాగంలో కల్పించిన ఈ పాట ఓటమిపాలైన దేవదేవిలో పేరుకున్న ఆవేదనకు ప్రతిరూపం. విప్రనారాయణుడుగా కనిపించే శిలను మనిషిగా మెత్తబరచమని శ్రీరంగనికి చేసుకునే ఆ అభ్యర్థనలోని దీనత్వం అమెపట్ల జాలిని కలిగిస్తుంది. కానీ, ఇక్కడ భానుమతి నటన ప్రేక్షకులను

కాసింత చిన్నబుచ్చుతుంది. భుజంమీది నుండి ముందుకు జారిన జానెడు జుట్టును సవరించుకునే 'మ్యానరిజం', వయ్యారాలు కురిపించే 'సా విరహే' గీతంలోనూ, ఆవేదనతో ఆక్రోశించే ఇప్పటి పాటలోనూ వొకేలా ప్రదర్శించడం ఎబ్బెట్టుగా వుంది.

ఆకాశం మబ్బులతో, మెరుపులతో నిండిపోతుంది. ఉన్నట్టుండి కుండ పోతగా వర్షం మొదలౌతుంది. కుటీరంలో నిదురించే విప్రనారాయణునికి హఠాత్తుగా మెలుకువొస్తుంది. తమతోపాటు తోటలో నివశించే మరొక జీవికి వర్షంనుండి తలదాచుకునే తావు లేదని గుర్తుకొస్తుంది. శిష్యుని తోడుగా తీసుకుని ఆమెకోసం తోటలో గాలిస్తాడు. తడిసి ముద్దగా పడివున్న దేవదేవి కనిపించగానే, దిగులుపడి కుటీరంలో చేరుస్తాడు. స్పృహలోకి రాగానే తన పొడిబట్టలు ఆమెకు కట్టబెట్టి, అటుమీదట ఆమెనుగూడా కుటీరంలో వుండి పొమ్మంటాడు.

వర్షంలో తడిసో ఏమో, స్వామికి వొంట్లో నలత చేస్తుంది. ఆనాటి తోమాలసేవకు తాను పోలేక, రంగరాజును పంపుతాడు. ఆశ్రమంలో ఆడపిల్ల చేరడం గురించి అప్పటికే ఊరంతా పొక్కింది. బుద్ధితెలిసినప్పటినుండి పెరుమాళ్ళసేవకు ఏనాడు కుంటుబడని విప్రనారాయణుడు ఆరోజు రాకపోవడంతో, పుకారు బలపడి, అసూయాపరులకు ముసుగులేకుండా అడిగే సాహసం కలుగుతుంది. దీనివల్ల, ఆలయంనుండి తిరిగొస్తున్న రంగ రాజుకు లోకుల ఎత్తిపొడుపులను తప్పించుకోలేని పరిస్థితి ఎదురౌతుంది.

ఇక్కడ, ఆశ్రమంలో, సంస్కృతంలో కృష్ణుని బృందావన లీలలు స్వామికి పాడి వినిపిస్తూంటుంది దేవదేవి. విప్రనారాయణుడు తన్మయుడై పోతాడు. బృందావనంలో గోపికాస్త్రీలతో నర్తించే గోపాలకృష్ణుడు అతని స్మృతిపథంలో మెదులుతాడు. ఆ పారవశ్యంలో 'చూడుమదే చెలియా, కనులా చూడుమదే చెలియా, బృందావనిలో నందకిశోరుడు అందముగా దీపించే లీలా' అంటూ వెళ్ళి దేవదేవి ఊరవులను కౌగిలించుకుంటాడు. దేవదేవి పిలుపుతో అతడు తిరిగి మన లోకంలో పడతాడు. కానీ, ఆ పరిరంభంలోని నఖంపచమానమైన సౌఖ్యం అతన్ని వదిలినట్టు తోచదు.

ఆగమేఘాలమీద రంగరాజు ఆశ్రమం చేరుకుంటాడు. లోకం తమమీద

వేస్తున్న అపవాదును స్వామికి విన్నవిస్తాడు. ఆశ్రమంనుండి దేవదేవిని తరిమేస్తేతప్ప ప్రజలు అతన్ని విశ్వసించరని తేల్చుతాడు. ఆమె కల్లబొల్లి ఏడుపులకు స్వామి కరిగిపోకుండా స్థిరంగా నిలబడితే, ఆమెను బయటికి పంపే కార్యకమం తను నిర్వహిస్తానని స్వామిని వొప్పిస్తాడు. ఆమె రంగనాథుడే తనవద్దకు చేర్చిన భక్తురాలని స్వామికి జ్ఞాపకంరాదు. లోకనిందకు బెదిరి ఆమెను సాగనంపే కార్యక్రమానికి తలూపుతాడు.

ఇంత పట్టు దొరికిన తరువాత అంత సులభంగా వదిలే ఘటమేనా దేవదేవి! రంగరాజును లెక్కజెయ్యకుండా కుటీరంలో దూరి విప్రనారాయణుని పాదాలు తాకుతూ, కనికరించమని వేడుతుంది. ఇదివరకటి స్పర్శకే చిత్తై పోయిన విప్రనారాయణుడు ఇక ఏమాత్రం నిగ్రహించుకోలేక, ఆమెను ఆశ్రమంలో వుండిపొమ్మంటాడు. హతాశుడైన రంగరాజు ఆశ్రమం విడిచి పోతాడు. కుటీరంలో దేవదేవి విప్రనారాయణునితో వొంటరిగా మిగిలిపోతుంది.

బావిలోనుండి విప్రనారాయణుడు ఏతంతో చెట్లకు నీళ్ళు తోడు తుంటాడు. అదివరకు పార చేతబట్టి పాదులకు మడవగట్టే దేవదేవి, ఇప్పుడు విలాసంగా ముస్తాబై, వయ్యారాలతో స్వామిని ఉడికించే ప్రయత్నంలో నిమగ్నమౌతుంది.

**ఎందుకోయీ తోటమాలీ, అంతులేనీ యాతనా**
**ఇందుకేనా నీవు చేసే పూజలన్నీ తపోధనా**
**వన్నెవన్నె చిన్నెలీను ఈ విలాసం,**
**చందమామ చిన్నబోవు ఈ ప్రకాశం**
**నిన్నేలువానీ లీలలేరా, కన్నార కనరా, ఏలుకోరా -**

అంటూ ఆమె పాడుతూంటే, ప్రేక్షకుల్లాగే స్వామిగూడా వొళ్లు మరిచిపో తాడు. ఏది నుయ్యో ఏది గట్టో, ఏది చదునో ఏది మిట్టో అర్థంగాని అయోమయంలో కాలుజారి పడిపోతాడు. అతన్ని లేవదీయడంలో దేవదేవి మరింత చొరవగా చేరువకు జరుగుతుంది.

రంగరాజు లేడుగాబట్టి, స్వామికి సపర్యలు చేసే బాధ్యత దేవదేవికి తప్పదు. ఆ రాత్రి అతని శయ్యను స్వయంగా సవరిస్తుంది. పవ్వళింపుకు తానే ఆహ్వానిస్తుంది. పక్కమీద వాలిన స్వామికి పాదసేవ చేస్తుంది. ఆ

స్పర్శతో అతని శరీరం వేడెక్కేలా చేస్తుంది. నిద్రపట్టక అతడు మసలడం చూసి 'ఏం స్వామీ, అదోలా వున్నారు' అని అడుగుతుంది. 'ఒళ్లంతా ఏదో తపనగా వుంది దేవీ' అంటూ చెప్పలేక చెప్పలేక సెలవిస్తాడు స్వామి. తపనకు ఉపశమనంగా అతని శరీరానికి చందనం రాస్తుంది. ఆ రాపిడికి స్వామి సంపూర్ణంగా నిగ్రహం కోల్పోతాడు. దేవదేవిని దొరకపుచ్చుకుని కోరిక వెల్లడిస్తాడు. నీతిమాటలతో దేవదేవి అతన్ని నివారించినట్టే వుంటుందిగానీ, వాస్తవానికి తన హావభావాలతో మరింత రెచ్చిపోయేలా చేస్తుంది. ఆమె సాంగత్యం పొందాలనే ఆత్రుత తప్ప, విప్రనారాయణుని మనసులో తక్కిన ఆలోచనలన్నీ మూసుకుపోతాయి. ఆ తరుణం కోసమే కాచుకుని కూర్చున్న వేశ్య కొంతసేపు మారాంచేసి, గోముగా లొంగిపోతుంది. భక్తుడైన విప్రనారాయణుడు పతితుడుగా దిగజారిపోతాడు. జరుగరాని అపచారం జరిగిపోయిన తరువాత దేవదేవిలో ఆత్మజ్ఞానం చిగురిస్తుంది. కపటమెరుగని ఆ బ్రహ్మచారి నైర్మల్యానికి ఆమె మానసికంగా లొంగిపోతుంది.

ఎవడో సన్యాసి దగ్గర వశీకరణం సాధించటానికి వెళ్ళిందని మధురవాణి చెప్పగా దేవదేవితల్లి నమ్ముతుంది. ఎన్నిరోజులు గడచినా దేవదేవి తిరిగి రానందుకు ఆరాటపడుతూ, వెదకటానికి స్వయంగా సిద్ధమౌతుంది. రేపు తనే వెళ్ళి తీసుకొస్తానని నచ్చజెప్పి, మధురవాణి ఆమె ప్రయత్నం విరమింపజేస్తుంది. మధురవాణి మరుసటి రోజు ఆశ్రమానికి వెళ్ళి దేవదేవిని కలుసుకుంటుంది. జరిగినసంగతి విని తెల్లబోతుంది. ఇకనైనా చాలించి ఇంటికి రమ్మంటుంది. స్వామిని విడిచి రానంటుంది దేవదేవి. ఒక్కసారి ఇంటికొచ్చి, అమ్మను సమాధానపరచమంటుంది మధురవాణి. స్వామి అనుమతి తీసుకుని తప్పకుండా వస్తానని మాటిచ్చి అక్కను పంపేస్తుంది దేవదేవి.

తల్లి మంచం పట్టినట్టు తెలిసిందనీ, వొక్కసారి చూసి తిరిగొస్తాననీ చెప్పి, విప్రనారాయణుని అనుమతి తీసుకుని, దేవదేవి స్వగ్రామం బయలుదేరుతుంది. ఆమెను ఎడ బాసి విప్రనారాయణుడు ఎంతోసేపు ఉండలేడు. తనుగూడా బయలుదేరి ఆమెను దారిలోనే కలుసుకుంటాడు. వద్దన్నా వినకుండా ఆమెతోపాటు వేశ్యాగృహంలో ప్రవేశిస్తాడు. స్వామిదగ్గర సంపద లేదని తెలియకముందు వేశ్యమాత అతన్ని ఎంతగానో గౌరవిస్తుంది. పూజాగృహంలో

స్వామి అనుష్ఠానానికి దేవదేవి ఏర్పాటు చేస్తుంది. కానీ, విప్రనారాయణుని ధ్యాస దేవదేవిని వదిలి దేవునిమీదికి పారదు. ఆ అపచారానికి తల్లడిల్లుతూ దేవదేవి తానే ప్రార్థన అందుకుంటుంది. 'బద్ధేనాంజలి నానతేన శిరసా' అంటూ భానుమతి పాడిన కులశేఖర్ ఆళ్వార్ ముకుందమాల శ్లోకాలు భావ రసగర్భిత తరంగాలై మనసును కొద్దిసేపు నిశ్చేష్టం చేస్తాయి.

తీరుబాటుగా దేవదేవితల్లి విప్రనారాయణునితో కబుర్లలో దిగుతుంది. స్వామి స్థోమత గురించి ఆరాతీయడం అమె ఆసక్తి.

'ఐతే స్వామీ, తమకు తలిదండ్రులు ఉన్నారుగదూ.'

'లేరు. ఆ రుణం తీర్చుకున్నాను.'

'అలాగా. సంపాదిస్తేగాని పొట్ట గడవదనే బెంగ లేదుగా. ప్రభువులిచ్చిన అగ్రహారాలూ, మణులూ, మాన్యాలూ ఈ సీమలోనే ఉన్నాయా స్వామీ?'

'ఆ బాదరబందీ మనకేమీ లేదు.'

'అంటే, ఏకాలానికేమోనని, అంతా మార్చి కరుగులుగా దాచిపెట్టా రన్నమాట. ఏపాటి భద్రం చేశారూ?'

'ఏమీ లేదమ్మా.'

'అంతేలెండి. ఉన్నవారు ఉందని చెప్పుకుంటే లేనివారు ఉండనిచ్చే రోజులు కావులే స్వామీ. అల్లాంటివి కాస్తా గుట్టుగా ఉంచుకోవలసినవే. ఆలివైపు దాన్ని గనుక అడుగుతున్నా. ఏమాత్ర ముంటుంది స్వామీ? ఉరామరిగ్గా చాలు.'

'నాదంటూ ఏమీ లేదని ఇదివరకే చెప్పాను. నా జీవిత సర్వస్వం దేవదేవి.'

'నన్ను వేలాకోళం పట్టిస్తున్నారా. నాకు క్షణం కోపం, క్షణం తాపం. ఆట్టే కవ్వించక నిజం చెప్పండి.'

'అసత్యా లాడవలసిన అవసరం నాకు లేదు. నేను చెప్పిందంతా అక్షరాలా నిజమే.'

'ఆ, ఐతే పుట్టుసన్నాసివన్నమాట. మా చిన్నది నిలువునా మోసపోయింది. చేసిన సేవ చాలుగానీ, తక్షణం బయటికి దయచెయ్.'

బలవంతంగా వేశ్యమాత అతన్ని బయటికి గెంటేస్తుంది. మధురవాణి వారించినా వినదు. దేవదేవి అడ్డొస్తే తోసిపారేస్తుంది.

చిరస్మరణీయులైన తారల జాబితాలో ఋష్యేంద్రమణి ఎందుకు చేరుతుందో ఈ సన్నివేశం చూస్తే తెలుస్తుంది. ఆమె నటనలోని ఏకాగ్రత అందరికీ అబ్బేదిగాదు. మహాభారతంలోని సుభద్రగా ఆమె వేషం కడితే, ఆ సుభద్ర ఇలాగే ఉంటుందనిపిస్తుంది; జానపదాల్లో రాజమాత పాత్రలు పోషిస్తే, అచ్చం రాజమాతలాగే ఉంటుంది; వేశ్యమాతగా నటిస్తే, 'చింతా మణి'నాటకంలోని శ్రీహరి ఈమెకు దిగదుడుపుగా వుంటుంది. ఋష్యేంద్రమణి ఏపాత్రను పోషిస్తే ఆపాత్రకు సహజదనం సమకూరుతుంది. చిత్రరంగంలోని సినిమాలన్నీ పరిశీలిస్తే, భానుమతి గొంతును 'డామినేట్' చెయ్యగలిగిన గాంభీర్యం వొక్క ఋష్యేంద్రమణికి తప్ప మరెవ్వరికీ లేదని ఈ సన్ని వేశం నిరూపిస్తుంది.

రాజేశ్వరరావు సమకూర్చిన మరో ఆణిముత్యం ఇక్కడ పొదగబడింది. బలవంతంగా విడదీయబడిన దేవదేవీ విప్రనారాయణుల విషాదగీతం రూపంలో వుందది. 'అనురాగాలు దూరము లాయెనా' అనే పల్లవితో విరహమూ, విషాదమూ కలిసిన గానామృతం ఈపాట. ఎ.ఎం.రాజాతో భక్తీ, రక్తీ పాడించి మెప్పించిన సంగీతదర్శకుడు, ఆ గొంతులో పరితాపం ఎలా పలుకుతుందో చూడమని బంగారుతునక మనమీదికి విసిరినట్టుంటుంది ఈ పాట.

భక్తుని ఆర్తి తీర్చడానికి దేవాలయంలోని బంగారుపాత్రను దేవుడే దొంగిలించి, రంగసానికి అందజేస్తాడు. చివరకు నేరం విప్రనారాయణునిమీద పడుతుంది. రాజసభలో విచారణ జరుగుతుంది. దైవధనం అపహరించిన నేరానికి విప్రనారాయణుని చేతులు ఖండించ వలసిందిగా రాజు ఆజ్ఞాపిస్తాడు. శిక్ష అమలుచేయటానికి అతన్ని ఊరి వెలుపలికి చేరుస్తారు. వధ్యశిలమీద వుంచిన అతని చేతులు నరకబోతే, కత్తి పూదండగా మారిపోతుంది. శ్రీరంగ ధాముడు కాంతిపుంజంగా ఆకాశంలో దర్శనమిచ్చి 'మిస్టరీ' విడదీస్తాడు. విప్రనారాయణుడు తన వైజయంతీమాలా స్వరూపుడనీ, దేవదేవి శాప గ్రస్తురాలైన దేవకాంతనీ, వారి కర్మావశేషాన్ని పరిహరించడానికి ఇదంతా తాను కల్పించిన నాటకమనీ వెల్లడిస్తాడు. విప్రనారాయణుడు వైజయంతిగా ఆయన ఎదమీదికి చేరుకోగా, దేవదేవి అంతర్ధానమై దివ్యలోకం చేరు కుంటుంది.

ధగధగ్గాయమానంగా ప్రకాశించే వజ్రం వెనకనున్న చీకటిని తనచాటున ఎలా కప్పేస్తుందో, అలాగే 'విప్రనారాయణ' లోని సంగీతం ఆ చిత్రంలోని లోటుపాట్లను తన చాటున దాచేసి ప్రకాశించింది. తన సంగీత ప్రతిభతో చిత్రాన్ని విజయపథంలో నడిపించే శక్తి సాలూరు రాజేశ్వరరావుగారికి కలదని నిరూపించింది. ఆ విజయరథానికి భానుమతిగారి అపురూప గాత్రం ఇరుసుగా పనిజేసింది.

# ముగింపు

తెలుగు సినీరంగానికి మన పూర్వీకులు అందించిన అపురూప వారసత్వాన్ని కొంతవరకు మననం చేసుకున్నాం. ఆ ఆస్తిని పెంచకపోయినా ఫరవాలేదుగానీ, కనీసం తరగకుండా కాపాడుకోవడం తరువాతి తరాల బాధ్యత. రెండవ తరంగా వచ్చిన ఆదుర్తి సుబ్బారావు, ప్రత్యగాత్మ, విశ్వనాథ్, బాపు, దాసరి నారాయణరావు వంటి దర్శకులు చాలామంది మన పూర్వీకుల సంప్రదాయాన్ని కొనసాగించటానికి శక్తివంచన లేకుండా కృషిచేశారు.

ఈ సందర్భంలో, తెలుగుబిడ్డ కాకపోయినా తెలుగులో సినిమాలు నిర్మించిన దర్శకుడు శంకర్‌ను ప్రశంసించకుండా వుండలేము. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యున్నత స్థాయిలో ఉపయోగపెట్టుకుంటూ, దేశాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను ఉద్రేకపూరితంగా తెరమీద ప్రతిబింబిస్తున్న ప్రతిభావంతుడు శంకర్. బి.ఎన్.రెడ్డిలోని పదును, కె.వి.రెడ్డిలోని కరుకు కలిసి రూపొందిన మూర్తిగా కనిపిస్తాడు శంకర్. కళాసృష్టిలో భారతీయులు ఏఒక్కరికి తీసిపోరని నిరూపిస్తున్న శంకర్‌ను మనసారా అభినందిస్తూ, జాతికి సుగంధం పంచటానికి తమను తాము అర్పించుకున్న ఆదర్శమూర్తులకు నమస్కరిస్తూ, వారు నెలకొల్పిన విలువలను కాపాడమని నేటి కళాకారులను ప్రాధేయపడుతూ, సెలవు తీసుకుంటున్నాను.

నమస్తే.

